భారతము-తిక్కనరచన

(A Critical Study)

1901

గ్రంథకర్త

విద్వాన్ భూపతి లక్ష్మీనారాయణరావుగారు, ఎమ్. ఏ., బి. ఇడి.

రాజమహేంద్రవర ప్రభుత్వ కళాశాల

ఆంధ్రభాషా ప్రధానోపన్యాసకులు

ప్రచురణ: అబ్బిపల్లి అండ్ కో

సరస్వతీ పవర్ ప్రెస్

రాజమహేంద్రవరము

C 1

27-5-50

సరస్వతీగ్రంథమండలి: ౫౮

(౮)

భారతము-తిక్కనరచన

(A Critical Study)

గ్రంథకర్త

విద్వాన్ భూపతి లక్ష్మీనారాయణరావుగారు. ఎమ్. ఏ., బి. ఇడి.

రాజమహేంద్రవర ప్రభుత్వ కళాశాల

ఆంధ్రభాషా ప్రధానోపన్యాసకులు



ప్రచురణ: అద్దేపల్లి అండ్ కో

సరస్వతీ పవర్ ప్రెస్

రాజమహేంద్రవరము

సర్వస్వామ్యములు
ప్రకాశకులవి

First Edition 1949

Saraswathi Power Press, Rajahmundry
Printed and Published by
A. Lakshmana Swamy Naidu
Addepally & Co, Educational Publishers
Order No. 5184/1949

అంకితము

....o....

నిరంతరము

భాషా సారస్వత కృషిచే

ఆంధ్రదేశమున విజ్ఞాన వ్యాప్తికి

దోహద మొనర్చుచున్న

అస్మదాచార్యులు, కళాప్రపూర్ణ, డాక్టరు, బ్రహ్మశ్రీ

చిలుకూరి నారాయణరావు పంతులు

(M. A., Ph. D., L. T)

గారికి

ఈ కృతిని

భక్తితో సమర్పించుచున్నాను.

(13

ఉపోద్ఘాతము

ఆంధ్రభారత రచనా విశిష్టతను సహేతుకముగ వివరించి, పాఠకులకు, నందు ముఖ్యముగ విద్యార్థులకు భారత పఠనమునం దాసక్తిఁ గల్గించు నుద్దేశముతో నేనీ సమీక్ష నారంభించినాను. ప్రస్తుత గ్రంథమందలి విమర్శ తిక్కన భారత భాగమునకు మాత్రమే పరిమితమై యున్నది.

ఆంధ్ర భారత ముదాత్తమగు స్వతంత్ర రచన యని పండిత విమర్శకుల నిశ్చితాభిప్రాయము. ఇతివృత్తమును సంస్కృతమునుండి గ్రహించి, తమ ప్రతిభాసామర్థ్యములచే నుదాత్తము, సర్వాంగసుందరము, నగు మహాకావ్యముగఁ గవిత్రయమువా రాంధ్ర భారతమును రచించినారు. మూలము నందలి యుత్కృష్ట భావము లనేకము లిందు వచ్చి చేరినవి. కావ్య విధానమున కనుకూలింపని విషయములు త్యక్తములైనవి. రసపోషణకై కొన్ని వర్ణనలు కల్పితములును నైనవి. ఇట్లు కవిత్రయమువారు భారతమును దీర్చితిద్దినారు. సంస్కృత భారతరచన యందుఁ గావ్యరీతికంటెను పౌరాణికవిధాన మెక్కువ ప్రాధాన్యము వహించినది. ఆంధ్ర భారతమునఁ బ్రాముఖ్యము వహించినది కావ్యరీతి. కనుక, రచనా విధానముం బట్టి, ఆంధ్రభారతము స్వతంత్ర కావ్యమగును. తిక్కన భారత భాగమునుండి విమర్శకై నేగ్రహించిన ఘట్టములను మూలముతోఁ బోల్చిచూడగా నాకుఁ గల్గిన యభిప్రాయ మిట్టిది. శ్రీయుతులు గుఱ్ఱం సుబ్బరామయ్య, కోరాడ రామకృష్ణయ్య, కొమర్రాజు లక్ష్మణరావు, చిలుకూరి వీరభద్రరావు - మున్నగు పండిత విమర్శకుల యభిప్రాయమును నిదియే. కవిత్రయము వారి యనువాద విధానమును గూర్చి వీరిదివఱకే కొంత ప్రశంస గావించియున్నారు.

కావ్యములను విమర్శించుపట్ల, స్వతంత్ర కావ్యముల విషయమున నొక విధానమును, ననువాద గ్రంథముల విషయమున వేఱొక విధానమును నవలంబింప వలసి యుండును. మూల గ్రంథము నందలి భావములు,

రసవత్తరములగు సన్నివేశములు, విశిష్ట శబ్దార్థాలంకారములచే సిద్ధించు మనోహరములగు ధ్వనులు, - మున్నగునవి యనువాదమునఁ బోషిత మైన విధమును బట్టియు, ననువాద పఠనము వలనఁ గలుగు చిత్తవికా నమును బురస్కరించు కొనియు, ననువాద గ్రంథములు విమర్శింపఁబడును. మూలగ్రంథ రచనా ప్రయోజన మనువాదముచేఁ గూడ సిద్ధించినదా, యను చర్చ యిందు ముఖ్యము. స్వతంత్ర రచనల విమర్శన విధానము వేరు. కావ్యరచన యందుఁ గవి యుద్దేశము, కావ్యప్రయోజనము, వివిధ సన్నివేశములకును, సంఘటనలకును బ్రధానేతివృత్తముతోఁ గల సన్నిహిత సంబంధము, వస్తురస పోషణ గావింపఁబడిన విధానము, పాత్రల శీల, స్వభావ, మనస్తత్త్వముల యావిష్కరణము, కావ్యమున వ్యక్తమగు లోకజీవితము, కవితారీతి, కావ్యపఠనము వలన సిద్ధించు హృదయ వికాసము, - మున్నగు లక్షణములను బురస్కరించుకొని, స్వతంత్ర రచనల ప్రాశస్త్యమును నిర్ణయించుట విమర్శక సంప్రదాయము.

తిక్కన భారతభాగసమీక్షయందు నే ననుసరించిన విధానమును నిదియే. సంస్కృత భాషాజ్ఞానము చాలని పాఠకులను గూడ నాంధ్ర భారత పఠనకై ప్రోత్సహించుట నాయాశయ మగుటచే నే నీ మార్గము నవలంబించియున్నాను.

ఈ గ్రంథముచే నాయాశయ మెంతవఱకు సిద్ధించు ననుటకు సహృదయ పండిత విమర్శక లోకమే ప్రమాణము.

ఎంత జాగ్రతతోఁ బరిశీలించినను ముద్రణదోషములు కొన్ని తప్ప లేదు. వాని సవరణములను గ్రంథాంతమునఁ జేర్చినాను. ఇవి కాక, నా దృష్టిపథము నుండి తప్పిపోయినవియు నుండవచ్చును. పాఠకమిత్రులు వానిని గుర్తించి, నాకుఁదెల్పినచోఁ గృతజ్ఞతతో గ్రహించి, రెండవ ముద్రణమున వానిని సవరించెదను.

భారతము - తిక్కనరచన

విషయసూచిక

1. భారతీయ విజ్ఞాన సర్వస్వము

సంస్కృత వాఙ్మయమున మహాభారతమునకుఁ గల విశిష్టత - వేదవాఙ్మయ లౌకిక వాఙ్మయములందుఁ బ్రతిబింబించిన భారతీయ జీవితము - భారతీయ విజ్ఞాన స్వరూపము - భారతేతివృత్త వైశిష్ట్యము - భారతేతివృత్త మాధారముగ వివరింపఁ బడిన ప్రకృతి తత్త్వము - పుణ్యపాపముల సంఘర్షణ - పరమేశ్వరుని సర్వశక్తిత్వ, సర్వజ్ఞత్వములు, సంచిత కర్మపరిపాక ప్రాబల్యము - భారతమునకుఁ గల వేదతుల్యత్వము - వేదమునకును, భారతమునకును గల తారతమ్యము - వ్యాసరచిత జయేతిహాసము - తత్ప్రయోజనము - తత్కాల సంఘస్థితి - ధర్మన్యాయముల పరిస్థితి - వ్యాసుని యున్నతాశయము - భారత గ్రంథ క్రమ పరివృద్ధి - వైశంపాయన రోమహర్షణుల యాశయములు - ప్రక్షిప్త భాగముల స్వరూప ప్రయోజనములు - భారత మితిహాసము, పురాణము, వేదాంత గ్రంథము, ధర్మశాస్త్రము, కావ్యము నగును - పరబ్రహ్మతత్త్వ, విధిప్రభావములు - విజ్ఞాన వ్యాప్తియు, లోక సంగ్రహణమును, భారత రచనా ప్రధాన ప్రయోజనములు - భారతము మహాకావ్యము కూడ నగును - మహాకావ్య లక్షణములు - రామాయణ మహాభారతముల భేద సాదృశ్యములు - భారత వైశిష్ట్యము.

భారతాంధ్రీకరణ ప్రయోజనము - రాజరాజు కాలమున సంఘస్థితి - మత విషయకమగు నశాంతి, సంఘ విచ్ఛిత్తికి హేతువు - చార్వాకాది క్షుద్ర మత వ్యాప్తి వలన ధర్మచ్యుతి - రాజరాజు నాశయము - తిక్కన నాటి సాంఘిక పరిస్థితులు - జైన బౌద్ధములు - వీరశైవ ప్రాబల్య ఫలము - శైవ వైష్ణవభేదములు - తిక్కన యాశయము - హరిహరారాధన ప్రయత్న విజయము - మత సౌమనస్యము - దక్షిణాపథమున మతముల వ్యాప్తి - ఆంధ్రదేశమున నద్వైత మతవ్యాప్తికిఁ గారణము - సంస్కృత భారతరచనకును, నాంధ్ర భారతరచనకును సిద్ధించిన ప్రయోజన తుల్యత్వము - భారత రచనయందుఁ గవిత్రయము వారి అర్హత - కవిత్రయమువారు ఋషితుల్యులు. భారతరచనవలన వీరాశించినది భవబంధ విమోచనము - భారతామ్నాయ కర్మనిర్వహణమున వీరిదీక్ష - యోగివరుల సంయమనము - కవిత్రయము వారి రచనల

యందలి ప్రధాన గుణములు – భారత మాంధ్రుల విజ్ఞాన సర్వస్వము – నాగరికతకు జాతిగౌరవమునకు మూలకందము – ఆంధ్రభారతము విస్మృతమగుటకుఁ గారణములు – పాశ్చాత్యులకును మనకును గల తారతమ్యము – నిజమగు జాతీయాభిమాన మెట్టిది – సారస్వత కర్తలకు దేశమున, గల స్థానము – వచన వాఙ్మయస్థితి – విమర్శక గ్రంథముల యభావమునకుఁ గారణములు – ఈ విమర్శ యాశయము.

2. విరాట పర్వము

రసవత్తరమగు నితివృత్త వైశిష్ట్యము – సన్నివేశములు లోక జీవితమునకు సన్నిహితము లగుట – కీచక వృత్తాంతమునఁ బోషితమైన లోకవృత్తము – కాముక ప్రవృత్తి, తత్పరిణామము, ఫలము – ఇతివృత్తము ప్రబంధ రచన కనుకూలించుట – మానవ స్వభావ వ్యక్తీకరణము – భావావేశ, భావోద్వేగముల ప్రదర్శన కనుకూల పరిస్థితి – పాతివ్రత్య పోషణకై ధీరయగు క్షత్రియ కాంత యొనర్చు ప్రయత్నము – తత్ర్పయత్నము పరిణామము లోకము నాకర్షించుట – వైనందిన జీవితమునకు సన్నిహితము.

సూర్యోదయ, సూర్యాస్తమయ, యుద్యానవనముల వర్ణనలు భావి ప్రబంధరీతికి బీజములు – భావనా ప్రధానములగు వర్ణనలు, అలంకారములు, శబ్దప్రయోగ చాతుర్యము, ఇత్యాది ప్రబంధ లక్షణములు – ప్రౌఢకావ్య లక్షణములు – కీచక విషయగత శృంగార రసాభాస ప్రయోజనము – భీమ కీచకుల స్వభావ వ్యక్తీకరణము.

ఉత్తర గోగ్రహణము భావి యుద్ధపర్వముల రచనావిధాన సూచకము – యుద్ధ వర్ణనయందలి విశిష్టత – విశిష్టార్థ స్ఫోరక శబ్దప్రయోగ చాతురి – ఉదాత్తార్థ గాంభీర్యము – శబ్దార్థశక్తి మూలకాలంకారార్థ ధ్వనులు – ప్రౌఢ ప్రబంధముల రచన కుత్తమాదర్శమగు పద్యమునకు భావవివరణము –

ఉత్తరాభిమన్యుల వివాహఘట్టము లలిత శృంగారమున కాదర్శము – వధూవరుల మనోహర స్వరూపములు – ఉత్తరాదేవి ముగ్ధ మోహనమూర్తి – వివాహ వర్ణనవలనఁ బాఠకులకుఁ గలుగు పూర్వానుభవ స్మృతి – తలబ్రాలు, పాణిగ్రహణము, లాజ హోమము, మున్నగు వాని మనోహర వర్ణనలందలి వైశిష్ట్యము – వివరణ – ప్రకృతి సౌందర్యములో సమన్వయము – వధూవరుల వర్ణనయం దుపయుక్తములైన యుపమాన ముల విశిష్టత – వైషయిక సంబంధ రహితము, లలితము, సహజసిద్ధము నగు శృంగార పోషణ – రస ధ్వని ప్రధానమగు రచన.

3. ఉద్యోగ పర్వము

రాజకీయ విషయ ప్రాధాన్యము - పిత్రార్జితమగు సంపదకై దాయాదులు కల హించుట లోకసిద్ధము - ఇతివృత్తము లౌకికవిషయ సంబంధి - పాండవు లజ్ఞాతవాస నియమమును సక్రమముగ జరిపి భావి కర్తవ్యమును నిశ్చయించుట - భారతేతి వృత్త మందలి ప్రధాన పాత్రల కందఱికిని విషమపరిస్థితి యేర్పడియుండుట - లోకశాంతి, లోకానర్థముల వినిశ్చయము ప్రధాన విషయము-పాత్రల మనస్తత్త్వముల యావిష్కరణమునకు హేతువులగు సన్నివేశములు.

పురోహితుని రాయబారము రచితమైన విధము - ఔచితీపోషణ - రాజకార్య పరిజ్ఞానము లేని ఖండితవాదుల స్వభావము - భీష్ముని సమయజ్ఞత - సంజయుని రాయబారిగాఁ బంపుటలో ధృతరాష్ట్రుని యభిప్రాయము - సంజయుఁడు కర్తవ్య మును నిర్వహించిన విధానము - సంజయుని వాక్చాతుర్యము, రాజకార్య నైపుణ్యము- ధర్మార్జున శ్రీకృష్ణుల సదుత్తరములు - నాటకరీతి - పురోహిత సంజయ రాయబార ములవైవిధ్యము - సంజయుని పల్కు- లర్థవిశిష్టములు - అతని యింగితజ్ఞానము - అతఁడు ధృతరాష్ట్రుని స్వభావమును విమర్శించిన పద్ధతి-ధృతరాష్ట్రుని నైజస్వభావము-

కృష్ణరాయబార ప్రయోజనము, తద్విశిష్టత - శ్రీకృష్ణుని యాశయము - సామా ద్యుపాయ ప్రయోగము - సత్యధర్మముల రక్షణకై కృష్ణుఁడొనర్చిన ప్రయత్నము - శ్రీకృష్ణుని జీవిత తత్త్వమునకు సూచన - అతఁడు కురుసభలో గావించిన మహోప న్యాసము - ఉక్తిచాతుర్యము - విశిష్టార్థ స్ఫోరకములు, గంభీరములు, నుదాత్త ములు నగు నతని సంధివాక్యములు - విశిష్ట ధర్మబోధ - అధర్మమునెడ నుపేక్ష వహించిన భీష్మద్రోణాదులను హెచ్చరించుట - సత్య ధర్మములు తప్పక దైవముచే రక్షితములగునను కృష్ణుని పల్కులయందలి ధ్వని - పురోహిత, సంజయ, కృష్ణ రాయబారముల రచనయందలి వైవిధ్యము - రాయబారుల స్థానభేదముల ననుసరించిన యౌచిత్యము.

వివిధ సన్నివేశములు, రసవత్తరములగు నాటకరంగముల వలె రచితములు - కుంతీ ద్రౌపదుల పల్కులు, వారి శీలస్వభావములు - క్షాత్రధర్మ బోధకములగు కుంతి పల్కుల అర్థము - స్వధర్మ వైశిష్ట్యమును బోధించుట - కుంతి వాక్యములందలి తీవ్రత, వ్యంగ్యార్థస్ఫూర్తి -

సంభాషణాత్మకమగు భాష - శిష్ట వ్యవహారస్థమగు తెలుఁగు నుడికారమునకు, ప్రాధాన్యము - తెలుఁగు జాతీయములు, లోకోక్తులు - దేశీయతకుఁ గల ప్రాముఖ్యము

4. యుద్ధ పంచకము

యుద్ధవీరము శృంగారమువలె ప్రైనందిన జీవితమునకు సన్నిహితము కాదు – రౌద్ర బీభత్సములు సర్వజన హృదయంగమములు కావు – యుద్ధాది భారత భాగమున కధిక వ్యాప్తి లేకుండుటకుఁ గారణములు – తిక్కన రచనను గూర్చిన, యవిచార మూలక మగు నొక యపోహ – సమాధానము – యుద్ధపర్వమాదియగు భారతభాగ రచన యందలి విశిష్టత.

యుద్ధవర్ణనాదియందలి సంజయుని వాక్యము తిక్కన యెడ వర్తించును – ప్రకృతి సిద్ధములు, హృదయంగమములు నగు నుపమానములచే యుద్ధవర్ణనకు మనోహరత్వము నాపాదించుట – భీష్మునిఁ గూర్చి విలపించు ధృతరాష్ట్రుని వాక్యములు – భీష్మ రహితమగు కురుసేన ప్రైన్యస్థితి – యుద్ధమునకుఁ బోవు పాండవ కుమారవర్గము – అభిమన్యుని ప్రథమ యుద్ధము, విశిష్టత – భావి పద్మవ్యూహ యుద్ధమున కిది నాంది యగును – పద్మవ్యూహమునం దభిమన్యుని వీర విహారము – పద్మవ్యూహమును బ్రవేశించుచు నభిమన్యుఁడు పల్కిన వాక్యములు భావ్యనర్థ సూచకములు – అభిమన్యు మరణము.

సైంధవ వధనాఁడు వ్యూహమును బ్రవేశించు భీమునివర్ణన – ద్రోణుఁడడ్డుపడుట– మనోహరమగు సన్నివేశము – రౌద్ర బీభత్స ప్రధానమగు రణరంగమును రమణీయ మగు ప్రకృతి దృశ్యముగ మార్చుట – భీష్మునిపై కృష్ణుఁడు పోఁబోవుట – అస్తమింప నున్న కర్ణుని వర్ణన – ధ్వని ప్రధానమగు రచన – భీముఁడు గజసమూహముపై విజృంభించుట – సైంధవ వధనాఁటి యర్జునుని వీర విహారము – అతఁడొనర్చిన మహాద్భుత చర్యలు.

భీకరమగు యుద్ధరంగమునకుఁ గోమలతా లాలిత్య ప్రధానమగు స్త్రీ సౌందర్యము నాపాదించుట – వివరణము – యుద్ధమునకు శృంగారమును జతగూర్చుట – రమణీయములగు సదృశ వస్తు వర్ణనలచే జాగుప్సను కప్పిపుచ్చుట – వివరణము – సంపూర్ణ సామ్యముగల సహజోపమానముల నుచితరీతిఁ బ్రయోగించి అర్థపోషణఁ గావించుట –

రౌద్ర రసోత్పాదకమగు వర్ణనలు – దుశ్శాసన వధ – అశ్వత్థామ ధృష్టద్యుమ్నుని జంపుట – రెండు సన్నివేశములకును గల భేద సాదృశ్యములు – భీమాశ్వత్థామల స్వభావ తారతమ్యములు – మనస్తత్త్వములు – ఒకే విధములగు సన్నివేశములలో భిన్నవ్యక్తుల ప్రవర్తన – అర్జునుఁడు వృషసేనుని జంపిన విధానము – అభిమన్యుని

వధకు ద్రోణుఁడు కారకుఁడగుట–మనస్తత్త్వము – యుద్ధ ప్రవర్తనయందు బ్రాహ్మణ క్షత్రియుల ప్రవర్తనయందలి వైవిధ్యము —

యుద్ధమధ్యమునఁ బోషితమైన కరుణ—గురుబంధు భావాదులు, వ్యక్తుల హృదయ మార్దవము – అర్జున, ద్రోణ, ధర్మజ భీమాదుల హృదయములు – పుత్ర శోకాతురుఁడైన యర్జునుని యవస్థ – మానవప్రకృతి – సుభద్ర విలాపము పోషితమైన విధము – ఆమె పల్కులలోని ధ్వని – పుత్ర శోకాతురయైన ద్రౌపది స్థితి – సైంధవ వధార్థ మెంటరిగ నేగిన యర్జునుని గూర్చి ధర్మజుఁడు చింతించుట – సాత్యకిని సహాయమంపు సన్నివేశము – పిమ్మట భీముని వారికి తోడుపంపుట – ధర్మజుని పల్కులలోని యౌచిత్యము – ధర్మజుని శీల ప్రదర్శనము – ద్రోణుని వధ విషయమై ధర్మార్జున భీములకు జరిగిన సంభాషణ – అందలి విశిష్టత – యుద్ధవృత్తాంతమును వినుచున్న ధృతరాష్ట్రునియంతఁ గలుగు భావోద్వేగాదులు – అతని నైజప్రకృతి – భీమ దుర్యోధనుల గదాయుద్ధ ఘట్టము – ధర్మ దుర్యోధనుల శీలములు వ్యక్తములగుట – మానవ స్వభావము – ధర్మజుని శీలమందలి లోపము – కృష్ణుని విమర్శ – అతని ప్రయత్నము.

అభిప్రాయభేదము కారణముగఁ గలిగిన వికారభావములు హృదయమున సుప్త స్థితియం దుండుట – తత్కారణమగు జనుల ప్రవర్తన—ధర్మార్జునులు కలహించుట—వారి హృదయములను పశ్చాత్తాప తప్తములు గావించి, వారి జీవితములను, కృష్ణుడు విశుద్ధములుగఁ జేయుట – శరతల్పగతుఁడగు భీష్మునెడఁ గరుని ప్రవర్తన – కర్ణుని యందుఁ గలిగిన మార్పు – మానవ స్వభావము – కర్ణుని మానసిక ప్రవృత్తి – తిక్కన చిత్రించిన లోక జీవితము.

౬. స్త్రీ పర్వము

యుద్ధ పరిసమాప్తితో నుత్సాహము శోక నిర్వేదములకుఁ దావిచ్చినది – కౌరవ పాండవ స్త్రీల యాక్రందనములందు శోకము కరుణముగ సిద్ధించినది – ధర్మజునకుఁ గలిగిన నిర్వేదము – హృదయములు శోకాగ్ని తప్తములు కావలసియుండుట – ధర్మ న్యాయముల స్మృతి లోకమునఁ గలుగుటకు హేతువులు – ధర్మజుని హృదయము ప్రశాంతినందుట కీ పరితాపమవసరము – ధృతరాష్ట్రుని ప్రలాపము – అతని స్థితి – సంజయుఁడతని ప్రవర్తనను విమర్శించిన విధానము – అందలి యౌచితి – విదురుని సాంత్వన వాక్యములు వైరాగ్య బోధకములు – ఉత్కృష్టోదాహరణముల విశిష్టత – తిక్కన యవలంబించిన శైలీ వైవిధ్యము.

ధృతరాష్ట్రుఁడు వధూవర్గముతోఁ బొలికలనికిఁ బోవుట – కౌరవ వధూజన వర్ణన యందలి విశిష్టత – ఆభిజాత్య గాంభీర్య ప్రదర్శకములగు నుచితోపమాన ప్రయోగము – ధర్మజుని హృదయ క్షోభకు హేతువులు – ధృతరాష్ట్రుఁడు భీమునిఁ జంప యత్నించుట – కృష్ణుని రక్షణ – ధృతరాష్ట్రుని నటన – కృష్ణుని విమర్శ – నాటకోచితమగు రచన – గాంధారి భీము నధిక్షేపించుట – భీముని సదుత్తరము – గాంధారీ ధృతరాష్ట్ర ల స్వభావములు వ్యక్తములగుట మాతృ గర్భశోకము – గాంధారి వాక్యముల విశిష్టత – బీభత్సమగు రణరంగమును, కురుకాంతల దీనావస్థను గాంధారి వర్ణించి, కృష్ణునకుఁ జెప్పుట – నవ వధువగు నుత్తర ముగ్ధ స్వరూప చిత్రణము – బీభత్స శృంగారముల సంయోగము – కరుణ రసోత్పత్తి – గాంధారి కృష్ణుని శపించుట – తన ధర్మలోపమును దా గుర్తెఱుంగని గాంధారి మోహావిష్టత – లోక స్వభావము.

6. శాంత్యనుశాసనికాశ్వమేధ పర్వములు.

స్త్రీపర్వమునఁ బోషితమైన నిర్వేదము శాంతిఁ బరిణమించుట – ధర్మజుని జీవిత పరిణామముతో సమన్వయము – ప్రజాపాలన విషయమున వ్యాసాదుల యభిప్రాయము – ధర్మజుని ప్రకృత స్థితి – ప్రతిహింస వలని ఫలము – మనో వైకల్యము వలనఁ గలిగిన పశ్చాత్తాపము – గురూపదేశమును గ్రహించుటకుఁ దగిన పరిస్థితి – ధర్మజుఁడు జ్ఞానియుఁ, గర్మయోగియుఁ గావలసియున్నది – అట్టివాఁడు ప్రజాపాలకుఁ డైనచో ధర్మము సుప్రతిష్ఠము కాఁగలదు.

శాంత్యనుశాసనిక పర్వములందలి యితివృత్తము – తద్విశిష్టత – వస్తువునందును, రచనయందును, సౌమ్యభావము – ధర్మజునియందుఁ గలిగిన మార్పు – దృష్టి అముష్మికమునకు మరలినది – ప్రధానేతివృత్తముతో శాంత్యనుశాసనిక భాగమునకుఁ గల సంబంధము – భీష్ముని విశిష్ట ధర్మ బోధ – గురు శిష్యులగు భీష్మ ధర్మజుల విశిష్టత – బోధ్యమగు విషయమునకుఁ దగిన రచనా విధానము – సంయమనము ప్రధాన లక్షణము – యుద్ధప్రశంస సందర్భమునఁ దిక్కన పాటించిన సంయమనము – అశ్వమేధ పర్వగత యుద్ధవర్ణనయం దవలంబించిన విధానము.

కావ్య రచనకును, శాస్త్ర రచనకును గల భేదములు – కావ్య రచనయందు ప్రధానాశయము – శాస్త్ర రచనయందు ధ్యేయము – తిక్కన రచనా విధానము, శైలి, – తద్వివరణము – శాంత్యనుశాసనిక పర్వముల ప్రాశస్త్యము – వీనిని రచించుటలోఁ

దిక్కున విశిష్టత - చక్కనిలోక న్యాయములు, దృష్టాంతములు — వీని సాహాయ్యమున శాస్త్రార్థములను వివరించుట — వర్ణాశ్రమ ధర్మములు, ధర్మాధర్మ, సత్యాసత్యములఁ గూర్చిన క్లిష్టసమస్యలు, సాంఖ్యాది యోగ సూత్రములు, పరబ్రహ్మ తత్త్వము, మున్నగు వానిని సుగమమొనర్చుట - తిక్కన ఆంధ్రుల పాలిటి వ్యాసుఁడు.

7. ఆశ్రమవాస మూసల మహాప్రస్థాన స్వర్గారోహణములు.

ఆశ్రమవాసపర్వ ప్రయోజనము - ధృతరాష్ట్రాదుల తపోవన గమనము — కుంతీ హృద యము — పాండవుల హృదయ పరివర్తనము — వ్యాసుని యోగమహిమచే మృత బంధు దర్శనము — కుంతీ గాంధారీ ధృతరాష్ట్రాల మరణము - పాండవు లిహలోక విముఖులగుట — బంధములు సడలుట.

మూసల పర్వేతివృత్తమునకు భారతమునఁ గల ప్రాధాన్యము — శ్రీకృష్ణుని జీవిత రహస్యము — కృష్ణావతార ప్రయోజనము — యాదవ సంఘస్థితి — అధర్మ ప్రాబల్యము — యాదవుల యున్మార్గ వర్తనము — అవినీతి — కృష్ణుఁడు ధర్మ మును ప్రతిష్ఠించిన విధము—

ఉత్పాతములు - కణ్వాదులశాపము — కృష్ణునియుపేక్ష — యాదవనాశము తీర్థ సమీపభూమియం దగుట మంచిదని కృష్ణుఁడు నిశ్చయించి, వారిని సముద్ర ప్రాంతమునకుఁ దరలించుకొని పోవుట కృష్ణ బలరాముల ప్రవర్తన - కాలపురుషుని ప్రశాంతతా గాంభీర్యములు — సాత్యకి ప్రద్యుమ్నాది యాదవుల ప్రవర్తన — మద్య పాన మత్తులైన సాత్యకి కృతవర్మల కలహము — కృష్ణుని .దోహదము — యాదవుల యన్యోన్య హననము — కృష్ణుఁడు హతశేషులను జంపి గాంధారీ శాపమును భారము నొందించుట - బలరాముని యోగనిష్ఠ — అతని యాత్మ అనంతునియందుఁ జేరుట — కృష్ణుని తనువిముక్తికి నిమిత్తము — భగవంతుఁడవతారమును జాలించి నిజ పదవిం జెందుట — ఇంద్రాదుల స్తోత్రము — కృష్ణార్జునుల జన్మ రహస్యము — వారి యన్యోన్య సంబంధము — అర్జునుఁడు నిర్వహించిన కార్యభారము — వేద వ్యాసుఁడర్జునునకుఁగావించిన బోధ — విధివిలాస, కాలప్రభావములు - అర్జునుని నిశ్చయము కృష్ణావతారమునకు మూసలపర్వము ప్రత్యక్ష వ్యాఖ్య.

మూసలపర్వము సమగ్రమగు కావ్యము-అంగాంగ భావ సామరస్యము — ఉత్తమ కావ్యలక్షణములతో సమన్వయము — వస్తు, రస, నాయక, ప్రయోజన, రచనా విధానముల విశిష్టత — వస్తు రసములు పోషితమైన విధానము — రూపక లక్షణము

లనువర్తించుట - వస్తైక్యత సిద్ధించినది — ఆరంభము మొదలు నిర్వహణము వఱకును నితివృత్తము పోషితమైన విధము — అంగి యగురసమును, దత్పోషకములగు నంగ ములు — మహాభారతమునందు ముఖ్యరసమగు శాంతియు, భారతరచనా ప్రయోజన మును మాసల పర్వముచే సిద్ధించినవి — కృష్ణ నిర్యాణముతోఁ బాండవుల కివాలోక సంబంధము పూర్తిగఁ దొలఁగినది - ధర్మజాదుల నిశ్చయము — యాదవ కుమారుల రక్షణ — సత్యభామాదుల తపోవన గమనము - ధర్మజాదుల మహాప్రస్థానము - ద్రౌప ద్యాదుల నిర్యాణము - ధర్మజుని యలౌకిక శీల, ప్రవర్తనలు — స్వర్గప్రాప్తి — ఆత్మసాక్షాత్కారము.

8. కర్మయోగి — వాఙ్మయ యజ్ఞము.

పాండవుల జీవిత పరిణామ క్రమము - భారతేతివృత్త పరిణామ క్రమము — అన్యోన్య సంయోగము - లోకజీవితముతో సమన్వయము — తిక్కన రచనా పరిణామ క్రమము — భారతమువలన గ్రహింపనగు తిక్కన మనస్తత్త్వము — యోగము, వేద ములు, ఉపనిష దుత్తరమీమాంసలు, పరతత్త్వము, వీనియం దతనికిఁగల భక్తి — వ్యాసుని యందును, భారతము నందును దిక్కనకుఁ గల పవిత్ర, పూజ్య, భావము — భారత రచన వాఙ్మయ యజ్ఞమును తిక్కన యుదాత్త భావము — తన వాఙ్మయా ధ్వరార్చనచే భగవంతుఁడు ప్రీతుఁడగుటయే తిక్కన యాశయము — ఆత్మ నీశ్వరా ర్పణ గావించిన కర్మయోగి — భగవద్గీతార్థమును వాచ్యము చేయుక యనుష్ఠానముచేఁ బ్రతిపాదించినాఁడు — తానేర్చిన విద్యకు నాల్గవ దశయగు ప్రచారమును గల్పించి, లోకము తరించుటకు మార్గమును జూపినాఁడు.

ఆశ్వాసాంత పద్యముల వలనఁ దెలియనగు తిక్కన మానసము — ఆత్మపరమా త్మానుసంధాన సాధనమగు యోగము, నిర్మలాంతఃకరణము, పరమార్థ ప్రతిపాదక మగు విశిష్టజ్ఞానము, ఆత్మసాక్షాత్కార జన్యమగు నానందము, ఇవి తిక్కన యభీష్ట ములు — మహా కవిత్వ దీక్షలోఁ బాటు వాఙ్మయ యజ్ఞ రూపమగు యోగదీక్ష — శబ్దబ్రహ్మైక్య సంధానమునం జేసి జ్ఞానజ్యోతి స్వరూప సాక్షాత్కారము — జన్మరాహిత్యము.

ఓం

భారతము - తిక్కన రచన

భారతీయ విజ్ఞాన సర్వస్వము

ప్రాచీన భారతీయార్యుల విజ్ఞానమును, నాగరికతను వ్యక్తపఱచు నుద్గ్రంథములలో వ్యాసప్రణీతమగు మహాభారతము ముఖ్యమైనది. మానవుల భౌతిక మానసి కాధ్యాత్మికజీవితమంతయు భారతమునఁ బ్రతి బింబించియున్నది. సారస్వతము మానవజీవితమునకు శబ్ద వర్ణ చిత్రి తాలేఖ్య మని చెప్పనగును. భిన్న కాలములం దుత్పన్నమైన సారస్వత మా యా కాలముల జనుల నాగరికతను, సాంఘిక వ్యవస్థను, సంస్కృ తిని, వ్యక్తము చేయఁగలుగుచున్నది. ఇతరములగు చారిత్రికాధార ముల కంటెను సారస్వతగతములగు నాధారములు తత్తజ్జాతి చరిత్రలను వ్యక్తపఱచుట కెక్కువ యుపకరింపఁగలవు. వేదవాఙ్మయమందలి ప్రతి భాగమును నార్యుల జీవితమందలి యొక్కొక భాగమునకు వ్యాఖ్యా రూపకవివరణము వలె నొప్పుచున్నది. వేదభాగములగు నారణ్యక ములు, బ్రాహ్మణములు, నుపనిషత్తులు, పూర్వోత్తర మీమాంసలు, నార్యుల యాధ్యాత్మిక సంపదకుఁ బ్రమాణములై వారి యాన్నత్య మును జాటుచున్నవి. అర్థశాస్త్రము, నీతిశాస్త్రము, ధర్మశాస్త్రాదులు. వారి సాంఘిక వ్యవస్థకును, నాగరికతకును, బ్రబల సాక్ష్యము లగు చున్నవి. వైదికవాఙ్మయ కాలమున నాధ్యాత్మికతత్త్వ ప్రధానముగ నున్న యార్యుల సాంఘికజీవితము లౌకిక వాఙ్మయమునాటికి భౌతిక విషయ ప్రధానమైనది. అప్పుడు చతుష్షష్టికళలును సర్వతోముఖముగ వృద్ధిఁజెందినవి. యజ్ఞయాగాదికర్మలు విస్మృతములు కాకున్నను లౌకిక జీవితమునఁ దమ పూర్వ ప్రాధాన్యమునుగోల్పోయినవి. మాన

వుని యైహిక జీవితమునందలి యార్థికస్థితి, సుఖదుఃఖములు, రాగద్వే షాదులు, తత్పరిణామము, నిత్యాదులకుఁ గ్రమముగఁ బ్రాధాన్యము కలిగినది. దృశ్య శ్రవ్య ప్రబంధాత్మకమగు లౌకిక వాఙ్మయము వృద్ధి బొందుటయు, నాధ్యాత్మిక విషయ సంబంధమగు గ్రంథరచన సన్న గిల్లుటయు, నిందులకు నిదర్శనములు. ఇట్లు సంఘపరిణామము ననుస రించి సారస్వత స్వరూపము క్రమముగ మారుచువచ్చినది. ఐనను, భారతీయుల జీవితమునకు మూలాధారమగు మతము మాత్రము మణిహారమందలి సూత్రము వలె వారి సారస్వతమంతటను బ్రాకి యున్నది. భారతీయుల జీవితమున నాటికిని నేటికినిఁ గూడ ప్రాధా న్యము వహించియున్నది మతమే. వేదాంతగ్రంథములు మాత్రమే కాక శాస్త్రీయులును, గావ్యములునుఁ గూడ, ధర్మార్థకామమోక్షము లను బ్రయోజనములుగఁ బోషించుచు, నాముష్మికమును జీవితధ్యేయ ముగ బోధించుచున్నవి. ఇహలోక జీవితమును, దద్గతభోగములును, బరమార్థములుగ నే కావ్యమును బ్రతిపాదించలేదు. సోమసిద్ధాంత చార్వాకాది క్షుద్రమతము లన్నియు వివిధకావ్యములలో నందందుఁ దిరస్కృతము లైనవి. మానవజీవితమున కత్యంతము సన్నిహితము లగు సాంసారిక విషయ ప్రధానములైన దృశ్య ప్రబంధములు కూడ నాముష్మికమునే జీవితపరమావధిగ సూచించుచున్నవి. వేదాంత శాస్త్ర మత గ్రంథములు, లౌకిక శాస్త్రములు, కావ్య ప్రబంధాదులు, నార్యుల జీవితమందలి యాధ్యాత్మిక మానసిక భౌతిక భాగములకుఁ గ్రమముగ వ్యాఖ్యలగుచున్నవి. ఇట్లే విజ్ఞానభాగములు మన ప్రాచీనుల జీవితమం దొక్కొక్క భాగమును బ్రధానముగ వ్యక్తీకరించుచుండ మహాభారతము వారి సమగ్రజీవితమును సువ్యక్తముఁ జేయుచున్నది. ప్రాచీన విజ్ఞానమునంతను సులభగ్రాహ్యమగు విధమున బోధించు చుండుటయే కాక రసవత్తరమగు లౌకికేతి వృత్తముతో నొప్పు మహా

కావ్యము కూడ నగుటచే భారతము సంస్కృతసారసత్వమునం దొక విశిష్ట రచనయై యొప్పుచున్నది.

కావ్యకర్త లోక సంగ్రహమునకుఁ బూనిన మహర్షి యగుటయు, నితివృత్తముదాత్త మై యుండుటయు, నాధ్యాత్మికవిషయము ప్రాధాన్యము వహించుటయు హేతువులుగ భారతము విశిష్టరచన యగుచున్నది. సత్యాసత్యములకును, ధర్మాధర్మములకును, దైవరాక్షస భావములకును జరుగు సంఘర్షణ మీ యితివృత్తమునఁ బోషితమైన నిగూఢార్థము. ప్రాచీనమగు వేదవాఙ్మయమందుఁ గూడ నందందు సురాసుర సంఘర్షణము నితివృత్తముగఁ గల్గిన కథ లుదాహృతములై యున్నవి. లోకమునఁ బుణ్యపాపములకు జరుగు నిరంతర సంఘర్షణ యిట్లు కథా రూపమునఁ బ్రతిపాదితమైనది. భారతమందును నిట్టి విషయమే ప్రధానేతివృత్తమై యున్నది. పరమేశ్వరుని సర్వశక్తిత్వ సర్వజ్ఞత్వములును, సంచిత కర్మపరిపాక ప్రాబల్యమును, భారతేతివృత్త సాహాయ్యమునఁ బ్రత్యక్షీకరింపఁ బడినవి. ఇతియేకాక సకల వేద శాఖలకును జెందిన వైదికవాఙ్మయ సర్వస్వమును భారతమునఁ బ్రతిపాదితమై యున్నది. ఏతద్విషయ ప్రాధాన్యమును బట్టియే భారతమునకు వేదతుల్యత్వము సిద్ధించినది. వేదములకును భారతమునకును ముఖ్యభేద మొక విషయమునఁ గలదు. ఉపపాదితమైన విషయమునకు మాత్రమే కాక, ప్రయుక్తములైన శబ్దములకుఁ గూడ వేదములం దధికప్రాధాన్య మున్నది. అందలి యే శబ్దమును గాని తొలఁగించి, తత్సమానార్థకమగు నితర శబ్దము నా స్థానమునఁ జేర్చ వీలులేదు. 'అగ్నిమీడే' యిత్యాది స్థలములలో 'అగ్ని' శబ్ద స్థానమునఁ దత్సమానార్థకమగు 'ఏహ్న' శబ్దము నుంచుటచే నర్థభేదముగాని, ఛందోభంగముగాని, ఆపాతతః కలుగకపోయినను, వేదత్వమునకు మాత్రము భంగము కలుగక తప్పదు. భారతమున నర్థమునకు మాత్రమే

ప్రాధాన్య మున్నది కాని, శబ్దమునకుఁ ప్రాధాన్యము లేదు. కనుక నూతనాంశము లనేకముల నా యా సందర్భములఁ బురస్కరించుకొని యిందుఁ జేర్చుటకు వీలగుచున్నది. వేదములనుండి యే శబ్దమును గూడ తొలఁగించుటకు వీలులేనట్లె, యధికముగ నొక శబ్దమును జేర్చుటకుఁ గూడ వీలులేదు. భారతేతిహాసము విషయ ప్రాధాన్యమగు గ్రంథమగుటచేఁ, దరువాతి కాలమునం దనేక విషయముల నుచిత స్థలములలోఁ గూర్చుట కవకాశము కలిగినది. ఈ కారణమునఁ జే అనేకవిషయములు భారతమునఁ జేరుట కవకాశముకలిగినది. వ్యాస మహర్షి జయనామక భారతేతిహాసము నెనిమిదివేల యెనిమిదివందల శ్లోకములలో రచించెననియు, నీ గ్రంథము రాను రాను బ్రక్షిప్తముల కారణమున వృద్ధిఁ జెంది, లక్షశ్లోక విస్తృతమయ్యెననియు, భారతము వలననే నిశ్చయింపవచ్చును. వ్యాసుఁడు జయేతిహాసమును రచించి తన శిష్యులగు వైశంపాయన, సుమంత, పైల, జైమినులకును, బుత్రుఁ డగు శుకునకును బోధించి, వారిచే దానిని లోకమునఁ బ్రచారముఁ జేయించెనని తెలియుచున్నది. ఈ యైదుగురును మూలగ్రంథమును ప్రచారమున కనుకూలించు విధమునఁ గొంత మార్చినట్లు కూడ భారతమునందే సూచనకలదు. వైశంపాయనుఁడు ప్రచారము గావిం చిన గ్రంథము మాత్రమే మనకు లభించియున్నది. జనమేజయుని సర్ప సత్ర సమయమున వైశంపాయనుఁడు భారతపఠనముఁ గావించెననియు, నాగ్రంథ మిరువదినాల్గువేల శ్లోకముల నొప్పెననియుఁ దెలియుచున్నది. కనుక వైశంపాయనుఁడును, తదనుయాయులును మూలగ్రంథమును విస్తరింపఁజేసిన ట్లూహింపనగుచున్నది. తరువాత రోమహర్షణి యగు సౌతి కాలమున కీ గ్రంథము లక్షశ్లోక విస్తృతమైనది. పురాణ సమయమున దేశ కాల వ్యవస్థల ననుసరించి పౌరాణికులు నూతన విషయములను మూలమునకు వ్యాఖ్యాన రూపముగఁ జేర్చుటయు

నచ్చటచ్చట కన్పడుచున్నది. భారత పఠనవేళ జనమేజయుఁ డనేక విషయములఁ గూర్చి వైశంపాయనునిఁ బ్రశ్నించుటయు, నతఁ డందులకుఁ దగిన సదుత్తరముల నిచ్చుటయు భారతమునఁ గాననగును. అట్లే సౌతియు మునుల ప్రశ్నలకుఁ బ్రత్యుత్తరములుగ ననేక విషయములఁ గూర్చి యుపన్యసించినాఁడు. ఈ ప్రశ్నోత్తర రూప విషయము వ్యాస రచిత మూలగ్రంథమున నుండుటకు వీలులేదనుట నిర్వివాదాంశము. వ్యాఖ్యారూపముగ నుదాహృతమగు విషయమంతయు గ్రంథమునఁ జేరుట మూలము విస్తృతిఁ గాంచుట కొక కారణము. అంతియకాక పౌరాణికుల యభిప్రాయమును బట్టియు, వారు భారత ప్రచారముచే సాధింపనెంచిన ప్రయోజనములను బురస్కరించుకొనియు, ననేకములగు నూతన విషయములు గ్రంథమునఁ జేరుట కెంతేని యవకాశము కలదు. ప్రఖ్యాత పౌరాణికుఁడును, గవియు నగు రౌమహర్షణి (సౌతి) చాలవరకు భారత గ్రంథవిస్తృతికిఁ గారకుఁడై యుండవచ్చు నని విమర్శకుల యభిప్రాయము. భాషావిషయక భేదములును, శైలీ వైవిధ్యమును గూడ నీ యభిప్రాయమునకు దోహద మొనర్చుచున్నవి. ఇట్లు మనకు లభించిన మహాభారతమున వ్యాసరచితమైన భాగమెద్దియో యిదమిత్థమని నిర్ణయింప వీలులేదు. వేదాంత ధర్మశాస్త్రాది విషయములు, నుదాహృతములగు నుపాఖ్యానములు మున్నగునవి కథా సందర్భములతోఁ జక్కగ ననుసంధింపఁ బడి యుండుట వలనఁ బ్రక్షిప్తములను వేరుపఱచుటకును సాధ్యము కాదు. ఇదికాక వేదాంత శాస్త్ర విషయములన్నియుఁ బ్రక్షిప్తము లనుటయును సమంజసము కాదు. మూల గ్రంథమునందే వేదాంత ధర్మ నీతి శాస్త్రవిషయక భాగము లకుఁ బ్రాధాన్యము కలదనుట నిర్వివాదాంశము. లోకోద్ధరణము ప్రయోజనముగ వేద విభాగముఁ గావించిన వ్యాసుఁడు భారతమును గూడ నట్టి ప్రయోజనము తోడనే రచించినాఁడు. వేదాధ్యయనము

చేయనివారికిని, ననధికారులకును గూడ ప్రాచీన విజ్ఞానము నందఁజేసి ననేకాని వ్యాసుని లోక సంగ్రహణము పూర్తికాదు. వేద ప్రతి పాదితములగు ప్రకృతి సత్యములను, ధర్మములను, కథా మూలమున వ్యాప్తి చేయుచుండుటవలననే పురాణములకు నుపబృంహణము లని పేరు కలిగినది.

'ఇతి – హ – ఆస' అను వ్యుత్పత్తి ననుసరించి, పూర్వుల భౌతికా ధ్యాత్మిక జీవితసర్వస్వమును జిత్రించుట యితిహాసముల యాశయమని తెలియుచున్నది. ఇట్టి యర్థవిశేషము ననుసరించియే భారత మితిహాస మని వ్యవహరింపఁ బడుచున్నది. భారతమున కితిహాసమను వ్యవహారము ప్రసిద్ధమై యుండుటవలన భారతకథ కల్పితము కాదనియు, నది జరిగిన విషయమునియు నిశ్చయింపవచ్చును. కురు పాండవ వంశములకు జరిగిన ప్రసిద్ధమగు కథ నిం దితివృత్తముగ వ్యాసుఁడు గ్రహించినాఁడు. భారత కథతో వ్యాసునకును సంబంధ మధికముగఁ గలదు. తన ప్రత్యక్షాను భవ మునకుఁ జెందిన యీ ప్రసిద్ధేతివృత్త ముత్కృష్టప్రయోజనము కొరకై వ్యాసునిచే నుపయుక్తమైనది. భారతకథను గావ్యరూపమునఁ బోషిం చుట మాత్రమే వ్యాసుని యుద్దేశము కాదనియు, విజ్ఞానవ్యాప్తిచే లోకము నుద్ధరించుట యతని యాశయమనియు విదిత మగుచున్నది. తత్ప్రయోజనసిద్ధికై యతఁ డాధ్యాత్మిక శాస్త్ర విజ్ఞానసారమును జేర్చియే జయ మను నితిహాసరూప కావ్యమును రచించెనని నిశ్చయ మగుచున్నది. భారతము ప్రమాణ గ్రంథముగ బ్రహ్మసూత్రాది వేదాంతగ్రంథములలో నుదాహృతమై యుండుటకు భారతస్థమగు నీ విషయమే కారణమైనది. మూలగ్రంథ మాధ్యాత్మిక విషయ ప్రధాన మగుటవలననే తరువాతి కాలమున నట్టి విషయ మింకను జేరుట కవ కాశము కలిగినది. ఇట్లు మహాభారతమునఁ గల వేదాంత, ధర్మశాస్త్ర, నీతిశాస్త్రాది విషయమంతయును బ్రక్షిప్తము కాదనియు, వ్యాసుని

గ్రంథమునందే యీ విషయము ప్రాధాన్యము వహించినదనియు, నిశ్చయింపవచ్చును. ఈవిషయములను జేర్చుటలో వ్యాసుని యొక్కయు, వతని యనుయాయులయొక్కయు నాశయమొక్కటియే. లౌకికమగు భారతేతివృత్తము నాధారముగఁగొని, పరబ్రహ్మస్వరూపమును, విధి ప్రభావమును, లోకులకు వ్యక్తపఱచి, సత్యధర్మములను సంఘమునఁ బ్రతిష్ఠించుటయే వారి యుదాత్తాశయము.

ఇట్లు పరిష్కృతిఁ జెందిన మహాభారత మాధ్యాత్మిక విషయ ప్రధానమగు వైదిక వాఙ్మయమును, భౌతికవిషయ ప్రధానమగు లౌకిక జీవితముతో ననుసంధింపఁజేయుచు, నా కాలపు సంఘజీవితమును సంస్కరించుట కుపకరించినది. పూర్వవిజ్ఞానమును సులభగ్రాహ్యమగువిధమునఁ బోషించుచుండుటయేకాక, రసవత్తరమగు లౌకికేతివృత్తముతో నొప్పు మహాకావ్యముకూడ నై యుండుటచే మహాభారతము సంస్కృత సారస్వతమున విశిష్టరచన యగుచున్నది.

భారత మితిహాసము. కథ ప్రత్యక్షముగ జరిగినది యగుటచే నాకర్షణీయమై, లోకోద్ధరణ కెక్కువగ నుపకరించుచున్నది. మఱియు, వేద వాఙ్మయ సారమంతయు నిందుఁబ్రతిపాదితమై యుండుటచే భారతమునకు వేదతుల్యత్వము సిద్ధించినది. ఇక, ధర్మశాస్త్ర నీతిశాస్త్రాదుల యందలి విషయము లన్నియు నిందు సులభ గ్రాహ్యమగు రీతి వివరింపఁబడి యున్న కారణమున, భారతము స్మృతిగ్రంథముకూడనగును. అంతియకాక, "సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణిచ, వంశానుచరితం చేతి పురాణం పంచ లక్షణం," అను పురాణలక్షణము లైదును భారత విషయమునఁ గూడ సమన్వయ మగుచుండుటచే నియ్యది పురాణ సముచ్చయమనికూడ వ్యవహరింపఁ బడుచున్నది. సకలోపనిషత్సారమును నిందుఁ బ్రతిపాదితమై యుండుటవలన భారతము వేదాంత గ్రంథముకూడ నగును. ఇట్టి మహోత్కృష్టమగు నుద్గ్రంథమునకుఁ గర్త

విష్ణ్వంశసంభూతుఁడగు కృష్ణద్వైపాయనుఁడు. "వ్యాసో నారాయణో హరిః." వేదవిభాగముఁ గావించిన కారణమున "వ్యాసుఁ" డను బిరుదము నందిన వేదవేదాంగాది విజ్ఞానసిధియు, బ్రహ్మజ్ఞానియు, వాఙ్మయ విశ్వ విధాతయునగు కృష్ణద్వైపాయనునకు మాత్రమే యిట్టి మహా గ్రంథసృష్టి సాధ్యమైనది. వ్యాసకృత జయేతిహాసమును విపులముఁ గావించి, మహాభారతముగఁ బరిణమింపఁజేసిన వైశంపాయన రౌమహర్షణాదులు కూడ, మహర్షులు, విజ్ఞాన వేత్తలు నగుటచే గ్రంథ పరివృద్ధి యుదాత్తమార్గమున జరిగినది.

ఇతివృత్తమును విశాలమైనది యగుటచే, జీవితమును సమగ్రముగఁ బోషించుటకనువైనది. ఒక్కొకవవంశమేకాక యాదవ పాంచాల మాత్స్య వంశములన్నియు నిందుఁ బ్రాధాన్యము వహించినవి. ఈ యితివృత్త మాధారముగ భారతీయ జీవితచరిత్రయంతయు నీ మహా కావ్యమునఁ జిత్రిత మైనది. ఐహికజీవితమున సంభవించు వివిధములగు సంఘటనలు, సమస్యలు, సాంసారిక సుఖ దుఃఖాద్యనుభవములు, పాప పుణ్యములఫలములు, మున్నగునవన్నియు భారతమునఁ బ్రస్ఫుటము లగుచున్నవి. శంతనుని చరిత్రతో నారంభమై, యనేకముఖముల విస్తృతిఁజెంది, పాండవుల స్వర్గప్రాప్తితో సమాప్తిఁ జెందిన ప్రధానేతి వృత్త మాధారముగ నీ గ్రంథమున సర్వతోముఖమగు లోకజీవితము ప్రతిబింబించినది. సత్య ధర్మములను సంఘమున స్థాపించుట మహాభారత రచనా ప్రయోజనము. అప్పు డట్టి యవసరమును గలిగినది. మహాభారత కథాకాలము నాటి కార్యులసంఘము బహుముఖముల విస్తరించి యార్యావర్తమున వ్యాపించినది. ఆర్యానార్య సమ్మేళనము కూడ జరిగి సంఘము వృద్ధియైనది. ఈ కారణమువలనఁ బలువిధములగు నాచార వ్యవహారములు, సంఘసూత్రములు, మతములు కూడ వివిధ ప్రదేశములలోఁ దలలెత్తినవి. ప్రజల ఐహికములం దాసక్తియు, నాము

ష్మికములందు నిరాదరణమును గలుగసాగినది. తత్ఫలముగ సంఘమున న్యాయ ధర్మములు క్షీణించినవి. ఆ యధర్మ పరిణామఫలమే భారత యుద్ధము. భారతయుద్ధమునఁగలిగిన సర్వనాశమును బ్రత్యక్షముగఁ జూచినవాఁ డగుటచే వ్యాసుఁ డా యితివృత్తము నాలంబముగఁ గొని, ధర్మప్రచారముఁ గావించి సంఘమును బునరుద్ధరింపఁ బూనినాఁడు. విస్తారవ్యాప్తిఁ జెంది, బహుధా భిన్నమై యుండిన యార్యసంఘమును వేదమనైకసూత్ర బద్ధము గావించుటయే వ్యాసుని యాశయము. తదా శయ సిద్ధికై ఆర్యవిజ్ఞాన సర్వస్వమును లోకమున వ్యాప్తిఁ గావింపవలసి వచ్చినది. కనుకనే వేదవాఙ్మయమునఁ బ్రతిపాదితమైన యార్యవిజ్ఞానము నంతను భారతమునఁ గథా సందర్భముల ననుసరించి వ్యాసుఁడు చేర్చి యున్నాఁడు. ప్రజాబాహుళ్యమున కందుబాటులో లేని వేదాంత ధర్మ శాస్త్రాంతర్గత విషయములను లోకహితార్థము ప్రచారముచేయుట యిం కొక ప్రయోజనము. భారతకథాభాగమంతయు నిరువదినాల్గువేల శ్లోక ములలో నిమిడియున్నను గ్రంథము లక్షశ్లోక విస్తృతమై యుండుటకుఁ గారణ మిదియే యైయున్నది. వ్యాసుని యాశయము ననుసరించి యితివృత్తముకంటెను నాధ్యాత్మిక ధర్మశాస్త్రాది విషయమే ప్రధాన మగుటచే నీ భాగము కథకు మూడురెట్లుండుటలో నాశ్చర్యము లేదు. వేదాంతశాస్త్ర గ్రంథజాలమునుండి సందర్భముల కనుకూలించు ననేక భాగములను గ్రహించి భారతమున నితరులు చేర్చి యుండవచ్చు ననుమ నభిప్రాయము కూడ సమంజసముగనే కనుపట్టుచున్నది. భార తమునకు సంహిత యను పేరుండుట యీ యభిప్రాయమును బలపఱచు చున్నది. ప్రక్షిప్తమని చెప్పఁబడు నీ విజ్ఞానవిషయ ప్రాధాన్యముం బట్టియే భారతమునకుఁ బంచమవేదమనియు, స్మృతిగ్రంథ మనియుఁ బ్రఖ్యాతి కల్గినది.

"ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని
యధ్యాత్మవిదులు వేదాంతమనియు,
నీతి విచక్షణుల్ నీతిశాస్త్రంబని
కవివృషభులు మహాకావ్య మనియు,
లాక్షణికులు సర్వలక్షణం బనియును
నైతిహాసికు లితిహాస మనియుఁ,
బరమ పౌరాణికుల్ బహు పురాణ సముచ్చ
యంబని మహిఁ గొనియాడుచుండ"

అను నన్నయ పద్యమువలన మహాభారత ప్రాశస్త్యము బాగుగ వ్యక్తమగుచున్నది. లోకజీవితమునకు సన్నిహితమగు నితివృత్తమును గావ్య రూపమునఁ బోషించి, తదాధారమున వైదిక లౌకిక వాఙ్మయసారము నంతను వ్యాసుఁడు ప్రతిపాదించి యుండుటచే భారతము విశిష్టమగు నుద్గ్రంథమైనది. వేదవిభాగముఁ గావించిన మహర్షియు, బ్రహ్మజ్ఞానియు, విపుల వాఙ్మయకర్తయు నగు కృష్ణద్వైపాయనుఁడు కావ్యకర్త యగుటచే మహాభారతరచన, యలౌకికముగఁ బరిణమించినది: రామాయణ మహాభారతములు రెండును ధర్మమునే ప్రయోజనముగఁ బ్రతిపాదించుచున్నను, రచనావిధానమునందు భిన్నములగుచున్నవి. రామాయణము విశుద్ధమగు మహాకావ్యమగుటచే నందు రసోత్కర్ష ప్రాధాన్యము వహించినది. మానవజీవితమునకుసన్నిహితము, నాకర్షణీయము, ప్రసిద్ధమునగు నితివృత్తము కావ్యరచనకుఁదగినవస్తువు. అట్టిరమణీయమగు వస్తువును రసోత్పాదకమగు రచనచేఁ బోషించుట కావ్యలక్షణము. కనుక వస్తు, రచనలు రెండును గావ్యమునఁ బ్రధాన విషయములగును. ఐనను, బౌద్ధక చిత్తవికాసమునకును, రససిద్ధికిని రచనా విశేషమే ప్రధాన హేతువగుటచే నది కావ్యములలోఁ బ్రాముఖ్యము వహించుచున్నది. ఇది కావ్య సామాన్య లక్షణము. ఇఁక, మహాకావ్యమున

వీరము ప్రధాన రసమగును. ధీరోదాత్తుఁడగు నాయకుని చరిత్ర ఆది నుండియుఁ దుదివఱకును ప్రౌఢాన్యము వహించును. సందర్భములఁ బురస్కరించుకొని పోషితములైన యష్టాదశవర్ణనలు రచనకు సౌంద ర్యము నాపాదించును. నాయికానాయకుల సచ్చరిత్ర, వారికిఁ గలిగిన కష్టసుఖములు, వారి ధర్మపరత్వ సత్ప్రవర్తనాదులు, తుదకు వారు పొందిన ధర్మవిజయము- మున్నగునవి లోకమున ధర్మ, న్యాయ, సత్య ములను ప్రతిష్ఠించుటకు సాధనము లగుచున్నవి. నాయికా నాయకుల జీవితముతో ననుసంధించునట్లు, సన్నివేశము లన్నియుఁ, గావ్యఫలాగ మార్థము పోషితములు కావలెను. వివిధసన్నివేశములు, సంఘటనలు నిత్యాదులు రసవత్తరమగు విధమున రచితము లగుటచేఁ గావ్య మాస్వాద యోగ్య మగుచున్నది. శాస్త్ర సంబంధములగు విషయము లందందుఁ గథాసందర్భముల ననుసరించి స్మరింపఁ బడినను, నవి కావ్య మునఁ ప్రౌఢాన్యము వహించవు. ఉపాఖ్యానములు, వేదాంత, ధర్మ, నీతి శాస్త్ర విషయములు, మున్నగునవి కథావేగమునకుఁ ప్రతిబంధ కము లగుటచేఁ గావ్యరచనయం దవి గృహీతము లగుటలేదు.

ఇట్టి మహా కావ్య లక్షణములన్నియు రామాయణము నెడఁ జక్కఁగ సమన్వయముం బొందుచున్నవి. సీతారాముల యుదంతమే రామా యణమునం దాదినుండి తుదివఱకును ప్రధానేతివృత్తము. తక్కిన ప్రాసంగికేతివృత్తము లన్నియు, నానుషంగికములై, ప్రధానేతి వృత్తము నకుఁ బోషకములగుచు, నందే యంతర్భావమును బొందుచున్నవి. ఇందు వీరరసము ప్రధానమును, దానికి శృంగార కరుణములు ముఖ్యాంగములు నగును. పుత్రధర్మ, భ్రాతృధర్మ, భర్తృధర్మ, సతీధర్మ, ప్రభుధర్మములు రామాయణేతివృత్తమునఁ బరాకాష్ఠనందినవి. భారతసతీత్వము సీతాదేవి యందును, ధర్మవీరము రాముని యందును మూర్తీభవించినవి. ఇతివృత్త మాదినుండియుఁ దుదివఱకును, నేకధారగ ఫలోన్ముఖమై ప్రవహించు

చున్నది. ఉత్తరకాండమందుఁ గూడ సీతాచరిత్రమే ముఖ్యేతివృత్తమును, ధర్మమే కావ్యప్రయోజనము నైయున్నవి. సందర్భోచితములు, భావపోషకములు నగు ప్రకృతివర్ణనలచే నొప్పుచు, రచన, రసవత్తరమై, చిత్తవికాసమునకు హేతువగుచున్నది. కనుకనే రామాయణము మహా కావ్యమని పండితులచే నిశ్చయింపఁబడినది.

మహాకావ్య లక్షణములు భారతమునకుఁ గూడ వర్తించకపోవు. కాని, రామాయణమునందు వలె భారతమున వానికిఁ బ్రాధాన్యము లేదు. భారతమునం దర్థగౌరవమును, రామాయణమున రసోత్కర్షయు ముఖ్యములు. ఇతిహాస ధర్మశాస్త్ర లక్షణములు భారతముతోఁ జక్కగ సమన్వయమును బొందుచున్నవి.

ఆదర్శ ధర్మవీరుఁడగు రాముని చరిత్రను గావ్యరూపమునఁ జిత్రించు టయే వాల్మీకి యాశయము. సీతారామలక్ష్మణుల జీవితములు మన కున్న తాదర్శము లగుచున్నవి. రామాయణ పఠనమువలన మనకు నీతి, ధర్మాదిజ్ఞానము పరోక్షముగ గల్గినను, ప్రత్యక్షముగ సిద్ధించునది సాత్త్విక మగు చిత్తవికాసము, సద్యఃపరనిర్వృతి. కనుక రామాయణ రచన యందుఁ బ్రాధాన్యము వహించినది కావ్యపద్ధతి. విపులసంఘసంస్కరణ వ్యాసుని యాశయమగుటచే భారత రచనావిధానము కావ్యరచనకంటె విశిష్టముగ నున్నది. భారతము శాంతరసప్రధానమనియు, దానికి నాయ కుఁడు శ్రీకృష్ణుఁడనియుఁ బెద్దలు నిశ్చయించినారు. రచనయందు రసో త్కర్షకన్న నర్థగౌరవమున కెక్కువ ప్రాధాన్యము కలిగినది. మతసూత్ర ములను, నాధ్యాత్మికవిషయములను, నీతి ధర్మసూత్రములను, లోక మునఁ బ్రచారముఁ గావించుటకు శాస్త్ర గ్రంథములకంటెను గావ్యము లెక్కువగ ననుకూలించుటచే, వ్యాసుఁడు పాండవేతివృత్తమును గావ్యముగ రచించి, తచ్చాలంబమునఁ దనయాశయమును నెరవేర్చు కొన్నాఁడు. కనుక భారతము కావ్యము, శాస్త్రము, కూడ నగు

చున్నది. ఇతివృత్తము లౌకికమును, దన్మూలమునఁ బ్రతిపాదితమగు విషయ మాధ్యాత్మికము, నగుటచే భారతము లోకకల్యాణసిద్ధి కుత్కృష్టసాధన మగుచున్నది.

"కమనీయ ధర్మార్థ కామమోక్షములకు
నత్యంత సాధనంబైనదాని"

అని యీ విషయము భారతమునందే వివరింపఁబడినది.

ఆయుష్యం బితిహాస వస్తు సముదాయం బైహికాముష్మిక
శ్రేయఃప్రాప్తి నిమిత్తము త్తమ సభాసేవ్యంబు లోకాగమ
న్యాయైకాంత గృహంబు నాఁ బరగి నానావేద వేదాంత
విద్యాయుక్తంబగు దానిఁ జెప్పఁ దొడఁగెం దద్భార తాఖ్యానమున్.

ఇట్టి విశిష్ట ప్రయోజన సాధనమగు నీ యుద్గ్రంథము ననువదించు టతో నాంధ్రసారస్వత మారంభమగుట ఆంధ్రుల భాగ్యవిశేషము. భారతాంధ్రీ కరణమునకు గూడ లోకహితమే ప్రయోజనము. రాజ రాజు కాలము నాటి కాంధ్రదేశము సంఘ మత కల్లోలములకు లోనై యుండినది. విజాతీయులగు శత్రువుల దండ యాత్రల వలనను, జైన బౌద్ధ మతముల వ్యాప్తివలనను, వేద ప్రమాణములను దిరస్కరించు కొన్న చార్వాకాది మతముల వ్యాప్తివల్లను, నార్యధర్మములు వెనుకఁ బడినవి. స్వార్థపరులు గావించుచున్న నిరీశ్వరాది మతప్రచారము ప్రజ లలో నైక్యమును నశింపఁజేసి, సంఘవిచ్ఛిత్తికిఁ గారణమైనది. ఇట్టి క్లిష్ట పరిస్థితియందున్న యార్యసంఘమును బునరుద్ధరింపఁబూనుకొనినవారిలోఁ గుమారిలభట్టు ముఖ్యుఁడు. శంకరాచార్యులకుఁ బ్రాచీనుఁడగు నీ కుమారిలభట్టు పూర్వమీమాంసా విధానమును బహుళ ప్రచారముఁ గావించియున్నాఁడు. తత్ఫలితముగ యజ్ఞయాగాది వైదికక్రియలకు మరల నాంధ్రదేశమునఁ బునఃప్రచారము కలుగసాగినది. ఈ యార్య మత పునరుద్ధారణ కాలమునకే రాజరాజు పాలకుఁడగుట తటస్థించినది.

ఆర్యమతావలంబియగు నీతఁడు సారస్వతమూలమున మతవ్యాప్తిఁ గావింప నిశ్చయించినాఁడు. వేద పురాణాదులయందును, మను గౌతమ పరాశరాది ఋషిప్రోక్త స్మృతులయందును, ప్రపంచితములైన సకల ధర్మముల నొప్పి, వర్ణాశ్రమ ధర్మములకు నిలయమై, వేదసార మనఁదగిన భారతము నాంధ్రీకరించి, దేశమునఁ బ్రచారముఁ గావించినచో నార్య మతము పునరుద్ధృతమగుననియు, సంఘమున నైక్యము సిద్ధించుననియుఁ దలఁచి, రాజరాజు తన్మహాకార్య నిర్వహణమునకు నన్నయను ప్రోత్స హించినాఁడు. లోకహితముఁగోరిన నన్నయ వ్యాసుననుసరించి యాంధ్ర భారతరచన నారంభించినాఁడు. ఇట్లు సంస్కృతభారత రచనకును, నాంధ్రభారత రచనారంభమునకును గూడ లోకసంగ్రహేచ్ఛయే హేతు వైనది. ఇఁక, తిక్కన్ననాటి కాంధ్రదేశమునఁ బరిస్థితులు మారినవి. చార్వాకాది మతములకు వ్యాప్తి లేకున్నను, జైనమత మింకను విజృం భించియే యున్నది. పాలకుల యభిమాన మాధారముగ నొకప్పుడు వైదిక మతమును, నొకప్పుడు జైనమతమును, ప్రాబల్యము వహించు చుండినవి. ఇదికాక పాల్కురికి సోమనాథాదుల రచనలవల్లను, బండితత్రయము వారి కాంధ్రదేశమున నుండిన పలుకుబడి వల్లను, వీరశైవము ప్రబలి, సంఘ మున మతకలహములకు హేతువైనది. ప్రాహ్మణ మతావలంబులగువారి యందే శైవ వైష్ణవ మతములు స్థిరపడి ప్రొత్తెగలను సృష్టించినవి. సంఘమునకు మార్గదర్శకులు కావలసిన కవులయందును మతవిషయక విభేదము లేర్పడినవి. శివకవులు భవికవులను నిరసించుట యిందులకుఁ దార్కాణ మగుచున్నది. ఇట్టి క్లిష్టపరిస్థితులనుండి సంఘమును రక్షించు నుద్దేశముతోఁ దిక్కన భారతమును బూర్తిచేయ సంకల్పించి నాఁడు. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు పరబ్రహ్మమొక్క యంశములు, వీరొనర్చు సృష్టి స్థితి లయములు సగుణాత్మకమగు పరబ్రహ్మలీలలు, కనుక శివకేశవు లా పరమాత్మయొక్క భిన్నమూర్తులు అను జ్ఞానము

ప్రజలకుఁ గలిగించుటకై తిక్కన హరిహరమూర్తి నిష్ట దేవతగా స్తుతించి తన భారత మా దేవున కంకితమొనర్చినాఁడు. ఇతని యుదా రాశయము ఫలించి సంఘమున శివ కేశవ భేదము లడఁగినవి. తిక్కన తరువాత వచ్చిన నాచన సోముఁడును, దిక్కనమనుమఁడును శిష్యుఁడును నగు కేతనయు, నీ యుత్తరాదర్శము నవలంబించి హరిహరునిఁ బూజించినారు. కొరవి గోపరాజు కూడ హరిహరారాధకుఁడే. తిక్కన తరువాతి కవులు వైష్ణవులైనను శైవులైనను బరమతదూషణఁ గావింప లేదు. మీదుమిక్కిలి పరమత సహనమునే ప్రదర్శించినారు. ఇట్లు తిక్కన, శివ కేశవ భేదమును బరిహరించుటయేకాక, జీవాత్మపరమా త్మైక్యమును బోధించు నద్వైతమును భారతమునఁ బ్రతిపాదించి, యాంధ్రసంఘము నేకైక మతసూత్ర నిబద్ధమగునట్లు గావించినాఁడు. దక్షిణాపథమునం దాంధ్రదేశమున నద్వైతమునకున్న ప్రాధాన్యము ద్వైత విశిష్టాద్వైతములకు లేకుండుటకు తిక్కనభారతము కారణమని చెప్పవచ్చును. తమిళదేశమున నద్వైత విశిష్టాద్వైతములును, గన్నడ దేశమున ద్వైత విశిష్టాద్వైత వీరశైవములును, ప్రాధాన్యము వహించి యున్నవి. తమిళదేశమున వైష్ణవమతవ్యాప్తికి నాళ్వారులును, శైవ మునకు నాయనారులును, నెక్కువగ దోహద మొనర్చియున్నారు. అట్లే కన్నడదేశమున వీరశైవ విజృంభణమునకు గురుజంగములు మూలపురుషులు. ఈ మతములన్నియు భక్తి నాలంబముగఁ గొని, తదనుయాయుల భావావేశప్రాబల్యముచే నెక్కువ వ్యాప్తిఁజెందినవి. జ్ఞాన మార్గముకంటెను భక్తిమార్గము సులభ సాధ్యమగుటచేఁ, బామర జనసంఘ మధికముగ నీమతముల నవలంబించుటకు వీలైనది. వేదాంత శాస్త్రజ్ఞానమును, దార్కికదృష్టియు నుండిననేకాని యద్వైతము సుబోధము కాదు. అద్వైతమును సులభగ్రాహ్యమగు విధమునఁ బ్రజ లకు బోధించు గ్రంథములు తమిళ కర్ణాట భాషలలో నంతవఱకును

వెలువడకుండుటచే నా దేశములలో నద్వైతవ్యాప్తి కవకాశము లేక పోయినది. వేదసారమును, నద్వైత మత ప్రతిపాదకమును నగు మహా భారతమును దేశభాషయగు జానుదెనుఁగునఁ దిక్కన రచించుటవలన, నాంధ్రదేశమునఁ దన్మతవ్యాప్తి యెక్కువగ జరిగినది. నన్నయతిక్కనల యున్న తాశయములను సిద్ధిఁబొందింపఁ జేయు నుద్దేశముతో నెఱ్ఱా ప్రెగడయు నరణ్యపర్వ శేష భాగమును బూర్తిచేసి, భారతానుబంధ మగు హరివంశమునుగూడ రచించియున్నాఁడు. ఇట్లు వ్యాస భారతరచన కును, భారతాంధ్రీకరణమునకును ప్రయోజనతుల్యత్వము సిద్ధించి యుండు టాశ్చర్యము. అంతియకాక, పంచమ వేదమనియు, ధర్మశాస్త్ర మనియుఁ ప్రసిద్ధిఁజెంది పవిత్రగంథముగఁ బూజింపఁబడుచున్న మహా భారతమును దెనుఁగున రచించుటకు, సాధారణులగు లౌకికకవులు కాక ఋషితుల్యులగు కవిత్రయమువంటివారు లభించుటయు, వారి యాశ యము ప్రజాహితమగుటయుఁ, దెలుఁగువారిభాగ్యము. "నానృషిఃకురుతే కావ్యమ్" అను నార్యోక్తి కవిత్రయమువారి విషయమునఁ బూర్తిగ సమ న్వయయించుచున్నది. రాజాశ్రయమును గాంచి, యైహిక విషయము లతో సంబంధమున్నవా రయ్యును వీరి యాంతర దృష్టి సర్వదా యా ముష్మికము నైపే ప్రసరించినదని వీరి రచనల వలననే తెలియుచున్నది. భారత రచనవలన వీరాశించినది భవబంధ విమోచనము.

"భారత భారతీ శుభ గభస్తి చయంబులఁ జేసి ఘోర సం
సారవికార సంతమసజాల విజృంభము వాపి నూరి చే
తో రుచిరాబ్జబోధనరతుండగు దివ్య పరాశరా త్మజాం
భోరుహమిత్రుఁ గొల్చి"

అను వాక్యమువలన, నన్నయ భారతరచనచే సంసారబంధములఁ దొలఁగించుకొనఁ దలఁచినాఁడని యూహింపనగుచున్నది.

కలయందు గోచరించిన హరిహరనాథునకుఁ దిక్కన భక్తిఁజేసి, "యింక జన్మాంతర దుఃఖముల్ దొలఁగునట్లుగఁ జేసి సుఖాత్మఁ జేయవే" యని ప్రార్థించిన నజ్జగన్నాథుండు,

"జనన మరణాదులైనసంసార దురిత
ములకు నగపడకుండంగఁ దొలఁగు తెరువు
గను వెలుంగు నీకిచ్చితి ననిన లేచి
నిలిచి సంతోష మెద నిండ నెలవుకొనఁగ."

మేలుకాంచినాఁడు. ఇట్లు తిక్కన యాశయమును భవబంధవిమోచన మని తెలియుచున్నది. ఇంతియకాక,

"కావున భారతామృతము కర్ణపుటంబుల నారఁ గ్రోలి యాం
ధ్రావలి మోదమున్ బొరయునట్లుగ సాత్యవతేయ సంస్మృతి
శ్రీవిభవాస్పదంబయిన చిత్తముతోడ మహా కవిత్వ దీ
క్షావిధినొంది పద్యముల గద్యములన్ రచియించెదన్ గృతుల్."

అను తిక్కనపల్కవలన నతని యుదారాశయము వ్యక్తమగుచున్నది. "భారతామృతము" అను ప్రయోగమున నభేద రూపకము గావింపఁబడినది. అమృత శబ్దము 'పరబ్రహ్మ' వాచి. పరబ్రహ్మజ్ఞాన మనునాదిక యోగముచే నానందసిద్ధి గలుగునట్లు భారతాఖ్యాన శ్రవణముచే నాంధ్రుల కానందము సిద్ధించునను విశిష్టార్థ మిందు స్ఫురించుచున్నది.

"అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయా అమృత మశ్నుతే"

పరబ్రహ్మ సాక్షాత్కారమునకు సాధన మగునది విద్య, యను నర్థము భారతమునెడ తిక్కన సమన్వయింపఁ జేసినాఁడు. భారతరచన తనకును, తన జాతివారికిఁ గూడ నిత్యశ్రేయమును గలుగఁ జేయునను తిక్కన యాశయ ముదాత్తమైనది. వీరిట్లు నిత్యమగు మోక్షఫలమును గోరిన వారగుటచే భారతామ్నాయ కర్మనిర్వహణమునందు యోగులైనారు. కనుక యోగులయందువలెనే కవిత్రయమువారి రచనలయందును సంయ

మనము విశిష్టలక్షణమై యొప్పినది. కొలఁదిమాటలలో విపులార్థము నిమిడించుటయు, విశేషార్థములు పలయుచోట దానిని వాచ్యము చేయక వ్యంగ్యశక్తిచే స్ఫురింపఁజేయుటయు, గాంభీర్యగుణ ప్రధానము లుగఁ బాత్రల శీల స్వభావాదులను జిత్రించుటయు, వర్ణనల విషయమున నలంకార చమత్కార వ్యామోహమునకు లోనుగాక సహజ సిద్ధమగు రమ్యత నర్థగౌరవముచే వికసింపఁజేయుటయు – నివి కవిత్రయము వారి రచనలయందలి ప్రధానగుణములు. ఇట్టి సంయమనము తరువాతి కవులలోఁ గానరాదు. కాలము ననుసరించియు, సంఘజీవితము ననుస రించియుఁ, బ్రజల జీవితాదర్శములును, వానితోఁ గావ్యరచనను గూర్చిన యభిప్రాయములును మారుచువచ్చినవి. తదనుగుణముగఁ గవుల జీవితములును వే ఱైనవి. కవిత్వదీక్షను బూని, సంయమి యై, లోకహితముఁ గోరి, కావ్యరచనఁ గావించు కవి లేకపోవుట వలన భారతముతోఁ దూగఁగల కావ్యమింతవఱకును మఱల సృష్టిం కాలేదు. నాఁటికిని నేఁటికినిఁ గవిత్రయభారతము లోకకల్యాణ ప్రతి పాదకమగు మహాకావ్యమగుటయే కాక, ఆంధ్రుల విజ్ఞాన సర్వస్వము నైయున్నది.

డాంటే రచించిన డివైన్ కామిడీ (Devine Comedy) ఇటలీదేశ స్థులకును, హోమరు రచించిన ఇలియడ్ (Iliad) గ్రీకులకును, షేక్స పియర్ రూపకములును, మిల్టను పారడైజ్ లాస్ట్ (Paradise Lost) అను గ్రంథ మాంగ్లేయులకును, నెట్లు జాతీయ జీవితసర్వస్వములో, అట్లే భారత మాంధ్రుల జాతీయ జీవితసర్వస్వ మగుచున్నది. ఒక జాతియుందుఁ బెంపొందిన సారస్వతమును, దన్మూలముగ జరిగిన విజ్ఞా నాభివృద్ధియుఁ, బ్రపంచచరిత్రయం దా జాతికి లభించు గౌరవమునకు హేతువులగుచున్నవి. రాజకీయ రంగమున నొక దేశమునకుఁగలుగు ప్రాధాన్యము స్థిరమైనదియుఁగాదు, సత్యమైనదియుఁ గాదు. ఉత్కృష్ట

సారస్వత నిర్మాతలై, స్వార్థరహితులై, విజ్ఞానవ్యాప్తిఁ గావించి, లోక హితము నాచరించిన మహామహులే నిజమగు జాతీయ నాయకులని పాశ్చాత్యుల యభిప్రాయ మగుటచే వారిదేశములలో సారస్వతస్రష్టల కనన్యలభ్యమగు గౌరవము కలదు. రాజ్యతంత్రములను ధీసామర్థ్య ముతో నిర్వహించి, దేశీయార్థికస్థితిని బాగుపఱచిన యేమహామంత్రికిని, నాంగ్లదేశమున మిల్టను బెర్నార్డుషాల వంటి మహా కవులకున్న పూజ్యస్థానము లేదు. రాజకీయకల్లోలములు పెచ్చుపెరిగిన యీ రోజు లలోఁగూడ షేక్సుపియరు జన్మస్థానము నొకపవిత్రస్థలముగఁ బ్రభుత్వము వారు రక్షించుచుండుటయు, విద్యావంతు లాప్రదేశమునకు యాత్ర పోవుచుండుటయు నిందులకు నిదర్శనములు. కార్లైలు రచించిన వీర పూజ(Hero Worship) అను వ్యాససంపుటికిఁ గల బహుళ ప్రచార మీదేశమునఁ గవులకుఁ, బండితులకుఁ, గల గౌరవమునకుఁ బ్రబల సాక్ష్యము.

షేక్సుపియరు రచనలనుగురించిన సద్విమర్శకగ్రంథములు, వ్యాస ములు నసంఖ్యాకములు. ఆంగ్లేయుల దేశీయాభిమాన భాషాభిమాన ములును, వారి విజ్ఞానాసక్తియు, నిందులకుఁ గారణములు. ఆంధ్రుల ప్రాచీన నాగరికతకును, సంస్కృతికినిఁ బ్రత్యక్షప్రమాణమగు నాంధ్ర మహాభారత రచన పూర్తియై యిప్పటి కారు శతాబ్దములు గడచినను, దదుద్గ్రంథమును గూర్చిన సమగ్రమగు విమర్శకగ్రంథ మింకను సృష్టికి రాలేదు. ఆదినుండియు నాంధ్రమున వచన రచన కాదరములేకపోవుట యిందులకొకకారణము. ఆంధ్రాభిమానము పూర్తిగ రాజకీయములందే వినియుక్తమై సారస్వత విజ్ఞానాది విషయముల కేమియు మిగులక పోవుట మఱియొక హేతువు. సరియగు విద్యావ్యాప్తి లేకపోవు టచే నుద్గ్రంథపఠనమే దేశమున లోపించినది. ఆముష్మిక దృష్టి సంఘ మున నున్నంతకాలము భారత రామాయణములను బురాణములుగఁ

జెప్పించి విను నలవాటైనఁ గొంత యుండెడిది. కాని ప్రజలలో నార్థిక దృష్టి మితిమీరి ప్రబలుటచేఁ బురాణ శ్రవణాదులకుఁ గూడ నవకాశము లేకపోయినది. తాత్కాలికాహ్లాద వినోదములు గూర్చు కథలకును, నింద్రియోద్రేకమును గలిగించు రచనలకును, సంఘమున నున్నంత ప్రచార మున్నత కావ్యములకును, విజ్ఞాన గ్రంథములకును లేదు. సామాన్యులగు నక్షరాస్యులు మాత్రమే కాక విద్వాంసులు కూడ నిట్టి వానినే యన్వేషించుచు, భారతాది గ్రంథములను స్మరింపకుండునట్టి స్థితి యేర్పడినది. పూర్వగ్రంథములను బఠించువారు ఛాందసులుగను, నభ్యుదయ ప్రతిబంధకులుగను, గణింపఁబడుట కూడ జరుగుచుండుటచేఁ గొందఱభిమానముండియుఁ, బరిహాసపాత్రుల మగుదు మను భీతిచే నుద్గ్రంథముల ప్రశంస చేయుటలేదు. సామ్యవాదసిద్ధాంతములు గావ్యప్రపంచమునఁగూడ ప్రవేశించుటవలన, నక్షరజ్ఞానశూన్యులగు మిల్లుకూలీల కందుబాటులో లేని భారతాదులగు నుద్గ్రంథములు నిరర్థకములుగఁ బరిగణింపఁబడు దుఃస్థితి యేర్పడినది. పరీక్షల కింకను భారతాది గ్రంథములలోని భాగములు పాఠ్యములుగ నిర్ణీతము లగుచుండుటవలననే నధ్యాపకులును, విద్యార్థులును, దప్పనిసరియై వానినిఁ బఠించుచున్నారు.

ఇట్లు మూలగ్రంథమే విస్మృత మగుచున్న కారణమున విమర్శకనుకూల పరిస్థితులే లేకపోయినవి. ఐనను భాషాభిమానము జాత్యభిమానము గల కొందఱు పండిత విమర్శకుల స్వయంకృపి. ఫలితముగ నొకటి రెండు విమర్శకగ్రంథములు, వ్యాసములు వెలువడకపోలేదు. 'కవిత్రయ కవితా విమర్శనము'న నన్నయాదుల అనువాద విధానమును గూర్చియు, తదౌచిత్యమును గూర్చియుఁ బ్రశంసించుట ప్రధానవిషయము. 'తిక్కన సోమయాజి', 'భారత కవితా విమర్శనము' మున్నగు గ్రంథములలోఁ దిక్కన కాలపు చారిత్రిక విషయములకును, విరాట పర్వ రచనాప్రాశస్త్యమునకును మాత్రమే ప్రాధాన్యము కల్గినది. ఆది

కవియుఁ, గవితాపట్టాభిషిక్తుఁడు నగు నన్నయ్య రచనను గూర్చి రామలింగారెడ్డిగారి వ్యాస మొక్కటియే మినుకుమినుకు మనుచున్నది. కావున నేటివఱకు భారతము నామూలాగ్రముగ విమర్శించుటలో నేమాత్రమును బ్రయత్నము జరుగలేదనియే చెప్పవచ్చును. భారతము మహాసముద్రము. దుర్గమార్థజల గౌరవ భారత భారతీ సముద్రము నీదుటకు విధాతృనకైనను శక్యము కాదని, అనన్య ప్రతిభాశాలియగు నన్నయయే సంకోచమును బ్రకటించి యుండఁగ, దద్గ్రంథ విమర్శనము అస్మదాదులకు దుష్కరమనుట నిజము. ఐనను భారత విమర్శనకుఁ బండిత విమర్శకులను బ్రోత్సహించు నుద్దేశముతో, నే నీ గ్రంథరచనకు సాహసించుచున్నాను. ఇందుఁ గూడ నింతవఱకు విమర్శకులచే స్పృశింపఁ బడని భారతభాగమునకు, నందులోఁ దిక్కనరచనకు మాత్రమే నా యీ విమర్శ పరిమితమై యున్నది. నన్నయ యెఱ్ఱనల భారతభాగ రచనను గూర్చిన విమర్శ యింకను జరుగవలసియున్నది. కావ్యమునందలి రసవత్తరములగు ఘట్టములను, నర్థవిశేషములను, పాత్రల శీలపోషణౌచితీత్యాదులను, సహేతుకముగ వివరించి, గ్రంథపఠనమందుఁ బాఠకుల కాసక్తినిఁ గల్గించుట విమర్శకుఁబ్రధాన ప్రయోజనమను సూత్రము నా కీ రచనయం దాదర్శమగుచున్నది.

విరాటపర్వము

"హృదయాహ్లాది చతుర్థ మూర్జిత కథోపేతంబు నానా రసాభ్యుద
యోల్లాసి విరాటపర్వము" అని తిక్కన తత్పర్వగతేతివృత్త
మెట్లు ప్రబంధరచన కనుకూలించుచున్నదియుఁ, దత్ప్రారంభమునసే
వ్యక్తముఁ జేసియున్నాఁడు. ఇందలి యితివృత్తము మానవ జీవితమున
కత్యంతము సన్నిహితమును, వీరశృంగారాది రసముల కాశ్రయమును
నగుటచే హృదయాహ్లాది యగుచున్నది. సాధారణముగ లోకమున
సంభవించు వివిధ సన్నివేశములు, తత్తత్సందర్భములలో వ్యక్తుల ప్రవ
ర్తనలవలన వ్యక్తములగు వారివారి నైజ శీల స్వభావములు, మున్నగు
వాని కీ కథాభాగమున నెక్కువ యవకాశమున్నది. కావుననే లౌకిక
జీవిత మిందు సంపూర్ణముగఁ బ్రతిబింబించిన దనవచ్చును.

కీచక వృత్తాంతము, ఉత్తరగోగ్రహణము, అభిమన్యు వివాహము —
ఇవి యీపర్వమునఁ బ్రధాన ఘట్టములు. కీచకవృత్తమున వీరరస
మంగియు, రౌద్రరస మంగమును గాఁగా, నుత్తర గోగ్రహణ కథయందు
వీర మంగియు, హాస్యము తదంగము నైనవి. ఉత్తరాభిమన్యు వివాహ
ఘట్టము లలిత శృంగార ప్రధానమై మనోహరమైనది. అసహాయ
స్థితియందున్న పతివ్రతకు దుర్మార్గులవలన పరాభవము జరుగుట, శీల
రక్షణకై యామె ప్రయత్న మొనర్చుట, వానిననుసరించిన యితర పరి
ణామములు, మున్నగునవన్నియు లోక సామాన్యములగుటచేఁ గీచకేతి
వృత్తము సహజముగనే ఆకర్షణీయమైనది. అట్టి యితివృత్తమును
బోషించుటలోఁ దిక్కన, 'ఆఖ్యాన మార్గమును గాక, ప్రబంధమార్గము
ననుసరించుటవలన నీ రచనకుఁ గడుంగడు మనోహరత్వము సిద్ధించినది.
పరాశ్రయ వృత్తి జీవనమందును, దాన, రాజాశ్రయమందునుగల కష్టములు
పాండవుల విరాటనగర జీవితమువలన వ్యక్తములగుచున్నవి. విరాటుని

వినోదముకొఱకు భీముఁడు జెట్టిమల్లురతో మాత్రమే కాక సింహాది క్రూరసత్త్వములతోఁ గూడఁ బోరవలసివచ్చుటయు, దాస్యభావమునఁ జేసి స్వామిని యగు సుధేష్ణ యాజ్ఞను మీరఁజాలక, యాసవముఁ దెచ్చుటకై ద్రౌపది కీచకునింటికిఁ బోవుటయు, నాత్మాభిప్రాయము నధిక్షేపించిన ధర్మజుని విరటుఁడు పాచికలతోఁ గొట్టుటయు, నిత్యాదులందులకు నిదర్శనములు. ద్రౌపదీ ధర్మజాదుల దాస్యమే వారి నిస్సహాయస్థితికిఁ గారణమైనది. కీచకుని కాముక వ్యాపారము, వీరక్షత్రియ నారీమణియగు ద్రౌపది యొనర్చిన కీచకవధోద్యోగము, తత్ఫలితముగఁ గలిగిన సన్నివేశములు, నిత్యాదులు సుధేష్ణాకీచకులయొక్కయు, ద్రౌపదీ ధర్మజాదులయొక్కయు నంతఃప్రకృతులను, శీలస్వభావాదులను వ్యక్తపఱచు ఘట్టములు. ధైనందిన మానవ జీవితమునఁ గాననగు కాముక స్త్రీలోలుపత, యుక్తాయుక్త పరిజ్ఞానశూన్యత, తత్పరిణామము, కీచక వృత్తాంతమున వర్ణితములై యుండుటచే నీ ఘట్ట మాహ్లాదకర మగుచున్నది. భీమకీచకులు నాయక ప్రతి నాయకులుగను, వీరము ప్రధాన రసముగను, ధర్మార్థములు ఫలముగను గలిగిన యీ ఘట్టము నొకచిన్న ప్రబంధముగఁ దిక్కన పోషించియున్నాఁడు. లోకజీవితమునందు సాధారణముగఁ బ్రాధాన్యము వహించు నింద్రియ వ్యాపారములైన కామక్రోధాదు లీ కీచక వృత్తాంతమున ముఖ్యవిషయములగుటవలన, దిక్కనరచనయు, వాని కనుగుణముగఁ బ్రబంధమార్గమున నడచినది.

తిక్కన యీ ఘట్టమున రచించిన ఉద్యానవన, సూర్యోదయ సూర్యాస్తమయాది వర్ణనములు తరువాతి కాలమునఁ బెంపొందిన ప్రబంధరీతి కాదర్శములైనవి. విరాటపర్వమున సూచితమైన యీ విధానమే యెఱ్ఱన సోమనాథులచే సుగృహీతమై, శ్రీనాథాదులచేఁ బోషితమై, రాయలకాలమునఁ బరిణతిఁ గాంచినది.

"నీరజాకరములు నిష్ణమ్మో జేసిన
భవ్య తపంబున ఫలమనంగ
దివసముఖాభినందిత చక్రయుగ్మకం
బుల యనురాగంపుఁ బ్రోవనంగ
హరిహర బ్రహ్మ మహానుభావంబు లొ
క్కొటిగాగఁ గరఁగిన గుటికయనఁగ
నతుల వేదత్రయ లతికాచయము పెను
పొందఁ బుట్టెడు మూలకంద మనఁగ
నఖిల జగముల కన్నెఱి యగుచు జన న
మాజ కరపుట హృదయసరోజములకు
ముకుళనంబును జృంభణంబును నొనర్చి
భానుబింబంబు పూర్వాద్రిపై వెలింగె."

భవ్య తపఃఫలంబగు పరంజ్యోతిస్స్వరూపము, విశుద్ధ ప్రేమపరిణామమగు రసస్థితి, హరిహర బ్రహ్మైక్య జ్ఞానమూర్తి, వేదత్రయ జన్మకారణమగు పరబ్రహ్మ స్వరూపము, నను నిట్టి యలౌకికోపమానములచే వర్ణన కుదాత్తత సిద్ధించినది. హృదయంగమములైన యీ యుత్ప్రేక్షలు రచనకు మనోహరత్వము నాపాదించుటయేగాక, సూర్యభగవానుని పరబ్రహ్మతత్త్వమును బ్రతిపాదించునవియై, పఠిత్ర మానసములను భక్తిభావపూరితములుగ నొనర్చుచున్నవి. 'అఖిల జగముల కన్నెఱి యగుచు' ననుటలో, సూర్యభగవానుఁడు చైతన్య ప్రదాతయు, జ్ఞాన ప్రదాతయు నగునను నర్థము సిద్ధించినది. అట్టి పరబ్రహ్మ స్వరూప సాక్షాత్కారముచే జనుల హృదయములు వికాసము నొందుటయు, వారు భక్తిచే గరములు మోడ్చి, సూర్యభగవానునకుఁ బ్రణమిల్లుటయు, నొక్కమ్మడి జరుగు కార్యములు. ఈ యుదాత్తార్థమును బ్రతిపాదించుచుఁ, దిక్కన, యథాసంఖ్య రూపకోత్ప్రేక్షాతుల్యయోగితల నతి

ప్రౌఢముగఁ బోషించియున్నాఁడు. జగజ్జ్యోతియు, విష్ణుస్వరూప
మును నగు సూర్యుని వర్ణించుచుఁ దిక్కన గ్రహించిన పవిత్రములగు
నుపమానము లతని యుదాత్త కవితాతత్త్వమునకు నిదర్శనములగును.

ఇచటి సూర్యాస్తమయ వర్ణనకూడ భావనాచమత్కార ప్రధా
నమై, ప్రబంధరీతికిఁ జక్కని లక్ష్యమగుచున్నది.

"ఇనుఁడు దనకడకు నేతెం
చిన రాగముఁ బొందుటది యుచితమనఁగాఁ గెం
పున మెఱసి పశ్చిమాశాం
గన జనసంభావనముల గారవమందెన్."

సూర్యుఁడు పశ్చిమదిక్కును జేరఁగాఁ దద్దిశ సాంధ్యారుణరంజితమైనది.
భర్తయగు సూర్యుఁడు తన కడకు రాగాఁ, బశ్చిమదిశాకాంత యనురాగ
యుక్తయగుటది యుచితమనునట్లు కెంపునఁ బ్రకాశించినదని యుత్ప్రేక్ష.
ఇనుఁ' డను శబ్దము సూర్యపరముగను, భర్తపరముగను ప్రయుక్తమగుటచే
శ్లేష. అట్లే 'రాగము' అను పదము రక్తిమ యను నర్థమును, ననురాగ
మను నర్థమును బోధించుచున్నది. మఱియు, శృంగారకారణమగు నను
రాగము వర్ణ మెఱుపగుటచే, రాగమను శబ్ద మర్థవంతముగఁ బ్రయుక్త
మైనది. ఇఁక, అస్తమయకాలమున జను లర్ఘ్యాదులచే సూర్యభగవాను
నుపాసించుట లోక ధర్మము. దినమంతయుఁ, దమతమ కార్యములలో
నిమగ్నులై యున్న లోకులు విశ్రాంతి విహారముల కనుకూలమగు
సాయం సమయము నాసక్తితో నిరీక్షించుటయుఁ, దత్సమయ సిద్ధిచే
వారు సంతోషించుటయు, లోక సహజములగు విషయములు. భర్తృ
విరహితయైయున్న పశ్చిమాశాకాంత కిప్పుడు భర్తృసమాగమము
కలుగుటచే నామె లోక సంభావనీయురాలైన దని, చమత్కారముగ నీ
ప్రకృతివిషయమును దిక్కనవర్ణించినాఁడు. భర్తృప్రేమను బొందిన
కాంతను లోకులు గౌరవముగఁ జూచుచెంతయును సహజమేకదా! ఇట్లే

ప్రకృతివర్ణన సహజాలంకార చమత్కార ప్రధానమై, హృదయ వికాస హేతువగుచున్నది. ప్రబంధ రీతికి లక్ష్యమనఁదగిన వసుచరిత్ర రచనా విధానమున కీ తిక్కన రచన ఆదర్శమైనదనుటలో నతిశయోక్తి లేదు.

అట్లే, ఉద్యానవనవర్ణనాసందర్భమున కీచకుని కాముకచిత్తవృత్తి కనుగుణములగు వనశకుంతముల విహార మతి సుకుమారముగఁ బోషిత మైనది.

"ఇంపైన ప్రియ కాననిచ్చి నిల్చినమధు
వాదటనాను మత్తాలివిభునిఁ
జెట్టుపల్చరించి చుట్టుఁ గ్రుమ్మరి మనో
రమ నియ్యకొలుపు మరాళవిభుని
ఫలరస మొండొంటి కెలమిఁ జంచుల నిచ్చు
మెయినఁ జొక్కెడు శుకమిథునములను
గవిఁబాసి తలిరు జొంపమునకు మెయిమెయిఁ
దాకంగఁజను పికదంపతులను."

"కామీ స్వతాం పశ్యతి" యనునట్లు కీచకుని యిప్పటి యవస్థ ననునరించి యతనికి దృగ్గోచరములగు దృశ్యము లన్నియు నిట్టివే. అనుచితము, నధర్మము నగు కీచకునిభావము నుద్రేకింపఁజేయుట కీ వర్ణన యావశ్యక మగుచున్నది. సంకేత సమయమునకై నిరీక్షించుచున్న కాముక చిత్తవృత్తి, యీవర్ణనయందుఁ జక్కగఁ బ్రతిబింబించినది. ఈ భావమునే తిక్కన,

"తనువు నింద్రియములు మనము ధృతియుఁ
దనవశంబుగాక తల్లడపడి సింహ
బలుఁడు విషమబాణు బారిఁ బొతెఁ."

అను వాక్యమునఁ జక్కగ వివరించినాఁడు. అదియుఁగాక, సైరంధ్రి గావించిన సంకేతమునుగూర్చి కీచకుని కెట్టిసంశయమును గలుగ కుండుట

కును నిది యుపకరించుచున్నది. ఉద్యానవనమున విహరించుచు నందలి కామోద్రేకకరములగు దృశ్యములచే విమూఢాత్మకుఁడైన కీచకుఁడు సైరంధ్రి చేసిన సంకేతమును గూర్చి సందేహించుటయే యసంభవము. ఇట్లు దినమంతయు మోహకామావిష్టుఁడై కడపినవాఁడగుట, గీచకుఁడు పరిజ్ఞానశూన్యుఁడై, నిర్భయముగ నారాత్రి నర్తనశాలకొంటరిగ నేగియున్నాఁడు. "కామాతురాణాం నభయం నలజ్జా" అనునర్థమిందుఁ జక్కగ ననువర్తించుచున్నది. మదిలో రాగంబు ఘూర్ణిల్ల, నుద్వృత్తాంగజోన్మాదుఁడై,

"స్వాంతము బాహుగర్వఘనసంతమ సాంధముగాగ, శంకయొ
క్కింతయులేక కీచకుఁ డహంకృతి ముంగలిగాగ మండపా
భ్యంతర భూమిఁ"

బ్రవేశించి నాఁడని తిక్కన కీచకునినర్తనశాలా ప్రవేశమును వర్ణించుచుఁ, గామాంధుని చిత్తవృత్తి కొకస్వరూపము నొసంగి, దానిని మనయెదుటఁ బ్రత్యక్షీకరింపఁ జేసినాఁడు.

అట్లే భీమునిప్రవేశమును వర్ణించుపట్ల, తిక్కన ప్రదర్శించిన యౌచితియు, లోకజ్ఞానమును ప్రశంసార్హములు.

"గమనముపీఁక వేఱొకవికారము పుట్టక సంగరోత్సవో
ద్యమ రభసాతిరేకము బయల్వడు టించుక లేక రోష సం
భ్రమ మొకయింతయైనఁ బరభావనిరూప్యముగాక ద్రౌపదీ
రమణుఁడు వోయి విక్రమధురంధరతం దగ నాట్యశాలకున్."

చని, యా నర్తనాగారంబు ముఖస్థలంబు సేరి,

"కెలఁకులుఁ బిరిందిదెసయుం
గలయం బరికించి తన యఖండిత బాహా
బలగర్వమ యచ్చట ముం
గలిగా మద మత్త భద్రగజ సదృశగతిన్."

"నిశ్చింతుండై సతికేలు పట్టికొని చొచ్చెన్ భీముఁ డత్యుగ్రతన్."
ఉద్వృత్తాంగజోన్మాదుఁడైన కీచకుఁడు, మదాంధుఁడై శంక యొక్కింత యులేక, అహంకృతియే ముంగలిగా నర్తనాగారమును బ్రవేశించి నాఁడు. నిర్వికార గాంభీర్యముల నొప్పి, ఆత్మనిగ్రహము నేమాత్రమును గోల్పోక, తన యఖండిత బాహాబలగర్వమే ముంగలిగా భీముఁడు ప్రవేశించినాఁడు. ఈ వైవిధ్య మాయిరువురి మానసిక పరిస్థితులకును, స్వభావములకును నెంతయు ననుగుణముగ నున్నది. కామావేశమునఁ గన్నులెఱుఁగనివాఁడగుటఁ గీచకున కనుమానమే కల్గినది కాదు. ఆత్మసంయమనముతోనొప్పు వివేకశాలియగుటచే, భీముఁడు నర్తనశాలను బ్రవేశించుటకుముం దాపరిసరప్రాంతములను జక్కఁగఁ బరిశీలించినాఁడు. ఇతరులు గాని, లేక కీచకుని యనుయాయులు గాని యున్నచోఁ దన ప్రయత్నము విఫలమగుటయేకాక పాండవుల రహస్యమును బయలై యనర్థము కలుగునని భీముఁడెఱుఁగును. కనుకనే యతని ప్రవర్తన మట్టి యుక్తాయుక్తపరిజ్ఞానముతో నొప్పినది. ఇట్లు, పాత్ర పోషణ విషయమునను, మానవస్వభావ వ్యక్తీకరణమునందును, దిక్కైన సిద్ధహస్తుఁడని యీఘట్టము సాక్ష్యమొసంగుచున్నది.

కీచకుని విషయమున వర్ణితములైన మోహవికారాదులును, విరహమును, శృంగారరసాభాసకుఁ బోషకములు. పరసతిని గామించిన నీచ కాముక చిత్తప్రవృత్తి వర్ణనము, శృంగారరసపోషకము కాఁజాలదు. రతియను సాత్త్వికభావ ముభయ నిష్ఠమైనప్పుడే అనుభావాదులచేఁ బోషితమై శృంగారరసముగఁ బరిణామముఁ బొందఁగలదు. కనుక కీచకసంబంధమగు వర్ణన కాముక చిత్తప్రవృత్తినిఁ బ్రదర్శించుటకు మాత్రమే యుపకరించునని చెప్పవచ్చును. వీర మీఘట్టమునఁ బ్రధానమును, రౌద్ర మప్రధానమును నగుచున్నవి. వీరరసమునకు స్థాయి

యగు నుత్సాహ మఖిల మహాకార్యనిర్వహణమునకును హేతువగు
టచే నదియు మానవజీవితమున కత్యంతము సన్నిహితమగుచున్నది.

" మనవారిలోన నొక్కనినైనఁ బిల్వ కు
త్సాహంబు సేసిన సాహసంబు "

అని ద్రౌపది కీచకవధానంతరము ప్రశంసించినట్లు భీముని యుత్సా
హము వీరరసస్వరూపముఁ దాల్చినది. కీచకునిఁ గూల్చి భీముఁడు,

" వికృతపుఁజావు సంప మది వేడుకపుట్టినఁ గిట్టి పట్టి మ
స్తకమును బీనదీర్ఘభుజశాఖలుఁ బాదయుగంబు మేనిలో
నికి జొర నుగ్గుగాదురిమి నించిన గ్రంతలతిత్తి యైన కీ
చకు ధరణీస్థలిం జదిపి చక్కని ముద్దగఁ జేసెఁ దుష్టుఁడై."

విరటునిసభాంతికమున కీచకునివలన ద్రౌపదికి జరిగిన పరాభవమును
గన్నారఁ గాంచినవాఁడగుటచే భీముఁడిట్టి రౌద్రస్వరూపమును దాల్చు
టెంతయు నుచితము, సహజము నగుచున్నది. తనసతియెడఁ
గాముక దృష్టినిఁ బరపిన కీచకునికన్నులను, నవాచ్యములు పల్కిన నతని
ముఖమును, బతివ్రతను వెన్నాడి, సిగబట్టి పడద్రోసిన కాలుసేతులను,
నీలోకమున నికఁ బ్రవర్తింపనీయక చేయుట మాత్రమే కాక, యితరులు
చూచుటకుఁ గూడ లేకుండ రూపఱునట్లు, మేనిలోనికిఁ జొనిపి, కీచకు
దేహమునంతయు నొక మాంసపుముద్ద గావించినఁ గాని భీమునకుఁ దృప్తి
యైనదికాదు. ఆతఁడప్పటికిఁ దుష్టుఁడైనాఁడు. ఇట్లు భీముఁడు కీచకు
నమానుషమగు విధమునఁ జంపుటయందును, గ్రోధావిష్టుఁడై యుపకీచ
కులఁ జంపుటయందును, రౌద్రము వీరమున కంగముగఁ బోషితమైనది.

" వికటభ్రూకుటి ఘోరఫాలకలితస్వేదోద్భటుండున్ చల
ద్వికృతోష్ఠద్వయుఁడుం బ్రమర్దనదశావిర్భావసంభావితాం
గకుఁడుం జిత్తవిదాహదోహలసమగ్రక్రోధవేగుండు నై
బకవిధ్వంసకుఁ డయ్యెడ న్నిలిచె శుంభన్మూర్తివిస్ఫూర్తితోన్."

కీచకవధతో నంతమగు నీ వృత్తము మానవజీవితమున కత్యంత సన్నిహితమగుటయుఁ, దిక్కనరచన మనోహరవర్ణనలతో నొప్పి రసవత్తరమగుటయుఁ, గారణములుగ నీఘట్టము సామాన్యులగు పాఠకులనేకాక పండిత విమర్శకులనుఁ గూడ నెక్కువగ నాకర్షించినది.

వీరరస ప్రధానమగు నుత్తరగోగ్రహణఘట్టము భావి యుద్ధపర్వములలోఁ దిక్కన కావింపఁబోవు విశిష్టరచనకు సూచకమగుచున్నది.

" ఒకమాత్రన్ వితతప్రసారనిబిడాత్యుగ్రాస్త్రసంతానముల్
సకలానీకములందుఁ బర్వ నరు భాస్వన్మూర్తి శోభిల్లె దీ
ప్తికలాపంబులు లోకమంతటను విస్తీర్ణంబులై యూగప
ద్వ్యక్తవ్యాప్తి వెలుంగ నొప్పెసఁగు మార్తాండు న్వీడంబించుచున్."

తేజోమయమగు మార్తాండబింబమునుండి కిరణజాల మొక్కసారిగా నెడతెగక, యన్నివైపులఁ బ్రసరించి, లోకములను ముంచినట్లు, అర్జునకోదండమునుండి సంతతధారగా, నన్నివైపులఁ బ్రసరించు దివ్యాస్త్రజాలములు, శత్రుసైన్యమునంతను ముంచివేసినవి. మార్తాండుని తీక్ష్ణ కిరణ ప్రసారమునకు విరామము లేనట్లే అర్జునప్రయుక్త తీక్ష్ణబాణ ప్రసారమునకును నవధి లేదు. విక్రమతేజస్స్వరూపమగు నర్జునునిమూర్తి అచ్చ తేజోరూపమగు మార్తాండుబింబమును బోలినది. ఇట్లు సమగ్రార్థస్ఫోరకములగు సహజోపమానములచే యుద్ధ వర్ణనను బోషించుట తిక్కన పద్ధతి. అర్జునాస్త్రప్రసార మెట్లు నిరంతరముగ సర్వతోముఖముగ జరుగుచుండు నదియుఁ దిక్కన యింతకుఁ బూర్వమే ప్రత్యక్ష మగునట్లు వర్ణించినాఁడు.

" గుణమున లస్తకంబుననుఁ గోటియుగంబున నేలఁ దార భీ
షణముగ నుప్పతిల్లి రభసంబున రేఁగినమాడ్కి దీవ్ర మా
ర్గణ నికరంబు లొక్కట నరాతిబలంబులఁ గప్ప —"

అల్లెత్రాడు, ధనుర్మధ్యభాగమగు పిడికట్టు, ధనుష్కోటియుగ్మము, నర్జునుని హస్తము, – వీని యన్నిఁటియందును నొక్కచే విధమున, నెడతెగక, బాణజాలములు తపంతటఁ తాము, భయంకర విధమున నుద్భవించి, పైకెగయుచున్నవను విధమునఁ, దీవ్ర మార్గణ నికరంబు లొక్కసారిగ నరాతిబలంబులఁ గప్పుచున్న వని, పైవర్ణన తాత్పర్యము. తేనెపెరనుండి సంక్షుభితములై, మధుపము లొక్కసారిగా పైకిరేఁగుటయు, వాతోద్ధూతమై, భూమినుండి పరాగరేణుసమూహము పైకిరేఁగుటయు, నిత్యాదులను మనసుననుంచుకొని, తిక్కన పైపద్యమున 'రభసంబున రేఁగినమాడ్కి' యని ప్రయోగించియున్నాఁడు. ఇట్లుచిత విశిష్ట శబ్ద ప్రయోగముచే నర్థస్ఫార్థిఁ గలిగించుట, తిక్కన వర్ణనలలోని ప్రత్యేకత. ఇట్టి శబ్ద ప్రయోగ మితనికి సహజమగుటయేకాక, అయ్యది యుద్దేశపూర్వకశిల్ప మనుట కీ పద్యమే నిర్వచనోత్తర రామాయణమునఁ గనఁబడుచుండుట నిదర్శన మగుచున్నది.

మనోహరములగుప్రకృతిదృశ్యముల సంయోగమున, భీషణ, బీభత్సముల కాశ్రయమగు రణరంగమును రమణీయముఁ గావించుట, యుద్ధపర్వములందుఁ దిక్కన యవలంబించిన రచనా విధానములలోఁ బ్రధాన మైనది. ఆ విధాన మీగోగ్రహణ ఘట్టమున సూచితమైయున్నది.

"ఘోషంబు భీషణ రూపమై చెలువొంద
నతుల కేతువు శిఖయై వెలుంగ
శరజాలములు పటుజ్వాలలై నిగుడ న
ర్కతనూభవోగ్రాగ్ని ప్రజ్వరిల్లు
నుద్ధతి సైపక యుజ్జ్వల దివ్య ప
తాక మెఱుంగుగా దళితధరణి
రథనేమిరవము గర్జనముగ శరపరం
పరలు ధారలుగాఁగ బరగి యుడరి

అర్జునాంబుదం బనన్య సామాన్య స
ముద్యమమున ముఖపయోరుహముల
కాంతి దరిగి యపుడు కౌరవసేనా స
రోవరంబు దీనభావమొంద.”

హృద్గతరోషమే రూపము దాల్చినట్లొప్పి, బాణజాలములఁ గురిపించుచు, విజృంభించిన కర్ణునకు, జ్వాలాపరంపరలచే విజృంభించుచున్న యుగ్రాగ్ని యుపమానము. కర్ణుని విజృంభణమును శరధారలచే నడఁగింప నుద్యమించు నర్జునునకు వర్షధారలఁ గురిపించు మేఘ ముపమానము. రెంటను నుపమానోపమేయముల కభేదరూపకము గావింపఁబడినది. అర్కతనూభవుఁ డను నుగ్రాగ్ని యొక్క ప్రజ్వలనోద్ధతిని సైపక, అర్జునుఁ డను నంబుద మనన్యసామాన్యసముద్యమమున విజృంభించినది. అర్కతనూభవాగ్నికి హృద్గతరోషమే భీషణస్వరూపమును, కాంతి మంతమగు నున్నత కేతువే శిఖజ్వాలయును, ప్రకాశమానములగు శర పరంపరలే కీలలును నైనవి. అర్జునాంబుదమునకు నుజ్జ్వలపతాక మెఱుఁగుఁదీఁగయు, రథనేమిరవము గర్జయును, బాణపరంపరలు వర్ష ధారలు నై యొప్పినవి. అంబుద వ్యాపారముచే నగ్ని యడఁగినట్లు, నర్జు నుని విక్రమమునఁ గర్ణుని విజృంభణ మడఁగినదను నర్థ ముపమానముల వలన ధ్వనితమగుచుండుటమాత్రమేకాక, వక్ష్యమాణ సైన్యస్థితివలనఁ గూడవ్యక్తమైనది. సైనికుల ముఖములనెడు పద్మములు కాంతిహీనము లగుటవలన కౌరవసేన యనెడు సరోవరము దీనభావము నొందినదని వర్ణన. కర్ణుని పరాజయముచే ఖిన్నులగు సైనికుల ముఖములు కాంతి హీనము లగుటయుఁ, దత్కారణమున నుత్సాహరహితమగు కురుసేన సైన్యమునొందుటయు నుచితమే. పద్మబాంధవాంశసంభవుఁ డగు కర్ణుఁడు అర్జునాంబుదావరణముచే నిరస్తతేజస్కుఁడు కాఁగా, సైనిక

ముఖపద్మములు కాంతిహీనము లైనవనుట చమత్కారయుతము. వర్ష
పాతమునోర్వక కమలములు కాంతిహీనములగుటయుఁ, దత్కారణమునఁ
గమలాకరము శోభఁ దరుగుటయుఁ, బ్రకృతిసహజములగు విషయ
ములు. ఇట్లు సమగ్రార్థపోషకము లగు రూపక త్రయముచే నతి
ప్రౌఢము, మనోహరము, ధ్వనిప్రధానము నగు వర్ణన సిద్ధించినది.
సూర్యుని తేజ మగ్ని యందును, నది మరల సూర్యునియందును,
కాలభేదము ననుసరించి, పర్యాయమున సంక్రమించుచుండుటచే
సూర్యాగ్ను లభిన్నులగుదురు. అర్క శబ్దమునకు సూర్యుఁడనియు,
నగ్నియనియుఁగూడ నర్థములు. కనుక నర్కతనూభవుఁ డగు కర్ణ
నగ్నితో నభేదముగ వర్ణించు టెంతయు నుచితము. కుమార పుత్రాది
శబ్దములు కాక, తనూభవ శబ్ద ప్రయోగమును విశిష్టమై యున్నది.
అగ్నిరూపమగు నర్కుని తనువునుండి జనించినవాఁడును నగ్నిమయ
మగుట తప్పదు. కనుక కర్ణుఁ డర్కతనూభవోగ్రాగ్ని యని తిక్కన
వర్ణించినాఁడు. అంతియకాక అగ్నిజ్వాలలు తాపహేతువులు. అట్లే
కర్ణనారాచజాలములును సంతాపకరములు. కనుక నుపమానోప
మేయములకు సాదృశ్య మర్థవత్తరమైనది. ఈ విధముగనే యింద్ర
పుత్రుఁడగు నర్జునుని మేఘముతో నభేదముగ వర్ణించుటయు నౌచితీ
పోషక మగుచున్నది. 'అర్జున' శబ్ద మింద్రునియొక్కయుఁ బాండవ
మధ్యమునియొక్కయు నామధేయమై యున్నది. మేఘముల కధి
నాథుఁడగు నింద్రుని పుత్రుఁడగు నర్జునున కంబుద ముపమానమగుట
అర్థవిశేషమునకు హేతువగుచున్నది. ఊర్జ్వలమగు నర్జునుని పతాక
దివ్యమగుటచే గగనస్థ మేఘసంబంధమగు విద్యుత్తుతోఁ బోలుట
కర్హమగును. మఱియు, గోరూప పరద్రవ్యాపహరణమునకు సహాయ
ముగఁ బోరుచున్న కర్ణుని బాణజాలములు లోకానర్థకరములు. కనుక
తద్బాణజాలమునకు లోకదాహమొనరించు నగ్నిజ్వాలతో సామ్య

ముచితము. అవ్విధమునసే ధర్మపరుఁడై యుద్ధమొనరించుచున్న యర్జునుని బాణజాలములు లోక హితాపాదులగుటచే వానికి, లోక కల్యాణకరములగు వర్ష ధారలతోడి సామ్య మెంతయుఁ దగియున్నది. ఇట్లే పద్యము విశిష్టార్థస్ఫోరక శబ్దప్రయోగ చాతుర్యమునకును, నుదాత్తార్థగాంభీర్యమునకును, శబ్దార్థశక్తిమూలకములగు నలంకారార్థధ్వనులకును, ప్రౌఢకవితారచనకును, నాదర్శమై తిక్కన ప్రతిభావ్యుత్పత్తులకు సాక్ష్యమగుచున్నది. విషయము ననుసరించి స్వాభావికముగ వీర రౌద్ర బీభత్సములకు స్థానము కావలసిన యుద్ధపర్వ రచన యంతయు నిట్లుదాత్తరమణీయముగఁ దిక్కనచేఁ బోషితమైనది. ఈ యుత్తరగోగ్రహణ ఘట్టము తల్లక్షణమునకుఁ బ్రథమ లక్ష్యము.

ఇఁక, విరాటపర్వమందలి తుదిఘట్టమగు నుత్తరాభిమన్యు వివాహ వర్ణన, పవిత్రమగు లలిత శృంగారమున కాదర్శమును, సరసము నైయున్నది. రూప వయో విద్యాభి జాత్యాదులచే ననురూపులగు నుత్తరాభిమన్యుల వివాహము, పాఠకుల మనోనయనములయెదుట జరుగుచున్నట్లు తిక్కన తన రచనాసామర్థ్యముచే వర్ణించియున్నాఁడు. ఉన్నతకుటుంబములందు వైభవోపేతముగ జరుగు వివాహమున కీ తిక్కనరచన, శబ్దమయ సుందర ప్రతిబింబము. తిక్కన గావించిన యుత్తరవర్ణన, నూతనవధువు ముగ్ధ మోహన మూర్తిని మన కనుల యెదుట నిలబెట్టును. లజ్జావశ్యములచే వినమ్రయై యింతవరకును వరునిఁ జక్కఁగఁ జూడఁజాలక పోయిన-యుత్తర, తలఁ బ్రాలువోయు నప్పు డవకాశము లభింపఁగా నోరచూపులఁ జూచుటయు, నభిమన్యుఁడును నట్లే, గురుజన సమక్షమున బాహాటముగ వధువును జూడఁ జాలక యీసమయమునఁ జక్కఁగఁ జూడఁగలుగుటయు, మున్నగు నూతన వధూవరుల ముగ్ధ మోహన శృంగారచేష్ట లెంతయు స్వాభావికమగు విధమున వర్ణితములై యున్నవి.

"లలిత తనూవిలాసముల లజ్జకతంబునఁ జేసి మున్ను వి
చ్చలవిడిఁ బట్టఁగా వెరవుసాలక యోరలు వారు చూపుల
లిఁ దలఁ బ్రాలు వోయునెడలం దగవొందిన నూలుకొల్పి యి
మ్మిలఁ బచరింతు రొండొరుల మోహన మూర్తులపై వధూవరుల్."

తలఁ బ్రాలు సంబరము వర్ణించుటలోఁ దిక్కన ప్రకృతిసౌందర్య మందలి లాలిత్యమును, వధూవరుల కాపాదించియున్నాఁడు.

"ఒండొరుల దోయిళుల నినుపొందఁ జేయు
నక్షతప్రకరంబు లనోన్యమస్త
కములఁ బోసిరి మందార కల్పలతలు
విరులగమియ నొండొంటిపైఁ గురియునట్లు."

ఈ పద్యమునందలి యుపమానోపమేయభావము గమనింపఁ దగినది. కోమలతా లాలిత్యములకుఁ బ్రధానమై, ఆలంబములేనిదే నిలువ లేని లతను స్త్రీతోడను, లతకు సుస్థిరాలంబనమై, దానిని ఉగ్రోగ్రతా వాతాద్యుపద్రవములనుండి రక్షించువృక్షమును బురుషునితోడను, బోల్చుట కవిసమయము. లాలిత్య కోమలత్వములును, నాశ్రయోపాత్త జీవితమును, లతయందును, స్త్రీయందును సమాన ధర్మములు. అట్లే ఆశ్రయత్వ సుస్థిరత్వములు, వృక్షమునందును బురుషునియందును సమానధర్మములు. మందారవృక్షమునాశ్రయించి పైకి ప్రాకిన కల్ప లతాప్రసూనము లా వృక్షముపై రాలుటయు, మందారపుష్పము లా లతపైఁ బడుటయు స్వభావసిద్ధములగు మనోహర ప్రకృతిదృశ్య ములు. ఈ యుపమానముల విశిష్టత వధూవరుల రూపరేఖావిలాసాదులను, వారి యనుకూల దాంపత్యమును, ధ్వనింపఁ జేయుచున్నది. ఇట్లే పాణిగ్రహణానంతర మేకాసనస్థితులగు వధూవరుల వర్ణనము కూడ హృదయంగమమై యున్నది.

" పెనుగుదుట నిడిన చూతం
బును నవమాలికయుఁ బోలెఁ బొలుపొంది రతం
డును నమ్మగ్ధయు నేకా
సనమున నున్నపుడు నూత్న సౌభాగ్యమునన్. "

ఒకే ఆలవాలమునఁ బరస్పర సంయోగమున శోభిల్లు నవమాలికా చూతవృక్షములతో నుత్తరాభిమన్యులకు సాదృశ్యము. సహజ కోమల సౌకుమార్య లాలిత్య ప్రధానమగు నుత్తరాసౌందర్యమునకును, భావ వీర్య శౌర్య స్థైర్య గాంభీర్య గుణ ప్రధానమగు నభిమన్యుని సౌందర్య మునకును, వివాహ ప్రాప్తిచే ననురూప సంయోగము సిద్ధించినది. జాతి రత్నమునకును మేలిమి బంగారమునకును జక్కని సంయోగము కుదిరి కాంతివంతము రమణీయము నగు పతక రూపము సిద్ధించినట్లైనది. ప్రాణిగ్రహణానంతరము వధూవరులయం దొక నూతన వికాసమును, నితఃపూర్వము లేని యొక విలక్షణమగు తేజస్సును సిద్ధించి, వారి మూర్తులు మనోహరములుగఁ గన్పట్టుట యెల్లరును గమనించెడి విష యము. మన జీవితములందలి యీ పూర్వానుభవమునకుఁ దిక్కన యొక మనోహర స్వరూపము నొసంగియున్నాఁడు.

అభిమన్యుఁ డుత్తరపాణిని గ్రహించుటయు నిట్లే సరసముగ వర్ణిత మైనది.

" చిత్తమున గాఢరాగంబు చేతఁ జూపు
తెఱఁగు దోపఁ గెంపారెడు తీఁగబోడి
మృదులపాణిఁ గుమారుండు మెలపుమై గ్ర
హించెఁ బల్లవాలంబి మత్తేభలీల. "

ఇందు, వధూనురూపమగు రక్తిమతోనొప్పు, కోమలమగు నుత్తరా హస్తకిసలయము నభిమన్యుఁ డాసక్తితో విలాసముగా గ్రహించు

టుపమేయమును, భద్రేభము విలాసముగఁ బల్లవములను గ్రహించు విధాన ముపమానమును, నగుచున్నవి. చిరుగుటాకులయందుఁ గల యాసక్తిచే నేనుఁగు వానిని నలిగిపోసీయక, వృక్షాగ్రములనుండి మిక్కిలి సుకుమారముగ, తొండముచే గ్రహించుట, ప్రకృతిసిద్ధమగు విషయము. మార్దవ కోమలతా రక్తిమలు ప్రధాన ధర్మములగు కిసలయమును హస్తమున కుపమానముఁ గావించి, తిక్కన, యుత్తరాదేవి సమగ్ర సౌందర్యమును స్ఫురింపఁజేసియున్నాఁడు. అట్లే పల్లవాలంబి మత్తేభ లీల యనుటవలన నభిమన్యుని గాంభీర్యప్రధానమగు మూర్తియు, నతని కామెయుందుఁగల యనురక్తియు, నాతని నాగరకతయు, వ్యక్తమగు చున్నవి. మఱియు నుత్తర తనహృదయమున నున్న గాఢానురాగమును హస్తమున వ్యక్తముచేయుచున్నదా, యనునట్లు, ఆమె యరచేయి రక్తిమతో నొప్పుచున్నదని యుత్ప్రేక్ష. ఆలంకారిక మతము ననుసరించి శృంగారరస వర్ణ మెరుపు. కనుక మనోగతమగు ననురాగము హస్తగతమగు సహజరక్తిమ రూపమునఁ బ్రదర్శితమని యుత్ప్రేక్షించుట అర్థవంతమై యున్నది. ఇంతియకాక ముగ్ధయగు నుత్తర మనోగతమగు తన యభిప్రాయమును వాచ్యము చేయఁజాలదు కనుక భంగ్యంతరమున సూచించిన దనుట చమత్కారము.

హోమసమయమునందు లభించిన సంస్పర్శకారణమున వధూవరుల యందుఁ గల్గిన సాత్త్విక భావోదయమును వర్ణించుటతో నీ ఘట్టము లలిత శృంగారమునకు శిరోభూషణ మగుచున్నది.

" గాఢ సంస్పర్శభంగులు గల్గునట్టి
హోమసమయ కృత్యంబుల నొదవి సౌఖ్య
రసముపెన్నిట్ట పొరిఁబొరిఁ గ్రమ్మ్మదేర
సమ్మదాంబుధిఁ దేలిరి సతియుఁ బతియు. "

స్పర్శ సౌఖ్యానుభవమువలన వధూవరుల దేహములు సాత్త్వికస్వేద ముచే సిక్తములైనవి. సతీపతులు సంతోషసముద్రమునఁ దేలి రను క్తిచమత్కారముచే వర్ణనీయ వస్తుస్థితి కుదాత్తత సిద్ధించినది.

ఇట్లీ ఘట్టమున లలితము, వైషయికసంబంధరహితము, నగు నుత్కృష్టశృంగారము, హృదయంగమమగు విధమునఁ బోషితమైనది. వీర శృంగార రసనిధులగు నితివృత్తములును, దదనుగుణమగు కావ్యరచ నావిధానమును హేతువులుగ, విరాటపర్వము పాఠక హృదయాహ్లాది మైనది.

ఉద్యోగపర్వము

ఉద్యోగపర్వము రాజకీయ విషయప్రధానమైనది. లోకశాంతి లోకా
నర్థములకు హేతువులగు సంధివిగ్రహముల వినిశ్చయము ప్రయో
జనముగఁ బాండవులొనర్చిన ప్రయత్న మిందలి విషయము. పాండ
వుల భావికర్తవ్యమును నిశ్చయించుటయేకాక, నీ పర్వము సత్య ధర్మ
న్యాయములకు, లోకమునఁ గల స్థితి యెట్టిదో కూడ వ్యక్తము చేయు
చున్నది. లోకహితమును, బంధుహితమును గోరిన ధర్మజుని ఆశయ
మును నెఱవేర్చువాఁడై, కృష్ణుఁడు సామ దాన భేద్ధీ భావముల నతి
చతురతతోఁ బ్రయోగించుట, యీపర్వమందలి ప్రధానేతివృత్తము.
కష్టపరంపరల నోర్చి, యరణ్యవాసాజ్ఞాతవాస నియమములను సక్రమముగ
నిర్వహించుటయే, యింతవఱకును బాండవుల కర్తవ్యమైనది. ఇపుడు
భావికర్తవ్య మింకను సునిశ్చితము కాలేదు. అదికాక, అరణ్యాజ్ఞాత
వాసములు పాండవులకు మాత్రమే సంబంధించిన వగుటచేఁ, దన్నిర్వ
హణమున నితరులఁగూర్చిన యోచనకుఁ బ్రసక్తిలేదు. ఇప్పటి సమస్య
అట్టిది కాదు. సంధికార్యము పాండవులపైకంటె నధికముగ ధృత
రాష్ట్రాదులపైననే యాధారపడియున్నది. అట్లే యుద్ధము కూడ
నొక్క పాండవులకు మాత్రమే కాక, యాదవ పాంచాల మాత్స్య
సింధు గాంధారాది వంశములకన్నిఁటికిని సంబంధించియున్నది. తత్స
లితములకుఁ గౌరవపాండవులు మాత్రమేకాక, సమస్త ప్రజలును భాగ
ధేయు లగుదురు. లోకహితము సమకూరు విధమునఁ బ్రస్తుత సమ
స్యను సాధింప నిశ్చయించియే, పాండవు లుదార మార్గము నవలంబించి
నారు. పూర్వవైరమును, దామనుభవించిన కష్టములను, నన్నిఁటికంటె

ముఖ్యముగ, ద్రౌపదికి జరిగిన పరిభవమును, పాండవులు లోక హితార్థము విస్మరింపవలసియున్నది. కనుక వారి జీవితములం దిప్పుడు కిష్టమగు సమస్య యేర్పడినది. ద్యూతసమయమున జరిగిన, యవాచ్యమగు పాపము నెడ నుపేక్షవహించియుఁ, బిమ్మట నుత్తరగోగ్రహణ సందర్భమున నన్యాయమునకు సాహాయ్య మొనరించియు, ధర్మనాశనమునకు దోహద మొనరించిన భీష్మద్రోణాదులకును, నశక్తదుర్జనుఁడగు ధృతరాష్ట్రునకును గూడ, నిప్పుడు విషమ పరిస్థితి యేర్పడినది. ధర్మమును బ్రతిఘటించి నిలిచి మరణాంతకమగు యుద్ధ మొనరించుటకు మనసొప్పకయు, నధర్మపరులు, పాపులు, నగు కౌరవులను బ్రతిఘటించుటకుఁ దగిన నైతికస్థైర్యము చాలకయు, ధర్మాధర్మముల నడుమ సందిగ్ధావస్థయందున్న వారు భీష్మాదులు. కుమారుని యందలి వ్యామోహము, సంపదయందలి దురాశయు నొకవైపునను, బాండవులవలని భయమొక వైపునను మనస్సును బాధించుచుండ, ధృతరాష్ట్రుని యవస్థ, బురదయందు దిగఁబడియున్న మహిషము నవస్థను బోలియున్నది. ఇట్లు పాండవులు, భీష్మద్రోణులు, గాంధారీ ధృతరాష్ట్రులు, కుంతీద్రౌపదులు, మున్నగు భారతేతివృత్త ప్రధాన పాత్రలగువా రందరికిని నిది విషమపరిస్థితి యగుచున్నది. కనుక తత్తత్పాత్రలమానసికస్థితులు, శీల స్వభావములు, నీ ఘట్టమున సువ్యక్తము లగుట కవకాశమెంతయుఁ గలదు. ఈ ఇతివృత్తమును బోషించుటలోఁ దిక్కన తన యఖండమగు లోక జ్ఞానమును, మనస్తత్వ పరిజ్ఞానమును, మంత్ర తంత్ర నిష్ణాతత్వమును బ్రదర్శించియున్నాఁడు. రాజకీయ సంబంధములగు రాయబారము లీ ఘట్టమునఁ బ్రధాన సన్నివేశములగుటవలన, సంభాషణా శైలి ప్రాధాన్యము వహించినది.

ఉత్తరాభిమన్యుల వివాహమునకై వచ్చిన బంధువర్గము వివాహానంతర మొకచోఁ జేరి పాండవుల భావికర్తవ్యమును జర్చించుటతో నీ

పర్వ మారంభమగుచున్నది. కృష్ణుని యుపదేశముననుసరించి, ద్రుపదుఁడు తన పురోహితుని ధృతరాష్ట్రుని యొద్దకు రాయబారిగా పంపుట, యిందలి ప్రథమ ఘట్టము. ధర్మజుని హృదయమార్దవమును గుర్తించి, ధృతరాష్ట్రుఁడతనినిఁ దియ్యని మాటలచేఁ దృప్తిపరుచుటకై సంజయునిఁ బంపుట, రెండవఘట్టము. సంధికై కృష్ణుఁడు తుదిప్రయత్నముఁ గావింపఁ బూనుట, మూఁడవ ఘట్టము. సందేశములు గొనివచ్చిన వ్యక్తుల స్థాన కుల శీలాదుల కెంతయు ననుగుణముగ వారిపల్కులును, వారు తమతమ రాయబారములను నిర్వహించిన విధానములును, దిక్కనచేఁ బోషితములైనవి. ఇరుపక్షములయందును ముఖ్యులగువారి యభిప్రాయములు, వారికి ధర్మమునెడఁ గల యాదరానాదరములు, నిత్యాదుల నీసన్నివేశములు వ్యక్తమొనర్చుచు, నాటకరంగములవలె నొప్పినవి. జ్ఞాతులలో ద్రవ్య సంబంధములైన యంతఃకలహములు కలుగుటయు, నిరుపక్షములవారికిని హితముఁ గోరువారు మధ్యవర్తులై సంధి యొనర్పఁ బూనుటయు, నట్టి సందర్భములలో నుభయులయందును నభిమానులగు వివిధవ్యక్తుల ప్రవర్తనలయందలి వైవిధ్యమును, – నిత్యాదులు, లోకమున నెల్లప్పుడు జరుగుచుండు సహజవిషయములు. ఉద్యోగపర్వగత మగు కురువంశేతివృత్తమును నిట్టిదియే యగుటచే, దాని యాధార మున లోకవృత్త ముదాత్తముగ బోషితమైనది.

కౌరవులయొద్దకు దూతనంపు సందర్భమున బలరాముఁడు దుర్యోధన పక్షపాతసూచకములగు పల్కులను బల్కఁగా, సాత్యకి సహింపఁజాలక,

"ఇట్టులాడఁదగునె యిది నీక పోలు ని
న్నేమనంగనేర్తు నిత్తెఱంగు
పాడిగాగఁ బూని పలుకంగఁ జెవియొగ్గి
యాదరించువారి నందుఁ గాక."

అని యధిక్షేపించినాఁడు. ఇంతియకాక,

"పలికిన చందముల్ నెరపి పైతృకమై చను రాజ్యభాగ మి
మ్మ్లల బడయందలంచి బలమున్ జలము న్నెరపం గడంగు వీ
రలు నొరు వేడఁబోదురె యరాతులు సాధుల మెత్తురే రణం
బుల జయలక్ష్మిఁ జేకొనుటఁ బోలునె యొండొక రాజధర్మముల్."

అని దూతనంపు టయుక్తమనియుఁ దెల్పినాఁడు. ద్రుపదుఁడును దుర్జ
నులయెడ సామవాక్యములు వ్యర్థములని,

"మృదుభాషణముల దుర్జన
హృదయములు ప్రసన్న తామహిమఁ బొందునె యె
ల్లిదముగఁ గొని యంతంతకు
మదమెక్కుఁగాక దురభిమానముపేర్మిన్."

అనువాక్యమున వివరించినాఁడు.

ద్రుపదుని పురోహితుఁడు కురుసభలోఁ దన దౌత్యమును నిర్వ
హించువాఁడై, కౌరవులు పాండవులకు బాల్యమాదిగ నొనర్చిన యప
కృతులను ప్రథమమునఁ దెరొక్కని, వానినెల్ల నీ పెద్దరాజుపేక్షించెనని
ధృతరాష్ట్రుని దోషమును బ్రదర్శించినాఁడు. అంతియకాక,

"నారీరత్నము నట్లుదెచ్చి సభలోననన్యారలుం జూడగా
జీరల్ ప్రోవులుగాగ నొల్చుటయు లచ్చింబుచ్చుకోలున్ మహో
గ్రారణ్యస్థలి నిల్వఁ బంచుటయు దైన్యవ్యక్తమై పల్కులున్
సైరింపంజనుఁ బాండవేయులకు నీ సంధిక్రమం బొప్పదే."

అని కౌరవుల దుర్నయములనెల్ల వివరించి, పాండవు లఖిల భూ
ప్రజానాశనమున కిచ్చగింపని కారణమున సంధికార్యము నడచినదనియు,
నద్దానిని వారి బలహీనతఁగాఁ దలంపకుఁడనియు ఖండితముగఁ బల్కి-

నాఁడు. మఱియు భీమార్జున సాత్యకాదుల శౌర్య సాహసోత్సాహము లను, గృష్ణుని సాహాయ్యమును బ్రశంసించి, యట్టిసహాయ సంపత్తి గల పాండవేయులకు నసాధ్య మెద్దియుఁ గలుగనేరదనియుఁ, గావున,

"అదను దప్పకుండ నమ్మహాత్ముల నెమ్మి
బిలువఁబంచి హితముఁ బ్రియము రెండు
పక్షములకు నగుట పాటించి తగవుమై
గొంతభూమి యిచ్చి కూడి మనుఁడు."

అని యతఁడు మోమోటములేక పల్కినాఁడు. రాజకార్య పరిజ్ఞానము, వాక్చాతుర్యము, చాలని ఖండితవాదుల పల్కు లట్టివయగును. అహం భావ దురభిమాన పూరితులగు దుర్యోధనాదుల కివి యుద్రేక కారకము లగుననుట నిక్కువము. దీనిని గుర్తించియే భీష్మాదితరుల మాటల కెడమీయక, "పాండునందనులు ప్రశాంతిమై మనముల నీనుఁదక్కి, మృదుమార్గము వట్టుటయుఁ, దలపఁగ భాగ్యముకదా,"

"నీవాక్యము విప్రస్వా
భావికమై యిట్లు శ్రుతికిఁ బరుషంబైన
భావింపఁ గార్యమునయం
దేవిధమున సభకు నింత యిష్టంబగునే."

యనిపల్కి, విప్రునిమాటలయందలి వాక్పారుష్యమును గప్పి పుచ్చి నాఁడు. బ్రాహ్మణుఁడగుటవలన నధర్మమును ఖండించుటకును, జంకక సత్యము నుగ్గడించుటకును నీ పురోహితునకు స్వాతంత్ర్యమున్నది. అందును, నితఁడు రాజపురోహితుఁడగుటవలన, నితనివాక్కులలో నధికార జన్యమగు తీక్ష్ణత నెలకొన్నది.

"నిండుమనంబు నవ్య నవనీతసమానము పల్కు దారుణా
ఖండలశస్త్రతుల్యము జగన్నుత విప్రులయందు."

అనువాక్య మిచట సార్థక్యమందినది.

ఉభయపక్ష హితాభిలాషియు, యుక్తాయుక్త పరిజ్ఞానియు, రాజుల సమక్షమున మెలఁగవలసిన విధానము నెఱిఁగినవాఁడును, వాక్చతురుఁడును, నగు సంజయుఁడు దౌత్యము నిర్వహించిన విధానము వేరు. ఆరంభమునఁ,

"భాగ్యమున నిన్నుఁ గనుఁగొనఁబడసి నాదు
చూడ్కి చరితార్థమయ్యె నస్తోకపుణ్య
ధనుఁడు మీతండ్రి ధృతరాష్ట్రధరణినాథుఁ
డిందు మీయున్కివిని ప్రియ మెసక మెసగ."

"అనుజులు నీవును ద్రౌపది
యును బుత్రచయంబు నున్న యోగక్షేమం
బున తెరగారయ బుత్తెం
చె నితాంతస్నేహపూర్ణచేతోవృత్తిన్."

అని చెప్పి, ధర్మజాదులయెడ ధృతరాష్ట్రునికిఁ గలస్నేహభావమును బ్రశంసించినాఁడు. పరిభవ దుఃఖమును, వివిధక్లేశములను ననుభవించినవారగుటవలనఁ, బాండవుల హృదయములు క్రోధపూరితములై యుండకతప్పదు. దానిని గుర్తెఱింగియే సంజయుఁడు ధర్మజుని మనస్సును మెత్తఁబరుపఁ బ్రయత్నించుచున్నాఁడు. కావుననే తిక్కన సంజయునినోట ధృతరాష్ట్రునిఁగూర్చి, "అస్తోకపుణ్యధనుఁడు, మీతండ్రి, ధరణినాథుఁడు" అనుగౌరవ వాచకములఁ బలికించినాఁడు. ధృతరాష్ట్రునియెడ నావంతయుఁ బాపము కాని తప్పిదము కాని లేదని సూచించుట, సంజయుని యాశయము. కావుననే 'అస్తోకపుణ్యధనుఁ' డను ప్రయోగము. పితృభక్తి గౌరవములు, పిత్రృప్రేమ, ధర్మజునకు జ్ఞాపకముఁ జేయుటకై 'మీతండ్రి' యనియు, రాజసందేశమును బాలించుట ధర్మజుని కర్తవ్యమని సూచిం

చుటకై 'ధరణినాథుఁ' డనియు, నిందుఁ జక్కఁగఁ బ్రయుక్తములైనవి. "అనుజులు నీవును ద్రోవదియును" నని వేర్వేర వారి నుగ్గడించి, యోగక్షేమములను నరయుట కూడ, నర్థవంతమై యున్నది. ధర్మజుననుసయించుటకంటె ముందుగా, నతనికై క్లేశముల పాలైన తమ్ముల ననుసయించుటయే ముఖ్యము. కనుక, సంజయుఁడు ముందు తమ్ములను, బిమ్మట నతనిని, యనంతరము పరిభవతప్తహృదయయైన ద్రౌపదినిఁ బేర్కొనుట, యాతని కార్యవాదనైపుణ్యమును బ్రదర్శించుచున్నది. ధర్మజుఁడును సమయోచితముగ,

"ఆరాజు మా దెసం గల
కారుణ్యము కతమునను సుఖమ్మున ని ట్లు
న్నారమని"

కాకుస్వరము కూడ స్ఫురించునట్లు పలికినాఁడు. కౌరవుల క్షేమములఁ గూర్చి ప్రశ్నించుచు, వారొనర్చిన యపకృతులును, భీమార్జునుల యసమాన శౌర్యసాహసములును, స్ఫురించునట్లు, ధర్మరాజు పల్కఁగా, తదింగితము నెఱిఁగిన సంజయుఁడు, ధర్మజుని కారుణ్యమునే యొత్తి పల్కినాఁడు.

"పొందొందఁగఁ దలఁచితి నీ
విందు శిశిరమైన విమల హృదయంబున వా
రందఱకును సేమం బిట
ముందఱ లేకున్న నేఁడు మొదలుగఁ గలుఁగుఁగా."

కౌరవులొనరించిన యపకృతికిఁ బాండవులు ప్రతిక్రియ యొనర్తురను భయముండినది కనుక, వారికింతవరకును సేమములేదు. ఇందు శిశిరమైన విమలహృదయంబున ధర్మజుఁడు కౌరవులతో సంధినిఁ గోరుచుం

డుటవలన వారి కీడమీఁద సేమము సేకురఁగలదు. ఇట్లుదాత్తముగఁ బలికి, సంజయుఁడు ధర్మజునిఁ బ్రశంసించుచుఁ, జంద్రవంశ సంభూతుఁడగు నతని హృదయ మమృతమయమై, లోకమున కానందదాయకము కావలెనను నర్థమును స్ఫురింపఁజేసియున్నాఁడు. తప్పంతయు దుర్యోధనాదులపైనిడి, ధృతరాష్ట్రుఁడు నిర్దోషియని యొత్తిచెప్పి, వృద్ధుఁడగు నతనిపై ధర్మజున కనుకంప కలుగునట్లు చేయుట, సంజయుని యుద్దేశము. ధర్మజునిహృదయము మెత్తఁబడినచో నతని యనుజులును నియ్యకొందురని సంజయుఁ డెఱిఁగును.

"ధృతరాష్ట్రభూపతికి వృ
ద్ధతకతమునఁ జిత్త మొకవిధము కామి సుతో
ద్ధతి మాన్పఁడ నాఁడు మనఃక్షతి పిదపం బుట్టి యప్పుడు శాంతుండయ్యెన్."

అని ధృతరాష్ట్రుని వార్ధక్యమును, నతఁడు మానసికముగ ననుభవించిన బాధను, స్పృశించి, పుణ్య చిత్తవృత్తిమై ధర్మజుఁడెట్లైనను బూర్వవృత్తములను సైచునట్లు చేయుటయే సంజయుని ప్రయత్నము.

"మడుగుఁ జీరయంచు మసిదాఁకినట్లు మీ
సత్కులమునఁ గల్మషంబు కొర
ద్రేంద్రుకతనఁ బొందె నింతయుఁ బాపంగ
నీవనేర్తు కార్య నిపుణ హృదయ."

అని సంజయుఁడు, దుర్యోధనాదులవలన వంశమునకుఁ గలిగిన కళంకమును దొలగించు బాధ్యత ధర్మజునిపై నిడినాఁడు. ఇవ్విధమున ధర్మజుని యౌదార్యముపై సర్వమును నాధారపడియున్నట్లు ముందు వివరించి, పిమ్మట,

"అఖిలజనక్షయంబయి జయాపజయంబులు రెండునుం దుదిన్
సుఖములుగాని యీపనికిఁ జొత్తురె యుత్తములు"

అని అప్రకృతమగు విషయమును దెల్పువిధమున ధర్మజుని యుద్ధ ప్రయత్న ముచితము గాదని నేర్పుతోఁ విమర్శించినాఁడు. ఇరుపక్ష ములయందునుఁ గల యోధాగ్రేసరులను బేర్కొని, వార లజేయు లగుటఁ దెల్పి, అట్టివారి కన్యోన్యకలహము మేలుకాదని తెల్పి, సంజ యుఁడు కొలువుఁ గలయంగనుంగొని,

"మ్రొక్కెద వాసుదేవునకు మోడ్చెద చేతులు సవ్యసాచికిన్
దక్కటి మిత్ర బాంధవ హిత ప్రియమంత్రి వయస్య కోటికిన్
స్రుక్కుచు విన్నవించెద నసూయలు దక్కి యనుజ్ఞ సేయుఁడీ
యిక్కరుణాకరున్ శరణ మేనిదె వేడెద క్రోధశాంతికిన్."

అని ముఖ్యులగువారినెల్లరను, వారి వారికిఁ దగినట్లు, వినయ గౌరవ ములఁ బ్రకటించుచుఁ బ్రార్థించినాఁడు.

"నెయ్యము వాటించి కడుం
దియ్యమెసఁగ నలుకలెల్లఁ దీరునటులుగాఁ
గయ్యమను దలఁపు లోనుగ
నయ్యమనందనుఁడు మానునట్టి తెఱఁగునన్."

" శాంతిప్రకారంబునం గార్యంబునడపి, యొక్కటియై మనుట యొడఁ గూర్చి రమ్ము " అనిన ధృతరాష్ట్రుని యాదేశమును నిర్వర్తించుటలో సంజయుఁడు తననేర్పునంతను బ్రయోగించినాఁడు. తన పల్కులకన్నిటికిని దగిన విధమున ధర్మజుఁడు సమాధానమొసఁగి, నిర్దాక్షిణ్యముగ, ధృత రాష్ట్రుని పక్షపాతమును, దుర్యోధనాదుల నడవడిని వివరించి, రాజ్య భాగ మీయనిచో సంధి కుదురదను నర్థమును దెల్లముఁ జేయఁగా,

బంధునాశనమున లభించు సంపద సుఖక్షరము కాదనియు, సందును, బాండవులవంటి సాత్త్వికుల కది తగదనియు, సూచించినాఁడు. దుర్నయవృత్తిచే దుర్ద్యూతమును బుట్టించి, యంతలుసేసిన వారిగర్వము సెల్లనిచ్చి, లోకనిందకుఁ బాల్జేసి పోవుటయుఁ, దాల్మిచే ధనముగ వరణ్యావాసాది కష్టములనెల్ల నోర్చుటయుఁ, దుట్టతుదకు నార్య నింద్య మగు క్రూరకర్మకుఁ జొచ్చి, నిష్కరుణముగ గురు బంధు వర్గమును జంపుకొనుటకేనా, యని కూడ ప్రశ్నించినాఁడు. స్వామికార్యమును హృదయపూర్వకముగ నిర్వహించుటయే ధర్మముగనెంచి, యెట్లైనను ధర్మజుని యుద్ధవిముఖునిఁ గావింపఁ బూనినవాఁడు సంజయుఁడు. కనుక నతనిపల్కులలో మాధుర్యమును, గడుసుఁదనమును బ్రౌఢాన్యము వహించినవి. దీనిని ధర్మజుఁడును, గృష్ణుఁడును గూడ గుర్తించినారు. కనుకనే ధర్మజుఁడు,

" మును మమ్మ్నఁబొగడి పదపడి
యని వారల గెలువనరిది యని పొత్తుఁగ జె
ప్పినమాటకు నే నొడఁబడ
విను సంజయ పక్షపాతవృత్తి విడువుమీ. "

" ఎదిరిం దమయట్టుల కా
మదిఁదలఁచినఁ బొసఁగుఁగాక మాకుం గుడుమిం
డిదె మీరు వ్రక్కఁగొనుఁ డని
చదురడచిన మననుపొందు చక్కంబడునే. "

అని యనుటలో సంజయుని ధృతరాష్ట్రుపక్షపాతమును దెల్లముఁ గావించి, మఱియు,

" సంపద దక్కియుండఁగ నశక్తు లనంజను మమ్మ్నఁబిల్చి పూ
జింపఁగ నంత్ర బేలె పతి "

అని యాతనిపల్కులను, ధృతరాష్ట్రుని సందేశమునంతరార్థమును విమర్శించినాఁడు.

" ఆరాజుసేయు నెయ్యము
గారాముసు జెప్పెదీవుఁ గడుఁదీపులుగా
వీరుఁ దమపాలు వడయక
నేరిమిమాటలనఁ దేరనేర్తురె చెపుమా. "

" తిట్టులఁబోయి యకొక్కులువు తేకువవారలలోని కింతిఁ దా
నట్టులు దుస్ససేనుఁ డదయాకృతి ముందలవట్టి యీడ్వఁగా
నెట్టు సహించె మామ సతి యేడ్వుకొలుంగన కెట్టులోర్చె నీ
పట్టున సేమమారయఁగఁ బంచుట కెట్టులు నేర్చెఁ గ్రమ్మఱన్. "

అను కృష్ణునిపల్కు సంజయుని చతురవాక్య మిథ్యాసువర్ణమునకు నికషోపల మగుచున్నది.

" దుర్ణయమును, బెట్టిదమును, బెండును నగు పలుకొదవదు నీనాలుకకు, నయోన్నత యెపుడున్. " అని ధర్మజుఁడు పల్కినపల్కులు సంజయుని మాటలయెడఁ జక్కగ సమన్వయించుచున్నవి. " ఈ వినయము నేర్పుఁ గలదె యితరులకొందున్. " అను వాక్యము సంజయుని రాయబారవిధానమునకు సూత్రప్రాయమగు వ్యాఖ్య.

ధర్మజాదులు సంధినిఁ గోరుచున్నారని వారిదివఱకంపిన సందేశము వల్లనే ధృతరాష్ట్రునకు వ్యక్తమైనది. కనుక సంధి కనుమతింపుఁడని వారి నిపుడు ప్రార్థించుట యనవసరము. సంజయునిఁ బంపుటలో ధృతరాష్ట్రుని యుద్దేశముకూడ సంధిప్రయత్నముకంటె భిన్నమైనది. అనునయ వాక్యములచే ధర్మజుని మనఃక్లేశమును బోగొట్టి, మెత్తబఱచి, యుద్ధమునందలి యతని యుత్సాహమును తగ్గించుట ప్రథమాశయము.

వంశరక్షణ, బంధురక్షణ, మున్నగు బాధ్యతలను ధర్మజునిపైనిడి, యత
నిని, శాంతునిఁ జేసినచో, రాజ్యభాగమిచ్చుటకు దుర్యోధనుఁ డొప్ప
కున్నను, ధర్మజుఁడు యుద్ధమునకుఁ బూనఁడని ధృతరాష్ట్రుని యాశ.
ధర్మజుని విషయమున ధృతరాష్ట్రునకుఁగల యీ యభిప్రాయము కేవలము
నిరాధారముకాదు. కావుననే పరాభవ ప్రతీకారమునకై, యెవరెవ
రెంతెంత యుత్సహించుచున్నను, బంధునాశమున కిచ్చగింపని ధర్మజుఁడు
మాత్రము, పంచగ్రామసంధిని గూడ సూచించినాఁడు. ధర్మరాజెంత
యౌదార్యమును బ్రదర్శించినను, దుర్యోధనుఁడు మూర్ఖత్వమును విడనాడఁ
డని ధృతరాష్ట్రునకుఁ దెలియును. అతనిమూర్ఖత్వము చెల్లునట్లును,
ధర్మజుఁడు శాంతిని బొందునట్లును, సంజయుఁ డొనర్పవలెనని ధృత
రాష్ట్రుఁడుద్దేశించినాఁడు. అతని యాశయము నెరవేర్చుటకే ధర్మరాజు
నుద్దేశించి సంజయుఁడు,

"ఎట్టితప్పులుం
బొవఁగఁద్రోచి తాలిమియ పూనుదు గావున నన్నిమాట లి
ట్లీవువినంగ నాడియును నేఁ దనివోవక విన్నవించెదఁ
నీవిభవం బహింసయు ననింద్యచరిత్రమ కాక యన్యమే."

యని పలికి, పిమ్మట,

"అల్పులకు మ్రింగఁ జేదైన హాలహాలము
భంగిఁ బొంగెడు కోపంబు మ్రింగికొనఁగ
నీలగళునెన్ని నిన్నెన్నఁబోలు. నట్టి
నీవు నాలినఁగా కేల నెగడుఁబేరు."

అని, ధర్మజుని శాంతదయాస్వభావమును నహింసాత్మక జీవితమును బ్ర
స్తుతించి యతనిని లోఁబఱచుకొనఁ జూచినాఁడు. ఇట్లు సంజయుని

వాక్య పద్ధతి యుక్తిప్రధానమై యుండుటచే ధర్మజకృష్ణు లతని యభిప్రాయములను ఖండించుట కవకాశము గల్గినది. ధర్మజునివంటి సాధువు కూడ కోపమునకు లోనై,

"గాండీవజ్యారవం బుత్కటమయి పెలుచం గ్రమ్మినన్ భీము బాహా
దండం బేపారి శుంభద్గదజడియుచు రౌద్రంబుగా దోచినన్ వే
దండద్వంద్వంబుమాడ్క నిరిమి కవలు మాద్యద్గతిం దాకినం జా
కుండం బోకుండఁ గౌరవ్యులకు వశమె బిట్టుల్క మూర్ఛిల్లకుండన్."

అని యావేశమును బ్రకటించినాఁడు.

ఇంగితజ్ఞానము కలవాఁడగుటచే సంజయుఁడు పాండవుల మనోగతాభిప్రాయమును జక్కగ గ్రహించినాఁడు. ఈవిషయమును ధృతరాష్ట్రునకుఁ దెలుపుచు, యుధిష్ఠిరుని సైరణను వెరపుగా భావించుట తప్పనియు, "సాదు రేఁగెనేని విను తలపొలమునఁ గాని నిలువదుసుమ్మా" యనియు హెచ్చరించినాఁడు. ఉభయ హితమును, లోకహితమును గోరువాఁడగుటచే సంజయుఁడు మోమోటమున కేమాత్రమును లోను గాక, ధృతరాష్ట్రుని ప్రవర్తనను విమర్శించినాఁడు.

"ఆలు బిడ్డ లేనియట్టి త్రిమ్మరియగు
కొయ్యగాక కుదుటఁ గూడువెట్టి
కుడుచువార లిట్టి క్రొవ్విదంబుల సేయఁ
జొచ్చు టిచ్చగించి చూతురయ్య"

"అనయమువుట్టి జూదమునయప్పుడ యెంతయుఁ జిచ్చువెట్టి కాల్చినదియది నీ యుపేక్షయ వశీకృతచిత్తుఁడు ధర్మసూతి మెత్తనిపులి యెల్లవారలు నధర్మము నీపయిఁ బెట్టునంతకు
న్వినఁడును గానడుం బిదప నీకును నాకు మరల్పవచ్చునే."

అని ధృతరాష్ట్రుని యుపేక్ష యే సర్వనాశనమునకు హేతువగుట నిశ్చ
యించి పల్కినాఁడు.

"అయ్యజాతశత్రుఁ డలుగుట నీళ్లుల
నగ్ని పుట్టినట్టిదయ్యె మీకు
నార్ప వెరవులేదు"

అను పల్కుచేఁ గౌరవుల భావిస్థితినిఁగూడ సంజయుఁడు సూచించినాఁడు. అగ్ని నార్పుటకు సాధనమగునది నీరు. అట్టి నీళ్లయండే అగ్ని పుట్టి నప్పుడు దాని నార్పునుపాయమే లేదు. అట్లే, క్రోధాగ్ని కుపశమ నముఁ గావింపఁగల ధర్మజుఁడే యలుగుటచే నిక పాండవక్రోధాగ్ని నార్ప నుపాయమే లేదనియుఁ, గౌరవు లందు దగ్ధమగుట తప్పదనియు, నిందు స్ఫురించుచున్నవి.

ఇట్లెన్నివిధముల సంజయుఁడును, విదురభీష్మాదులును హిత ముపదే శించినను నాదరింపక, పాండవులను జయింపనగునేమో యను దురాశచే, ధృతరాష్ట్రుఁడు వారి బలమునుగూర్చి ప్రశ్నింపఁగా, సంజయుఁ డొసంగిన ప్రత్యుత్తరము గమనింపఁదగినది. భీమార్జునాభిమన్యు నకులసహదే వాది మహావీరుల శౌర్యముల నుదాత్తముగ వర్ణించుచు,

"అట మిన్నందినయట్టివాని పొడవెంతన్నట్లు ఘాలాతు నె
క్కటికయ్యంబునఁ గొన్న ఫల్గును భుజాగర్వంబు లెక్కించు టం
తటివానిం గొని ధర్మసూతి సమరోత్సాహంబుమై నెత్తి వ
చ్చుటకుం గొంకునె వీపు సక్కనయి నిల్చుంగాక మీసైన్యముల్."

అని హేళనఁగావించి,

"సకలభువనములు నరచే
తికిఁ దేరంజాలునట్టి ధీమంతుఁడు దే

వకికొడుకు గలఁడు ధర్మజు
నికి నాతం డెత్తిరాక నిలుచునె యధిపా."

అని సంజయుఁడు ధృతరాష్ట్రునకు వెఱపును గూడ పుట్టించినాఁడు. విదు రునివలె సంజయుఁడును లోక హితమునుగోరిన జ్ఞానియగుటచేఁ, గురు పాండవులకు సఖ్యముఁ గావింపఁగోరి, తన ధీశక్తి సామర్థ్యములను, వాక్చాతుర్యమును బూర్తిగఁ బ్రయోగించినాఁడు. తద్విషయమున కనుకూలించు నుక్తిచమత్కార ప్రధానమైన రచన యీ ఘట్టమున నెలకొన్నది.

సంజయరాయబారమువలన ధృతరాష్ట్రుని యంతరంగము పాండవులకు వ్యక్తమైనది. ఆతని హృదయ మింకను దురాశా పీడితమై యున్నదని గ్రహించియే, కృష్ణుఁడు స్వయముగ సంధికార్యమును నడుపఁబూని నాఁడు. సంజయుఁడు, హితుఁడు, వాక్చతురుఁడు నైనను, స్థానరహితుఁ డగుటచే నతని యుపదేశము ధృతరాష్ట్రునియందు ఫలింపదు. విదు రాదుల యుపదేశముకూడ నతిపరిచయమువలన నతనియందు నిరర్థకమై నది. కనుక, దండనీతినిఁ బ్రయోగించుటకుఁ బూర్వము కృష్ణుఁడు స్వయముగా సామాదులను బ్రయోగింప నిశ్చయించినాఁడు. దివ్యాంశ సంభూతుఁడు, లోక పూజ్యుఁడు, వీరాధివీరుఁడు, వివిధోపాయపరాయ ణుఁడు, రిపుదోర్వీర్యాపహారక్రియాప్రవణోద్యోగుఁడు నగు శ్రీకృష్ణుని సంధికార్య నిర్వహణవిధానము విశిష్టమై యున్నది.

"మమ్మెఱుఁగు దెదిరినెఱుఁగుదు
నెమ్మియెఱుఁగు దర్థసిద్ధి నెఱియెఱుఁగుదు వా
క్యమ్ముల పద్ధతినెఱుఁగుదు
పొమ్మెవ్వఁడ నేను నీకు బుద్ధులు సెప్పన్."

అను ధర్మజునిపల్కు లేతద్విధానమునకు వివరణములగుచున్నవి. పాండవ

కౌరవుల పూర్వచరిత్రలు, ప్రస్తుతస్థితిగతులు, నాశయములు, తత్సిద్ధికై వారువారవలంబించుమార్గములు, వారివారి ధర్మములు, బలాబలములు నిత్యాదులన్నియు, 'మమ్మొయ్యంగు దెదిరినెయ్యంగుదు,' అను పదముల వలన సూచితము లైనవి. ఉభయ పక్షములకును నేది క్షేమమో, యట్టి ప్రయోజనము సిద్ధించు క్రమమెట్టిదో, తత్సిద్ధి కెట్టి వాక్యపద్ధతి యవసరమో, యన్నియుఁ గృష్ణుఁడే యెయ్యుంగునని ధర్మజుని యభిప్రాయము. ధృతరాష్ట్రుని సభయందుఁ గృష్ణుఁడు సంధిప్రయోజనముగఁ గావించిన మహోపన్యాస మెల్లవిధముల పైయభిప్రాయముతో సమన్వయము బొందుచున్నది. ఆరంభమునకే,

"జననాథ నీయెయ్యుంగని
పనులుఁ గలవె యైనఁ దగవు పరమ హితంబుం
దన వారికిఁ జెప్పనఁ దగు
నని వచ్చితి భారతాన్వయము ప్రియమందన్."

అని కృష్ణుఁడు తన యాగమనప్రయోజన విశిష్టతను గ్లుప్తముగ వివరించినాఁడు. ధృతరాష్ట్రుని వశమొనర్చుటకై, మున్ముందు 'నీయెయ్యుంగని పనులు గలవె' యని యారంభించినాఁడు. న్యాయమును, బరమహితమును బోధించి, భారతాన్వయమునకుఁ బ్రియమొనరించుటయే తన యాగమన ప్రయోజనమనియుఁ, గౌరవులు తనవారగుటఁ దాను వారి శ్రేయోభిలాషియనియు, ముందుగనే సూచించినాఁడు. ఇందువలనఁ గౌరవులు కృష్ణునియందుఁ బాండవ పక్షపాతమును శంకింపక, యతని వాక్యములను శ్రద్ధతో నాలకించుట కవకాశము కలిగినది. "క్షీరోదక గతి పాండవకౌరవు లొడఁగూడి మనికి కార్యం"బని, ప్రధానాంశమును సిద్ధాంతముగఁ దెల్పి, దాని నొడఁగూర్చుట ధృతరాష్ట్రుని కర్తవ్యమని హెచ్చరించి, కార్యభారము నాతనిపైననే పెట్టినాఁడు. ఇట్లుముందుగాఁ

కర్తవ్య నిశ్చయముఁజేసి, తన్నిర్వాహణమేలయావశ్యకముగుచున్నదో సహేతుకముగ వివరించినాఁడు. కురుపాండవుల పొందువలన నిరుపక్షముల వారికిని, బంధు మిత్రాదులకును మాత్రమే కాక ప్రజలకందఱికును గలుగు హితమును, యుద్ధమువలన లోకమంతటికినిఁ గలుగు ననర్థమును, కృష్ణుని వాక్యములు వ్యక్తపఱచుచున్నవి. ఇంతియకాక, ధర్మమూర్తులు, న్యాయశీలురు, వీరాధివీరులు, నగు పాండవులను జేర్చుకొనుటవలనఁ గౌరవ సంఘమునకుఁ గలుగు నతిశయమును, ధృతరాష్ట్రుఁడొందు నౌన్నత్యమును, గన్నులకుఁ గట్టునట్లు వర్ణించి, కృష్ణుఁడాతనిఁ బ్రలోభపెట్టియున్నాఁడు.

"జగతిఁగల జనపతులు నీచరణపద
మర్థిఁగొలువ సముద్రవేలావృతోర్వి
యెల్ల నేలుట యొప్పదే తల్లి ప్రజల
యెడ విరోధంబు వాటించు టెంతమేలు."

ఈవాక్యములు ప్రలోభమునకే కాక, పుత్రవాత్సల్యమునకుఁ గూడ ధృతరాష్ట్రుని హృదయమును గురిచేయుచున్నవి. పాండవులు సభ్యులనుద్దేశించి చెప్పిన,

"సారవుధర్మమున్ విమలసత్యముఁ బాపముచేత బొంకుచేఁ
బారముఁ బొందలేక చెడబారినదైనయవస్థ దక్షు లె
వ్వార లుపేక్ష సేసి రది వారల చేటగుఁ గాని ధర్మని
స్తారకమయ్యు సత్య శుభదాయకమయ్యును దైవముండెడున్."

అను పలుకులు గభీర భావ ప్రధానములైనవి. సత్య ధర్మములను బాలించుచున్న పాండవు లెట్లును దైవముచే రక్షితులగుదురనియుఁ, గౌరవులవలనఁ గలిగిన యాపదనుండి సత్య ధర్మముల నుద్ధరింప సమర్థులయ్యు, నుపేక్షవహించిన భీష్మాదులు చెడుదురనియు, నీవాక్యములు

తెలుపుచున్నవి. భీష్మద్రోణాదులకుఁ గూడ స్వధర్మ స్మృతిఁ గలుగఁ జేయుట కృష్ణుని యుద్దేశము. "ద్రోణభీష్మ లీదిక్కు సుమ్ము" అని దుర్యోధనుఁడు పల్కినట్లు కౌరవుల యుద్ధోత్సాహమంతయు నీ యిరువు రపైఁ బడియున్నదని కృష్ణుఁడెఱుఁగును. వారి నీ యధర్మ ప్రయత్న మునకు విముఖులఁ గావించి, యుద్ధమునఁ బొల్గొనకుండునట్లు చేసినచో గోరలూడ్చిన త్రాచులై, కౌరవులు సంధి కొప్పుకొందురని కృష్ణుని యాశయము. కనుక ధర్మనాశమునెడ నౌదాసీన్యము కూడ నధర్మమే యగునని భీష్మాదుల కీ వాక్యములు సూచించుచున్నవి. కృష్ణుఁ డీ విధ మున "ధర్మంబును నీతియు మున్నిడికొని మనోవాక్ప్రకారంబు లేక రూపంబైన సత్యంబకా చెప్పి" కడపట,

"వారలు శాంతశూరులు భవచ్చరణంబులు గొల్వఁబూని యు
న్నారటుగాక మీకది మనంబునకప్రియమేని నింతకుం
బోరికి వచ్చుచుండుదురు భూవర రెండుదెఱంగులందు నీ
కారయఁ బథ్యమేదియగు నవ్విధమేర్పడ నిశ్చయింపుమా."

అని మీ భావిసౌఖ్యమును నీవే నిశ్చయించుకొమ్మనుచు ధృతరాష్ట్రు నకే కార్యనిశ్చయమును వదలినాఁడు. ప్రకృతి తత్త్వమును సమగ్రముగ నర్జునునకు బోధించి, కడపట కృష్ణుఁడు "యథేచ్ఛసి తత్కురు," అని యిట్లే పల్కినాఁడు. విశిష్టజ్ఞానబోధకుఁడగు నుత్తమ గురుఁ డవలంబించు విధాన మిట్టిది. కృష్ణుని యీ ధర్మోపన్యాసము సభ్యులను దన్మయులఁ గావించినది. లోకహితము ప్రయోజనముగా గల విశిష్ట ధర్మవాక్యము లకుఁ బ్రతివచనముండఁజాలదు. కావుననే సదస్యులెల్లరును బ్రియమంది,

"నెమ్మనములం బురుషోత్తముఁ డింతయొప్పఁబల్కెనె మఱుమాట
లాడ నయకోవిదుఁ డెవ్వఁడు ధీరుఁ డెవ్వఁ డిందనువరి యెవ్వఁ

డంచు నచలాకృతులై"

యూరకుండిరి.

కృష్ణుని యుపదేశ బీజ మూసరక్షేత్రమునఁ బడినది. దురాశా వ్యామోహములకు వశుఁడైన ధృతరాష్ట్రుఁడు ధర్మమును నిర్వహింపలేక పోయినాఁడు. నారదాది మునులును, భీష్మద్రోణాది గురులును దుర్యోధనునకుఁ గావించిన హితబోధ యంతయు నిష్ఫలమైనది. కృష్ణుఁడును దుర్యోధనుననునయించి, బుజ్జగించి, సచ్చఁజెప్పుటకు యత్నించి, లాభము లేకవిసిగి, తుట్టతుదకు బెదరించి, యెట్లైనను సంధిఁగావింపఁ బ్రయత్నించి నాఁడు. దుర్యోధనుఁడు తాఁ బట్టిన పట్టువీడక ఖడ్గవాదమునే యవలంబించి, "యెవ్వరైనను సంగ్రామమునన్ జయంబుగొని రాజ్యము సేయుట నిశ్చయించితిన్," అని ఖండితముగాఁ బల్కినంతవఱకును, కృష్ణుని పలుకులయందెందును దీక్షత కానరాదు. దుర్యోధనుఁ డంత పుల్లవిరుపుగాఁ బల్కినపుడుకూడ, కృష్ణుఁ డుద్రిక్తుఁడు గాక, గాంభీర్యమును విడువక తృణీకార భావమును, నపహాస్య భావమును సూచించు చిఱునగవుతో, దుర్యోధనున కుత్తరమిచ్చిన విధాన మితని ధీరోదాత్తతను, ప్రౌఢిని, వ్యక్త పఱచుచున్నది.

"అనిన విని కిన్కఁబూనిన యలతినగవు
చెలువు మొగమున కొక క్రొత్త పొలుపొనర్పఁ
బుండరీకాక్షుఁడగుచెల్లఁ బోయి యప్పు
డరుణకమలాక్షుఁడగుచు మురాంతకుండు."

"మొనతలఁ బడియెదు నీ చె
ప్పినయట్టుల తడవులేదు బిరుదులకై నీ
వును వీరు నిలువుఁ డిదె భం
డన మెల్లియ వచ్చె నూరటలు గనుఁ డింకన్."

ఇంతవరకును బ్రసన్న భావముచేఁ దెల్లనైయున్న కన్ను లిప్పుడు కోప భావముచేఁ గొంత యెఱ్ఱబడినవి. కనుక పుండరీకాక్షుఁ డిప్పు డరుణ కమలాక్షుఁడై నాఁడు. మఱియుఁ జిఱునగవు వికాసముఁ గల్గింప ముఖము క్రొత్త చెలువముతో నొప్పినది. కృష్ణుఁడొందిన మార్పు ఇంతమాత్రమే. లోకద్రోహుల విషయమున గాంభీర్యమును విడనాడకుండుట మహా త్ముల లక్షణము. మీరు కోరి నిరీక్షించుచున్న యుద్ధమిదె సమీపించి నది, యీరాటలింకఁగాంచుఁడని చెప్పుటలోఁ గృష్ణుని ప్రౌఢత వ్యక్త మగుటయే కాక, కౌరవుల సర్వనాశము ధ్రువమను భావము గంభీర ముగ ధ్వనించుచున్నది. దుర్యోధనాదులు కృష్ణుని బంధింప యత్నిం పగా నతఁడు ధృతరాష్ట్రునితో,

"రోషము నాపయిం గలిగి క్రూరతఁ గౌరవు లింతసేత సం
తోషమ నీవు ప్రాభవముతోఁ దగ నాకు ననుజ్ఞ యిమ్ము ని
ర్దోషత నేను నోపుగతి దోర్బలదుర్జయులైన వారి వి
ద్వేషముఁ జక్కఁబెట్టి జగతీశ్వర యింతక పోయివచ్చెదన్."

అని చెప్పి, లోకశాంతికైన తుదిప్రయత్నమున కుద్యమించినాఁడు. తాను స్వయముగ దుర్యోధనాదులను సంహరించుట కింతవఱకును గారణము కలుగ లేదు. ఇప్పు డట్టికారణము కలిగినది కనుక దానిఁ బురస్కరించు కొని, దుష్టుల నడంచి, యిరుపక్షములవారిని రక్షింతునని ధృతరాష్ట్రుని యనుజ్ఞను గోరినాఁడు. బంధువుల యనుమతిచేఁ దాను వంశదూషకుఁ డగు కంసునిఁ జంపిన విధానమును గూడ ధృతరాష్ట్రునకుఁ దెల్పి,

"సత్కులమున్ బాలింపంగ వర్జింపంగ రాదే దుష్టాత్మకు నీచు నొక్క
రుని" యని యతనికిఁ కర్తవ్యము నిదివఱకే సూచించియున్నాఁడుఁ
కాని, విధిపై పరీత్యమునఁ గృష్ణుని యీ మహాప్రయత్నమంతయు
నిఫలమైయుద్ధమే సిద్ధించినది.

"పుడమియెల్ల నొడ్డగెడవయి గజవాజి
యుతముగా గడంగి యుగ్ర మృత్యు
ముఖము మొరఁగ దివురు మూర్ఖత మాన్చుట
యధిక మైన పుణ్య మనఘచరిత"

అనియిదివరకే కృష్ణుఁడు, సంధివిషయమగు తన యుదాత్తభావమును విదురునకుఁ దెల్పియున్నాఁడు. అతఁడీపుణ్యకార్యమును నిర్వహించిన విధానము కూడ రాజకీయముగ నత్యుదాత్తమై యున్నది.

కృష్ణునిరాయబారము కారణముగ నిరుపక్షములలోని ముఖ్యులగు వారి చిత్తవృత్తులు, నభిప్రాయములు, వ్యక్తములగుట కనుకూలించు సన్నివేశము లేర్పడినవి. పాండవులును, ద్రౌపదియు, దూతగాఁ బోవు కృష్ణునకుఁ దమతమ యభిప్రాయముల నెఱిఁగించుట, అట్టి సన్నివేశములలో నొకటి. 'పాండవులు శాంతశూరు' లను కృష్ణుని పల్కులకు నీ ఘట్టము నిదర్శనమగుచున్నది. భీమార్జునుల వాక్యములలో శౌర్యము, శాంతి ప్రచ్ఛన్నమై నెలకొన్నవి. ప్రశాంతత గభీరతా లక్షణమనుట, పాండవులయెడఁ జక్కగ సమన్వయించుచున్నది. వివిధ చిత్తవృత్తులఁ బ్రదర్శించు నీ సన్నివేశమును రసవత్తరమగు నేకాంకిక యన వచ్చును. ఎన్నఁడు లేని శాంతినిఁ బ్రదర్శించు భీమునిపల్కులను విని, కృష్ణుఁడు చిఱునవ్వుతో నతని రెచ్చఁగొట్టి మేలమాడుటయు, నతఁడందులకు,

"ఏమీ పార్థుఁడు నీవు దండిమగవై యీ వచ్చు కౌరవ్యసం
గ్రామ క్షోభము బాహు దర్పమున దీర్పం బెద్ద మిట్టైక్కి మి
మ్మేమెల్లన్ వెరగంది చూచెదముగా కీ సారెకుం బోయిరా
భీముం డిత్తరి రిత్తమాటలకుఁ గోపింపండు సూ పెంపటన్."

అని సరసంబొడుటయు, నిట్టి నాటకోచితములగు సంభాషణలెన్నియో యిందుఁ జూడవచ్చును. ద్రౌపది పల్కులు రోషాగ్ని జ్వాలాసదృశములై యొప్పినవి. పరిభవజన్యమైన యీ క్రోధాగ్ని కౌరవుల నెల్ల నావహుతిఁ గొనికాని, చల్లారునది కాదని యీమెపల్కులే వ్యక్తము చేయుచున్నవి. వీరిడి నని చెప్పికొన్నను నావేశపూరితములైన ద్రౌపది వాక్కులు గాంభీర్య ప్రధానములై యీమె విశిష్టలోక జ్ఞానమును, వివేకమును బ్రదర్శించుచున్నవి.

" రాజ్యముపాలులేక తీ
రున కొడఁబాటుగల్గిన నెఱుంగమి వెట్టరె చాలరైరి వీ
రనరొక్కొ నానలేమి యని యాడరె లోకమువారు కేశవా. "

" ఓట యొకింతయేనియు సుయోధను చిత్తమునందు లేదు నీ
మాటలఁ బోవునే దురభిమానమ యెక్కుడుపూనుఁ గాక. "

అను వాక్యములు ద్రౌపది ప్రాపంచిక పరిజ్ఞానమునకు నిదర్శనములు.

" అరయమిఁజేసి కోడలన కప్పుడు దాసిగఁ జేసె నమ్మహా
పురుషుని పాలికిం బతులుమోవఁగ వీరలతోన యేను జె
చ్చెరఁ జని కోటరంబుఁ దగఁ జేయుదునో యటుఁగాక పాడిమై
పరవుడ మోపి సేయుదునో వారిక మాధవ నిశ్చయింపుమా. "

అను పల్కులామె ఆభిజాత్యాభిమానములకు సూచకములు. కోడలను భావమేమాత్రమును లేక జూదమునాఁడు దాసిగఁజేసిన మహాపురుషుని, భర్తలు కొల్వఁబోవుటవలనఁ దనకు లభించునది దాస్యము కాక కోడరిక మెట్లగునని, ద్రౌపదిప్రశ్న. మహాపురుఁడను ప్రయోగము కాకుస్వర ప్రాధాన్యముచే విశిష్టమగుటయేకాక, స్త్రీజన స్వభావపోషకము కూడ నగుచున్నది. భార్య గౌరవాగౌరవములు భర్తలు గణిం

చుటలేదనియు, స్త్రీ నిస్సహాయయనియు నిందు స్ఫురించుచున్నవి. ద్రౌపదివాక్యము లుత్తమ క్షత్రియాంగనార్హములై వీరవంశోచిత ములై, స్త్రీస్వభావపోషకములై యొప్పినవి.

క్షత్రియధర్మమునకు విరుద్ధముగనున్న భర్తల సంధియుద్యమము నిట్లు తీక్ష్ణముగఁ బ్రతిఘటించిన ద్రౌపది, కీచకవధోద్యోగసందర్భమున నెంతటి యాత్మ సంయమనమును బ్రర్శించినదో గమనింపఁదగును. భీముఁడు క్రోధావిష్టుఁడై,

" అవసీచక్రము సంచలింపఁగ దివంబల్లాడ నాశాచయం
బవధూతంబుగ గోత్రశైలనికరం బాకంపముం బొంద న
ర్ణవముల్ ఘూర్ణవమొందఁ గ్రోధము గృతార్థత్వంబునొందించి చి
త్రవధప్రౌఢి వహించి సూతునకు రౌద్రం బేర్పడం జూపెదన్. "

అని యుద్రేకమును బ్రకటింపఁగా ద్రౌపది అజ్ఞాతవాస సమయ భంగ మగునని భీతిల్లి, యతనికి,

" ఒవ్వనివారు నవ్వ మహిమోదధిధర్మసుతుండు దీనికిన్
నెవ్వగఁబొంద భూజనులు నిందయొనర్పఁగ నే నొనర్చు నీ
చివ్వకు నీవు నల్క మెయిఁ జేసిన యాపని గూఢవృత్తికిన్
దవ్వగునేని నియ్యభిమతం బొడఁగూడియు నిష్ఫలంబగున్. "
" కావున వంచన బాహిర
పోవక యుండంగ మన రిపుం బరిమార్పం
గావచ్చునేని నట్టిద
నావల పటుగాక తక్కినను వలదు సుమీ. "

అని కర్తవ్యోపదేశముం గావించినది. ద్రౌపది ప్రవర్తనలో సంద ర్భము ననుసరించిన యీ వైవిధ్య మామె సమయజ్ఞతను, కర్తవ్యోపదేశ సామర్థ్యమును బ్రకటించుచున్నవి.

అవమానాగ్ని తప్తమైన ద్రౌపదివలెనే, కుంతీదేవియుఁ గృష్ణుని సంధి ప్రయత్నమును దూలనాడినది. ఉమ్మలికమ్మున నెంతయుఁ గృశించి, బడుగయి, పాలలోఁ బడిన బల్లివిధంబున నున్న, యీ వీరమాత వాక్కులు వజ్రధారాసన్నిభములైనవి.

" కొడుకుఁ గాంచు రాచకూఁతు రెద్దానికి
నట్టిపనికి నుచితమైన సమయ
మొదవే దడయు టింకనొప్పదు జనములు
నట్లుఁగాని పురుషు లనరు మిమ్మ్మఁ "

" భుజబలమున జీవించుట
నిజధర్మము మెత్తఁబడుట నింద్యము మాద్రీ
ప్రజలకుఁ జెప్పుము ద్రుపదా
త్మజఁ గార్యమడుగుమనుము తగ నందఱితోన్. "

అని సంధిప్రసంగమునకు మునుపే కుంతి కృష్ణునితోఁ బల్కినది. సంధి పొసఁగలేదని కృష్ణుఁడు చెప్పినప్పుడు, కుంతి,

" వీరిఁ గలయుట కష్టం
బౌవెరవు దప్పుటయ మే
లైవచ్చెం బొమ్మ్మ విడువు మనుమానంబున్. "

అని దుర్జనులతోఁ బొత్తు తగదని చెప్పినది.

"రాజుల కెందు నారయఁ బరాక్రమ జీవనవృత్తి దక్క నొం
డోజ నిషిద్ధమంద్రు మును లుత్తమసత్త్వులు పంశధర్మముల్
పూజితభంగిఁ జేయుదురు బుద్ధివిహీనులు వానిఁ దక్కి ని
స్తేజపుఁ గూటి కియ్యకొని దీనతఁ బొందుదు రంబుజోదరా."

క్షట్టు లప్రకృతమగు లోకన్యాయమును బురస్కరించుకొని, పాండవుల సంధిప్రయత్నమును గఠినముగ నిరసించినది.

భుజబలము నాధారమున శత్రువుల నాక్రమించి, శౌర్యమును బ్రకటించి జీవించుటయే క్షత్రియులకు, నందును రాజులగువారి కుచిత మగు వృత్తి. ఇతరములగు వృత్తులు, వానిలో ముఖ్యముగా, పరుల దయకు లోనై జీవించుట యనునది, రాజులకు నిషిద్ధము, నీచము, అని సామాన్య రాజ ధర్మమును వివరించి, కుంతి ధర్మజుఁడవలంబించిన యీ సంధివిధానము రాజధర్మ విరుద్ధమనియు, నీచమనియు వ్యక్త పఱచినది. ఉత్తమసత్త్వులు వంశగౌరవమున కనుగుణముగఁ బ్రవర్తించి వంశమును స్తుతిపాత్ర మొనర్తురు. బుద్ధిహీనులు కృపణులై పరులనాశ్ర యించి, వారు పడవేయు కూడును దిని దైన్యమున జీవింతురు. తనకు భర్తయు, మహావీరుఁడు నగు పాండురాజువంశ గౌరవమును ధర్మజా దులు నశింపచేయుచుండుటచే, వారు నత్త్వహీనులను నర్థము గమ్య మాన మగుచున్నది. అట్లే 'నిస్తేజపు కూటి కియ్యకొని దీనతనొందుదు' రనుటచే, పాండవులు సంధిప్రయత్నము మానకున్నచో బుద్ధిహీనులు, కృపణులు, క్షత్రియ తేజోవిరహితులు, కాఁగలరను కుంతియధిక్షేపమును గమ్యమానమైనది. నిస్తేజపుజీవనముకంటె రాజులకు వీరమరణము మేలని కుంతివాక్యముల యర్థసారము. రాజధర్మమగు పరాక్రమము నాశ్రయించి సంపాదించిన సంపదను 'జీవన' మను శబ్దముచేతను, ద దన్యమార్గమునఁ గృపణులై, వేడి తెచ్చికొన్న దానిని 'కూడు' అను శబ్దముచేతను కవి వర్ణించియుండుట గమనింపఁదగినది. ఇట్లే పద్య మందలి ప్రతిశబ్దమును విశిష్టార్థ స్ఫోరకమగునట్లు, సుప్రయుక్తమై, వీర పత్నియు, వీరమాతయు నగు కుంతీదేవి క్షాత్రతేజోమయ స్వరూపమును బ్రత్యక్షముఁ జేయుచున్నది.

ఆత్మగౌరవము గల ధీరయగుటచేఁ గుంతి ద్రౌపదీహృదయక్షోభను గ్రహించినది. ఉత్తమకులకాంతకు, నందును, స్వీయవంశ వధువునకు,

తన కుమారుల సహధర్మచారిణికి జరిగిన యవాచ్యమగు పరిభవము నకుఁ దగిన ప్రతిక్రియయొనర్చి యామె కన్నీటి నాపిన నేతప్ప, కేవలము రాజ్యలాభము నిప్రయోజనమనియు, జీవితము వ్యర్థమనియుఁ గుంతి భాషాటముగ వ్యక్తపఱచినది.

"మరచిరె కొలువున ద్రౌపది
బరచిన బన్నంబు ధర్మపథముఁ దొరంగన్
వెరచుట కప్పటి కది తగుఁ
జెరచిన-చో వెదకవలదె చిరతరకీర్తిన్."

అసి భార్య పరాభవమునకుఁ బ్రతీకారముఁ గావించుట భర్తకుఁ గర్తవ్య మనుచుఁ బాండవులను ప్రతిక్రియకుఁ బురికొల్పినది. పెట్టిదమగు నీమె పల్కులు విని భీష్మద్రోణాదులు కూడ బమ్మెరవోయిరి. కార్య వాదములు వల్క కుంతీ కృష్ణులిట్లు తెగఁబారుటవలన ధర్మజవారిరాశి కింకఁ జెలియలికట్ట తొలఁగిన దని వారితిక్తవ్యతామూఢు లైనారు.

ఇట్టీకుట్టమునందలి సన్నివేశములు వ్యక్తుల హృదయగత భావావేశ ములను, స్వభావములను, ప్రత్యక్షముఁ జేయుచుఁ, బాఠకులహృదయ ములకుఁ జైతన్యముఁ గలిగించు చున్నవి. వృత్తమంతయుఁ బాత్రల సంభాషణల తోడనే నడచినది. వర్ణనకును కథాకథనమునకును నించుఁ బ్రసక్తిలేకుండుటచేఁ గవి పాత్రలవెనుకకొదిగి సూత్రధారుఁడైనాఁడు. చతురములు, హృదయ ప్రదర్శనములునగు సంభాషణలను నిర్వహించు టలోఁ దిక్కన యుదాత్తమగు శిష్టవ్యవహారాంధ్రభాషకుఁ బాధాన్య మొసంగినాఁడు. ప్రతిపదమునను దెనుఁగునుడికార ముట్టిపడుచున్నది. ఛందోవిషయమునందును నీ పద్యమున దేశీయత నెలకొన్నది. గీతము లకుఁ గందములకుఁ గలప్రాధాన్యము సంస్కృతవృత్తములకు లేదు. ఇది వృత్తము సంభాషణాత్మక మగుటచేఁ దెనుఁగు పలుకుబళ్ళకును,

లోకోక్తులకును ప్రవేశము కలిగినది. ఉవ్వెత్తుగొనరె, కొట్టిన తిండి కాఁదు, ఒల్లవుగాక చివ్వకున్, చెవులు చీములు గట్టెడు, పిల్లివట్టిన యీరువు, మడుగుచీర యందు మసి దాఁకినట్లు, మాకుం గుడుమిండిడె మీరువ్రక్కఁగొనుఁడు, మీను ప్రింగిన గాలము చాడ్పున, చిక్కని పోటుమానిసివి, వారొకతల యే నొకతల, - యిత్యాది ప్రయోగము లనేకములు సహజ వ్యవహారోచితమగు విధమున సంభాషణల నడుమ నిమిడినవి.

ఇట్లు భాషయు నితివృత్తమును జీవితమున కత్యంతమునన్ని హితము లగుటయు, సన్నివేశములు నాటకోచిత విధానమునఁ బోషకములై యుండుటయుఁ గారణములుగ, నుద్యోగ పర్వరచన విశిష్టమై యున్నది. పురోహిత, సంజయ, కృష్ణ రాయబారములను రచించుటలోఁ దిక్కన చూపిన వైవిధ్య మతని లోక జ్ఞానమునకును, రాజ్యాంగపరిజ్ఞాన మునకును, సాక్ష్యమగుచున్నది. కృష్ణరాయబార ఘట్టమున శ్రీ కృష్ణుని జీవితతత్త్వము కూడ సూక్ష్మముగ వెల్లడియైనది. ఇంతియేకాక ధృతరాష్ట్ర దుర్యోధనాదులయుఁ, గుంతీకర్ణాదులయు, మానసిక ప్రకృతులను, స్వభావములను ప్రదర్శించు సన్నివేశములకు తిక్కన రచన చైతన్యమాపాదించినది. మనుమసిద్ధికి మంత్రియై రాజ్యాంగములను స్వయముగ నిర్వహించియుండిన కారణమునఁ, దిక్కనకు రాయబార ములఁ గూర్చిన స్వానుభవముండుట కవకాశము గల్గినది.

ఇట్లు విరాటపర్వము నానారసాభ్యుదయోల్లాసియు, నుద్యోగపర్వము తిక్కన రాజనీతివైదుష్యప్రదర్శకము నై లౌకికజీవితమున కత్యంత సన్నిహితములగు సన్నివేశములతో నొప్పుచున్న కారణమున నీ పర్వద్వయము సామాన్యపాఠకులనేకాక, పండిత విమర్శకులనుఁగూడ నెక్కువగ నాకర్షించుచున్నది.

68

యుద్ధపంచకము

భీష్మపర్వము మొదలు సౌప్తిక పర్యంతమువఱకును, వర్ణనీయ విషయము యుద్ధము. సాధారణ మానవజీవనందిన జీవితమునకు దూర మగు యుద్ధవీరము శృంగారమువలె సర్వజనాకర్షణీయము కాఁజాలదు. మఱియు నిందు జుగుప్సావహములగు బీభత్సాది రసములుకూడ నందందుఁ బోషితములై యుండుటచే యుద్ధపంచకము సామాన్యులకు రుచింపదు. ఇఁక శాంత్యను శాసనికాది పర్వములందు వర్ణితములగు విషయములు, ధర్మశాస్త్రాంతర్గత సూత్రార్థములును, వేదాంతసారము లునై యుండుటచే నవి ముముక్షువులకుఁ దప్ప నితరులకు రుచింపవు. స్త్రీపర్వ మౌసల స్వర్గారోహణాది పర్వములు బీభత్స కరుణముల కాలవాలములును, నాయక జీవితచరమదశను వర్ణించునవియు, శోక భూయిష్ఠములు నైయుండుటచే సామాన్యపాఠక హృదయాహ్లాద కరములు కావు. ఈకారణము వలన విరాటోద్యోగ పర్వములకుఁ గలిగిన జనాదరణ, తదనంతర భారతభాగములకుఁ గలుగకుండుటలో నాశ్చర్యము లేదు. విరాటోద్యోగపర్వ రచనానంతరము తిక్కన కవితాశక్తి క్షీణించినదనియు, నాకారణముననే తదనంతర భారతభాగమునకు నంతటి విపుల ప్రచారము కలుగలేదనియు నొకయభిప్రాయము సామాన్య పాఠక లోకమున నేర్పడుటకుఁగూడ నవకాశము గలిగినది. ఈయభిప్రాయ మవిచారమూలకమనియు, యుద్ధపంచక, శాంతి, మౌసలపర్వాదులు, తిక్కన కవితాప్రతిభలను విరాటపర్వముకంటె నధికముగ, నఖండముగఁ, బ్రదర్శించుచున్నవనియు, నీవ్యాసమున దిఙ్మాత్రముగ నిరూపింపఁ బ్రయత్నింతును.

"వేదవ్యాసమునీశ్వరు
పాదంబులు దలఁచి మ్రొక్కి భక్తి రసైకా
స్వాదన సుకరానందో
త్పాదన దివ్యమతినగుచుఁ దగ నెఱిఁగింతున్."

యుద్ధ ప్రవర్తనమును ధృతరాష్ట్రునకుఁ దెలుపఁబూను సంజయుని యీ పల్కులు యుద్ధపర్వరచనకుఁ గడంగిన తిక్కనయెడ ముఖ్యముగ సమన్వయించుచున్నవి. అష్టాదశాక్షోహిణీసైన్యప్రవర్తితము, నష్టాదశదివస పరివ్యాప్తము నగుయుద్ధమును రసవంతమగు కావ్యరూపమునఁ బోషించుట యెట్టి యసాధారణ కార్యమో తిక్కన యెఱుంగును. కనుకనే వ్యాసమహర్షియందలి భక్తిరసైకాస్వాదనముచే నానందము సుకరముగ సిద్ధించినదసియు, నాయానందసిద్ధిచే దివ్యమతినై, యీ యుద్ధపర్వములను రచింతుననియుఁ దిక్కన పలికియున్నాఁడు.

"ద్వాపరే ద్వాపరే విష్ణుః వ్యాసరూపో జనార్దనః"

యను వాక్యముననుసరించి, వ్యాసమహర్షి విష్ణ్వంశ సంభూతుఁ డగును. అతనియందలి భక్తికారణముగ, దివ్యచక్షువును, బుద్ధివికాసమును, నార్షమగు కవితాశక్తియుఁ, బొందినవాఁడు తిక్కన యని యూహింప నగుచున్నది. యుద్ధాదిపర్వములయందలి యతనికవిత యీ యూహను బలపఱచునదియై యున్నది.

యుద్ధము స్వభావముచేతనే వీరరౌద్రబీభత్సముల కాటపట్టు. "అట్టి యుద్ధమును బంచపర్వవిస్తృతముగ, విసువు జనింపనియట్లు చిత్రించుట దుష్కరకార్యము. ఈఘట్టమును రచించుటలో, ఋషితుల్యుఁడగు తిక్కన మహాకవి యవలంబించిన విధానమద్వితీయము. జాగ్రతతోఁ బఠించువారి కీవర్ణనలోని వైవిధ్యము, సందర్భోచితమగుశైలి, రసపోషణ యందలియౌచితి,— యిత్యాదులు సులభముగ గోచరించి, తిక్కన ప్రతి

భను సువ్యక్తముఁ జేయును. ప్రతిపద్యము నత్యద్భుతమగు చైతన్య
ముతో నొప్పుచు, నర్థస్ఫూర్తి భావగాంభీర్యములఁ బోషించుచు, రచన
కుదాత్తత నాపాదించుచున్నది.

ప్రకృతిసిద్ధములు, హృదయంగమములు, నగు నుపమానములను
సందర్భోచితముగఁ బ్రయోగించి, యుద్ధవర్ణనకు మనోహరత్వము
నాపాదించుట యితని రచనయందలి యొక విశేషము. భీష్మునిఁదలంచి,
పలవించు ధృతరాష్ట్రుని వాక్యము లిందులకుఁ జక్కని నిదర్శనములు.

"అంచిత తాలకేతుకిరణాలి మెఱుంగులుగాఁగ మార్మ్రోఁ
యించుట గర్జచందముగ నేచి వికోధిదవానలంబు మా
యించు శితాస్త్రవర్ష మున నిట్టిది భీష్మమహాభ్ర మెట్లడ్డం
గించెనొకో శిఖండియను గృత్రిమవాయువు దాఁకి దైవమా."

"పెరిగి పాండవాంబుధి వెల్లివిరిసినపుడు
నిలువ నిమ్మగుదీవిగా నిన్ను దలఁచి
యుండ నత్యంత తుచ్ఛ శిఖండి పల్వ
లాక్రమంబున మునిఁగితే యకట తండ్రి."

శత్రువిజృంభణమను దవానలమును సులభముగఁ దనబాణ ధారాపాత
మున నార్పఁగలుగు భీష్మమహాభ్రమును శిఖండియను గృత్రిమ
వాయు వెట్లెగురఁగొట్టఁగలిగినదో ధృతరాష్ట్రున కూహించుటకుఁగూడ
సాధ్యముకాలేదు. దుఃఖావేశమున నతనినోటినుండి, యప్రయత్నముగ
నిర్గమించిన 'దైవమా' యను సంబోధనమే యందులకుఁ దగిన సమా
ధానమగుచున్నది. విధివిలాస, వైపరీత్యము లిట్లు ప్రతిపాదితములైనవి.
అట్లే పాండవాంబుధి యుప్పొంగిననుగూడ మునుంగని భీష్మద్వీపము
శిఖండియను నత్యల్పముగు పరియపొంగుచే నాక్రమింపఁబడుటకు విధివై ప
రీత్యమే కారణముకదా. పాండవశౌర్యమను మహాసముద్ర ముప్పొంగి

నప్పు డద్దానిచే నాక్రాంతముకానిది భీష్ముఁడను దీవి యొక్కటే. అది యొక్కటే కౌరవులకాశ్రయము కాఁగలదు. అట్టిభీష్ముఁడు పడుటచేఁ గౌరవు లనన్యగతికులైనారనియుఁ, బాండవసముద్రమున నిఁక మునిఁగి పోవుటతప్పదనియు నిందుచే సూచితములు. ఈవిషయమే, శల్యవధా నంతర మగ్గునుఁడు దుర్యోధనుని మార్ఖ్యము నుద్దేశించి కృష్ణునితో నిట్లుబల్కినాఁడు.

" అమరనదీసుతుఁడువడినప్పుడు వీరలబుద్ధి సంధికా
ర్యమునకుఁజొచ్చునింక నని యాత్మఁదలంచితి నమ్మహాత్ముఁడున్
సముచితవాక్యవృత్తిఁ గురునాయకుఁ దేర్చఁగఁజూచెఁ జిత్త దో
షమహిమ నద్దురాత్ముఁడు ప్రశాంతతనొందఁడు యెన్నిభంగులన్."

" గంగాతనయుఁడు దెగినను
సంగరమున కుత్సహింపఁజనునే తమకున్
వెంగలు లని యప్పుడుదెలి
యంగానెఱిఁగితి సుయోధనాదులఁ గృష్ణా."

భీష్మనియాన్నత్యము నీ పర్వారంభమందలి పద్యము లుదాత్తవిధ మున వర్ణించుటయేకాక, యుద్ధపరిణామమునుఁ గూడ విదితముఁ జేయు చున్నవి. వీనియందలి ప్రతిశబ్దమును ధ్వనిప్రధానమై, యర్థగౌరవమున నొప్పుచున్నది. యుద్ధపర్వారంభమున కాదియందు రచితములగు నీ పద్యములు తిక్కన చేయఁబోవు భావిశిల్పమునకు మచ్చుతునుకలు. ద్రోణపర్వారంభమునఁ గౌరవసేనస్థితి వర్ణితమైన విధాన మీ పై పద్యములను స్మరింపఁజేయుచున్నది.

" పతికహితాత్మయైన సతిభంగియు గోపకహీనమైన గో
ప్రతతినిధంబు సస్యనిధుగస్థితియైన ధరిత్రిచాడ్పు ను
ద్ధత హరిశూన్యమైన వసుధాధరకందరభూమి చందమున్
మతి మనసేనదోఁచె బుధమాన్యుఁడు భీష్ముఁడు లేకయుండుటన్."

విగతభర్తృకయైనసతి, గోపాలక రహితమైన గోసమూహము, సస్యరహితమగు ధరిత్రి, సింహములేని పర్వతకందరము, నిట్లే భీష్ముండు లేని కౌరవసైన్యము గూడ కాంతిహీనమైనది. ఇంతియకాక భర్త లేనిస్త్రీకిని, గోపకుఁడులేని యాల మందకును, రక్షణలేకుండుటచేఁ గ్రమ మున దుర్మార్గులబారికిని, ఘాతుకమృగముల బారికిని గురియగుట ప్రకృతిసహజము. పంటలేని బీడుభూమియందు నిరసనమును, సింహములేని కందరమునెడ లఘుభావమును గలుగుటయు లోకసహజమే. అట్లే భీష్మనినిష్క్రమణముచే, ననాథయై, దీనయైయున్న కురుసేన పాండవులకుఁజిక్కు ననెడి భావ మిందు ధ్వనించుచున్నది.

మఱియును,

"అంగద నాథుమ్రింగిన వృకావలి తన్ వెసముట్టికొన్న స
ర్వాంగములుం జలింప వెగడందుచు దిక్కులు సూచుచున్న సా
రంగియ వోలె నుండెఁ గురురాజ భవత్సుతసేన భీష్మ నా
జిం గబళించి పాండవులు జృంభిత విక్రమలీలఁబొల్చుటన్."

తనకుఁబ్రియుఁడు, రక్షకుఁడు నగుభర్తను, దనయెదుట మ్రింగిన తోడేళ్ళ గుంపు తన్నుఁ జుట్టిముట్టికొనఁగా, భయకంపిత గాత్రయై, కాతరనేత్రయై, దిక్కులుసూచుచున్న యాడుజింక యుపమానము. యుద్ధమున భీష్మునిఁ జంపి పాండవులు దనాక్రమింపఁగా, వ్యూహము లెక్కడవక్కడ సడలు చుండ, భయముచే దిక్కులుసూచుచు నిలుచున్న కౌరవసేన యుప మేయము. ఉపమేయమగు కౌరవసైన్య నాశనమును సూచించుటయే కాక, యీ యుపమానము తత్సేనయొక్క ప్రకృతావస్థ నెంత విశదముగ వ్యక్తపఱచుచున్నదియు సువిదితము. ఆకలిచే మగజింకను మ్రింగిన వృకావలి యుపమానమగుటచే, నుపమేయమగు పాండవులను వర్ణించుచుఁ దిక్కున, "భీష్మ నాజిం గబళించిన" పాండవు లని ప్రయోగించినాఁడు.

"మ్రింగిన, కబళించిన" యనుపదములిందు విశిష్టములగుచున్నవి. ఆ వృకావలి కెట్లో పాండవులకు నష్టే ఆకలి యింకను దీరలేదనియు, మిగిలిన వారినీ గూడ మ్రింగినఁగాని శాంతింపదనియు ధ్వనించుచున్నది. ఆకలి యధికము గల జంతువులలో వృకము సుప్రసిద్ధము. కావున వృకావలి యని యిచట ప్రయోగించుట సార్థకమగుచున్నది. అట్లే "దిక్కులు సూచుచున్న" యనుప్రయోగమును నుపమేయమగు కౌరవ సేన దీనస్థితినిఁ బ్రత్యక్షీకరించుచున్నది. రక్షించునాథుఁడు లేకుండుట వలన నేమిచేయుటకును దోచక దిక్కులు సూచుచు నిలఁబడుట యుపమానోపమేయముల రెంటను సమానము.

సంగరోత్సవమునకు వెడలు పాండవాదివీరులను వర్ణించుచుఁ, దిక్కున పాండవ కుమారవర్గమును జిత్రించిన విధాన మతిసరసము.

"రభసక్షోభిత మేదినీతలముపై రథ్యప్రచారంబులో
ప్ప భుజాగర్వము నెమ్మొగంబులఁ దలిర్పం గన్నెకయ్యంబు న
ర్థి భవత్ప్రతులమ్మాది కోపమున నుద్దీపింప నేతెంచి ర
య్యభిమన్యుండును ద్రౌపదేయులును మాద్యద్దంతియూథాకృతిన్."

అభిమన్యుద్రౌపదేయుల కిది కన్నెకయ్యమగుటచే వారియుత్సాహమునకు మేరలేదు. కనుక నెప్పుడెప్పుడని వారు ముందుకుదూకుచుండుటచే మేదిని క్షోభించినది. నవయౌవనమున నున్నకారణమున మాద్యద్దంతి యూథాకృతినున్న కుమారవర్గము యొక్క యుద్ధాటోపముచే మేదిని చలించుటాశ్చర్యముకాదు. ఉత్సాహముచే సంపూర్ణ వికాసముం గాంచిన వారి నెమ్మొగములందు భుజాగర్వము తలిర్చినది. 'కన్నెకయ్యము,' 'మాద్యద్దంతి యూథము' ననుశబ్దముల యర్థము లెట్లున్నో న్యసంయోగముచే నొప్పుచుండునదియు, నవి యెట్టి మనోహరార్థమును స్ఫురింపఁజేయుచుండునదియు, సహృదయవేద్యము.

భీష్మపర్వమందలి యభిమన్యుయుద్ధవర్ణన, యిక ముందతఁడు పద్మవ్యూహయుద్ధమునఁ జూపఁబోవు వీరవిహారమునకు నాంది యగుచున్నది. అభిమన్యుని యుద్ధకౌశలము, శౌర్యసాహసములు, నసాధారణమగు నస్త్రప్రపాండిత్యము – ఇత్యాదులు తగిన విధమున నిందుఁ బోషితములైననేతప్ప, యతని పద్మవ్యూహావిహారవర్ణన కౌచిత్యము సిద్ధింపదు. కనుకనే తిక్కన యుద్ధాదినుండియు, నభిమన్యున కుచిత ప్రాధాన్యము నొసంగినాఁడు.

"ప్రళయకాలతాండవంబునం బ్రచండమూర్తియగు అష్టమూర్తియుంబోలె విజృంభించిన భీష్ము మార్కొను మగలులేక పాండవసైన్యంబు బెండువడియున్న యెడ నభిమన్యుండు వచ్చి, తాకి, శల్యకృతవర్మదుర్ముఖవివింశతికృపులయేపు నొకత్రుటిలో నడంచి, భీష్మునిపైనడరి,

"విశిఖనవకంబు నాటించి వెగడుపఱిచి
వేర్చియార్చిన సురకోటి పిచ్చలించె
మెచ్చి భీష్మాదులెల్ల విచ్చ్చుఁబోలు
నెక్కుడగుఁగాని యసదుగా దీతఁడనిరి."

"ఆసౌభద్రుం డుగ్రపు
వేసవి దావాగ్ని శుష్కవిపినమ్ము నిరా
యాసంబుగ దరికొనుగతి
భాసితశరశిఖలు వారిపైఁ బరగించెన్."

"రంగత్ప్రథనస్తుత్యతు
రంగముఁడై తాండవాభిరతుఁడగు హరులీ
లం గడఁగి వీరనృత్యము
సంగరరంగమునఁ జేసె శత్రులు మెచ్చన్."

శుష్కమగుటచే నీరసమగువిపినము కురుసేనకును, నుగ్రపు వేసవియందలి దవాగ్ని యభిమన్యునకును నుపమానములఁ గావించి, తిక్కన కురు సైన్యనాశమును సూచించియున్నాఁడు. అభిమన్యుని వీరవిహారమును లయకాలరుద్రుని తాండవనృత్యముతోఁ బోల్చుటవలన, నభిమన్యుని శౌర్యమున కుదాత్తత సిద్ధించినది. బిందుపూర్వక గకారప్రాసముతో, తరువాతిపాదములలో జొచ్చుకొనిపోవు పాదాంతముల విరుపులతో నొప్పు, నీ పద్యమునందలి శబ్దములన్నియు, నర్థమునకేకాక ధ్వనియం దును లయకాల శివతాండవమును రూపించుచున్నవి.

"చెంగట నభిమన్యుండు పి
శంగతురంగప్రచారచంచద్రథుఁడై
పొంగి మనదిక్కుప్రజమీఁ
దం గవిసెం జిచ్చు దూదిదరికొనుమాడ్కిన్."

అని యిదేపర్వమున మఱియొకచో వర్ణితము. ఇందును నుపమాన ములయౌచితి ప్రశంసనీయము. అట్లే ద్రోణపర్వమున నభిమన్యుఁడు విజృంభించి వీరవిహారముఁ గావించుచుండ, నాకలితోనున్నహరిం దేకువసెడి చేరు కరిగతిన్ దుర్యోధనుఁడు చేరవచ్చినాఁడు. రాజునకుఁ గలుగనున్న యుపద్రవమును వెంటనేగమనించిన ద్రోణునిచేఁ ప్రేరి తులై కృపాశ్వత్థామ కర్ణాది మహావీరులెల్లరు నడ్డుపడి, యభిమన్యుని ధారనుండి దుర్యోధనుని రక్షించుకొన్నారు.

"ప్రకటబలాఢ్యు లొక్కట దిరంబయి పల్వురు వీఁక భూమిపా
లకునకు నడ్డమైన దవులంబడి హుమ్మని నోరకండ నా
టికొనిన ప్రోగు బెబ్బులివిశేషముఁ దోపఁగఁ బార్థుపట్టి సా
యకముల నొంచినన్ దెరలిరందఱు లేళులపిండు నాకృతిన్."

అభిమన్యునిబారిఁబడ్డ దుర్యోధనుని రక్షించుట, క్రూరవ్యాఘ్రము తినఁ బోవు మాంసమును హరించుటవంటిది. క్రోధావేశమున వ్యాఘ్రము బిట్టురిమి వన్యసత్త్వములపై బడినట్లు రోషావేశమున నభిమన్యుఁడు హుంకరించి కురువీరులను బాణాగ్నికి గురిచేసినాఁడు. వ్యాఘ్రగర్జనచేఁ జెల్లాచెదరగు లేళ్ళగుంపువలెఁ గౌరవవీరులెల్లరు పంచబంగాళమై చెదరి పోయినారు. ఇట్లు సంపూర్ణార్థపోషకమగు నుపమానముచే నీ రచన కర్థగౌరవము సిద్ధించినది.

యుద్ధారంభమునుండియు నభిమన్యునిశౌర్య మీవిధమునఁ బోషిత మగుటచేఁ బద్మవ్యూహగతమగు నతని విశృంఖలవీరవిహారవర్ణన కౌచిత్యము కలిగినది. అస్త్రగురుఁడగు ద్రోణునంతటివాఁ డగతికుఁడై, కర్ణ శకుని శల్య కృపాశ్వత్థామ బాహ్లికాది మహావీరుల నధర్మమునకుఁ బ్రోత్సహించి, లోకనిందకుఁ బాల్పడవలసివచ్చినది.

కర్ణద్రోణాదు లనేకులుచేరి, వంచనచే నొక్కసారిగ నభిమన్యుని నిరాయుధుండును, విరథుండును నగునట్లు గావించి, యడరి యస్త్రశస్త్రకలాపంబులనొంచి, చిక్కుపఱచి, యలచినన్,

"వాలును బలకయుఁగొని య
బ్బాలుఁడు రయమార గగనభాగంబునకు
న్నిలిత ధృతిసారుండై
లీల నెగసిపోయె మండలీభూతగతిన్."

"తనవిద్యకలిమి వినతా
తనయునిభంగిం జరింపఁ దమతమపైఁ దెం
పున నుఱుకు నను తలంపున
మనమోఘులు భయముఁగొనిరి మనుజాధీశా."

ఇట్లు ద్రోణాదులూహింపని యద్భుతవిధమున నభిమన్యుఁడు విహరింపఁగా, నోర్వలేక మఱల గురుఁడే యతనిఖడ్గమును ఖండించినాఁడుఁ: ఇట్లయ్యు నభిమన్యుండు జంకక, ఘనచక్రముంగొని, యుపేంద్రుఁడు లీల నటించు చాడ్పునన్,

"కుంభసంభవుఁడున్న దిక్కునకుఁగవిసి
యడ్డుపడు సేనఁ జించిచెండాడు నక్క-
మారవరు మేని యొప్పును మగతనంబుఁ
జలము బలముఁ గీర్తించె నిర్జరగణంబు." -

అధర్మయుద్ధమునకుఁ గర్ణాదులను బురికొల్పిన కుంభసంభవుని దిక్కునకుఁగవిసి, యభిమన్యుండు విజృంభించుట తగియున్నది. అపకృతి యొనరించిన వాని వెంటఁబడుట కృష్ణసర్పమునకు సహజమే. ఇట్లు నిర్జరగణము కీర్తించువిధమున వీరాధివీరులఁ జీకాకుపఱచి, శ్రాంతుఁడై, తుదకు దౌశ్శాసనితోఁ నెక్కటొక్కటిపెనంగి, యతనింగూల్చి తానును గూలినాఁడు. కమలాకరము నవారణంజొచ్చి కలఁచియాడు వనగజమును గృపమాలిన బోయలు ముట్టిచంపుచాడ్పున ననేకవీరులుచేరి, యభిమన్యునిఁ గూల్పఁగా,

"జగములన్నియునుఁ దేజంబునవెలిఁగించి
యపరాద్రిసేరిన తపనుమాడ్కిఁ
దరచైనకానలు దరికొని నివురుగాఁ
జేసి యారిన దవశిఖివిధమున
గగనంబుతోరాయు కరడులుగల జలం
బివురఁబారిన మహార్ణవముకరణి
నున్నతగతిసెడి యుర్వ్యైఁ గదువిన్న
నై పడియున్న సుధాంశుభంగి

బీరమునఁదమ వారికిఁ బెంపొనర్చి
యరులసమయించి వసమతి యనువుఁదప్పి
తెగియుఁ జూడ్కికిఁజాల వ్రేఁగగుచుఁ బొలిచె
మహితమూర్తిశోభితుఁ డభిమన్యుఁడధిప."

ఇందుఁ బ్రయుక్తములైన యుపమానములన్నియు నతిలోకములై యుండుటవలన నభిమన్యువర్ణన కుదాత్తతసిద్ధించినది. అంతియ కాక, ముల్లోకములను భాసింపఁజేసిన మార్తాండుఁడ స్తమించుటకును, కాన నములను నివురుగాఁ జేసిన దవాగ్ని యారుటకును, మహాసముద్ర మివ్వుకఁ బారుటకును, లోకరంజకమగు సుధాంశుబింబము గతిసెడి యుర్వ్యైఁ బడుటకును గాలప్రభావమే కారణము. అట్లే ద్రోణాది మహావీర ప్రపంచమునంతను దన శౌర్యకిరణజాలముచేఁ దపింపఁజేసిన యభిమన్యు మార్తాండుఁ డస్తంగతమందుటకును గాలప్రభావమును, విధివిలాసమును హేతువులనుట గమ్యమానమగుచున్నది. మరణించి, రణరంగమునఁ బడి యుండియు, సుధాంశునివలె మనోహరుఁడై, చూడ్కికిఁ ప్రేగయి పొలిచె ననుటచే, నభిమన్యుఁడెట్లు లోకాతీతమగు విక్రమముచే నెల్లరహృదయము లను జూరఁగొనియెనో వ్యక్తమగుచున్నది. అతఁడుగావించిన యతిలోక యుద్ధవిహార స్వరూపమును సూచించుట కీ మహత్తరములగు నుపమాన వస్తువు లావశ్యకము లైనవి.

పద్మవ్యూహమును ప్రవేశించుటకుముం దభిమన్యునిచేఁ గవి పల్కించిన వాక్యములు భావ్యనర్థమునకు సూచకములగుచున్నవి. బహు విధసమరకర్కశులగు కుంభజప్రముఖ సైన్యపతులతోఁ గొప్పు వ్యూహమును, యుద్ధానుభవముచాలని యభిమన్యుఁడు ప్రవేశించుట సాహసమని సారథి హెచ్చరింపఁగా, నభిమన్యుఁడు.

"అనవుడు నల్లనవ్వి యతఁడాతనికిట్లను దేవయుక్తుఁడై
యనికి బలారివచ్చినఁ బురారి గణంబులుఁ దానుఁ బన్నినం
గినిసి కడంగి క్రీడియును గృష్ణుఁడుఁదాఁకిన నేఁ జయింతు మా
రొక్కనియనుచుండుచున్ సరకుఁగొందు నెఱ్ఱోణునిఁదోడియోఘులన్."

అనిపలికినాఁడు. ఇవి కేవలము యుద్ధోన్ముఖుఁడగు వీరుని యుత్సాహ వాక్యములుకావు. విధిప్రేరణమున మృత్యుముఖముం బవేశింపఁబోవు వాని నోటినుండి, యప్రయత్నముగ వెల్వడిన యతిసాహసవాక్యములు. అత్యావేశము హేతువుగా సహంకారము వాక్కులలో నెలకొన్నది. ఆరిపోనున్న దీప మొకక్రొత్తటికాల మమితతేజమునఁ బ్రజ్వరిల్లున ట్లభిమన్యుని జీవితజ్యోతియు నొక్కసారి భగ్గునమండి యారిపోయినది. విధిప్రభావ మిట్లు వివృతము గావింపఁబడినది.

ఇట్టి విషాదగర్భిత పరిణామముతోఁగూడిన పద్మవ్యూహయుద్ధము, మఱునాఁటియర్జునుని మానవాతీతమగు వీరవిజృంభణమునకుఁ గారణమైనది. సైంధవరక్షణార్థ మాచార్యుఁడు గావించిన మహాప్రయత్నము, ప్రతిజ్ఞానిర్వహణమున బద్ధకంకణుఁడైన యర్జునుఁడు ప్రదర్శించిన యస్త్ర విద్యాకౌశలము, భీమసాత్యకుల శౌర్యసాహసములు, – నిత్యాదులు, తనరచనా కౌశలముచేఁ బాఠకులయెదుటఁ బ్రత్యక్షమగునట్లు, తిక్కన గావించి యున్నాఁడు. సైంధవవధార్థ మేకాకియై వ్యూహమును బ్రవేశించిన యర్జునునకు సహాయమేగుచున్న భీమునకు వ్యూహముఖముననే ద్రోణుఁ డడ్డుపడినాఁడు.

ఇదివఱకే సాత్యకి ద్రోణునిఁదప్పించుకొని, వ్యూహమును బ్రవేశించినాఁడు. ద్రోణుఁడు సాత్యకిని బోనిచ్చుటలో నొక యుద్ధరహస్యముఁ గలదు.

సైంధవవధోద్యోగము మాత్రమేకాక సాత్యకి రక్షణభారముఁ గూడ నర్జునునిపైఁ బడఁగలదని ద్రోణునియూహ. అతఁడూహించినట్లే నిరంతర

యుద్ధకారణమునఁ బరిశ్రాంతుఁడైన సాత్యకిని భూరిశ్రవునిబారినుండి యర్జునుఁడు రక్షింపవలసివచ్చినది. భీమునిఁ బ్రవేశింప నిచ్చుట తమకు శ్రేయముకాదని ద్రోణుఁడెఱుఁగును, కావుననే, యాతని కడ్డుపడినాఁడు. ఈఘట్టమున భీమునిపాత్ర నతిమనోహరముగఁ జిత్రించినాఁడు తిక్కన.

"నను గెలిచికాక నీ కి
మ్మొన సొరఁగానెట్లువచ్చు మును నీతమ్ముం
డనుమతుఁడై కాదే చొరఁ
గనియె ననుడు నతఁడు కన్నుఁగవ గెంపార్ప."

"నరుఁడొక రథికుని యనుమతిఁ
జొరఁదలచునె మనుజసేన సురబలమైనన్
దెరలిచికొని విచ్చలవిడి
నరుగున్ దనవలచినెడకు నది యట్లుండెన్."

"ప్రియములువల్క నిన్ననుసరింపఁగ బార్థుఁడు కాఁడు సుమ్ము దు
ర్జయభుజశక్తినిర్మథిత శత్రుఁడు భీముఁడు గాని నీవు దం
డియు గురుడుం బ్రియుండు నని ప్రీతియొనర్చెదఁ బూనివైరికిన్
జయ మొనరింతుఁగాక యని సైతునె దర్పము సూపకుందునే."

అని పలికి,

"గదసారించి చెలంగివైచిన భుజాగర్వంబు సాలించి య
మ్మదుకం డుర్వికిదాటిపోయె నది రశ్ముల్ మింటఁబర్వంగ బె
ట్టిదమై మ్రోయుచువచ్చిబల్పిడుగుమాడ్కిన్ దాకుడున్ గుఱ్ఱముల్
నదిసెన్ సారథిమ్రగ్గెఁ దేరువొలిసెన్ సైన్యంబుభీతిల్లగాన్."

భీముఁడువిసరివైచినగద, తనకాంతులనన్నివైపులు ప్రసరింపఁ జేయుచు, శబ్దించుచు వచ్చి రథమును దాకినది. కాంతిప్రసరణమునకును, శబ్దించు

టకును గదాదండము సమితవేగము కారణమగుచున్నది. ఇట్లు సూచిత మైన మహావేగమునకుఁ గారణమగు భీముని భుజశక్తిమాహాత్మ్య మిందుచే ధ్వనిత మైనది.

అప్పు డమ్మేటిమగండు వ్యూహమునఁ బ్రవేశింపఁబోవునంతలో ద్రోణుండు వేరొండు తేరెక్కివచ్చి శరపర్షముచే నతని నడ్డినాఁడు. బాణపరంపరలఁ గురిపించి, గురునిగెల్చి, వ్యూహమును జొచ్చుట సుకరముకాదు, వ్యవధియునులేదు. త్రుటికాలము, ద్రోణుని యుద్ధవిముఖునిఁ గావించి, యతఁడు మఱల సిద్ధమగు నంతలో వేగముగ వ్యూహమును బ్రవేశింపవలయుననుట భీముని యెత్తుగడ. అప్పటి యతని భీమ ప్రయత్నవర్ణనకుఁ దిక్కన యూహాపాదించిన మనోహరత్వ మసదృశమైనది.

"అరదము డిగ్గి యప్పటుశరావళికోర్చి మొగంబు వాంచి స
త్వరుఁడయి వాన పైఁగురియ వంచినమస్తక మొప్పఁ బోవు సుం
దర వృషభంబులీలఁ జని దర్పమెలర్పఁగ నొక్కచే నొగల్
వెరవునఁబట్టి తేరు ప్రజ విస్మయమందఁగ వీచి వైచినన్."

వర్షపాత మత్యుత్సాహముఁగల్గఁజేయఁ జెలరేగి, తలకొంచెమువంచి, మిట్టప్రదేశములను గొమ్మలచేఁ గోరాడఁ బోవు కోడెలను జూచినవారి కీ వర్ణనయందలి విశిష్టత సువ్యక్తము కాఁగలదు. ద్రోణుని పల్కులకు భీముఁ డిచ్చిన ప్రత్యుత్తర మతని స్వభావమును జక్కఁగఁ బ్రదర్శించుచున్నది. తన యనుమతిఁ గైకొనియే యర్జునుఁడు వ్యూహమును బ్రవేశించె నని ద్రోణుఁడనుటతో, భీముని నేత్రములు రోషారుణరంజితము లైనవి. సుర సేనలైనను నెవ్వరి యనుమతి నొందకయే ప్రవేశించి నరుఁడు తన యిచ్చ వచ్చిన చోటికి బోఁగలఁడను నతనిపల్కులలో క్షాత్రము, రాజసము, నర్జుని విక్రమమునం దతనికిఁగల విశ్వాసము, వ్యక్తములైనవి "నీవు గురుఁ డవై పితృసమానుఁడవగుటచే నిన్నుఁ బూజింతునుగాని, నీవు పైరికి జయ

మాపాదించుచుండ సహింతునా, ధైర్యమును జూపకుందునా, దుర్జయ భుజ శక్తినిర్మథితశత్రుఁడగు భీముఁడు సాంత్వనవాక్యములచే ని న్నను నయించునా" యను భీముని పల్కులలో, నుద్ధతితోఁబా టతని వినయ వివేకములును బ్రదర్శితములైనవి. ఇట్లు పాత్రల శీల స్వభావాదులను వ్యక్తపఱచు సహజసంభాషణములచేఁ దిక్కన యుద్ధవర్ణనము నాకర్షణీ యముఁ గావించియున్నాఁడు.

సన్నివేశములఁ బురస్కరించుకొని, రౌద్రమునకాటపట్టగు యుద్ధ రంగము నొక్కసారిగా రమణీయమగు ప్రకృతిదృశ్యముగ మార్చుట, తిక్కనరచనయందలి విశిష్టగుణములలో నొకటి. భీష్మార్జునుల ద్వంద్వ యుద్ధమున నర్జునుఁడు చేడ్పడఁగా, కృష్ణుఁడు సైరింపక, రథంబునుండి దుమికి, భీష్మునిపైఁబోవుట యట్టి సన్నివేశములలో నొకటి.

"ధరణీచక్రముగ్రక్కునంగదల దిగ్దంతావళ శ్రేణి కం
ధరముల్ ద్రొమ్మఁబడన్ దిశావలయ ముత్కంపంబుగా నీబలం
బురులం బారగ భీష్మునిపైఁగవిసె రౌద్రోద్రేకముంజూచి ఖే
చరలోకంబును సంచలింప హరి చంచద్బాహు ఘోరాకృతిన్."

అని రౌద్రరసోత్పాదకముగ నొకపద్యమున వర్ణించి, తిక్కన తక్షణమే యైంద్రజాలికునివలె, మఱుపద్యమున దృశ్యమును మార్చివైచి యుండుట, గమనింపఁదగినది.

"లలిత పీతాంబరంబువిలాసమొప్ప
సింహనాదోద్భటంబగు చెలువుతోడ
మెఱుఁగు వెలుఁగును గర్జయు మెఱయవచ్చు
కాలు మొగి లనఁ గృష్ణు నాకార మొప్పె."

వర్షకాల మేఘధర్మములగు విద్యుత్కాంతిగర్జలను రెంటి నుపమానము లుగ నిందు వాచ్యములుచేసి, మూడవధర్మమగు నలుపు ఉపమానోప

మేయములరెంటను సమానమగుట, వాక్కులచేఁ బేరొక్కనక కవి వ్యంగ్యముఁ గావించియున్నాఁడు. ఇట్లు సహజములు మనోహరములు నగు నుపమాలంకారసాహాయ్యముచే, నుదాత్తములగు విశేషార్థములను ధ్వనింపఁజేయుట, తిక్కన యుద్ధవర్ణనయందు సర్వత్ర కాననగుచున్నది. ప్రయుక్తములగు శబ్దము, నర్థము, నలంకారము, నిత్యాదులచే, మనోహరములగు విశేషార్థ, విశిష్టాలంకారాదులను ధ్వనింపఁజేయుట, ప్రౌఢ కవితాలక్షణము. రసాత్మకమైన యిట్టిధ్వనియే కావ్యాత్మయని పండిత కవుల సిద్ధాంతము.

కర్ణార్జునుల ద్వంద్వయుద్ధమున, నర్జునప్రయుక్తమహాస్త్రములు మేన నెత్తురులఁబరప గైరికనిర్ఝరప్రకరశోభితాచలము వోలెఁ బొలుచు కర్ణుని తిక్కన వర్ణించినవిధ మిందుల కొక యుదాహరణమగుచున్నది.

"నెత్తుటఁదోగి మేను కమనీయరుచింగొమరార బాణసం
పత్తి యుదగ్రతన్ మెఱయ భాస్వరుఁడై యరదంబు మీఁద భూ
భోత్తమ కర్ణుఁడొప్పె నరుణోజ్జ్వలమండల కాంతి పూరమున్
మొత్తపుదీప్తులుం దగ నినుం డపరాద్రివెలుంగుచాడ్పునన్."

రక్తముచేఁదడిసినమేను గమనీయకాంతిచే నొప్పు, మహాస్త్రముల కాంతి యుదగ్రముగఁ బ్రకాశించుచుండ, రథముపై వెలసిన కర్ణునకు, సాంధ్యారుణశోభితము, నుజ్జ్వలకాంతిమంతము, పశ్చిమాచలోపరిస్థితము, నగు సూర్యబింబ ముపమానము. ఉపమానోపమేయములు సమగ్రార్థ పోషకములగు సాధర్మ్యములచే నొప్పుచున్నవి. మఱియు, 'భాస్వరుఁడై' యనుప్రయోగము విశిష్టార్థ బోధకము. "భాస్వరః" అనుపదమునకుఁ బ్రకాశించువాఁడనియు, సూర్యుఁడనియు నర్థములు. భాస్వరుఁడగు కర్ణునకు, 'భాస్వరుఁ' డుపమానమగుట యిందలివిశేషము. ఇంతియ కాక అనతికాలముననే యర్జునునస్త్రములకుఁ గుఱియై యస్తమింప

నున్న కర్ణుని వర్ణనమిది. ఉపమానమగు సూర్యబింబమును నస్తమింప నున్నది. ఇట్టి యుపమానముచేఁ గర్ణునివధను ధ్వనింపఁ జేసి యున్నాఁడు తిక్కన. మఱియు, సూర్యుఁడు తన ప్రచండమగు తేజస్సుచే లోకమును దపింపఁజేసి, కాలమునతిక్రమింపలేక, యస్తంగతుఁడైన విధ మున నతనియంశమున జన్మించిన కర్ణుఁడును, దనపరాక్రమముచే వైరి తాపమొనరించి, విధినతిక్రమింపలేక యస్తమింపనున్నాఁడనుట హృద యంగమమగు రచనయగును. కనుకనే తిక్కన,

"దారుణాస్త్రజాలాంశుల వైరిసైన్య
తాపమొనరించి యా సూతతనయతరణి
పార్థదుస్తరకాలవైభవముఁ గడవ
ననువులేమి నవ్విధమున నస్తమించె."

అని కర్ణుని ప్రతాపాస్తమయములను, సూర్యుని ప్రతాపాస్త మయ ములతో నభేదరూపకముఁ గావించియున్నాఁడు.

ఉపమానోపమేయములకు చక్కని అంగాంగభావసామరస్యము పొసఁగునట్లు రూపకాలంకారమునుగూర్చి, వర్ణనీయవస్తువున కుదాత్తత నాపాదించుట యితనిపద్ధతి. కర్ణుని విజృంభణము నొకచోవర్ణించుచు,

"బాణజ్వాలలు బెట్టుపర్వ గగనప్రక్షోభణజ్వాలతా
క్వాణస్ఫూర్తి ఘటచ్ఛటారవముగాఁ గర్ణోగ్రదావాగ్ని యు
క్షీణోదగ్రత వైరిసైన్యవనభస్మీభావనిర్వాహపా
రీణంబై వెలుఁగొందె నిర్జరులు వర్ణింపంగ నేముబ్బఁగన్."

అని, యతనిని దావాగ్నితో నభేదముగ వర్ణించినాఁడు. దావాగ్ని జ్వాల లన్నివైపుల వ్యాపించినట్లు కర్ణుని బాణజ్వాలలు సర్వముఖముల వ్యాపించుచుండుటయు, కాలుచున్న వృక్షములును, వెదుళ్ళును, ఫెళ ఫెళారావములొనర్చున ట్లాతని జ్యానినాద మొప్పుచుండుటయు, దవా

గ్నిచే నరణ్యాముభస్మీభూతమైనట్లు వైరిసైన్యము నిస్సారమగుచుండు టయు, నను సాధర్మ్యములు చక్కగ సమన్వయించుచున్నవి.

గజసమూహములపై లీలనరిగి గదావిహారముసల్పు భీమునియాటో పము పలుచోట్ల. పలువిధముల, వర్ణితమైయున్నది.

"గజఘటలం గనుంగొని వికాసము మోమునఁ బల్లవింపఁగా
భుజశిఖరంబునందు గదఁబూన్చి మదంబున దేరుడిగ్గి వా
యుజుఁడు గడంగి భీషణసముద్ధతియై దలపడ్డఁ బర్వత
వ్రజమిపయిన్ వెసంగవియు వాసవుచందముఁదోచె నత్తఱిన్."

తనపైవచ్చు గజసమూహముం గాంచినతోడనే భీమునిమోమున వికా సము పల్లవించినది. అతని గదాదండ విశృంఖల విహారమున కర్వమైనది గజసమూహము. అశ్వపదాతివర్గము లందులకుఁ జాలినవికావు. మత్త మాతంగదర్శనమున సింహమునకుఁగల్గు సంతోషము, హరిణ సమూహ దర్శనమునఁ గలుగకుండుట ప్రకృతిసహజము. కనుక భీమునిముఖము వికసించు నెంతయు నుచితము. మఱియు సంతోష ప్రాదుర్భావముచే ముఖమెఱ్ఱవడుట దైహికలక్షణము. కనుక 'పల్లవించు' నను ప్రయోగ ముచేఁ, దిక్కన యీలక్షణమునుగూడ ధ్వనింపఁజేసినాఁడు.

"ఏనుఁగునెత్తుట గదయున్
దానుఁ దడిసి విలయకాల దండధరునిచం
దానం బొవని మాగధ
సేనం బీనుంగు పెంటఁ జేసి చెలంగెన్."

"అడవి దరి కొనిన పావకు
వడువున భీముండు కౌరవవ్యూహంబుం
బొడిసేయుచుఁ బేర్చెం దన
యొడలు మనము నంతకంత కుబ్బుచునుండన్."

గదాదండమును ధరించి మాగధునిసేనను బీనుఁగుపెంటఁ గావించిన భీమునకుఁ బ్రళయకాలమున జీవులను బీనుఁగుపెంటఁగావించు దండధరుని తోడి పోలిక యెంతయు నర్థవంతమై యున్నది. కౌరవసైన్య దాహకుఁడగు భీమున కడవిని దహించు దవాగ్ని యుపమానము. ఇందుఁ "దనయెడలు మనము నంతకంత కుబ్బుచునుండఁ," అను క్రియావిశేషణ మర్థగౌరవముచే నొప్పుచున్నది. అడవి దహింపఁబడుకొలఁదియు, దావాగ్నివ్యాప్తి విస్తారమై, తత్పరిమాణము వృద్ధియగుచుండుటయు, దాని ననుసరించి, దాహకశక్తికూడ వృద్ధిఁగాంచుటయు, సహజములే. అట్లే, కౌరవసైన్యము నాశమగుకొలఁది, భీమునిదేహ ముప్పొంగుటయు, నతని శక్త్యుత్సాహములు వృద్ధియగుటయును సహజమే. ఇట్లర్థస్ఫోరకమగు విశేషణప్రయోగమువలన నలంకారము ప్రౌఢమైనది.

దుశ్శాసనదుర్విషహాదికౌరవు లొక్కసారిగా, జతురంగబలంబుల తోడం జుట్టుముట్టిన, వృకోదరుండు సంతసంబునం బొదలి, సారథిని రథంబుతో నుండనియమించి, గదవుచ్చికొని ధరణికిలంఘించి, జరిపిన వీర విహార మత్యద్భుతము, దివ్యశక్తిస్ఫోరకము, నగుచున్నది.

"కవిసి యుగాంతదండధరుకైవడిఁ గోలుమసంగి కుంభముల్
పవులగఁ దుండముల్ దునియఁ బ్రక్కలుప్రక్కలుగాఁగ దర్పమున్
జవము బలంబు నొప్పఁగ గజంబుల ప్రేసిన నెత్తురొల్కఁగా
నవి వడె ధాతునిర్ఝర మయాచల పంక్తులఁబోలి మేదినిన్."

యుగాంతమునఁ ప్రాణులఁ బంచత్వము నొందించుటయే యమునిధర్మము. తద్వ్యాలయముం గావించుటలో రౌద్రబీభత్సములు సాకారములై వికటనృత్యముఁ గావించుటతప్పదు. కౌరవుల విషయమున భీముఁడు విలయకాలదండధరుఁడనుట తగినదే. అతఁడు గావించిన రౌద్రవిహారము, నట్లే యుపమానమునకుచితముగ వర్ణితమైనది.

మఱియు రక్తధారలచే నొప్పి, కదలికలేక క్రిందం బడియున్న గజరాజములు, ధాతునిర్ఝరమయములగు పర్వతములతోఁ బోల్పఁబడినవి. గైరిక ధాతువుల కారణమున నెఱ్ఱనడియున్న సెలయేళ్ళు, పర్వతోపరిభాగములనుండి క్రిందికిఁ బ్రవహించుచుండఁగా, నాపర్వతములు మనోహర దృశ్యములై యొప్పును. ఇవి ప్రకృతిసహజములగు నుపమానములు. ఈ యుపమానములయందలి సహజ సౌందర్య గాంభీర్యములచే వర్ణనీయ వస్తువున కుదాత్తత సిద్ధించుటయేకాక, యందలి బీభత్సమును మరుగు పడినది.

సైంధవనధనాటియుద్ధమున నర్జునుఁడుగావించిన వీరవిహారమును వర్ణించుచుఁ, దిక్కన యద్భుతరసమును బోషించిన విధానమును, నిట్లే యతని కవితాశిల్పమును బ్రకటించుచున్నది. సైంధవవధోద్యోగమున నెడ తెఱపిలేక, యుద్ధనిమగ్నుఁడైయుండిన యర్జునుని రథాశ్వముల దేహములం దలుగు లసంఖ్యాకములుగఁ గ్రుచ్చుకొన్నవి. ఆకారణమున నవి యుద్ధమునఁ జక్కఁగఁ బ్రవర్తింపలేవని కృష్ణుఁడు చెప్ప, నర్జునుఁడు రథావతరణముంగావించి, పాదచారియై, నిలిచి గాండీవగుణంబు సారించి నాఁడు. కృష్ణుఁ డశ్వములను బరామర్శించుచుండఁ, గౌరవసైన్యము లొక్కమ్మడిగా విరథుఁడైయున్న యర్జును నాక్రమించినవి. అర్జునుఁ డీ సమయమునఁ బ్రదర్శించిన యస్త్రకౌశలమును, నసాధారణములగు నాత్మవిశ్వాస గాంభీర్య శౌర్యములును, నద్భుతావహములు, దివ్యములు.

".....బీభత్స రౌద్ర మహాద్భుతములు
మూర్తిమంతంబులుగ మనమొనలు రక్త
మాంసమేదోస్థిమస్తిష్కమయతఁ జూడ
ఘోరరూపంబులై పరిక్షోభమొందె."

ఇవ్విధంబునం గురుసేనం గనుపుకొట్టి నవ్వుచున్న కవ్వడిం గనుంగొని, కమలనాభుండు,

"పెఱికితి నలుగులు మేనులు
నెఱిఁబడ నెల్లెడలఁ గలయ నివిరితి హరు లి
త్తఱి నీళ్ళులుద్రావక తె
ప్పిఱి పెట్లొకో శత్రుసైన్యభీకరమూ ర్తీ."

అనవుడుఁ గన్నుల నగి యర్జునుండు "గల విపె యనుచుఁ,"

"ధర దివ్యాస్త్రహతిం బగిల్చి కొల నుత్పాదించి వే దానికిన్
శరజాలంబుల నిల్లుఁగట్ట మనసైన్యంబుల్ వెఱంబొందఁ న
చ్చెరువందెన్ సురసంఘముల్ హరినుతించెం బొంగి యప్పార్థ భూ
వర మున్నిట్టివి నూడర్చ వినరు నెవ్వారుం ద్రిలోకంబులన్."

ఈ యలౌకిక సంఘటనను, దిక్కున యొకసీసపద్యమున నద్భు తావహ మగువిధమున, నర్జునునిమూ ర్తి దృగ్గోచరమగునట్లు, చిత్రించియున్నాడు.

"కురు సేన పైఁబడ్డ సరకు సేయక మంచు
విరియించు భానునివెరవు మెఱసి
యిది నడుగలనని యించుక గొంకక
తన ఘోటకంబులఁ దడవఁ బనిచి
కొల నక్కజంబుగ నలుగుల మొన ఘటి
యించి యమ్మల దాని కిల్లుఁగట్టి
సారథి లీల నశ్వముల కార్యముఁదీర్చు
నంతకు నవ్వుచు నవుల నిలిచి

గారవమునఁ దాను గానివాఁడునుబోలె
నరదమెక్కి నింక నడ్డపడఁగ
నలవియే పురారికైనను వీనిచేఁ
జచ్చువాఁడుగాక సైంధవుండు."

సారథియగు కృష్ణుఁడు విలాసముగ నశ్వములను గమనించుచుండ, నర్జునుఁడు 'నవ్వుచు నవుల నిలచియుండె' ననియుఁ, బిమ్మట 'తాను గాని వాఁడునుబోలె నరదమెక్కె' ననుటయు ముఖ్యముగ గమనింపఁదగినవి. ఈ మహాద్భుత కార్యములన్నియు నతనికి లీలలనుట, యతని చిఱు నవ్వు సూచించుచున్నది. అట్లే తా ప్రదర్శించిన దివ్యాస్త్రసామర్థ్యమతనికి సామాన్యమని 'తాను గానివాఁడును బోలె నరదమెక్కె' నను వాక్యము వ్యక్తముఁ జేయుచున్నది.

ద్రోణుఁ డొసంగిన పరాభేద్యమగు కవచమునుధరించి, గర్వముతో దుర్యోధనుఁడు తన్నుఁ డాకఁగా, నర్జునుఁ డాకవచ ప్రయోజనమును నిష్ఫల మొనర్చిన విధాన మత్యాశ్చర్యకరము.

"అన్నరుఁ డానృపు
తురఁగములను సూతుఁ దునిమివైచి
రథము నతికి యధికరయమునఁ దఱచుగ
నాఁకొఁ గరతలముల నారసనులు."

తఱచుగ బాణములను గరతలములయందు నాటుటచే దుర్యోధనుఁడు వికలహస్తుఁడైనాఁడు. యుద్ధమున నెట్టి క్లిష్టపరిస్థితియందును, నర్జునుఁడు కలతఁజెందక, సమయస్ఫూర్తితో వ్యవహరించుననుట కిది నిదర్శనము.

సైంధవునిశిరమును ద్రుంచియు, దానినిఁ గ్రిందఁబడనీయక, యంతరిక్షమునసే త్రిప్పుచు, నర్జునుఁడు యుద్ధమును సాగించిన విధానమును నిట్లే యద్భుతరసోత్పాదకముగ వర్ణితమైనది.

"పటుశరముల మోఁదికి డా
పటికిఁ బలపటికి నపరభాగమునకు ముం
దటికిఁ జదల నడపె సము
త్కటరయమున శిరముఁ గందుక క్రీడగతిన్."

అట్టియెడ శత్రువీరులు,

"నరుఁ బొదివి రతఁడు వారల
యురవడి వివిధాస్త్రతతుల నుమ్ముచు నింగిం
దిరుగ మును నడపుచుండెడు
శిరమును నేమఱక యుండెఁ జిత్రస్ఫురణన్."

దివ్యాంశసంభవుఁడగు నరుని యద్భుతచర్యల నీపద్యములు పునఃసృష్టికిఁ దెచ్చుచున్నవి. తిక్కనకవితాశిల్పమున కిదియొక నిదర్శనము.

భీకర పౌరుషప్రధానమగు యుద్ధరంగమునకుఁ గోమలతా లాలిత్య పధానమగు స్త్రీనిలాసము నాపాదించుట, తిక్కనరచనయందలి మఱి యొకవిశేషము.

"ధరణి నెత్తుటఁదోగి యాభరణకాయ
శస్త్రఖండజాలమ్ములఁ జాలనొప్పె
బలుచకాకుండఁ గుంకుమమలఁది పెక్కు
దెఱఁగు తొడవులు దొడిఁగిన తెఱవ వోలె."

రక్తముచేతడిసి, ఆభరణయుతదేహాఖండములతో నొప్పి, శస్త్రాస్త్ర ఖండములతోఁగూడి జుగుప్సావహమైయున్న యుద్ధభూమికిఁ, గాశ్మీరాంగరాగరంజితము, వివిధాభరణయుతము, నగు సుందరస్త్రీదేహముపమానము గావింపఁబడినది. అట్లే, శల్యపర్వమున నశ్వసైన్యవర్ణనకు శృంగారము నాపాదించియుండువిధము కడుహృద్యమై యున్నది.

"గతిబహుతాల సతుష్ఖురవిఘట్టిత మేదిని జీవితేశక
ల్పిత నఖరేఖలం జెలువుపెంపు వహించు పురంధ్రిబోల ను
ద్ధతముఖ బంధురాంగలలితంబులు నూర్జిత కింకిణీఝణ
త్కృతిపటు హేషలుం దగ నుదీర్ణములై నడచెం దురంగముల్."

గుజ్జుపుడెక్కల గుర్తులచేనొప్పు రణభూమిని, భర్తృకృత నఖక్షతశోభచే నొప్పు పురంధ్రితోఁ బోల్చినాఁడు తిక్కన. ఇందలి శృంగారలాలిత్యము హృదయంగమము. ధర్మజప్రయుక్తమగు "శక్తి" వక్షమును జొచ్చుకొనిపోగా, శల్యుఁడు కరద్వితయముసాచి, ధర్మజునిదిక్కు శిరంబుగ, వజ్రదారుణాహతిబడు భూరి భూధర మహత్తర శృంగముభంగి, భూమిపైఁ బడినాఁడు. అట్లుపడిన శల్యునివర్ణన మతియొక చక్కని యుదాహరణ.

"భూమిమీద నిట్టు బోరగిలంబడి
ముద్రనాథుఁడొప్పె మానవేంద్ర
లేమయురమునందు లీలమై వ్రాలిన
ప్రాణనాథుఁ బోల్పుఁ బట్టుగాఁగ."

శల్యుఁడు క్షత్రియుడగుట భూమిపతియగును. కనుక భూమిపై నట్లు బోరగిలంబడిన శల్యుని, సతియురమున విలాసముగ వ్రాలిన ప్రాణనాథునితోఁ బోల్చుటయందలి సరసత, యౌచితి, గమనింపఁదగినవి. 'ప్రియుఁడగుభర్త' యను విశేషార్థముగల 'ప్రాణనాథ' శబ్దమిందు నుష్ణప్రయుక్తమై, యర్థగౌరవమునకు హేతువగుచున్నది. విషయములగు లలిత శృంగార, భీషణమృత్యువు, లిందు రసవత్తరముగ సంఘటింపఁ బడియున్నవి.

ద్రోణపర్వాంత్యభాగమున, సైనికులు రాత్రి యంతయు యుద్ధము జేసి, శ్రాంతులై యుండుటం గాంచి, యర్జునుఁ డిరువాగు నుద్దేశించి, చంద్రోదయమగువఱకును నిద్రించి, పిమ్మటఁ, బోరనగుననిపల్కగా నెల్లవారును నతని దయా స్వభావమును గీర్తించుచు నిద్రవోయిరి అసమయమున నుభయబలంబులయందును,

"తరుణుల కుచములపై రతి
పరవశులై యెరగు పతులపగిది సమరసం
భరిత శ్రమమున నిద్రించిరి
కరికుంభములఁ జెంది చెన్నుగ జోదుల్."

రతిపారవశ్యపరిశ్రాంతిచేఁ దరుణుల కుచసీమలపైఁ జొక్కినపతులు, యుద్ధశ్రమమున శ్రాంతులై, యేనుఁగుల కుంభస్థలములపై నొరగిన యోధుల కుపమానము. ఏనుఁగుల కుంభస్థలమును దరుణీకుచసీమతోఁ బోల్చుట, కవిసమయము. ఉపమానోపమేయములకు సమగ్రమగు నంగాంగభావసామరస్య మొప్పినది.

బీభత్స ప్రధానమగు రణరంగవర్ణనను గావించుచో రమణీయములగు సదృశవస్తువుల వర్ణనాసాహాయ్యమున జుగుప్సను మరుగుపఱచుట తిక్కన యనుసరించిన మఱియొక రచనావిశేషము.

"నెత్తుటదోగియు నిగిడిపోరెడు వీరు
లలరిన నడమోదుగుల విధంబు
గ్రక్కునఁదెగిపడి కదలెడు బాహుదం
డములు మహాభుజంగములభంగి
యవని రక్తాక్తంబులైయున్నయట్టి బల్
దలలు కెందామరకొలనిపగిది
దఱచుగా నెఱిఁదప్ప నొఱఁగిన గజములు
కులిశ భగ్నాచల కులమునట్లు
దునిసి తొరగిన జోదుల తొడలు సామ
జముల కరములు నొండొంటి చందములు గ
నుంగొనఁగ వింతలగుటను సంగరాంగ
ణంబు రమణీయమును భీషణంబునయ్యె."

సంగరాంగణమును, రమణీయమును, భీషణమును, నగు విధమునఁ జిత్రించుటయే తిక్కన యుద్ధవర్ణనయందలి ముఖ్యమగు విశిష్టత. సంపూర్ణ సామ్యముగల సహజోపమానముల, నుచిత సన్నివేశముల యందుఁ బ్రయోగించు విశిష్టతలో, గాళిదాసునకెనవచ్చు తెలుఁగుకవి తిక్కన యొక్కఁడే. ఉదాహరణము లతని భారతభాగమున ననేకములు సర్వత్ర కాననగును.

దుశ్శాసనుని యమానుషమగు వధయు, కర్ణుచావును, సంజయునిచే విన్నధృతరాష్ట్రుఁడు తన హృదయావేదనను వెలిబుచ్చిన విధమట్టి సహజోపమానముతో నొప్పుచున్నది.

—"పడుచు లీకలూడ్చి పట్టి యూడెడు నట్టి
పులుఁగుచందమయ్యో దలఁప నా య
వస్థ యెందుఁజొచ్చువాఁడ నీయలమటఁ
దీర్ప నెవ్వరింక దిక్కుగలరు."

బాలురచేఁ జిక్కి, వినోదార్థము వారు తన యీక లొక్కటొక్కటిగ లాగివేసి సంతోషించుచుండఁగా, బాధపడుచుండు పక్షియవస్థ తనకుఁ బట్టినదని, ధృతరాష్ట్రుఁ డను చున్నాఁడు. పక్షియీఁకలు తద్ద్వేహాజన్యములు. అట్లే ధృతరాష్ట్రుని పుత్రపౌత్రాదులును, నతని తనూజు లగుదురు. వారొకరొకరు హతులగుచుండ, నతనికి మర్మభేదకమగు వేదన కలుగుచున్నది. ఈఁకలు పోయినపిమ్మట పక్షినిర్జీవ మగునట్లు, పుత్రనాశానంతరము ధృతరాష్ట్రుఁడును, జీవచ్ఛవమగుట నిక్కము. బాలురవినోదముచే పక్షికత్యంతము బాధకల్గుటయుఁ, బాండవకౌరవుల కలహముచే నంధుఁడు, నగతికుఁడు, నగు ధృతరాష్ట్రునకు దుర్భర వేదన కలుగుచుండుటయు సమానములు. ఇట్లీందలి యుపమానము సంపూర్ణార్థ పోషకమగుచున్నది.

ఈ ఘట్టమునఁ దిక్కున గావించిన చంద్రోదయవర్ణన, మూఁడు శతాబ్దుల యనంతరము పరిణతిఁగాంచిన ప్రబంధరీతి కుత్తమాదర్శమై యున్నది.

"నలువ చెందొవలరేకులకు నన్నువవెట్టఁ
గోరి కావించిన గుళ్ళికయనఁగ,
నఖిలద్విజ శ్రేష్ఠమగు చకోరచయంబు
తపము సముల్లస త్ఫలమనంగఁ
బూర్వ పయోరాశిపొంతఁ గెంజాయ చె
న్నొందవిన పవడంపుఁ బొద యనంగఁ
జిగురు జొంపము ననుజిగి యొప్ప నుదయాద్రిఁ
బొలుపారు నవకల్ప భూజ మనఁగ

నరుణరుచిఁ దనమండల మతిశయిల్ల
బొడిచి దివిఁబ్రాకి దీధితులడరఁజేసి
యంతకంతకు నెక్కుచు సంతమసముఁ
గాలుకొననీక చంద్రుఁడు గ్రాలె నధిప."

ప్రబంధముల ముఖ్యలక్షణము లగు భావనా మూలక వర్ణనా విశిష్టతకును, శబ్దప్రయోగ చాతుర్యమునకును, నీ పద్య మాదర్శమైనది.

ఇట్లు, యుద్ధవర్ణనలను బ్రశాంతసుందరములగు ప్రకృతిదృశ్యములతో సమన్వయింపఁజేసి, రచనకు మనోహరత్వము నాపాదించియున్న ఘట్టము లనేకము లిందుఁ గలవు.

రౌద్ర ప్రధానములగు సన్నివేశములను జిత్రించుపట్ల, నవి పాత్రకుల మనోవీధిని బ్రత్యక్షములగునట్లు గావించి, వారి నావేశపూరితులుగఁ జేయుట, యితని యుద్ధవర్ణనమం దెల్లెడలఁ గాననగు విశిష్టగుణము.

కౌరవ కులపాంసనుఁడగు దుశ్శాసను నాక్రమించి విజృంభించిన భీమసేనుని స్వరూపవర్ణన, యిందులకొక చక్కని నిదర్శనము. కులస్త్రీకిఁ గలిగిన యవాచ్యమగు నవమానము హేతువుగా జన్మించిన క్రోధాగ్ని, క్షాత్ర స్వరూపుఁడగు భీముని హృదయమున పదమూఁడేఁడులు కుమిలినది. భీమున కత్యంతముఁ బ్రియతమమగు నవకాశ మిప్పుడు లభించినది. "అక్కీచకారాతి బెబ్బులి లేడికొదమం బొదువుపోలిక దుశ్శాసనునిఁ బొదివి మెడద్రొక్కి వానితో నిట్లనియె."

"మును సభఁ బలికినదానం
దనివోవక యిచ్చటికిని వెదకివచ్చితి యే
మనియె దనుము నీమాటలు
వినుటకు నాకినుక సాల వేడ్కపడియెదున్."

అని యమ్మహాబలనందనుండు, మహోగ్రలోచనప్రభలు నిగుడ మన బలంబులం జూచిన,

"నిగుడు దవాగ్నిజ్వాలల
వెగడందిన మృగకులంబు విధమున నతిభీ
తి గదిరి నలుఁగడ విచ్చిన
జగతీశ్వర యతఁడు మెరసెఁ జక్కనిబయలన్."

"లీలం గేల నమర్చి మత్తగజకేళీసుందరోల్లాస మా
భీలత్వం బలరింపఁ ద్రిప్పుఁ జదలం బృథ్వీస్థలిన్ వైచు ముం
గాలంద్రోచు మొగంబువ్రేయు దెస లుగ్రస్ఫూర్తివీక్షించు మో
కాలూదుంబయిఁ గ్రమ్మరంగ మెడ చిక్కంద్రొక్కి నిల్చున్ నగున్."

ఇవ్విధంబున ఘోరవిహారంబుసలిపి, భీమవిక్రముండగు నా భీముం
డయ్యువరాజు నాననం బాలోకించి,

"ఏ నురమువచ్చి నెత్తురు
దేనియ యిదె త్రాఁవెదం గదిసి ననుఁ గడిమిన్
మానుప దిక్కుఁగలిగిన
వ్రాని మ్మెలిఁగింపు మీ మొనంగలవారిన్."

అని పెలుచంబలికి, కఠారంబుఁ జెరికి, యతని మొగంబుమీఁద జల్లింపి,

"నరసింహుండను రేంద్రువచ్చుకరణిన్ రౌద్రంబుదగ్రంబుగా
నురమత్యుగ్రతఁ జీరి క్రమ్మురుధిరమ్ములొల్లాసిమై దోసిటఁ
బెరవారంగొని త్రావు మెచ్చుఁజవికిన్ మేనున్ మొగంబున్ భయం
కరరేఖం బొరయంగఁ జల్లికొను నక్కారవ్యుఁ జూచున్ బొరిన్."

భీకర క్రోధాగ్ని స్వరూపమే యిందుఁ బ్రత్యక్షమైనది. భార్యకుఁగలిగిన పరిభవముచేఁ బురుషునిహృదయ మెట్టి భీషణ పరివర్తనమును గాంచు నదియు, ప్రతీకారావకాశము లభించినప్పు డతని ప్రకృతి యెట్టి యుగ్రస్వరూపమును దాల్చునదియు నిందుఁ బ్రత్యక్షమైనవి.

మహాబలనందనుఁ డను ప్రయోగ మిం దర్థపోషకమైయున్నది. మహా బలుఁడు, ప్రభంజనుఁడు. అతఁ డప్రతిహతమగు విజృంభణముతో నొప్పు వాఁడు. కనుక నతనికుమారుఁడగు భీమునిప్రయత్నమును నప్రతిహత ముగ జరుగుననియు, నెవ్వరు నితనిఁదాటి కెదురుగ నిలువలేరనియు, ధ్వని. అట్లే, 'మహోగ్రలోచనప్రభలు నిగుడ మనబలంబులం జూచిన' యనుటలో నర్థవిశేషముకలదు. ఫాలనేత్రమును దెఱచి, సృష్టిని లయిం పఁజేయు త్రినేత్రుఁ డుగ్రుఁడు అతని వీక్షణములు దుర్నిరీక్ష్యములు, లోక దాహకములు. కనుక, క్రోధావేశమునఁ గన్నుల నిప్పులుఁ దాల్చ్చి, భీముని వీక్షణములంగని, దవాగ్నిజ్వాలల వెగడందిన మృగకులమువలె భీతిల్లి, కౌరవసైన్యము చెల్లాచెదరగుట యెంతయు సమంజసముగ నున్నది.

కారవసైన్యము పొందిన యీ దైన్యము, భీముని యుగ్ర స్వరూప మెట్టిదో వ్యక్తపఱచుచున్నది.

"అని యెలుఁగెత్తిపల్కి నలినాఁడు మహోద్ధతిఁద్రుళ్ళు నార్చుఁ బె
ల్చిన భుజమప్పళించుఁ దమసైనికులుఁ మనవారు రక్కసుం
డని వెఱఁగందువారు గళితాయుధు లయ్యెడువారు భీతిమూ
ర్ఛను బడువారునై రణవిరామముఁబొంద మదోత్కటాకృతిన్."

ఇట్లమానుషమగు విధమునఁ బ్రతిజ్ఞ నిర్వహించియుఁ, గోపము శాంతిం పక, దుస్సహేనుఁ గనుంగొని, భీముఁడు పల్కిన వాక్యములు గమనింపఁ దగినవి.

"ప్రేవడిపోయెఁగాక ధృతరాష్ట్రుఁడు గన్నదియేమి యాసభం
దా వలదన్నఁ గీడుగదా పతి లేడనబడ్డకాంత నేఁ
డీవుగనుంగొనంగఁ బతియేడ్తెరనొప్పెఁ బతుల్ విజృంభిత
శ్రీవిలసిల్లు కామినులు నేడ్పడి రిట్లపతిత్వ దీనతన్."

కులకాంతకు జరిగిన యవాచ్యమగు పరిభవ మెట్టి ఘోరపరిణామమును దెచ్చినదియుఁ బాఠకుల కన్నులకుఁగట్టినట్లు చిత్రించి, తిక్కన లౌకిక మగు నీతిని వ్యంగ్యార్థశక్తిచే బోషించియున్నాఁడు. ఇట్టిదే మఱియొక సన్నివేశము సౌప్తిక పర్వమునఁ జిత్రితమైనది. నిరాయుధుఁడగు ద్రోణుని శిరోజములఁబట్టి, కంఠము నరకిన ధృష్టద్యుమ్ను, నశ్వత్థామ వధించుట యిట్టిది. భీముఁడు ప్రతిజ్ఞానిర్వహణార్థము రాక్షసరూపమును బూనెనేకాని రాక్షసుఁడు కాలేదు. రక్తమును బెదవిని చేర్చెనే కాని యాస్వాదింపలేదు. సుక్షత్రియ వీరుఁడగుట నధర్మ యుద్ధమునకుఁ గడంగలేదు. అశ్వత్థామ యట్లుకాదు. దుర్యోధనుని దుఃస్థితిఁగాంచిన యశ్వత్థామ హృదయమునఁ బితృవధ జనితామర్ష మొక్కమ్మడి

ప్రజ్వరిల్లినది. కర్ణదుర్యోధనుల పాపకృత్యములను నిర్దాక్షిణ్యముగ వారియెమట నుగ్గడించిన నైతిక స్థైర్యము కలవాఁడు, తండ్రిని మించిన వీరుఁడు, మీదుమిక్కిలి బ్రాహ్మణుఁడు, క్రోధావేశవివశుఁడై, క్రూర రాక్షసుఁడుగఁ బరివర్తన మొందినాఁడు. నిద్రాసక్తమగు పాండవశిబిరముఁ బ్రవేశించి, తానెట్లు ధృష్టద్యుమ్ననిఁ జంపఁ బోవునదియు, ముందు గనే కృపకృతవర్మలకు వర్ణించి చెప్పినాఁడు.

"ధృష్టద్యుమ్ను ని ముట్టిపట్టుదు మదోద్రేకంబడంగింతు ను
త్కృష్టాస్త్రంబులఁ జంప నల్క- పశుభంగిం జంపినంగాని పో
దిష్టావాప్తియనంగ నా కిదియె భూయిష్ఠంబు గాంతేయులన్
గష్టస్వైరవిధాభియోగమృతులం గావింతు నుగ్రాకృతిన్."

'పశువును జంపిన విధమునఁ జంపిననేకాని కోపముపోదు. ఉత్తమాస్త్రములచేఁ జంపను,' అను పల్క-లవలన నశ్వత్థామ యెట్టి యున్మదావస్థకు లోనైనదియు వ్యక్తమగుచున్నది. పాన్పున నూఁబడి నిద్రవోవు ధృష్టద్యుమ్ననిఁ దలపట్టికొని, పెడమరలదిగిచి, యబ్బలియుండు,

"నేలపయిం బడందిగిచి నిష్ఠురభంగి నురస్థలంబు మ్రో
కాల నొగిల్చి యేపున మొగం బతిదారుణముష్టినొంచె ని
ద్రాలసవృత్తి నంగములయందుఁ బలంబును బుద్ధినేర్పునుం
జాలని యవ్విరోధి వివశత్వముఁ బొందఁగఁజేసె వ్రేల్మిడిన్."

"కాలను గేలనుం జదిపి గంధకరిం దెగటార్చు సింహముం
బోలుచుఁ బేర్చి యాద్రుపదభూపసుతున్ సమయించె వేదనన్
ఓలగ రోజగా బలుమరుం బొరలంబడి లాలఁగ్రక్క- న
వ్వాలుమగండు వాక్పరిభవంబుఁ దలంచుచుఁ గ్రౌర్యధుర్యుఁడై."

ఇట్లు గురువధకారియగు ధృష్టద్యుమ్ననిఁ జంపుటయేకాక,

"నిద్రాసక్తునిఁ గొంతమేల్కనినవానిఁ సుప్రబుద్ధాత్మునిఁ జై
యుద్రేకంబును శౌర్యసారమును బాహూల్లాసముం జూపఁ జం
చద్రేఖం దిరమైనవానిఁ దను నుత్సాహోగ్రతం దాకి యు
న్నిద్రస్వైరసముద్ధతిఁ మెఱయువానిం దున్మె నేకాకృతిఁ."

దుశ్శాసనునివధతో భీముని క్రోధాగ్ని యుపశమించినది. కాని ధృష్ట
ద్యుమ్ననివధతో సశ్వత్థామయావేశ ముపశమించినదికాదు. నిద్రా
సక్తులైయున్న పాంచాలరాజకుమారుల నందఱ నదయుఁడై వధించి
నను నతనికిఁ దృప్తి లేదు. ఆతనిక్రౌర్యమునకు గజతురఁగాది పశువులు
కూడ నాహుతి కావలసివచ్చినది.

"కొన్నిఁటిపాదముల్ నఱకుఁ గొన్నిఁటిమోరలు సెక్కు లీలమైఁ
గొన్నిఁటికంఠముల్ దునుముఁ గొన్నిఁటివీపులు వ్రచ్చు నుబ్బునం
గొన్నిఁటి సర్వగాత్రములు క్రూరవిచేష్టితవిభ్రమంబుఁదోఁ
పన్నుఱుమాడుఁ బ్రౌఢబలభాసితభూరిభుజావిహారుఁడై."

జగంబులుగొనికాలిన కాలాగ్నియుంబోలె పాండవశిబిరంబు నిరవశేషం
బుగా సఘయించి, చాపాచార్యనందనుండు మే నెత్తుటజొత్తిల్లి మో
హాంధ్యంబుతోఁ గలసియునికింజేసి, సాంద్రతర రక్తసిక్తంబులైన బాహు
ఖడ్గంబు లేకద్రవ్యంబు చందంబునొంద, మఱలి తానుబ్రవేశించు తఱి
నెట్లుండె నట్ల సిశ్శబ్దంబైన యవ్విడిదల వెడలుచుండఁ దెలతెలవేఁగ.

ఇట్లు రాక్షసావేశంబునంజేసి నీచపరాక్రమంబాచరించిన యశ్వత్థామ
యందుఁ గ్రోధావేశజన్యమగు నున్మదావస్థను దిక్కన ప్రదర్శించి
యున్నాఁడు. ప్రతీకారకాంక్ష, ధర్మాధర్మములు, నుచితానుచిత
ములు, అను వివేచనను నశింపఁజేసి, దయాదాక్షిణ్యములను బోఁగొట్టు
నను బ్రకృతితత్త్వ మిందుఁ బ్రత్యక్షీకరింపఁ బడినది. రౌద్రబీభత్స

ముల నింతటి తేలికమాటలతో, నుత్ప్రేక్షాదుల నేమాత్రమును స్పృశింపక మానవ ప్రకృతికి సహజమగు విధమునఁ బోషించుట కవిబ్రహ్మకే చెల్లినది.

ఒకేవిధమగు సన్నివేశములందు భిన్నవ్యక్తుల ప్రవర్తన, వారి శీల స్వభావాదుల ననుసరించియుండు, నను బ్రకృతి సత్యము, భీమాశ్వత్థామల ప్రవర్తనలయందుఁ జక్కఁగ వ్యక్తపఱచినాఁడు తిక్కన. భీమునకు సందర్భోచితమగు నౌద్ధత్యావేశములతోఁబాటు ఆత్మనిగ్రహమునుఁ గలదు. ఇట్టి ప్రతీకారావసరము నిరీక్షించు నర్జునునిప్రవృత్తి తిక్కనచే నెట్లు పోషిత మైనదియు గమనింతము. భీము నవమాన వాక్యములు పల్కిన కర్ణు నుద్దేశించి యర్జునుఁడు,

"ఏమిరకర్ణ భీము నటు లేటికిఁ దిట్టి తతండు దోల సి
గ్గేమియు లేక పాఱునెడ నెవ్వరు తిట్టిరి నిన్ను గెల్పు సం
గ్రామములోనఁ దప్పిదముఁ గల్గినయంతన నింతగర్వ మే
లా మును ని న్నెఱుంగమె చలంబున సాత్యకి యిట్లు గెల్వఁడే."

"గెలుపును నోటమియు ననిఁ
గలుఁగవె యెడ పెట్టి యెట్టి ఘనులకు నిమ్మో
బలుకుదురే తగువారిం
దులువా నీ కులము గుణముఁ దోచెం బ్రజకున్."

"ఇంతవట్టును వెలారింతు, నీ మాటలు మరువకుండు మిదియుంగాక నా యసన్నిధి నధర్మంబున నభిమన్యువిల్లు దునిమితివి. దానికి నీవుఁ గనుం గొనుచుండ, ధర్మప్రకారంబున వృషసేను తలఁ దునుముదు," అని ప్రతిజ్ఞఁగావించి, యట్లే రెండురోజుల యుద్ధమైన పిమ్మట నవకాశము లభింపఁగా, నతఁడు వృషసేనునిఁ జంపినవిధ మతని ప్రశాంతస్థైర్యమును, నాత్మవిశ్వాస నిగ్రహములను వ్యక్తపఱచుచున్నది.

"భ్రుకుటిస్ఫూర్జిత ఫాలభాగుఁడగుచుం బొంగారి యాసూత పౌ
త్రకు కోదండము బావహిదండములుఁ జిత్రస్ఫూర్తిఁ దున్మాడి మ
స్తక ముగ్రోద్ధతిఁ గ్రూరభల్ల విలసద్ధారాహతిం ద్రుంచె బా
ణకళాదుర్దమునుఁ డన్నరుండు పతియు న్రాధేయుఁడుం జూడఁగన్."

కులధర్మమగు క్షాత్రధర్మనిర్వహణము క్షత్రియవీరుని జీవితమున దినచర్య యగుటచే సాధారణముగ నతఁ డాత్మనిగ్రహమును గోలోనిఁడు. బ్రాహ్మణునకు క్షాత్రము సహజ సిద్ధమగు స్వభావముగామి, యతఁ డావేశమునకు వశుఁడై, మితిమీరి ప్రవర్తించు ననుట యశ్వత్థామయందు వ్యక్తము. అశ్వత్థామ, ప్రాణభయమున వర్జితవిఁ కుఁడై, బ్రహ్మశిరోనామ కాస్త్రముఁ బ్రయోగించి, వ్యాసాదులు ప్రార్థించినను నుపసంహరింపలేక పోవుటయుఁ, బాండవేయ రాగపాత్ర గర్భములను విధ్వంసముఁ గావించి తీరుదునని పట్టుపట్టుటయు నతని యనుచిత క్రౌర్యమును వ్యక్తపఱచుచున్నవి. అట్టి నీచకర్మకుఁ బూనిన యబ్బాలభూతిని బ్రాణములతో విడిచిపుచ్చుటలో, భీమార్జునుల క్షమా గుణమును వ్యక్తమైనది.

పద్మవ్యూహ యుద్ధమునఁ, గర్ణాదివీరులెల్లరును నభిమన్యునిచే నోడింపఁబడినవారయ్యును, మరల మరల వచ్చి సాహసముతోఁ బోరిరే కాని, యధర్మయుద్ధమునకుఁ దామై పూనుకొనలేదు. ఆవేశమునకు లోనైన ద్రోణుఁడే యభిమన్యువధకుఁ గారణ భూతుఁడైనాఁడు. కనుకనే ధర్మజుఁడు "ఆద్రోహికి నిన్నయు నేఁడును దోడ్పడిన ద్రోణుం దెగ టార్పవలయు," నని సంకల్పించినాఁడు. ద్రోణుని దునిమిన ధృష్ట ద్యుమ్ను నర్జునుఁడు దూరగా ధర్మజుఁ డిచ్చిన ప్రత్యుత్తరము గమనింపఁదగినది.

"ఆసభఁ బాంచాలి గాసిసేయఁగ నుపే
క్షకుఁడయి చూచే బెక్కండ్రఁ గూర్చి

"నొని బాలు నభిమన్యుఁ గూల్చె నించుకవడి
యాగిన నర్జునుఁ డగ్నిఁజొచ్చు
ననువగ మనల నాతనికిఁ దోడ్పడఁబోవ
నీ కాగె నమ్మెయి నిట్టి ధర్మ
పరుఁడైన కలశసంభవుతోడ సరివచ్చుటుచితంబె."

ఇందు ద్రోణుని యధర్మపరత్వమును, ననుచిత క్రౌర్యమును నుగ్గడించి, ధర్మజుఁడు, "ఇట్టి ధర్మపరుఁడైన కలశసంభవుతోడ సరివచ్చుటుచితంబె" యని, కాకుస్వరముచే స్వాభిప్రాయమును వెలిబుచ్చియున్నాఁడు.

ఇట్లాయా సన్నివేశ సందర్భములఁ బురస్కరించుకొని భిన్న మానవ మానసిక ప్రకృతులను, లోక సహజమగు విధమునఁ బ్రదర్శించుచుఁ, దిక్కన, ఘోరరణరంగము నొక నాటకరంగముగ మార్చియున్నాఁడు. ఇట్టి నాటక ఘక్కి కనుకూలించు సహజ సంభాషణాదులు పాత్రలస్వభావములను, హృదయగత భావావేశ, భావశబలతలను, వ్యక్తీకరించుచుఁ దత్తత్సమయోచితములగు కరుణాదిరసములను బోషించుచున్నవి.

భీష్ముని, జంపు నుపాయమును గూర్చి ధర్మజాదులు చింతించు ఘట్టమట్టి విశిష్ట రచనలలో నొకటి.

"అకట తండ్రిసచ్చినంతనుండియు మము
నరసి ప్రోచినట్టి యనుఁగుఁదాతఁ
జంప మదిఁదలంచు తెంపుసూచితె రాజ
ధర్మ మింత క్రూరకర్మమగునె."

అను ధర్మజునిపల్కు లాతని మానసికాందోళనమును వ్యక్తపఱచుచున్నవి. తన్నుఁ జంపునుపాయమును దానే తెలిపి తత్ప్రయత్నము తన

యాజ్ఞగా నిర్వర్తింపవలసినదని భీష్ముఁడు పాండవులకుఁ జెప్పిపంపఁగా, నర్జునుఁడు చింతించిన విధము నతి లలితముగఁ దిక్కన పోషించినాఁడు.

"గురునిఁ గృతప్రజ్ఞుని ధ
ర్మరతు వయోవృద్ధు లోకపూన్యు దయాళున్
సురతటినీసుతు వంచనఁ
బురుషోత్తమ చంప బుద్ధి పుట్టదు నాకున్."

ఈపద్యమునఁ బ్రతిశబ్దమును నర్థగౌరవమున నొప్పియుండుటయేకాక యొక క్రమముననుసరించి ప్రయుక్తములై యున్నవి. సురతటినీసుతుఁ డగుటవలన దివ్యుఁడగుటయేకాక, పూర్వోక్తములగు విశేషణముల కారణమునఁ బూజనీయుఁడైన భీష్ముని జంపుట కర్జునుఁడు వెనుదీయుట సహజమే. అందును వంచన నుపయోగించుట అర్జునుని ప్రకృతికే విరుద్ధము. అదికాక భీష్మునియందలి గురుత్వ కృతప్రజ్ఞత్వాది లక్షణము లన్నియు నాతని మహత్వమునకును నర్జునుని సంకోచమునకును, బల వత్తరములగు హేతువులగుచున్నవి. వానిలోఁ బ్రతియొక్కటియు, భీష్మఁ డవధ్యుఁడనుటకుఁ గారణమగును. కావుననే యర్జునుఁడు,

"నన్నుఁ బొంసుకేలినున్న నర్మిలి యెత్తి
మేనిధూళి తనదు మేను వొరయఁ
బ్రీతిఁ గౌఁగిలించి మాతండ్రి గుణము ల
గ్గించి కన్ను నీరు నించు నతఁడు."

"అక్కట తండ్రిలేని మము నమ్మొయిఁ బెంచినతాత నిమ్మొయిం
ద్రెక్కొనఁగా దతండు సముదీర్ణ భుజాబలశౌర్యశాలియై
యిక్కడిసేనఁ జక్కడిచెనేనియుఁ జూతున కాక ధర్మముం
దక్కుట కోర్వఁడాలుదునె ధర్మజుతమ్ములు క్రూరకర్మలే."

అని వాపోయియున్నాఁడు. ఈ రచన యర్జునుని హృదయ మార్ద వము తోఁ బాటతని బంధుభావము, ధర్మపరత్వము, మున్నగు సహజ గుణములను బాఠకులకు హృదయగోచర మొనర్చుచున్నది.

శిఖండిని బురస్కరించుకొని, యర్జునాదులు భీష్మునిపై గవిసినప్పుడు, భావిని సూచించుచు, ద్రోణుని మనస్సనిర్వచనీయమగు కల వరమునకు లోనైనది.

"తడఁబడె దివ్యబాణముల తంత్రము మంత్రము దప్పెడుం గడున్
వడఁకెడుఁ జాపదండము మనంబును నాకు వశంబుఁగాదు వీ
డ్వడియెడుఁ జెయ్వు లంగము గడంకఁ దొఱంగెడు నేటిభంగి గ
వ్వడి తన పూనికదీర్చుట ధ్రువంబని బుద్ధి జనించెఁ బుత్రకా."

అభిమన్యు మరణమును గూర్చి ధర్మజాదులు విలపించుట కూడ, నిట్టి రస వత్తరములగు రచనలలో నొకటి. పద్మవ్యూహమును భేదింపుమని యభి మన్యునిఁ బంపిన ధర్మజుఁ డతనిమరణమున కెట్లువిలపించెనో చూడుఁడు.

"కొడుకుఁ బొడఁగాన కర్జునుఁ డడిగెనేని
వానితో నింక నేమనువాఁడ హరికి
నతని గారాబు చెలియలి కధికదుఃఖ
మేన చేసితి వగవంగ నేమి గలదు."

"కుడువను గట్టను బూయను
తొడువను బోఁబనిచిగాక తొలుత మొన సొరం
గొడుకుం బనుచుట కెవ్వఁడు
గడఁగునె నాయట్టి పాపకర్ముఁడు దక్కన్."

"వానితోడిద లోకమై యేనుఁ బోవ
నైతిఁబో గన్న పుత్రశోకాతురత్వ

మున నితాంత వివర్ణతఁ బొందుచుండఁ
జూడకుండెడివాఁడ నర్జునుమొగంబు."

అభిమన్యుని వ్యూహప్రవేశమునకుఁ దాను గారకుఁడగుటచే ధర్మజుని హృదయ మెట్లు క్రుంగిపోవుచుండునదియు నీపద్యములు సువ్యక్తముఁ జేయుచున్నవి. తమ్ముల కష్టపరంపరలకు, భారతయుద్ధమునకుఁ, దన తప్పిదమే కారణమని ఖిన్నుఁడై, మనసుననే పరితపించుచున్న ధర్మజుఁ డీ యనర్థముచే నెట్టి యావేదనను బొందుచున్నదియుఁ, దిక్కున తన రచనాదర్పణమునఁ బ్రతిబింబింపఁ జేసినాఁడు.

అర్జునుఁడు శిబిరంబునకు వచ్చునెడ, దుర్నిమిత్తంబులం గని కృష్ణునితో జెప్పుట, యిట్టి సన్ని వేశములలో మఱియొకటి.

"కలయఁగ దుర్నిమిత్తములు గానఁగనయ్యె మదీయ చిత్తముఁ
గలఁగెడు మేను ప్రాణుపడఁగాఁదొడఁగెఁ గురుఁ డారయంగఁ గే
వలుఁడే నృపాలుఁ డేదెసకు వచ్చెనొ,"

"సైనికులు నన్ను గనుగొని
ఆననములువంచి తొలఁగి యరిగెద రదియే
మో నేఁడు వేణువీణా
గాన స్వనములు వీటఁ గలుగవు కృష్ణా."

"ఈ మేలు ప్రజకొనర్చిన
యా మహిమకు నెలవు గొంతి యగ్రతనయుఁడో
భీముఁడొకొ తమ్ములగుట్టలో
కో మఱి యెవ్వఁడొకొ తలఁపు గొలఁదికి మాఱెన్."

"అఱుమొగముతోడ నభిమన్యుఁ డేలొకో
యెదురురాఁడు నాకు నెట్టివార్త

చెవులు సోఁకు నొక్కొ చేవెట్టి కలఁచిన
భంగిఁ ద్రిప్పికొనఁ దొడంగె మనము."

అను నర్జునుని పల్కులలో కరుణరస మెంతయు స్వాభావికమగు రీతిని బోషితమైయున్నది. ఎట్టిసమయమునను బ్రశాంతతను గోల్పోవని ధీరుఁడు, గంభీర గుణప్రధానుఁడు నగు నర్జునుఁడు పుత్రశోకావేశమునఁ బలవించిన విధమును వర్ణించుటలోఁ, దిక్కన, వాత్సల్య మోహాదులకు లోనైన పితృస్వరూపమును జిత్రించి యున్నాఁడు.

"అక్కట మంద భాగ్యునకు నట్టి తనూభవరత్న మెవ్విధిన్
దక్కఁ విధాతనిర్దయుఁ డొడంబడునే కడుమేలివస్తువుల్
పెక్కు దినంబులున్కి యరిబృందము పిల్చినఁ బోటుబంటునై
యక్కడ కేల పోయితి మహా గుణభూషణుఁ గోలుపోయితిన్."

"పిన్ననగవుతోడ జెన్నెసలారు సౌ
భద్రు మొగము సూడఁ బడయకున్న
వాఁడ నామనంబు వ్రయ్యలై పో దిది
ఖాతఁజేసినది యొకో తలంప."

చిఱునగవుతోఁ గూడిన యభిమన్యు ముఖ మర్జునునకు సుభద్రాముఖ సంస్మృతిని గలగించునను భావము, 'సౌభద్రు మొగము' అను ప్రయోగ ముచే ధ్వనితము. ఇట్లు, కొడుకును దలంచుకొను కొలఁది తండ్రియావేశ మును నధికమైనది. తన కుమారుని రక్షింపలేని ధర్మజభీమాదుల నంద ఱిని దుఃఖ జనితములగు వాగ్బాణములకు గుఱిఁజేసినాఁడు.

"మిమ్మును బొంచాలురఁ గడు
నమ్మిచెడితి వానిరక్షణమ్మున బ్రౌఢ
త్వ మ్మట్లు లేమి యొఱిఁగిన
నెమ్మోయిఁ గాచికొననేరనే యబ్బాలున్."

"ఉక్కును నస్త్రబలము మీ
కెక్కడియది సాలనై తిరిందఱు నని న
య్యొక్కరుఁ గావఁగ మీరీ
తక్కువకోర్చితిరి మిమ్ము దక్కననేలా."

"బలహీనులు సంగరభీ
తులునగు మిమ్మెఱిఁగి యెఱిఁగి తొలఁగి తనూజుం
దలపఁక యొంటి మెలఁగు వెం
గలి నగు నను దూఱుకొందుఁగాక నేమందుఁ."

"మానినులువోలె నున్నార లేను లేని
తటి మహాగుణశాలి నాతనయుఁ గాఁచి
కొనఁ గడంగర సింగారమునకుఁ గాక
మఱువులును నైదువులు మీకు మానమునకె."

అట్లు భంగించి, యూర్పులు సందడింప, మొగంబు బిగువాఱం, గ్రోధ శోకంబులు మనంబునఁ బెనంగొనం, గన్నీరొలుక మారకున్న, నెల్ల వారు నతనికి మారుపలుకను, దేటిచూడను వెఱచియుండిరి. లోక మునఁ బుత్రశోకము తండ్రులచే దైవమునే తిట్టించుచుండ, నర్జునుఁ డన్నలను నిందించుటలో నాశ్చర్యమేమి. రాగ శోకముల ప్రాబల్య మట్టిది. తదావేశ ప్రాబల్యమునఁ బల్కిన మాటల కర్థమును నుండదు; వాని కెవ్వరను సమాధానమును జెప్పరు. ప్రతివచనమును, ననునయ మును, శోకావేశమును వృద్ధిపఱచునే కాని తగ్గింపవనుట లోక సహజ మగు విషయము. పుత్రుఁడు లేమి, సుభద్రకు లోకమెల్ల పాడిల్లును వోలె నున్నది. శూరాగ్రేసరుఁడగు నర్జునుఁడు, ధర్మజ భీమ పాంచా లాదులను నిందించిన విధమును, సాధ్వీమణియగు సుభద్ర యత్తింటి

వారినిఁ బుట్టినింటివారినిఁ బల్కిన విధమును గమనించినచోఁ, దిక్కిన పాత్రల శీలపోషణమునఁ బాటించిన యౌచిత్యము విదితమగును.

"అనిలజు నుక్కు లావు గలఁడందురు సాత్యకి శౌర్యశాలి నాఁ
జను ద్రుపదుండు సంగరవిశారద భావము వ్యూనియుండు మా
త్స్యునిఁ బటువిక్రమాఢ్యుఁడని చూతురు పాండవు లిందఱుండి యొ
క్కనికిఁ గడంగలేర నినుగావఁగ నేమననేర్తుఁ బుత్రకా."

సుభద్రవాక్యములు వ్యంగ్యార్థస్ఫురణచే నర్జునుని వాక్యముల కంటెను దీక్ష్ణతరములై, భీమాదుల యంతరంగములను దూసికొని పోవుచున్నవి. ఆవేశపూరితములగు నర్జునుని వాక్యములందు నింద వాచ్యముగను, గభీరములగు సుభద్రవాక్యములలో వ్యంగ్యముగను బోషితమైనది. స్త్రీల వాక్కుల స్వభావమే యట్టిది. పుత్రశోకాతురయైన సుభద్రను గృష్ణుఁ డూరార్చుచు,

"తగుమాటలాడి కోడలి
వగపుడుపును నీవు ధైర్యవతి వి ట్లుడలం
దగునె నిను జూచి కాదే
మగుడుం జిత్తమునవగలు మాకందఱికున్."

అని పల్కినాఁడు. కాని గర్భశోకమున కూఱటయెక్కడ! కావుననే సుభద్ర,

"అకట యుత్తర యొప్పెడునది మనంబు
దీనికెంతయు మెత్తన యేను నిన్ను
వేడికొనియెద వచ్చి యివ్వేలఁది వంతఁ
దీపి తళుకొత్తు పలుకులఁ దేర్పవన్న."

అని కృష్ణునిఁ బ్రార్థించినది.

ఇట్టిదే మఱియొక సన్నివేశము సౌప్తికపర్వమునఁ గలదు. అశ్వత్థామచే నిహతులైన కుమారులఁ గూర్చి విలపించు ద్రౌపదిని దయనీయస్వరూపనుగఁ జిత్రించినాఁడు తిక్కన —

"పెనుమంచునఁ జెలువేదిన
వనజంబునుఁ బోలె నశ్రువారిపరీతా
ననము చెలువెడలఁ గొడుకులఁ
బనువుచుఁ జరణములు త్రొక్కునడ దీనగతిన్."

"అలఁత గదిరి నోరెండఁగ
బలవించుచుఁ దోడుతోడ బాష్పజలం బ
గ్గలమై క్రమ్మఁగ సొలయుచుఁ
దెలియుచు నతనికి నడలు దీపింపంగన్."

అమ్మగువ యమ్మహీపతి యాననం బాలోకించి,

"కలిమికి నొప్పుఁగాఁగ బలగంబయి నీకడ నాతనూభవుల్
మెలఁగఁగఁ జూడఁ గానన యమేయ భుజాబలశాలి విక్రమో
జ్జ్వలుఁడు సుభద్ర పట్టియును వమ్మయి పోమె ననూన భోగముల్
గలిగినయేనియున్ మరవఁగా వశమే మన కా కుమారులన్."

మానవజీవితమున కత్యంత సన్నిహితములై, యెల్లర యనుభవమునకు వచ్చు నిట్టి సన్నివేశములఁ బురస్కరించుకొని, మాతా పిత్రాదయ ప్రకృతులను, మానవస్వభావమును, చిత్రించుటలోఁ దిక్కన తన రచనా కౌశలముచే నాయా దృశ్యములు మన కన్నులయెదుట జరుగుచున్నట్లు గావించియున్నాఁడు.

ఘోరమైన, విరతిలేని, యుద్ధమధ్యమునఁ గూడ నిట్టి మానవ హృదయ వ్యాపారములగు దయా, వాత్సల్య, బంధుభావాదులందందుఁ బ్రదర్శితములగుటచేఁ దిక్కన యుద్ధరచన సరసమై యొప్పినది.

సైంధవవధార్థ మేకాకియై వ్యూహమును బ్రవేశించిన యర్జునుని క్షేమమునుగూర్చి ధర్మజుఁ డాకులపడుట, యిందుల కొక యుదాహరణము. అర్జునుని దేవదత్తధ్వని వినిపింపక, కృష్ణుని పాంచజన్య రవమొక్కటే వినఁబడుచుండుటవలన,

"మనంబు గలంగ నెలుంగు గుత్తుకఁ దగుల సాత్యకితో నిట్లనియె."

"ఒక్కఁడ చన్న వాఁడు విజయుండు మహీరజ మెక్కడయ్యె న
ద్దిక్కునఁ బాంచజన్యము యుకీర్ణత మ్రోయఁదొడంగె నక్కటా
చిక్కెనొ కారవాధములచే నతఁ డీయెడ నీవ యొక్కడుం
దక్క నొరుండు దీర్ఘఁగ నుదగ్రుఁడు బంధుఁడు లేమి వేడెదన్."

"ద్వైతవనంబునందు గుణధన్యుఁడు గాండివి నాకుఁజెప్పె ని
ర్ధూతవిరోధి సత్యకసుతుండు సహాయుఁడుగా జయింతుఁ బ్ర
ఖ్యాతిగ ధార్తరాష్ట్రబలమంతయు నే నని దానికిం దగం
బ్రీతియొనర్పవే నరవరేణ్య రయమ్మునఁ బోయి వానికిన్."

"అలఘు బలుఁడు శైనేయుఁడు
గలుగఁగఁ బాండవుల గెలువఁగా వచ్చునె వా
రలకతఁడు గోటయంత్రు
రిపులు దానికిఁ దగఁగ నెఱపు భుజగర్వంబున్."

"హరి గురుఁడు, నీకుఁ గ్రీడియు
గురుఁ డిరువుర యెడరు దీర్ఘఁగోరి గురులకుం
గురుఁడనగు నేన చేసెదఁ
బరమ ప్రార్థనము దీనిఁ బాటింపు తగ్గ."

మొదట నర్జునుని క్షేమమును గూర్చి తనకుఁ గలిగిన చింతను దెల్పి, పిమ్మట క్రమమున, నర్జునుఁడు సాత్యకికి గురుఁడగుటయు, బంధుసహా

యము పుణ్యకృతి యగుటయు, నర్జునుండొట్లు సాత్యకి శౌర్య విక్రమము లపై నాధారపడి, కౌరవుల గెల్వ నుత్సహించి నదియు, సాత్యకియనిన శత్రువు లెట్లు భీతిల్లు నదియు, నుగ్గడించి, కడపట, గురులగు కృష్ణ పార్థుల సంరక్షణార్థమై తప్పక యురుగ వలసిన దని, గురులకుం గురుం డైన ధర్మరాజు, తానే సాత్యకినిఁ బ్రార్థించినాఁడు. ధర్మజుని చింతను బాపుట, గురుఁడు, సఖుఁడు, బంధుఁడు నగు నర్జునునకును, నన్న యగు కృష్ణునకును దోడ్పడి, వారి మెప్పును బడయుట, శత్రువులకుఁ దన పరాక్రమమును బ్రదర్శించుట,- యివియన్నియు, సాత్యకిని వ్యూహ ప్రవేశమునకుఁ బురికొల్పుటలో నొకటికంటె నొకటి ప్రబలతర సాధ నము లగుచున్నవి. కనుక నీ ప్రార్థన వాక్యము లెంతయు సమయో చితములై, యర్థస్ఫూర్తితో నొప్పి, ధర్మజుని విశిష్ట లోకజ్ఞానమును వ్యక్తపఱచుచున్నవి. ద్రోణునిఁ గడచి వ్యూహమును బ్రవేశించిన సాత్యకిపై నెడతెరపిలేక వీరాధివీరులు వచ్చి పడుచుండుటచే నతఁడు త్వరలో నర్జునునిఁ జేరలేకపోయెను. క్షణము గడచు కొలఁది ధర్మజుని యాందోళన యధికముకాసాగినది. ఇప్పుడతనికి సాత్యకిని గూర్చిన చింతయుఁ బొడమినది. ఆతఁ డాత్మగతంబున,

"అర్జునుఁ డొంటివోయెనని యక్కడఁ బుచ్చితి బాహుసార వి
స్ఫూర్జితు సాత్యకిం బిలుచఁ బోవుటయుం గనుఁగొంటి నిద్దఱున్
దుర్జయ శత్రుసైన్యముల దొందడి నేమయిరొక్కొ విక్రమా
వర్జితవైరి భీముఁడును వారికిఁ దోడుగ నేఁగు టెట్లొకో."

"తమ్మునిఁ దలంచి కృష్ణుని
తమ్ముఁ బనిచె నాతనిఁ బదంపడి తన చి
త్తమ్మునఁ దలపడ ధర్మజుఁ
డెమ్మెయివాఁడొక్కొ నారె యీఁయున్న జనుల్."

"పెక్కు-చోటుల నెఱిఁగిన యుక్కు-లావుఁ
గలుగు నీతనిఁ బనుచుట కలుకనేల
యితఁడు గలయ నయ్యిరువుర కెలమివచ్చు
బనుతు నేనటు శోకంబు వాయవలయు."

అని బహువిధంబుల విచారించి నిశ్చయించినాఁడు. 'తన తమ్మునిఁదలంచి కృష్ణునితమ్మునిఁ బనిచె' నను తిక్కన ప్రయోగ మెట్టియర్థమును స్ఫురింపఁ జేయుచున్నదియు గమనింపఁదగును. భీమాదులగు తన తమ్ములుండఁగా వారిలో నెవ్వరినైనను బంపక, కృష్ణునితమ్ముఁడగు సాత్యకినిఁబంపి, పిమ్మట నతనిస్థితి యెట్టిదైయుండునో యను చింతలేక, నిశ్చలుఁడైయున్న ధర్మజుఁ డెంతటిగడుసువాఁడో యని సైన్యములోని వారనుకొనవచ్చును. ఈయూహయే ధర్మజునకు విచారహేతువైనది. అతని శీలమునందలి ముఖ్య లక్షణమగు లోకాపవాదభీతి నింతసరళముగఁ దిక్కన వెలువఱచినాఁడు. భీమునిఁ బంప నిశ్చయించిన ధర్మజుఁడు పల్కిన పలుకులలో, నాతని భ్రాతృభావమును, సహజమగు హృదయమార్ద్రవమును, వ్యక్తమగుచున్నవి.

"భీముఁ జేరనరిగి బీభత్సు నీతమ్ము
నని యెలుంగు గళమునందుఁ దగుల
నశ్రులొలుక మాట యట సెప్పలేఁడతఁ
డార్తిసూచి యిట్టులనియె నతఁడు."

ఇందుఁ దిక్కన, ముందు 'బీభత్సు' అని, వెంటనే 'నీతమ్ము' నని ధర్మజునిచేఁ బలికించియుండుట గమనింపఁదగినది. అర్జునుని విషయమునఁ దనకుఁ గలిగిన కలఁత భీమునకును గలుగఁజేసి, యతని నందుఁ బంపుట ధర్మజునుద్దేశము. కనుకనే ముందు బీభత్సుఁడనిపేరు నుచ్చరించి, వెంటనే 'నీతమ్ము' డని పల్కి భీముని భ్రాతృవాత్సల్యమునకు గుఱిచేసినాఁడు.

"నీతమ్ముఁగుఱ్ఱి రూపసి
నీతివిదుఁడు సకలగుణనిధి మద్భక్తుం
డాతని కెడరగునో యను
చేతోగతి పల్లటిల్లఁజేయదె తాల్మిన్."

"నీవుపోయి పార్థునిఁగని సింహనాదమున రోదసినింపును, మాకు నింపుగన్," అని అర్జునుని గుణగణాదులను స్మరణకుఁదెచ్చి, భీమునిఁ బ్రోత్సహించు టీసందర్భమున కెంతయు నుచిత మగుచున్నది.

భీష్ముఁడు తొమ్మిదిదినము లుద్దండుఁడై విజృంభించి పాండవానీక మును సమయించి యజ్ఞనాదుల నొంపఁగా, ధర్మజుఁడు కృష్ణునిఁ జేర నరిగి పలికిన పల్కులు నిశ్లే యతని స్వభావమును సూచించుచున్నవి.

"కార్చిచ్చు గవిసి మృగతతి
నేర్చుకరణి నేఁడు భీష్ముఁడేచినకడిమిం
బేర్చి మనసేనఁ బొదివె శ
రార్చుల నీవీరుఁ గన్నులారం గంటే."

"మున్నను నేఁ గారణముగ
నన్నియిడుము లనుభవించి రనుజులు వీరిం
గన్నారఁ జూతుఁగాని జ
గన్నుత భీష్మునకుఁ గోలుగా నీఁజాల."

తాను జూదమాడి తమ్ములను బలుకష్టములకు గుఱిచేసినాఁడఁగదా, యని ధర్మజుని హృదయ మిదివఱకే యెఱిఁగియుచున్నది. తనయం దంత బద్ధానురాగులగు తమ్ములు నొచ్చుట సహింపఁజాలఁడు. వారిని రక్షించు కొని, కన్నారఁజూచుచు, సంతోషింతునుగాని, భీష్మునకు బలిగానీఁజాల ననుసతనిపల్కు లతని యంతరంగము నిట్లు ప్రదర్శించుచున్నవి.

ఇట్లే యుద్ధమధ్యమునఁ గర్ణునిచేనొచ్చి, శిబిరమును బ్రవేశించిన యుధిష్ఠిరుని సేమమరయుటకై కృష్ణార్జునులుపోవ, వారినిగూర్చి భీముని హృదయ మెట్టి తహతహానొందినదియుఁ, దిక్కున వర్ణించియున్నాఁడు.

"అంబరంబునడుమఁ దేజరిల్లు రవిఁబోలి, యనిలసుతుండు దీప్తవిశిఖం
బులు పర్వఁగ నేచి, కౌరవసైన్యమును దఱిమి, యప్పుడు పార్థునిఁ
దలంచి, సారథితో,

"నరుఁ డన్నవర్తనము తెఱఁ
గరయుటకై మడిఁగలంగ నటచనినాఁ డ
న్నరపతి దుర్దశఁ గని మ
స్తరశోకం బడరి తాను దదవస్థుఁడగున్."

"అయ్యిరువురకు నొకటియైనట్టిదైన
మనము కౌరవసంఘంబు భ్రగ్గఁజేసి
గెలుపుఁ గొంటిమేనియు ఫలము దాన
నేమి గలదనువగఁ జిత్త మెఱియఁజొచ్చె."

అని పల్కినాఁడు. కొంతసేపటిలో నర్జునుని రథమును గుర్తించి సారథి యతనితో,

"హరి మేనికాంతియును నరు
కిరీట రత్నాంశుపులును గిరిగొన రథర
థ్యరుచులు బెరసి విచిత్ర
స్ఫురణమ్మునఁ దేజరిల్లఁ జూడు కుమారా."

అనిన విని యంతరంగంబు సంతోషమయంబుగా నంగంబు వొంగ మన శ్శాంతినిఁ బొందినాఁడు భీముఁడు. ఇట్లు మధ్యాహ్నమార్తాండునివలెఁ బ్రచండుఁడై శత్రుతాప మొనరించుచున్న భీముఁడు భ్రాతృవాత్సల్య

మున, నొక్కత్రుటిలో నమృతకిరణుఁడుగఁ బరివర్తన మొందినట్లు, తిక్కన వర్ణించియున్నాఁడు.

ద్రోణునివధ విషయమై యర్జునుఁడు ధర్మజు నాక్షేపించుచు,

"మన సేనల నొక్కెత్తునఁ
గొనఁదలఁచి కడంగివచ్చు గురుపుత్రుని మా
ర్కొన ధృష్టద్యుమ్ను నిఁ గా
పను శక్యమె నీకు నిచటి వారికి నధిపా."

యనినం గోపించి, యనిలనందనుం డా సంక్రందననందనున కిట్లనియె.

"అడవులనుండు తాపసుల యట్లులు వల్కెదు రాజనీతి యి
ట్లొడఁబడి చేయవచ్చి వధకొల్లమి యొప్పునె ధర్మనిష్ఠయె
క్కుడఁగల దాసభన్ ద్రుపదకన్యక పాటున కీట్టి వెన్నియుం
గడుకొని చేసినన్ మనలఁ గల్మష మొందఁగనేర దర్జునా."

"అరులు మనమీఁద నురవడి నరుఁగుదేర
మేము సిడిముడి పడుచుండ నిట్టులనుట
యొప్ప దురిసినపుండుల నుప్పువెట్టి
పరయ దీనికి నిన్ను నేమందుఁ బార్థ."

"కురువీరు లెఱుఁగుదురు ననుఁ
గురువీరుల నెఱుఁగు నేను గొంత యెఱుఁగుదున్
శరపరిఘ ప్రహరణములఁ
బోరిఁగొనియెదఁ గాక వారిఁ బోనిచ్చెదనే."

కర్తవ్యనిరూఢుఁడగు భీముని పల్కులెంతయు సమయోచితములై ధర్మసుతుని శీల స్వభావములకు ద్యోతకములగుచున్నవి. అశ్వత్థామ

ప్రయుక్తమైన నారాయణాస్త్రమునకుఁ బ్రతిక్రియగా నర్జునాదు లందఱును శస్త్రాదులను వదలి, రథములనుండి దిగఁగా, సమీరనంద నుండు సైనికులతో,

"డిగకుఁడు వాహనంబులు గడిందిమగంటిమిఁ గోలుపోవ మీ
రు గడఁకఁదక్కి వెట్టకుఁడు రూపఱు నాయుధముల్ మహాస్త్ర
శక్తి గెలుతు గోత్రభిత్కులిశతీవ్రశరంబుల వైభవంబు భూ
రి గదవిహారభంగియు నరిప్రకరంబులు పిచ్చలింపఁగన్."

"అని బరవసంబుసేసి, శంఖంబొత్తి, మల్లచఱచి, సింహనాదంబు సెలంగ నశ్వత్థామను మారొక్కనుటయు," నశ్వత్థామ యమ్మహాస్త్రంబు దీపింపం జేసిన, నది పేర్చి, కార్చిచ్చు వొదువుచందంబున సమీరనందనుం జుట్టుముట్టె. అప్పుడు కృష్ణార్జునులు తేరు డిగ్గి, రిత్తచేతులం బారి, యా భీముని నిరాయుధుంజేసి, రథంబు డిగ్గఁద్రోయ నారాయణాస్త్రంబు ప్రశాంతిఁబొందె. ఇందు భీముని సహజౌద్ధత్యసాహసాదులు, ప్రదర్శితము లైనవి. ఇట్లు వివిధ సన్నివేశములయంనుఁ బ్రదర్శితము లగు విలక్షణ మానవ స్వభావములను రసవత్తరముగఁదిక్కన చిత్రించియున్నాఁడు.

ఇట్లే యుద్ధవృత్తాంతమును సంజయుఁడు దెల్పఁగా వినుచున్న ధృత రాష్ట్రునియందుఁ గలుగు భావోద్వేగాదులు, నతని స్వభావము, నతని పలుకులవలన వ్యక్తమగుచున్నవి.

సాత్యకి వీరాటోపమున కాగ లేక దుర్యోధనాదు లెల్లరును బాఱి రని సంజయుఁడు చెప్పగా, ధృతరాష్ట్రుఁడు,

"పులికిఁ బసులు వాఱిన క్రియ
నలవుఁ జలము సిగ్గు విడిచి యట్లొక్కని కో
ట్లల కోర్వక విరిగిన
పుత్రుల నేమని విందు నేను రోయక యింకన్."

అని తనకుమారుల యశక్తతను గర్వించినాఁడు. భీముఁడు ద్రోణాది రథికుల నతిక్రమించి, వ్యూహముం బ్రవేశించి, యర్జునుం జేర నరిగె నని విని,

"ఇట్లు సింహనాదమిచ్చిన భీముని
మార్కొనంగ మగఁడు మనబలమున
గలిగెనే మదాత్మజులఁ గాల్పఁబుట్టిన
చిచ్చు వాఁడు వానిఁ జెనయుటరిది."

అని వాపోయినాఁడు. కౌరవుల పాలిటి యముఁడైన భీముని మార్కొను వాఁడు తన బలమున లేఁడే, యని యతని దుఃఖము. కర్ణునిచేఁ బ్రయుక్తమైనశక్తి ఘటోత్కచునిఁ జంపె నని విని ధృతరాష్ట్రుఁడు,

"ఒకనినిఁజంపి యిట్లు సను నుజ్జ్వలశక్తి నెఱింగి కర్ణుఁ డే
టికి నరుమీద దాని నిగిడింపక యిన్నిదినంబు లప్రయో
జకముగఁ జేసెఁ గయ్యము భుజాబలశాలి నరుండు వడ్డఁ బో
రికి మఱి యుత్సహింపఁగలరే పెరవారలు సూతనందనా."

అని సంజయునితోఁ బల్కినాఁడు. కర్ణుఁడర్జునునిపై నాశక్తిఁ బ్రయోగింపలేదే, ప్రయోగించియుండినఁ, బాండవుల పీడ తమకులేకుండెడిదే, యను ధృతరాష్ట్రునివాక్కు, లతనికిఁ బాండవులయెడఁ గల యభిప్రాయమును వెలిబుచ్చుచున్నవి. అంతమాత్రమేకాక, మఱియు నతఁడు,

"పిలిచికొనిరమ్మైనఁ బార్థుం
బొలియింపఁడ శక్తి నతఁడు పోరికి నెవ్వా
రలు రమ్మన్నను వ్రతమయి
తలకొనిచను గర్ణుఁడేల తప్పం జేసెన్."

అని కర్ణుని బుద్ధిహీనతకు వాపోయినాఁడు. ద్వంద్వయుద్ధమునకుఁ బిలీచి
కొనిరమ్మైనఁ గర్ణుఁ డర్జునునిపై శక్తినిఁ బ్రయోగింపకపోయె నని చింతిం

చుట ధృతరాష్ట్రుని మోహాంధ్యమును బ్రకటించుచున్నది. దైవముపై విశ్వాసమును, విధివిలాసమవిలంఘ్య మను జ్ఞానమును, నున్నవాఁ డెవ్వఁడును నిట్లు, గతము తన కనుకూలింపలేదే యని దుఃఖింపఁడు. ధృతరాష్ట్రుని యశక్తదుర్జనత్వమున కీవాక్యము ప్రబల నిదర్శనము.

కర్ణుని ద్వితీయదివస యుద్ధమును గూర్చి వినుచు, ధృతరాష్ట్రుఁ డిట్లు పలికినాఁడు.

"పాండునృపసుతులలో నొ
కొండైనను నొవ్వఁ డింతకును మును వనితా
మండలి చేరువ మెలఁగెడు
గండున మెఱసెదరు కురునికాయము నడుమన్."

ఇట్లే, శల్యదుర్యోధనాదుల చావు వినినప్పుడుకూడ,

"చావరు నొవ్వరు పాండవు
లేవురు సని నీవుచెప్ప నిప్పలుకులు దుఃఖా
వేశకరములై చే
తోవృత్తి దహింపఁజొచ్చె దుర్భరభంగిన్."

అని ధృతరాష్ట్రుఁడు వాపోయినాఁడు. ఈ పల్కులవలన విషపూరిత మగు నాతనిహృదయమును, లోక సహజమగు దుర్జన స్వభావమును విశదమగుచున్నవి. తన కుమారులతోఁ బాటు, పాండవులందరు కాక పోయినను, నొకఁడైనను గూలియుండిన నీయంధునకుఁ గొంత మన శ్శాంతి కల్గెడిది. అట్లు కాకపోగా, వారి కేమాత్రము నొప్పియుఁ గలుగ లేదను సంజయుని వాక్యములు, ధృతరాష్ట్రుని హృదయమును దుఃసహ మగునట్లు దహించినవి. తమతోఁబా టితరులును గష్టపడుచున్నచో నూఱటనందుట, దుర్జన స్వభావము. తమకుఁ గీడు సంభవించినప్పుడు పరులకుఁ గీడు కలుగలేదే యని దుష్ట లీర్ష్యాపరులగుట లోక సహజ

మగు విషయము. ఈర్ష్యాపరుఁడు, నశక్తదుర్జనుఁడు, నగు ధృతరాష్ట్రుని స్వభావ మిమూటలలో సువ్యక్తమైనది. ఇంతలో నతనిని పుత్ర దుఃఖము ముంచివేయఁగా,

"కొడుక తమ్ములతోడ్పడఁ గడగి శత్రు
వరుల గెలిచెదనంటి వొక్కరుఁడుఁ దక్క
కుండ నీతమ్ములుగుఱ్ఱుల నూచముట్టు
గొనియెనే విధి యేగతిఁ జనుదుఁ జెపుము."

"కదిసి పవనజుఁడు బెట్టుగ
గదద్రవేసిన తొడలు విఱిగి కయ్యపు నేలన్
మదమఱి పడినప్పుడు నీ
మది నేమని తలఁచితో కుమార యెఱుంగన్."

అని, యతిదీనముగఁ బలవించినాఁడు. సుజనుఁడైనను, దుర్జనుఁడైనను, మానవునకు రాగమోహాదులును, బంధుభావ వాత్సల్యాదులును, సమానములగుట ప్రకృతిసిద్ధమగు విషయము.

కర్ణుని చావును గూర్చి విలపించుచు, ధృతరాష్ట్రుఁడిట్లు,

"ఆలలోని యాఁబోతును బోలె నొప్పుఁ
గురుబలంబులో నున్మదద్విరదమూర్తి
సింహసంహననుండు నిస్సీమవిక్ర
మాభిరాముండు వోయెనే యక్కటకట."

అని వాపోవుచుఁ గర్ణునకుదాత్తమగు గౌరవము నొసంగినాఁడు. 'ఉన్మదద్విరదమూర్తి' 'సింహసంహననుండు' 'నిస్సీమవిక్రమాభిరాముఁడు' అను విశేషణములు, కర్ణునిపై ధృతరాష్ట్రాదు లెంత యాధారపడియుండిరో వ్యక్తముఁ జేయుచున్నవి. ఉన్మద ద్విరదమూర్తివలె నొప్పు వృష

భముచే నాలమందకుఁ గలుగుశోభయు, రక్షణయు, నుపమేయము నందు గమ్యమానములగుచున్నవి. అదియునుంగాక, యివి, యుత్తరోత్త రోత్కర్షములై కర్ణునియందు వారికున్న యభిమాన విశ్వాసములను వ్యక్తముఁజేయుచున్నవి. తన్మూలమునఁ, గర్ణునివధచేఁ గౌరవసైన్యము కాంతి రహితము, రక్షణశూన్యము నైనది యనునర్థము ప్రస్ఫుట మగు చున్నది. ఈవిషయమునే సంజయుఁడు,

"బలితపువెన నాబోతుం
బులిగొనినం బసులు వాఱుపోలికి గ్రోధో
జ్వలుఁడగు పార్థుఁడు గర్ణునిఁ
బొలియించిన నీదుసైన్యములు వెఱఁ బఱచెన్."

అని ధృతరాష్ట్రునకుఁ దెల్పినాఁడు. కర్ణుని యుద్ధమును వర్ణించుటకుఁ బూర్వ మతనిఁగూర్చి ప్రయోగించిన యుపమానము నేమఱక తిక్కన తద్యుద్ధవర్ణనానంతరమునఁ గూడ నిట్లు ప్రయోగించి, పూర్వాపరవర్ణన ములకు సమన్వయముం గూర్చియుండుట గమనింప వలసిన విషయము.

ఇట్లు తిక్కన, సన్నివేశాదులం బురస్కరించుకొని, మానవ స్వభావ వైవిధ్య వైలక్షణ్యములను, లోక స్వభావానుగుణముగ, నాకర్షణీయ మగు విధమునఁ జిత్రించి, తన యుద్ధపర్వరచనను బాఠక జీవితసన్నిహి తముం గావించియున్నాఁడు.

నాయకప్రతినాయకులగు ధర్మజ ధుర్యోధనుల శీల స్వభావాదులను బ్రదర్శించు వీరరస ప్రధానమగు భీమదుర్యోధనుల గదాయుద్ధ, మిట్టి యుదాత్త రచనతోఁ గూడిన ఘట్టమై యొప్పుచున్నది. విజయపరం పరల కారణమున నమితోత్సాహియై, సోదర బంధు పరివృతుఁడై యున్న ధర్మజుని యొక్కయు, బంధుమిత్రాదుల నెల్లఱఁ జంపికొని,

యపజయము వెన్నాఁడుచుండ నేకాకియై, నిరుత్సాహియై, ద్వైపాయన హ్రదమున డాగిన దుర్యోధనునియొక్కయు, మానసిక స్థితిగతులను దిక్కన యిందు జక్కఁగఁ జిత్రించియున్నాఁడు.

జలస్తంభన విద్యచే మడుగున డాగియున్న దుర్యోధనునిఁ బాండవులు పోటుమాటలచే నొప్పించి, రోషముఁ దెప్పించుచుండ, నతఁడు దీనుఁడై,

"ఏనింక సమరమొల్ల మ
హీనాయక నీక యుర్వినిచ్చితి శాంతిం
గానకుఁ జని వల్కలపరి
ధానుఁడనై తపమొనర్చెదను మునుల కడ్డ."

"ఓడివచ్చినాఁడ నుద్ధతి నాకేల
యుడుకు మాని నీవ యుర్వి యేలు
గుఱ్ఱములును నేనుఁగులు లేని బయలు నీ
తలనె కట్టికొనుము ధర్మతనయ."

అని నైరాశ్యమును బ్రకటించినాఁడు. ఈ వాక్యము లిప్పటి యతని దిక్కుమాలిన దీనావస్థ కెంతయు నుచితములై యున్నవి. కాని "ధర్మతనయుండును; దమ్ములుఁ, గొడుకులు, ద్రుపదపుత్రులుఁ బొదువుకొని పలుకు పలుకులకు జిత్తంబుత్తలపడ, నాననంబు పల్లటిల్ల, గరంబులు విదిర్చి, దురంబొనర్చువాఁడై, యప్పాండవాగ్రజునకు నతఁ డిట్లనియె."

"మీ రేవురును బరివార బాంధవ మిత్ర
సహితుల రథాశ్వస్రుక్‌స్రువంతు
లరు కరిస్యందనతురంగసమేతుల
రేనొకరుండ విహీనసహాచ

రత్వంబు విగ తాయుధత్వంబు వాహన
హీనత నొందితి నేవిధమున
ననియెొనర్పఁగవచ్చు నదిగాక పోటుల
డస్సితిఁ గడు మీకు డప్పిలేదు
వరుసఁ దగ నొక్కఁడొక్కఁడ వచ్చి పోరుఁ
డివుడ వెడలి మిమ్మందఱి నెల్ల చెలులఁ
జుట్టముల రూపుమాపెదఁ జుట్టుముట్టి
పలువు రొక్కనితోఁ బోరఁ బాడియగునె!"

జీవితమున నతిక్రమింపఁజాలని విషమదశ ప్రాప్తించినపుడు మానవునకు న్యాయాన్యాయ, ధర్మాధర్మ వివక్ష కలుగుట సహజము. తాను బల వంతుఁడై యున్నంతవఱకు న్యాయమునుగూర్చిన యాలోచనయే పొడమదు. కర్ణార్జునుల ద్వంద్వయుద్ధమున, నర్జునునిపైఁ దాఁ బ్రయో గించిన సర్పముఖ శరం బాభంగి నిష్ఫలప్రయత్నంబగుటయును, దన మనంబున నొవ్వడరి యక్కర్ణుండు గరంబుల విదిర్చుచు,

"ధర్మవాదులు ధర్మతత్త్వప్రధాన
చిత్తులగువారిఁ బూని రక్షించు ధర్మ
మందు రది బొంకుఁగావించె నతులధర్మ
శీలుఁడగు నన్ను ధర్మ్మపు సెలవులేద."

అని ధర్మంబును దూఱియున్నాఁడు. అంతియకాక, రథ చక్రంబు క్రుంగినపు డతఁ డర్జును నుద్దేశించి,

"అరదంబు చక్రంబు ధరఁ జాలఁగ్రుంగిన
నెత్తెద నంతకు నేయకుండు"

అని ప్రార్థించియు,

ఏను భూమిస్థుండ నీవు రథస్థుండ
వీయెడఁ దగవగు నేయకునికి
విరిదలవానిని విరథుని నాయుధం
బిడినవానిని శూరు లేయ రెందు
మహిని శూరుఁడవనుమాత్రగా దు త్తమ
కులుఁడువు రణ ధర్మకోవిదుండ
విట్టి నీవు తగినయట్టి భంగిన యని
సేయవలయు."

ననుచు రణధర్మములను గూడ ప్రస్తావించియున్నాఁడు. లాక్షాగృహ దాహ, ద్రౌపదీపరిభవ, అభిమన్యువధాది సందర్భములలో నీధర్మ చింత కర్ణున కేల కల్గినదికాదని, యపుడు శ్రీకృష్ణుఁడే తగినట్లు ప్రశ్నించి నాఁడు.

అట్లే అభిమన్యువధ సమయమున దుర్యోధనుని స్థితివేరు, నిప్పటిస్థితి వేరు. కావునఁనే యప్పుడు తలంపునకురాని యుద్ధధర్మములు, దయా దాక్షిణ్యములు, నతని కిప్పుడు స్ఫురించుచున్నవి. ఇది మానవ ప్రకృతికి సహజమగు విషయము. ఇతనికి ధర్మజుఁడిచ్చిన ప్రత్యుత్తరముఁ జూతము.

"వలసిన యస్త్రశస్త్రములు వాహనముం గొను మొక్కరుండ నిఁ
గలన జయించువాఁ డతనిగర్వము నీవడఁగించితేని యీ
యిల సకలంబుఁ గైకొని వహింపుము రాజ్యవిభూతి వాడు నిం
దలపడిపోరు జుట్టులును దక్కటివారలు నిల్చి చూడగన్."

విజయ ముత్సాహకారి. "ఉత్సాహము సగము బలము." అను నానుడి ఇందుఁ జక్కఁగ ననువర్తించుచున్నది. ఇట్టి ప్రతీవచనము నకు విజయ లాభమున నుప్పొంగియున్న ధర్మజుని యత్యుత్సాహమే హేతువు. ఉత్సాహపరున కాత్మవిశ్వాస, బల గర్వములు ద్విగుణముగు

టయు సహాజమే. కావుననే ధర్మజుఁ డొక్కని జయించి, రాజ్యముఁ గైకొనుమనుటకు సాహసించినాఁడు. అంతమాత్రమే కాక, దుర్యోధనుఁడు గదాయుద్ధముఁ గోరఁగా,

"పొంగి ధర్మసుతుఁ డాతనితో గద నొక్కరుండ నే
గొనియెద నీదుప్రాణము లకుంఠితబాహువిలాసభాసినై
యనవుడుఁ బుట్టలోపలి మహాభుజగేంద్రుఁడు రోజునట్లు రో
జె నధిప యవ్విభుండు దనచిత్తము నప్పలుకుల్ గలంచినన్."

భీముఁడే గదాయుద్ధమునఁ దనకుఁ జాలఁడను నాత్మాభిమానముతోనున్న దుర్యోధనున కీ ధర్మరాజు వాక్యములు సహింపరానివైనవి. కనుకనే రోషావేశముచేఁ, బుట్టలోపలి మహానాగము బుసగొట్టినట్లు, మడుగులోనున్న దుర్యోధనుఁడు మహాభిమానమున నుత్కటముగ నిశ్వసించినాఁడు. దెబ్బఁదిని, ప్రతీకారావకాశములేని స్థితియందున్న సామాన్య సర్పములే, రోషాభిమానముల కారణమున నుద్రేకముఁజెంది, పడగలనువిప్పి, నేలనుగొట్టి, బుసగొట్టుట, లోకమునఁ గాననగు విషయము. అట్టిదియెడ 'మహాభుజగేంద్రుఁ' డెట్లు ప్రవర్తించునో యూహించుకొనవచ్చును. ఇప్పటి దుర్యోధనుని యవస్థ కీ యుపమాన మెంతయు సముచిత మగుచున్నది.

విజయ మూలకమగు నత్యుత్సాహమునకు లోనై ధర్మజుఁడు స్వపర బల తారతమ్యమెఱుఁగక, యుక్తాయుక్తములు గణింపక, పలికినాఁడు. మానవ స్వభావమే యట్టిది. ఈమాటలువిని రోషావేశమున మడుగువెడలి సంరంభ విజృంభితుండై వచ్చు దుర్యోధనునిఁ జూచి,

"చిఱుతనగవుతో నొండొరు చేతులప్ప
ళించి నిర్భర సంతోషలీల నొప్పి

రమ్మహీనాథుఁ డయ్యపహాస మెఱిఁగి
బొమలు ముడివడఁ గనుఁగవఁ బొడమఁ గెంపు."

కోపావేశంబునొంది, యుద్వృత్త తారకంబుల వారలనెల్ల నాలోకించి,

"ఈగెలి వేలార్చెద బా
హాగర్వము మెఱయ మిమ్ము నందఱను మహీ
భాగమున గూల్చి నెఱపెద
నాగదబలు పెట్టులైన నగుఁ డందాకన్."

"అనుచుఁ బోటులఁ దొరుగు రక్తాంబుధార
లంగమెల్లను గప్పిన నప్పుడొప్పెఁ
గావి సెలయేఱు లెల్లెడఁ గలయఁబర్వఁ
బొలుచు కుఁపర్వతంబు చాడ్పున నతండు."

పాండవాదులెల్లరు నొక్కపెట్టఁ దన్నుం బొదువుదురని శంకించుచున్న దుర్యోధనునితో, ధర్మరాజు,

"ఏరికొను మీవు నొకని మా యేపురందు
వాఁడు నీ తోడఁ దగఁ బోరువాఁడు వానిఁ
జంపి మహియేలు వానిచేఁ జచ్చి త్రిదివ
సౌఖ్య మొందుము చేసితి సమయమేను."

అని పలికి యుజ్జ్వలవివిధవర్మంబు లాతని ముందటఁ బెట్టించి,

"విను జీవముతో నిన్నుం
జననిచ్చుట యొండు దక్క సమరంబున గో
రినయది నీకొసఁగెద నిం
తన చెడియెనె యకట యన్నదమ్ముల కూర్మిల్."

అని యుదారముగఁబల్కినాఁడు. ధర్మజుని యీ ప్రవర్తన యతని హృదయవైశాల్యమును, ధర్మబుద్ధిని, దాక్షిణ్యభావమును, బ్రదర్శించు చుండుట నిజమే. కాని వానితో నతని స్వభావసిద్ధమగు నొక లోపముకూడ వెలువడినది. దానిని గుర్తించియే-

"ఇతఁడు గదారణంబునకు నీకొలఁది న్నినుబిల్చినన్ మరు
త్పతిసుతుఁ గోరినన్ జిఱుతతమ్ములలో నొకని న్వరించినన్
మతిసెడిరొక్కొ వీర లను మాటకుఁ బాత్రముకాదె సాహసం
బు తఱియె మేదినీశ యిది బుద్ధిదొఱంగి తనుగ్రహంబునన్."

"ఒకరునిఁ జంపితేని సకలోర్వీయుఁ గైకొను మంట నీవు మున్
శకునికి మాయజూదమున సంపదలెల్లఁ ద్రయోదశాబ్దభో
గ్యకృతి నమర్చి యొడ్డినటులైనది పండెపుఁగయ్యమయ్యె శ
త్రుకులమునెల్ల దుఃఖపడి త్రుంచుట కాఁ దుదిఁ బండెమూఁడనే."

అనికృష్ణుఁడు ధర్మజునిఁ గఠినముగ విమర్శింపవలసి వచ్చినది. అమితో త్సాహపరవశులై యేమాత్రమును యోచింపక పండెములు చరచు టయు, శపథములు పల్కుటయుఁ, గొందఱి స్వభావము. అది యనర్థ దాయకమనుట లోక విదితము. పండెములు ప్రధానముగా గలద్యూతము నందు ధర్మజునకుఁగల యాసక్తికిని, నీలోపలేశమే కారణము. ఈ భారత యుద్ధమున కంతకును, నదియే మూల హేతువైనది. తనయొక్కయుఁ, దమ్ముల యొక్కయు, శక్తిసామర్థ్యముల యందును, జయసిద్ధి యందును, ధర్మజునకు సంపూర్ణ విశ్వాసముండుటచే, నతఁ డట్టిసమయ మును జేసెనని సమర్థించుటకును వీలులేదు. కావుననే కృష్ణుఁడు,

"నరవర యొక్కొకొక్కటి పెనంగఁగ భీమునినైనఁ బన్పఁగా
ధరయఁగ భీముకంటె గదయందలి కౌశలమెక్కు డీ మహీ

శ్వరునకు భీముమేన బలసంపదమిక్కిలి దానఁ బోవునే
పెరవునఁ గోలుపోదె భుజవీర్యము పోరుల నెందుఁ జూడమే."

అని ధర్మజుఁడొనర్చిన యనుచితమెట్టిదో వివరించినాఁడు. కృష్ణుని యీ మాటలయందలి యాథార్థ్యము, గదాయుద్ధసందర్భమున విదితము కూడ నైనది. ప్రస్తుత విషమస్థితినుండి పాండవులను దప్పించుటకై కృష్ణుఁడు గావించిన ప్రయత్న మతని మానవ స్వభావ పరిజ్ఞానమునకు సాక్ష్యమగుచున్నది. దుర్యోధనుఁడు వినుచుండ, భీముని బలశౌర్యాదులను, సతఁడు హిడింబాదులను జంపుటను, బ్రశంసించి భీమున కుత్సాహముఁ గల్పించినాఁడు. అంతియకాక, భీముఁడొనర్చిన దుశ్శాసన వధను బ్రత్యక్షమగు రీతిని వర్ణించి, దుర్యోధనుని హృదయమును బ్రజ్వలింపఁజేసినాఁడు. ద్రౌపది కపమానమొనర్చిన యిరువురిలో నొక్కనిఁ జంపి ప్రతినఁదీర్చికొంటివి; మిగిలినదాని నిప్పుడు తీర్పుమని, భీమునిఁ బురికొల్పుచు, దుర్యోధనునకు భీమునిపైఁ గ్రోధావేశ మగ్గలమగునట్లు చేయుట, కృష్ణుని పన్నాగము. ఇట్లు తనవాక్యములచే నొకవంక, భీమున కుత్సాహముఁ గూర్చుటయు, మఱొకవంక, ధర్మజుఁడొనర్చిన యయుక్తకార్యమును దిద్దుటయుఁ, గృష్ణుని కర్తవ్యములైనవి. అదృష్ట వశమున దుర్యోధనుఁడు గదాయుద్ధమునకు భీమునే కోరుకొనెను. కృష్ణుని ప్రయత్నము సిద్ధించినది.

ధర్మజుఁడు సంస్కృతినందిన మానవశ్రేష్ఠుఁడనుట నిక్కము. కాని మానవ స్వభావాతీతుఁడగు దివ్యపురుషుఁడుమాత్రము కాఁడు. కావుననే మనకు సన్నిహితుఁడగుచున్నాఁడు. వాల్మీకి శ్రీరాముని పురుషోత్తమునిగఁ జిత్రించి, యతని జీవితమును మానవజీవితముతో ననుసంధింపఁ జేసియుండుటవల్లనే రామాయణరచన జనరంజకమై యున్నది. అట్లే వ్యాసుఁడును, ధర్మజాదుల నింద్రియవ్యాపారములతోఁ గూడిన

మానవులుగఁ జిత్రించి, భారతపాత్రలను లోక జీవితముతో నను సంధింపఁ జేసినాఁడు.

కావ్యములలో నాదర్శమునకై యుత్తమవ్యక్తులనే ప్రధానపాత్రలుగా జేసినను, వారిలోపములను, వానివలన వారు పొందెడి యనర్థములను, సువిదితమగునట్లు చిత్రించుట లోకసంస్కరణమున కొకమార్గము. ఆ విధానముననుసరించియే నాయకుఁడగు ధర్మజుని యుత్తమగుణములతోఁబాటతని లోపములను గూడ బహిర్గతములు గావించి, వానివలని యనర్థములను కవి సువ్యక్తము గావించియున్నాఁడు. కర్ణునిచే పరాభూతుఁడై నొచ్చి శిబిరముం జేరిన ధర్మజుని సేమమరయుటకై, కృష్ణార్జును లచటికిఁ బోగాఁ గర్ణుఁడింకను బ్రతికియున్నాఁడని విని ధర్మరా జర్జునుని నిందించుట యట్టి సన్నివేశములలో నొకటి.

"విను కర్ణున కే నోడితి
ననునేటికి నీవునోడి తనిలజ మాద్రీ
తనయులు మున్నే యోడిరి
మనతోఁ గూడంగఁ గంసమర్దియు నోడెన్."

అని ధర్మరాజపుడు కిరీటినుద్దేశించి యతితీక్ష్ణముగఁ బల్కినాఁడు. దానితో నూరకొనక,

"అని వధించెదఁ గర్ణు నే నని ప్రతిజ్ఞ
నేసి యిటుదెచ్చి నన్నిట్లునేసి తింత
కెట్లునేర్చితి పొడవుగానెత్తి నేల
వైవనోర్చితి నను భగవారినడుమ."

అని తన యావేగమునంతను నర్జునునిపైఁ గ్రుమ్మరించినాఁడు. "మనతోఁ గూడంగఁ గంసమర్దియు నోడెన్" అను పల్కు సందర్భమున

కుచితమును, నర్థపోషకము నగును. ఎంతయో యాశను, నమ్మకమును గల్గించి, యుద్ధమున దింపి, యిప్పుడు వంచించి, తన్ను పరులయెదుట యర్జునుఁడే భంగపఱచుచున్నాఁడను నర్థమును సూచించుచు, "పొడవుగానెత్తి నేలవైవనోర్చితి నను బగవారివడుమ" అని ధర్మజుఁడు నిందించినాఁడు. సూక్ష్మముగఁ బరిశీలించినచో, ధర్మార్జునుల మనోగతములై యడఁగియున్న భావము లిందు బహిర్గతములై యుండుట కాననగును. భీష్మపర్వమునసే ధర్మరా జర్జునునిగూర్చి,

"అతని జయించునంచు మన మగ్గును నెంతయు నమ్మియుండఁగా
నితఁడును సంగరంబున నుపేక్షకుఁడయ్యె వృకోదరుం డొకం
డ తఱికిఁజొచ్చి దోర్బలముడాపకఁ బోరెడు నేమిసేయు నా
కితనిని నీతనిం దడవనేటికిఁ గయ్యపుజోలి మానెదన్."

అని కృష్ణునితోఁ బల్కియున్నాఁడు. అట్లే యిప్పుడును "గర్ణు నిగ్రహించుట యశక్యంబయ్యెం. సుయోధనాదికౌరవులు గనుంగొన, వానిచేతం బరిభవింపంబడి యేను జీవంబుతోనునికిం గడచిన కష్టంబునుం గలదె. అదియట్లుండె నేను జావుఁదప్పి వచ్చుట వడముడి కతంబునం గలిగె, నతండొక్కరుండును, బ్రాణంబులు దాపక, పరబలంబులు బడలువడం బోరుచున్న వాఁడు." అని కృష్ణునితోబల్కి యర్జునుఁడు మన స్ఫూర్తిగ బోరుచుండుటలేదను స్వాభిప్రాయమును బ్రకటించినాఁడు. ఈ విధమునసే, యర్జునుని యంతరంగమందును నొక వికృతిభావము నిగూఢమై స్వప్నావస్థయందువలె ప్రజ్ఞానిబద్ధముకాక వర్తించుచున్నది. అభిమన్యువధనాఁడు శిబిరమును జేరవచ్చుచు, దుర్నిమిత్తముల సూచించి కలఁతఁ జెందు నర్జునుఁడు,

"ఈమేలు ప్రజకొనర్చిన
యామహిమకు నెలవు గొంతి యగ్రతనయుఁడో"

యని ధర్మజునిపై తనకుఁగల యాక్రోశమును వెడలఁగ్రక్కినాఁడు. లోక
మున కీ యుద్ధమునెడి మహానర్థమును దెచ్చిపెట్టినవాఁడు ధర్మరాజే
యని యతని భావము. ఈసందర్భమున, ధర్మజుఁడు పరిభవ జనితమగు
దుఃఖరోషావేశమునకు లోనై నిందింపఁగనే, యర్జునుని హృదయమున
నడఁగియున్న వికారభావము క్రోధస్వరూపముఁ గైకొన్నది. మానవ
మనస్తత్త్వాదుల ప్రాబల్యము నెఱింగిన కృష్ణుఁడీ భావముల కన్యథా
ప్రవృత్తిఁ గల్పించి, ధర్మార్జునుల మానసములను బరిశుద్ధ మొనర్చి
యున్నాఁడు. 'ప్రభువు, గురుఁడు నగువాని దోషముల నెన్ని దూషించుట
యతనినిఁ జంపుటతోఁ దుల్య' మను ధర్మసూత్రముం దెల్పి కృష్ణుఁ
డర్జునునిచే నట్లు చేయించినాఁడు. అతనిమాట ననుసరించి, యర్జునుఁడు
ధర్మజునుద్దేశించి,

"కనదస్త్రంబుల నుజ్జ్వలోద్భటగదా ఘాతంబులన్ గాలఁ గే
లను విద్వేట్చతురంగ సంఘములుగూలన్ గేలిసల్పంగఁ జా
లిన యాభీముఁడు వల్కఁగాక నను దోర్లీలాసమగ్రుండవై
యనిలో నిల్వఁగలేని నీ విటులఁ గీడాడంగ నర్హ్యుండవే."

"నకులుఁడు సహదేవుండును
బ్రకట భుజాస్ఫురణమున నరాతిబలము నే
లకు గోలకు దెత్తురు నో
రికి వచ్చినయట్లు లాడిరే యిబ్భంగిన్."

"నీవు జూదంబొడఁగా వైరబంధంబు
గౌరవజాతితోఁ గలిగె మనకు
రాజ్యనాశంబు, నరణ్యవాసంబును,
దాస్యదైన్యంబు నత్యంత దుఃఖ
ములు దెచ్చికొంటి సిగ్గొలయదు నీ మనం
బున నించుకేనియు ననికిఁ జాల

కున్న వానికిఁ దాల్మియొప్పగుఁ గాక ప్ర
ల్లదములు పలికిన లాఘవంబు
సెందు మున్నేమి సేసినఁ జేసి తింక
నైన దుర్బుద్ధితనములు మాని తగిన
పౌరుషము లేము సేయఁగ నూరకుండు
నిదుమవడువారు సైతురే యింత వట్టు."

అని యగ్రజు నప్రియంబువల్క, యంతరంగంబు సంతాపంబునొంద నాత్మహత్యకై ఖడ్గమును దూసినాఁడు. ఈపల్క లప్రయత్నముగ నర్జునుని నోటినుండి వెల్వడినవి. చిరకాలమునుండియు నతనిహృదయ ముస సుప్తమైయుండిన భావవికారావేశ మీ పరుష వాగ్రూపమును దాల్చినది. మనసులోని భావ మిట్లు బైటపడినతోడనే సజ్జనుఁడగు నర్జునుని హృదయము పరితాపమునకు లోనైనది. సత్యమేయైనను నప్రియమును బల్క సజ్జను లితరుల మనసులను నొప్పింపఁజాలరు. కృష్ణుఁ డిట్లీ సోదరుల హృదయములను పరస్పర నిందాగ్నిశుద్ధముఁ గావించి, వాని కుదాత్తతను గల్గించినాఁడు. విషమ పరిస్థితుల కారణమున నేక కుటుంబమునందలి యన్నదమ్ము లావేశపూరితులై, కలహించి, మరల నంతలోననే సహజానుబంధకారణమున నేకీభవించుచున ట్లీఘట్టము నెంతయు స్వాభావిక మగువిధమునఁ దిక్కన రచించియుండుట గమనింపఁ దగినది.

అట్లీ, భీష్మునిపైఁ గోపించి యావేశమునకు లోనై యస్త్రసన్నాహ మొనరించిన కర్ణుఁడు, భీష్ముఁడు శరతల్పగతుఁడైన యనంతర మతని యెడఁ బ్రవర్తించిన విధాన మిందులకు మఱియొక యుదాహరణ.

"శరతల్పగతుండైన గాంగేయు కడకుం బోయి, కర్ణుండు భక్తివిన యంబులు దోపం బొదప్రణామం బొచరించి,

"అలుకదక్కి నన్ను నధికవాత్సల్య శీ
తలముఁగాఁగఁ జూచి తగినమాట
లాడవే మహాత్మ."

అని కంతము రుద్ధమగుచుండఁ బ్రార్థించినాఁడు. తండ్రియెడఁ గోపించి యతని విడిచిపోయిన కుమారుఁడు, కొంతకాలమునకుఁ బశ్చాత్తాప తప్త హృదయుఁడై మరణశయ్య యందున్న తండ్రిని మరల చేరిన విధము నీ ఘట్టము స్మరింపఁజేయుచున్నది. భీష్ముఁడతనిఁ జేరఁబిలిచి, యొక్క కరంబు మలంచి, కౌఁగిలించుకొని, పుత్రవాత్సల్యమును బ్రదర్శించు నంతవఱకును, గర్ణుని హృదయావేగ ముపశమించినదికాదు. "నీదెసఁ గోపింతునె, అది శిక్షగాని రోషంబుకాదు, నీవు పాండుతనయుండవగుటం జేసి, నీయెడ వాత్సల్యంబ కాని మాత్సర్యంబు లేదు," అని యా కురువృద్ధుఁ డనునయించినప్పుడు కర్ణుని హృదయ మెట్టి యమృతసేచన మొందినదో కదా! కౌరవులకు జయము లభింపదనియుఁ, గుంతీపుత్రుఁడగు కర్ణుఁడు కౌంతేయులం జేరుట శ్రేయమనియు, భీష్ముఁ డుపదేశింపఁగా నతఁడు, "దైవాధీనము సర్వమున్ మనమతిం దప్పింపఁగా వచ్చునే" యని విధివిలాసమునకుఁ దలయొగ్గియు,

"నీవింకన్ ననుఁ గొండువల్కక పరానీకంబుపై బంపు మ
త్సేవాధర్మము నిర్వహించెద—"

ననుచు యుద్ధమున కనుమతి యిమ్మని ప్రార్థించినాఁడు. మరుదినమునఁ గర్ణుఁడు యుద్ధమునకు సంసిద్ధుఁడై, భీష్ముని సమీపించి, వీరశయన మహనీయుండైన యమ్మహానుభావుని యడుగులపైఁ గన్నీరు దొరుఁగం బ్రణమిల్లి, కేలు మొగిడ్చి, వినయ వినమితశరీరుండై,

"వచ్చితి రాధేయుఁడఁ గను
విచ్చి ననుంజూడు భరతవీరాగ్రణి నీ

సచ్చరితముఫలమే యి
ట్లిచ్చట నీయునికి ధాత నేమననేర్తున్."

"పావనంబులైన పలుకులు నా చెవు
లార నెమ్మి నన్ను నాదరింపు
మయ్య ధర్మనిత్య యంచితసత్య శం
తనుకుమార గాఢధైర్యసార."

అని నిస్సహాయుఁడగు బాలునివోలె వాపోయినాఁడు. "ఇట్లిచ్చట నీయునికి నీ సచ్చరిత్రమునకు ఫల మా, ధాత నేమననేర్తున్." అను నాతనివచనములలో భీష్మునెడఁ గర్ణునకుఁగల పవిత్ర పూజ్యభావములు మాత్రమేకాక, యతని హృదయమార్దవమును వ్యక్తమగుచున్నది. కను విచ్చి చూచి తన్నాదరింపుమని కులవృద్ధుని వేడికొను గర్ణునియందు, సద్వ్యంశోచితములగు భక్తి ప్రేమౌదార్యములు మూర్తీభవించినవి. ఒకప్పుడు భీష్మునుద్దేశించి సభలో,

"నొవ్వఁబలుకుదు సభలోనఁ జివ్వకొల్లఁ
కేను గురుపతి సూచి సహించిపోదు
సురనదీపుత్ర వినుమాకుఁ జూడ నర్ధ
రథుఁడవగుదీవు లావు బీరమ్మి నరయ."

అని పల్కి, భీష్మని దుర్మాని యనుచు కోపావేశంబునఁ దృణీకరించిన కర్ణుని యందెట్టి పరివర్తనము గల్గినదో యీఘట్టమున విదితమైనది.

"దమమును సత్యముం దపము దానము శీలము నస్త్రవీర్య శౌ
ర్యములును భీష్మునంద కల వట్టి మహాత్ముఁడు పోర నీల్గె నిం
క మనకు నేటిబాహుబలగర్వము లెక్కడి సేన లక్కటా
సమసెనె కౌరవేశ్వరుని సంపద యంచు విషణ్ణమూర్తియై."

కన్నీరొలుకఁగ వగచిన కర్ణునిఁ గాంచి నరపతులెల్ల రార్తరావములు మిన్నంద విలపించినారు.

"భరితాశాంతర పాంచజన్యరవ దృప్యద్దేవదత్తధ్వని
స్ఫురణ వీనులువ్రయ్యఁ గేతనకపిస్ఫార్జత్ర్పభ జూడ్కి లా
తురతంబొందఁగ చండ గాండివ సముద్భూతాస్త్రజాలంబు లె
వ్వరు సైరింతురు నీవుదక్క భుజగర్వస్ఫూర్తినిర్వాహకా."

అను కర్ణుని వాక్యమున నతని నైజసౌజన్యము ప్రదర్శితమైనది. ఈ పలుకులలో, నతఁడు భీష్మునియెడ దనకున్న గౌరవ భావమును దెలుపు టతోఁ బాటు ప్రతివీరుఁడగు నర్జునుని గొప్పఁదనమును గూడ జంకులేక ప్రశంసించినాఁడు. విశాలహృదయులగు మహావీరుల స్వభావమిట్టిది. ఇట్లు జీవితమునసంభవించు వివిధసంఘటనలవలన మానవుని హృదయమునఁ గలుగు పరివర్తనమును, దత్కారణమగు నతనిప్రవర్తనవలన వ్యక్తము లగు నైజశీల స్వభావాదులును, దిక్కనచే నాయా ఘట్టములలో రస వత్తరముగఁ బోషితములై యున్నవి.

ఇట్లు తిక్కన యుద్ధపర్వములందు భిన్నభిన్న సన్నివేశములలోఁ బాత్రల మానసిక స్వభావాదుల కత్యధిక ప్రాధాన్యమిచ్చి, యుద్ధవర్ణన మును మానవ జీవితమునకు సన్నిహిత మగునట్లు గావించియున్నాఁడు. వీనియందలి వివిధఘట్టములను జిత్రించుటలోఁ దిక్కన యవలంబించి నది పౌరాణిక మార్గము కాదు. రూపకకర్తనలెఁ దాను పాత్రల వెనుక నొదిగియుండి, యాయా ఘట్టములను నాటకమందలి రంగ ములవలె నిర్మించినాఁడు. ఒకచో ప్రశాంత మనోహరమగు ప్రకృతి సౌందర్యము, నొకచోప్రకృతి సిద్ధములగు నుచితోపమానరామణీయ కము, మరియొకచో విశిష్టశబ్ద ప్రయోగచాతురివలనఁ గలుగు నర్థగౌరవ

రసధ్వనుల స్ఫూర్తియు, వేఱొకచో సందర్భోచితమగు సంభాషణాత్మక రసవత్తర నాటకీయ సంవిధానము, కొండొకచో, సన్నివేశానుసారమగు మానవ స్వభావ వ్యక్తీకరణము, నందందు స్థిత్యంతరానుగత మానసిక ప్రవృత్తులును, మనోరంజకమగునట్లు చిత్రించి, తిక్కన యీ యుద్ధపంచకము నుదాత్త ప్రౌఢ కవితా రచన కాదర్శముఁ గావించి యున్నాఁడు.

స్త్రీ ప ర్వ ము

పలువిధములగు రసవత్తర సన్నివేశముల కాకరము, వీరరౌద్రా దులకుఁ బ్రధానము నగు యుద్ధముతో, భారతేతివృత్తమునందలి ముఖ్య ఘట్టము సమాప్తమైనది. ఇతివృత్తముతోఁ బాటు భావము గూడ మారుట సహజము. యుద్ధభాగమునఁ బ్రౌఢాన్యము వహించిన యుత్సాహ మిప్పుడు వెనుకకొదిగి, శోక నిర్వేదములకుఁ దావిచ్చినది. సౌప్తికపర్వ గతమగు ద్రౌపదీ విలాపముతోడనే శోకము స్థాయీ రూపముఁ దాల్చినది. స్త్రీపర్వమున నయ్యది ప్రాధాన్యము వహించి, గాంధారి యొక్కయు, నితర కురుపాండవ స్త్రీలయొక్కయు నాక్రంద ములం దుత్కటమై, కరుణ రససిద్ధిం గాంచినది. యుద్ధరంగమున భర్తృ భ్రాతృ పుత్రాదుల మృత దేహములపైఁ బడి దీనముగ విలపించుస్త్రీజన సమూహమును గాంచుటచే, ధర్మజుని మనస్సు వికలమైనది. హృదయ విదారకమగు నీదృశ్యముచే నతఁడు నిర్వేదమునకు లోనైనాఁడు. యుద్ధపరిణామఫల మతనికి సంపూర్ణముగఁ బ్రత్యక్షమైనది. ఇంతటి సర్వనాశమునకును మూలహేతువగు తన ద్యూతప్రవర్తన స్మృతికివచ్చి యతనిమనస్సును వికలముఁ గావించినది. ఈ నిర్వేదమువలననే ప్రజా పాలనమునెడ విముఖుఁడై ధర్మజుఁడు వనవాసమునకు బోవనెంచినాఁడు. అతఁడిట్టి నిర్ణయమునకు వచ్చుటలో నాశ్చర్య మేమాత్రమును లేదు. తన తప్పిదము కారణముగా లోకమునకుఁ గీడు కలిగినచో సత్పురు షుని మనస్సు నిర్వేదమునొందుట ప్రకృతిసహజము. భారతేతివృత్త మునకు నాయకుఁడగు ధర్మజుని హృదయము కూడ నట్లే పరితాప తప్తమై పరిశుద్ధిఁగాంచి, ప్రశాంతి నొందవలసియున్నది. శాంతి లభించిన పిమ్మట గురూపదేశముచే జ్ఞానోదయమును, దత్ఫలముగ ధర్మనిష్ఠయు

సిద్ధింపఁగలవు. ఈక్రమము ననుసరించియే, భారతయుద్ధానంతరము శోకాధిష్ఠితమగు స్త్రీపర్వ రచన యావశ్యక మైనది. గాంధారీధృత రాష్ట్రుల హృదయములును, నట్లే. భారతేతివృత్తముతో సంబంధమున్న యందఱి హృదయములును, శోకాగ్నితప్తములు గావలసియున్నవి. పాపపరిణాను ఫలమగు శోకానుభవము నెల్లరును సమానముగ బంచు కొనక తప్పదు. కావుననే ముగ్ధయు, నవఢువు నగు నుత్తరకూడ కారవ స్త్రీలతో సమదుఃఖ భాగిని యైనది. పాపుల హృదయములు మాత్రమే కాక, పుణ్యవంతుల హృదయము లుకూడ నిట్టివిఘమున దప్తమైనప్పుడే లోకమునకు న్యాయ, ధర్మములఁ గూర్చిన స్మృతి కొంత కలుగఁగలదు. ఒకఁడొనర్చిన పాపమువలన, సంఘమున ననేకులు నశింతు రను ప్రకృతిసత్యము హృదయములలో నాటు కొనినప్పుడే, లోకులయందు పాపభీతి యంకురించును. ఇట్లు లోకమునఁ బాపభీతియు, నసత్యాధర్మ పరాఙ్ముఖత్వమును గలిగినచో ధర్మస్థాపన కవకాశ మేర్పడును. ఈమహోద్దేశము ననుసరించియే స్త్రీపర్వ ముత్కట శోకా వేగమున కాధారముగ రచితమైనది. ఇందు ధర్మజుని హృదయము నిర్భరమగు నిర్వేదమునకు లోనై పశ్చాత్తాపమును జెందినది.

తనకుమారులెల్లరును పాండునందనులచేతఁ దెగుట సంజయునివలన విని, దీనముగ దుఃఖించు ధృతరాష్ట్రుని వర్ణనతో స్త్రీపర్వ మారంభ మగుచున్నది.

"అట్లుపుత్రశతంబు వైరికులంబుచే
నిరవశేషత నొందుటన్ మహనీయ గౌరవ హీనతన్
బొరసి కొమ్మలుదున్న ద్రెంపడు భూరుహంబును బోలె ని
ర్భర విపద్వికలాత్ముఁడై ధృతరాష్ట్రుఁడుల్లము వెమ్మఁగన్."

"నా కతంబునఁ బోలిసిరి నందనులును
జెలులుఁ జుట్టంబులును సహాయులును ధైర్య
మెట్లుకలుగు వైదికముల కెట్లు మనసు
గొలుపుఁ బ్రాణంబుతో నెట్లు నిలువ వచ్చు."

శాఖోపశాఖల నన్నిఁటిని గొట్టివేయఁగా, మోడు వడియున్న వృక్షము ధృతరాష్ట్రుని ప్రకృతావస్థ కుపమానమైనది. వృక్షకాండము నుండి యుద్భవించి విస్తరించిన శాఖోపశాఖలవలెనే స్వీయ దేహజులగు పుత్ర పౌత్రాదులందఱు నశింపఁగా, కాండమాత్రావశిష్టమై నిల్చియున్న వృక్షమువలెనే, ధృతరాష్ట్రుఁడును దేహమాత్రావశిష్టుఁడై యున్నాఁడు. దుఃఖావేశమున నిర్వేదము జనింపఁగా, కర్తవ్యమగు వైదిక క్రియలకు బూనుకొనజాలకున్న ధృతరాష్ట్రునకుఁ, దగుమాటలచే సంజయ విదురులు దుఃఖోపశమనము గావించినారు. అందు సంజయుఁడు దుర్యోధనాదుల పాపప్రవర్తనమును, ధృతరాష్ట్రుని లోభమును, గతినరీతి విమర్శించి, స్వయంకృతమును గూర్చి యిప్పుడు వగచుట హాస్యాస్పదమని, ధృతరాష్ట్రుని హెచ్చరించినాఁడు.

"సుహృజ్జనంబు లుపదేశించిన మాటలు వినవైతినని' నీవ చెప్పెదు. ఉమ్మలింపం బనియేమి. నీకును నీకొడుకునకును మంత్రులు దుశ్శాసనుండును, గర్ణుండును, శకునియు నఁట ఏమి సెప్పఁగలదు."

"కొఱతనఁటుకుఁగాని కొడు కేర్పఁడును గార్య
తంత్రమునకుఁ జొరఁడు దాని నీవు
మాన్పనొల్ల వతనిమగటిమియును లావు
నచ్చి లోభ మెదఁ బెనంగొనంగ."

తృష్ణయే కారణముగ నతీసాహసమునకుఁ బూనినచోఁ బరిణామము విపరీతమగుట యాశ్చర్యముకాదు. ఈవిషయమునే సంజయుఁడు,

"జున్ను డెప్పరంపుఁజోకైన చటి నున్న
జూచి విఱుగఁబడుట చూడ కాత్మ
దీపుఁ గోరి యుఱుకు తిండికాఁడునుబోలె
నైతి వగచు టింక ననుచితంబు."

అని చక్కని లోక న్యాయమును బురస్కరించుకొని వివరించినాఁడు. అందుకొనుట కశక్యమై, యాపదకు మూలమైన కొండచటియ నున్న పట్టు తేనియకై ప్రలోభపడి, క్రిందుమీఁదెఱుఁగక, తెగనుఱుకు తిండి పోతునకుఁ గల్గిన గతియే ధృతరాష్ట్రునకును గలిగినది. అలభ్యమగు పాండవుల సంపదయందలి యతిలోభముచే యుక్తాయుక్తముల గణింపక, కృష్ణ విదురాదుల హితవచనములను గూడ సరకుఁగొనక, దైవమును లెక్కింపక, తృష్ణాపీడితుఁడై, యతిసాహసమునఁ బ్రవర్తించిన ధృతరాష్ట్రుని విషయమున నీ యుపమాన మెంతయు నుచితముగ నున్నది. 'విఱుగఁబడుటచూడక' 'తీపుఁగోరి యుఱుకు తిండికాఁడు' అను తిక్కన ప్రయోగములు తత్తద్దశాసూచకములై యర్థవంతముగ నున్నవి. ఇట్లే స్వయంకృతాపరాధమువలన సిద్ధించిన యనర్థమునకై వగచుట యవివేకము, మీదు మిక్కిలి హాస్యాస్పదము, ననుసర్థము సాభిప్రాయమగు నీ క్రింది యుపమానముచే సువ్యక్త మగుచున్నది.

"తాన చుట్టూఁదగిల్చియగ్ని యుదగ్రతం దరికొన్నఁ దా
నానుభూతికి నోర్వఁజాలక యప్రయోజన వాక్య సం
తాన శోషిత వక్త్రుఁడై యతిదైన్య మొందెదువాని యు
ష్ట్రున నీదువిలాప మన్యుల కాడఁబట్టగు భూవరా."

ధృతరాష్ట్రుఁ డవివేకమునఁ బ్రవర్తించిన విధమును, దత్ఫలమగు నతని ప్రకృతావస్థను నీయుపమానము సూటిగ విశదపఱచుచున్నది. "నీదు

విలాప మన్యుల కాడఁబట్టగు భూవరా" యను వాక్యమందలి తెలుఁగు నుడికారము కడుంగడు హృద్యమైనది. దుఃఖావేగమున నోటికివచ్చిన ట్లెల్ల వాగుటచే నోరెండుటతప్ప వేరు ప్రయోజన ముండదను నర్థ ముపమానోపమేయముల రెంటను జక్కగ సమన్వయించుచున్నది." సత్యములు, మర్మభేదకములు నగు నీవాక్యము లశక్తదుర్జనుఁడగు ధృతరాష్ట్రుని హృదయ సంస్కారమున కెంతయు నవసరములు, నుచిత ములు. ఇంతియకాక దైవికముగఁ గల్గిన పుత్రమరణ కారణమునఁ బరిణతవయస్కులైనవారు దుఃఖించుచో, సన్నిహితులగు పెద్దలు కతి పయము వారిని మందలించుట లోకమునఁ గలదు. సంజయుని పల్కు లివ్విధమున నుండఁగా, నీసందర్భమున విదురుఁ డాడినమాటలు వైరాగ్యబోధకములై యున్నవి.

"యౌవనంబును రూపంబు జీవితంబు
ద్రవ్యసంచయములు ననిత్యములు గావె
వీనిహానికి వగ పవివేకమగుటఁ
బండితులు వగఁగూరరు పౌరవేంద్ర."

"ఒకయింటనుండి వేఱొకయింటి కరిగిన
విధమును వస్త్రంబువిడిచి యొండు
వస్త్రంబుఁ గట్టిన వడువును నైయుండు
నొడలుదొఱంగి యొండొక్కయొడలు
గైకొంట నృప వినుకడవకు సారెపై
నమర మృత్తిక యిడునపుడు విరియు
టయు వెరవారఁ బట్టగరాక చెడుటయు
వాని నెత్తెడునెడ వ్రయ్యుటయును

"నెత్తి యొక-చోట డించిన నెడలుటయును
నెండి యసియుటయును నావమిడినఁ బగిలి
పోవుటయు వాఁడుజనులచేఁ బొలియుటయును
గలుగుగతి మేని కెట్లునుఁ గలుగుఁ జేటు."

మొదట, దేహి యనిత్యతను సాధారణముగఁదెల్పి, పిమ్మట, జన్మా రంభమునుండి దేహి యెన్నెన్ని గండములకు లోనగునదియు, నుత్కృష్ట మగు దృష్టాంతముచే విదురుఁడు వివరించియున్నాఁడు. కుమ్మరిసారె పై నిడిన మట్టి భాండరూపమునుదాల్చి, యెండి, కాలి, కుండ యగు వఱకును, నెన్నిగండములఁ గడపవలసియున్నదో, పిమ్మట భగ్న మగుట దాని కెట్లుతప్పదో, యిందు వివరింపఁబడినది. జన్మా రభ్య జీవినిఁ బ్రతిక్షణము మృత్యువెట్లు వెన్నాడునదియుఁ, గడపట నెట్లు తప్పక గ్రసించునదియు, నీ యుపమానము మూలమున విశదమగుచున్నది. భవబంధములపై జుగుప్సను గలిగించి వైరాగ్యము నుదయింపఁ జేయుటయే విదురుని యుద్దేశము. తదనుగుణముగఁ దిక్కనయు, భావ ప్రకటన కనుకూలించు శైలిని, రీతిని, నవలంబించి యున్నాఁడు.

"కలసి శుక్లశోణితములు కరడుగట్టి
బిను మమేధ్యమధ్యమునఁ బ్రవృద్ధిఁ బొంది
కాలవశత నప్పిండ మంగంబులెల్ల
గలిగి శిశువై మారుతగతి యెలర్ప."

"వెడలునెడ గాఢపీడం
బడి సుమువడి మోనినొత్తువడి యొకభంగిన్
వెడలగ గ్రహభూతము ల
ప్పుడు దొడఁగి యనేక దురితములు గల్పించున్."

సంగరాంగణము రమణీయము, భీషణము నగు విధమున వర్ణించిన తిక్కన యీ విషయము నేవిధమున రచించినదియు గమనింపఁదగును. ఉపమానోత్ప్రేక్షాదుల ప్రసక్తి యేమాత్రమును లేక, సూటిమాట లలో, నతిసంక్షేపముగ, గమ్యార్థ సంతను వ్యక్తముఁ జేసి యున్నాఁడు. యుద్ధాంతమునఁబుకును భారతేతివృత్త మైహిక విషయ సంబంధి. ఆముష్మిక విషయ సంబంధియగు నుత్తరభాగము, పై విదురు వాక్యములతో నారంభమగుట యౌచితీవంతముగ నున్నది.

ధృతరాష్ట్రుఁడు కౌరవ వధూవర్గముతోఁ బోలికలనికిఁ బోవుఘట్టము హృదయవేదనాపాదకమగు శోకోత్కటమున కాటపట్టుగనున్నది.

"చేతులు నడుదల సేర్చు టుత్కటశోక
మాకారములు దాల్చి నట్టులుండ
విరిసిన వేసలుల్ వెన్నులఁ బ్రక్కల
నెఱసి చూపఱుదృష్టి నీఱుసేయ
సందంద దొఱఁగెడు నశ్రుజలంబుల
పెంపున మోములు ముంపఁబడఁగ
నేమియుఁ దొడవులులేమి బాడటియున్న
యంగంబులందు దైన్యంబు నెఱయఁ

బతుల నన్నలఁ దమ్ముల సుతుల హితుల
బేరుకొని వాఁతులెండంగఁ బ్రేముడించి
పనవు పలుకులు వినువారి వనటఁ దేల్చు
కురుకుమార నారీ జనకోటి వచ్చె."

"చెలులైనఁ జూడఁ బయ్యెద
దొలఁగుటకును సిగ్గుపడు వధూజనతతి యు

త్తల యెదుర నేక వక్త్రం
బులతో నంగములు వికృతిఁబొందఁగ నడచెన్."

"విపుల హర్మ్యతలంబులు వెడలునట్టి
వెలఁది మొత్తముల్ వొల్చె బల్వేటకాఱు
పతులఁ జంపిన గిరిగుహాప్రతతి వెడలఁ
బాఱు సింగంపుఁ బెంట్లకుఁ బాటియగుచు."

"మున్నెన్నఁడు నెవ్వరికిం
గన్ను లెదురఁ బడనియట్టి కాంతలు జను లె
ల్ల న్నిలిచిచూడ వెడలిరి
కన్నులు గమరన్ సుహృన్నికాయంబులకున్."

కారవ వనితాజనము నుత్కట శోకరూపముగ వర్ణించుచున్నను, దిక్కన యిందు రాజాంతఃపురకాంతల సహజ సౌందర్య, లావణ్య, గాంభీర్యాదులను గూడ వర్ణించియున్నాఁడు. పయ్యెద తొలఁగఁగఁ జెలులు చూచినన్ సిగ్గుపడు వధూజనమనియు, మున్నెన్నఁడు నెవ్వరి కన్నుల యెదుటఁ బడనియట్టి కాంతలనియు, వర్ణించి, కురుకాంతల గుణశీలాభిజాత్యముల నెంతయు లలితముగ తిక్కన సూచించియున్నాఁడు. సార్వభౌమ వంశ వధువులైన వారి యిప్పటి దురవస్థను వర్ణించుటలోఁ దిక్కన సాధారణమగు దైన్యమున కవకాశమియ్యక, యుదాత్తతనే సముచితముగ బోషించినాఁడు. వేటకాండ్రు మగసింహములను జంపఁగా పర్వత కందరములనుండి వెల్వడు నాడుసింహములవలె, హర్మ్యముల నుండి వెల్వడు కురుకాంత లొప్పిరట. హర్మ్యమన నేడంతస్తులమేడ గనుక, నున్నతములగు హర్మ్యములకును, బర్వతములకును బోలిక. హార్మ్యాంతఃప్రదేశములకును, గిరిగుహా గహ్వారములకును సామ్యము. ఉపమాన మాకారలక్షణముల రెంటను సమగ్రమైనది. క్రోధశోకముల యుద్వేగ ముపమానోపమేయముల రెంటను సమానమే.

ధర్మజుఁ డనుజసహితుఁడై సమరతలంబునకు రాగ, నీ వని తాజనంబు
ల క్కొఁ తేయాగ్రజుం గనుంగొని, కరంబు లెత్తి యేడ్చుచు నెదు
రొ క్కని, దూఱిన విధము, స్త్రీజన స్వభావానుగుణముగ నుండుటయే
కాక, వారి యాభిజాత్యమునకుఁ దగిన సంయమనముతో నొప్పి,
గంభీరమై యున్నది.

"ధర్మవేదిత్వ మీధరణీశ్వరునకు నె
క్కడియది కృప యెందుఁగలదు తలఁపఁ
దంద్రుల మామలఁ దాతలఁ గొడుకులఁ
దోడఁబుట్టువులను ద్రుంచివై చేఁ
గ్రూరత మెఱయంగ గురుజనంబులఁ గూల్చె
సఖుల సంబంధులఁ జంపె నదయుఁ
డని పల్కుదురు కొంద ఱప్పార్థుఁజేరి గాం
గేయుని ద్రోణుని గెడయఁబొదువఁ

"బనుప నెట్లునేర్చి తని బల్కుదురు గొంద
అకట సింధురాజు ననుజమగని
దునిమి తేటిరాజ్య మని బల్కుదురుగొంద
అతఁడు మోమువాంచి యరుగుచుండ."

"ఇందఱఁ జంపితినని యుబ్బం
దీఱద ద్రుపదతనయ పట్టుల నభిమ
న్యుం డెగటార్చితి మఱిదుల
నందఱ ద్రిమ్గితి విభూతియన నీ కెద్దీ."

హృదయ శోధకములగు నీపల్కులును, వారి దీనావస్థయు, ధర్మజుని
నిర్వేదమునకు ముఖ్యకారణములగుచున్నవి.

ధర్మజాదులు గాంధారీధృతరాష్ట్రులయొద్దకు వచ్చుటయు, ధృతరాష్ట్రుఁడు భీమునిఁ జంపఁబ్రయత్నించి, కృష్ణుని యుపాయమువలన విఫలుఁడగుటయు, గాంధారీ భీములకుఁ జరిగిన సంభాషణయు,- నిత్యాదివివరములతో నొప్పు తరువాతిఘట్టమును, తిక్కన, నాటకరంగమువలె నడిపించియున్నాఁడు. అందు ధృతరాష్ట్రుని స్వభావ, మొకరూపమును వహించి, పాతకుల యెదుటఁ బ్రత్యక్షమైనది. ధృతరాష్ట్రుని దుష్టభావము తొల్లియెటెంగి త్రికాలవేదియైన కృష్ణుం డయోమయంబుగా భీమ ప్రతిరూపంబుసేయించి, సంగ్రహించి, నిగూఢప్రకారంబునం దత్ప్రదేశంబునకుఁ దెప్పించినవాఁడు గావున నద్దాని నతనియెదుటనిల్పిన, నది భీమసేనుండ కాఁ దలంచి,

"కోపంబుత్కటమై యా
రూపము నిరుగేలఁ బట్టి రూఢత ఘోరా
టోపం బెసక మెసగ నా
భూపతి వెసఁ గౌఁగిలించి పొలుపఱ వీఱిచెన్."

ఇట్లా యంధనృపతి భీముని ప్రతిరూపంబు భగ్నంబుచేసి, దుర్యోధనునాత్మకు శాంతి నాపాదించితినని యెడంద నిర్భరమగు హర్షము నొందినాఁడు. కాని, యా హర్షాతిశయమును బాహ్యము కానీయక లోకుల మెరమెచ్చునకై, భీమునిచావునకు దుఃఖించిన వాడుంబోలె నతనిం బేర్కొని హాహాకారంబు లెసంగ రోదనంబుచేసిన విధమును, దానిం జూచి, చిఱునవ్వునం దన వదనకమలంబొప్ప కమలనాభుం డతనిని మందలించిన విధానమును దృశ్యకావ్యమునందువలె వర్ణితములైనవి.

"తనయ శోకాతురుండవై ధర్మమెడలి
యనిలసుతుఁ దెగటార్చెదనని తలంచి
తట్టిపని నీదుచే నేలయగు విధాతృ
లీలఁ బరికింపనేరక భేలవైతి."

అను శ్రీకృష్ణుని పలుకులు, ధృతరాష్ట్రుని ప్రకృతిత త్వమునకుఁ జక్కని వ్యాఖ్య లగుచున్నవి. 'ధర్మమెడలి' 'విధాతృలీలఁ బటికింపనేఱిక', స్వసామర్థ్యమునే యాలంబముగఁగొని, స్వోత్కర్షకై, పాపమునఁ బ్రవర్తించిన ధృతరాష్ట్రుని స్వభావ మిట్లు వివృతమైనది. విధిప్రభావ మును గుర్తెఱుంగక పోవుటయే లోకుల పాపాచరణమునకు మూల హేతు వను విశిష్టార్థ మిందు వ్యక్తమైనది.

పుత్రశోకము గాంధారియందు మూర్తీభవించినది; ధర్మజుని శపింపఁ బూనినది. కాని, భీముఁడుపల్కిన ట్లామె సువిచార యనకతప్పదు; మంచిచెడ్డల నరయఁగల పరిజ్ఞాన మామెకుఁ గలదు. ఐనను, భీముఁడు గదతోఁ దన కుమారుని నాభికి దిగువఁ గొట్టుటయు, దుశ్శాసనునిఁ గ్రూరముగ వధించుటయు, నామెకు హృదయాఘాతము లైనవి. భీముని ప్రవర్తన యధర్మమనియు, నాసురమనియు నామె కఠినముగఁ బల్కినది. భీముఁ డందుల కుచిత సమాధాన మొసంగి, "నీవును సువిచార, వింతయు విచారింపు మనవుడు" నందలి సత్య మామె గ్రహింపఁ గల్గినది. ఐనను,

"అంధులకు నూతకోలగా నకట యొకని
నైన నిలుపక నూర్వార నదయవృత్తి
మ్రింగి తండెవ్వఁడేనియు మీకు నెగ్గు
లాచరింపనివాఁడు లేఁడయ్యె నయ్య."

"ఒక్కరుని నీవు సంపక
తక్కిననంతటనె ప్రతీనదప్పినె విభవం
బొక్కఁగ మీయన్న నతం
డొక్కటి రాజ్యంబు సేయనీఁడె కుమారా."

అని యతిదీనముగఁ బల్కినది. అడుగడుగునకునునంధున, కూతకోల

యెంతయవసరమో లోకవిదితము. వృద్ధాప్యమునఁ గుమారుఁడు నష్టో, తలిదండ్రుల కాలంబమగును. ఇ ట్లీయుపమాన మెంతయు నుచితమగు చున్నది. మరియు నంధులగు గాంధారీధృతరాష్ట్రుల విషయమున యథార్థముకూడ నగునట్లు 'ఊతకోల' యను నీ శబ్దమును దిక్కన మెలఁకువతో ప్రయోగించినాఁడు. 'అదయవృత్తి మ్రింగితివి' అనుచో 'మ్రింగు' అను శబ్ద మిచట తెనుఁగునుడికారమున కెంత సన్నిహితమో గమనింప నగును. పుత్ర శోకమునకు లోనైన, తల్లులు, తమవారిని 'మిత్తి పొట్టను బెట్టుకొన్నదనియు' 'వాఁతవేసికొన్నదనియుఁ', బల్కుట సహజము. తన కుమారుల నందఱినిఁ జంపిన భీముని విషయమునఁ బైపదములకంటె శీఘ్రుకబళనమును సూచించు 'మ్రింగి' తను శబ్దప్రయోగము మిక్కిలి సముంజసము.

దుఃఖాతిశయమునఁ దానున్నను, దనవలెనే దుఃఖమునన్న ద్రౌపదినిఁ జూచి, గాంధారి వెలువర్చిన సానుభూతి ప్రశంసనీయము. పుత్రశోకమునఁ బొగులుచు, నెండదాఁకి వందిన తీఁగచందమున నున్న ద్రౌపది, గాంధారిని సమీపించి పాదంబులకు మ్రొక్కి వెక్కుచున్న, యా వృద్ధమాత,

"పుత్రి యిట్లగునమ్మ శోకముఁబొంది కుందుచునున్న నీ
గాత్రమం దొక కీడుపాటిలి కందుఁ బొండుతనూభవుల్
పుత్రవర్గము గన్నచో నెద భూరితాపముఁబొందుడున్
పుత్రహీనతఁ బడ్డ కొంతికిఁ బొయనేర్చునె నెవ్వగల్."

"నిను నే నిట్టూరార్చెద
ననుఁ నీవూరార్పవలదె నా నీ తెఱఁగుల్
వినుఁ మొక్కరూప మన కే
మనఁగలదు విధాత క్రూరుఁడై పఱుపంగన్."

అని యామెనూరార్చినది. గాంధారి గర్భశోకము ననుభవించు చున్నది యగుటచేఁ "గొంతికిఁ బాయనేర్చునె నెవ్వగల్," యని పలుకుట, సముచితము, ప్రకృతిసహజము నగుచున్నది. అట్లే, గర్భశోకాతురయైన ద్రౌపదిస్థితియుఁ, దనస్థితి యట్టిదే యని గుర్తించినదియగుటచే, "నా నీ తెఱఁగు లొక్కరూప యగు టచే మన మొండొరుల నూరార్చుకొనవలె" నని పల్కినది. ధర్మజుని ద్యూత ప్రవర్తనవలనను, ధృతరాష్ట్రుని యుపేక్షవలనను సంభ వించిన యీయనర్థమును ద్రౌపదీగాంధారు లనుభవింపవలసి వచ్చినది. యుద్ధానర్థములను బ్రత్యక్ష కర్తలు గాక బాల వృద్ధ స్త్రీజనము లనుభ వింపవలసివచ్చుట నాఁటికిని నేఁటికినిఁ దప్పనిసరియగుచున్నది.

గాంధారి, తన దుఃఖమును మాత్రమేకాక, కౌరవ పాండవ వనితా జనముల హృదయగత దుఃఖమునుగూడ తానే వెలిబుచ్చినది. కురు వంశమునఁ బ్రతివ్యక్తికిఁ గల్గిన దుఃఖమును, దద్వంశవృద్ధయగు గాంధా రికిఁ జెందుటయు నుచితమగుచున్నది. రణరంగమున దమతమ ఆత్మీ యుల కళేబరములంగాంచి, పలువిధముల, హృదయ విదారకమగు భంగిని దుఃఖించు కురుకాంతల నొక్కరొక్కరినే, కృష్ణునకుఁ జూపి, గాంధారి తనహృదయావేదనను వెలిగ్రక్కుచున్నది.

"ప్రేవులు గండలు పెరికి వేటాఁడి యం
గదఁగొని మెదళు లగల్చికొనుచు
రాగిలి రక్తంబు ద్రావుచు లోచన
గుళికల నొలిచి మ్రింగుచును గుండె
కాయ లాదటమెయిఁ గబళించుచును గ్రొవ్వుఁ
దెమలిచి నములుచు నెముకయూట
చవిగొని యానుచుఁ జావకయున్న రూ
పులు సచ్చుటకుఁగాఁగ బెలుచఁదన్ని

కొనిన వెఱఁ బాయబారుచుఁ జెనకి తొడరి
కాటులాడుచు నున్న సృగాలములును
గాకములు రాపులుఁగులును గ్రద్దలును వృ
కంబులును మానసము వికలంబు సేయ. ”

ఇంత బీభత్సముగనున్న పొలికలని దర్శనముచే, గాంధారి మాత్రమేకాక ధర్మజాదులును హృదయవైకల్యమును బొందుటలో నాశ్చర్యములేదు. పిమ్మట భీష్మ ద్రోణులను, విరాటద్రుపదులను, ద్రౌపదేయాభిమన్యులను, సమస్త బంధుమిత్రాదులను, బనవి పనవి గాంధారి వాపోయినది.

“ కూలియుఁగాంతియుగుర్వఁగఁ దేజముగుందక వహ్నులు గ్రూరశిఖా
జాలమడంగియుఁ జాయవెలింగెడు చందమునొందిరి శల్యుఁడు బాం
చాలుఁడు గర్ణుఁడుఁ జాపగురుండును శాంతనవుండు నిజంబున కీ
ణి
బాలుఁడు వీరిప్రభం గడచెన్ గుణభద్రుని గంటె సుభద్రసుతున్.”

“ హంసతూలికాతల్పములందు బొందు
భోగిజనముల మృదుగాత్రములు ముకుంద,
కంటే బరుసని ధరణిభాగములఁ గూలి
యున్నయవి సూచువారల యుల్ల ముడుక. ”

కౌరవస్త్రీలు పడునవస్థను గృష్ణునకుఁ జూపుచు,

“ అట్టలకడ నుత్తమాంగముల్ గానక
యలమట నలుఁగడ లరయువారు
తలలు చేతులఁగొని తనువు లత్తలమున
దొఱచు పీనుఁగులలోఁ దడవువారు.
శిరములు మేనులఁజేర్చి భావించి ని
జాస్యముల్ వ్రేసికోం చఱచువారు

తునియలు పెకైక్కఁ బనివడిఁ గూర్చి హా
పులు గనుంగొని మూర్ఛ మునుఁగువారు

నైన కౌరవ పాంచాల మానినీ జ
నముల నచ్యుత, చూడుము నాథ జనక
పుత్ర సోదర శవముల పొంతకేఁగి
పెక్కు దురవస్థ లొందెద రక్కటకట."

"అవయవములు రూపఱఁగ గ్రవ్యాదభక్షి
తంబులై యున్కి గొన్నిశవంబు లువిద
లెంతసూచియు నవి గొంద లెఱుఁగఁజాల
రయ్యెదరు సూడు తమబంధులగుట కృష్ణ."

అని, యుద్ధఫలము నెట్లు నిర్దోషు లనుభవించుచున్నారో గాంధారి ప్రదర్శించుచున్నది.

"చందనార్ద్రికుట్టిమముల చరణతలము
లొందుటకు నేవగించు నయ్యువిద లిపుడు
నెత్తురుల తేవమెక్కిన నేలఁ బొరలు
చున్న వా రేమి సెప్పుదు నుడుకు పేర్మి."

"బాలలుఁ దరుణులు బ్రౌఢులు
దూలెదు వికలాంగకములతో డెందములన్
వాలిన విరహానలముల
పాలై వందురెద రొక్కభంగిన యకటా."

కోమలత్వ లాలిత్యములకు స్థానములై, సకల సౌభాగ్యములఁ దులఁ దూగుచున్న కౌరవవంశ స్త్రీలకుఁ గలిగిన దుస్థితి నీపద్యములు కన్ను

లకుఁ గట్టినట్లు వర్ణించుచున్నవి. కోడండ్రదుఃఖమును, గుమార్తె స్థితినిఁ, జూచుకొలఁది గాంధారిశోకము హృదయము పట్టరానిదైనది.

"కొడుకుచావుకంచెఁ గోడలియడలున
బెరిగి శోకవహ్ని దరికొనంగ
నంతరంగ మిప్పు డగ్గల మెగియంగఁ
"దొడఁగె దీనికేదితుది యుపేంద్ర.

హృదయమున వగలేనియ ట్టిట్టు నట్టు
దిరుగుచున్నది దుస్సల పరునిశిరము
గాన కీకూఁతు నిమ్మెయిఁ గనుటకంచెఁ
దలఁప నెక్కుడు దుఃఖంబు గలదె కృష్ణ."

దుస్సల తనభర్తశిరస్సునుగానక, హృదయమున దుఃఖము లేనిదాని వలె నిట్టట్టు తిరుగుచు వెదకుచున్నది. హృదయము శోకముచే సంపూర్ణముగ నిండియున్నప్పుడు బాహ్యముగ దుఃఖము కనఁబడకుండుటయే సహజము. ఇచట, దుస్సలయందు నక్లై, యవధిని దాటిన శోకోద్వేగ స్వరూపము చిత్రితమైయున్నది.

అభిమన్యు కళేబరముపైఁబడి దుఃఖించు నుత్తర దీనావస్థను గాంచి, గాంధారి విలపించుటలో నెంతయు నౌచిత్యముగలదు. కురువృద్ధయు నుత్కట శోకవిదూనమానమానసయునగు గాంధారికంటె నుత్తరా సుభద్రల యావేదన నెఱుంగఁగలవారెవ్వరు.

"పాడిమాలి తన్ను బలువురు పొదివినఁ
బోరి తద్ద డప్పిఁగూరి నిదుర
పోయెనొకో సుభద్రపుత్రుండు మృతుఁడైన
జెలువ మింత యేల గలుగనేర్చు."

"ఉత్తర యిక్కు-మారోత్తము నురమున
వ్రాలి మోమునఁ దన వదనకమల
మందంద సేర్చుచున్నది మున్ను గన్నంత
మెలఁగంగనేఱక చెలుల మాటు
గొను సిగ్గుపెంపున వనట నిట్లయ్యె ని
ప్పుడు మాటిమాటికిఁ బొలఁతి ప్రియుని
గనుఁగొని బిగియారఁ గౌఁగిలించుచు శిర
మూరుతలంబున నునిచి పాణి

పల్లవంబున నానన మల్లనల్లఁ
దొడయుచును నిన్నుఁ జూచుచుఁ దోడుతోడఁ
బొడము పెల్లునఁ గన్నీరుఁ దుడిచికొనుచు
నలఁత పెనువెల్లిఁ దేలెడు నంబుజాక్ష."

భగ్నజీవితయగు నుత్తర ముగ్ధస్వరూప మెంతయు స్వాభావికముగ నిందుఁ జిత్రితమైనది. వివాహానంతర ముత్తరాభిమన్యుల దాంపత్యజీవితము, నుత్తర ముగ్ధప్రవర్తన, యామె భర్తనురాగము, నిత్యాదులన్నియు నిందు సుకుమారముగ సూచితములై, యామె ప్రస్తుత శోకభావమున కుత్కర్ష నాపాదించుచున్నవి. తనకత్యంతము ప్రీతిపాత్రమగు బొమ్మ క్రిందఁబడి భగ్నముకాగా, నాశకలములను గూర్చి హృదయమునకుఁ జేర్చికొనుచుఁ, గన్నీరుఁ గురియుచు, మాటిమాటికిఁ దల్లిముఖమును జూచుచున్న బాలికవలె నుత్తర తన జీవతేశ్వరుని మృత దేహమును హృదయమునఁ జేర్చుచుఁ, గన్నీరుఁగార్చుచు, మాటిమాటికిఁ గృష్ణునిఁ జూచుచున్నది. ఉత్కటశోకభావముతోఁ, గడచిపోయిన యుత్తర లలితశృంగారము నిట్లు స్వాభావికమగు విధమున మేళవించి, తిక్కన, కరుణరసమును బోషించినాఁడు. భగ్నజీవితయగు నుత్తర ముగ్ధ

స్వారూపమున కనుగుణముగ, రచనయు లలితములగు నలఁతి యులఁతి శబ్దముల కూర్చుచే సుకుమారమై, కరుణ రసపోషకమై యొప్పినది.

ఈపర్వమంతయు నిట్టి హృదయవిదారక శోకభూయిష్ఠములైన వర్ణనలతో నిండియున్నది. పాపపరిణామ రూపమగు యుద్ధఫలము ననుభవించుచున్న లోకము, స్త్రీరూపమున భగవంతునిఁగూర్చి మొఱ పెట్టుకొన్న విధమున గాంధారి విలాప మొప్పుచున్నది. సంఘమున జరుగు పాపములకు సంఘమంతయు బాధ్యత వహింపక తప్పదు. దక్షులైన వారు పాపాచరణమునెడ నౌదాసీన్యము వహించుటకూడ, పాపమున కొకవిధముగ దోహదమే యగుచున్నది. ఈవిషయమునే కృష్ణుఁడు,

"సారపుధర్మముఁ విమలసత్యము పాపముచేత బొంకుచేఁ
బారముఁబొందలేక చెడబారినదైన యవస్థ దక్షు లె
వ్వార లుపేక్ష సేసి రది వారల చేటగుఁగాని ధర్మ ని
స్తారకమయ్యు సత్యశుభదాయక మయ్యును దైవముండెడున్"

అను మాటలలోఁ, బ్రత్యక్ష పాపప్రవర్తకులేకాక, పాపమును బ్రతిఘటింప లేక యుపేక్ష వహించిన దక్షులుకూడ, పాపఫల మనుభవింపక తప్పదని వివరించియున్నాఁడు. కావుననే గాంధారీప్రభృతు లెల్లరును దుర్యోధనకృత పాపఫలము ననుభవింపవలసివచ్చినది. లోకు లీ సత్యమును గుర్తెఱుంగక, నిర్దోషులు బాధఁజెందుటఁ గాంచి, దైవమును దూఱుదురు. అట్లే దుర్యోధనకృత పాపఫల మనుభవించు కురువంశ బాలవృద్ధ తరుణులఁ గాంచిన గాంధారి వికలమతియై కృష్ణుని శపించినది. వ్యామోహ మెట్లు వివేకమును నశింపఁజేయునదియు నిందు వ్యక్తమైనది. ద్రౌపదీ పరిభవ సందర్భములఁ దాను వహించిన యుపేక్షయే యిట్లు పరిణమించినదను జ్ఞానమివ్వుడైనను గాంధారికిఁ గలుగ లేదు. తాను న్యాయముగా నడ్డుపడి ద్రౌపదిని రక్షింపకపోవుట తన

ధర్మలోపమని, నైతిక దౌర్బల్యమని యామె తెలిసికొనలేక పోయినది. కాని, తత్ఫల మనుభవమునకు వచ్చినప్పుడు మాత్రము దైవమును దూఱినది. అన్నదమ్ముల కుమారులు తమలోఁదాము కలహించుచుండ, సమర్థుఁడయ్యును, గృష్ణుఁడుమాన్పక యుపేక్షఁ జేసెనని, యతనిని శపించినది. తన తోడికోడలికిఁ, గురుకులవధూమణికిఁ, దన కుమారులవలనఁ బరిభవము గలుగుచుండ, నుపేక్ష వహించినగాంధారి, యుద్ధమునుమాన్పక యుపేక్షించెనని కృష్ణుని నిందించుటలో, నామె వ్యామోహము వ్యక్తమగుచున్నది. వ్యామోహావిష్టమగు లోకస్వభావమే యిట్టిది.

ఇట్లు స్త్రీపర్వమున యుద్ధమువలనఁ గలిగిన లోకానర్థముఁ బ్రత్యక్షముగ, శోకభూయిష్ఠముగ, కరుణరసోత్పాదకముగ వర్ణితమైనది.

156

శాంత్యనుశాసనికాశ్వమేధ పర్వములు

కౌరవ పాండ వాంగనా జనముల యాక్రందనము లాధారముగ, స్త్రీపర్వమునఁ బోషితమైన నిర్వేదము తదనంతర కథాభాగమున శాంతిగఁ బరిణమించినది. శాంతిరసమునకు నిర్వేదము స్థాయీభావ మగుటచే, శోకాధిష్ఠితమగు స్త్రీపర్వ రచనానంతరము శాంత్యనుశాసనిక పర్వముల రచన యెంతయు నుచిత మగుచున్నది. భారతేతివృత్త పరి ణామము ననుసరించియు, నితిపృత్తాధికారి యగు ధర్మజుని జీవితపరి ణామము ననుసరించియుఁ గూడ, స్త్రీపర్వానంతర భాగము శాంత్యధి ష్ఠిత మగుట సముచితము. యుద్ధపరిణామ ఫలమును బ్రత్యక్షముగ ననుభవించుటవలన, ఖిన్నుఁడై, ప్రజాపాలన విముఖుఁడై యున్న ధర్మ జునకుఁ, గృష్ణచోదితుఁడైన భీష్ముఁడు విశిష్ట ధర్మోపదేశముం గావించి, యతని తమస్సును నిర్మూలింపఁజేసి, యతనిని స్వధర్మోన్ముఖుని గావిం చుట యీ భాగమందలి ప్రధానేతివృత్తము.

సంఘము ధర్మవిముఖమై యుండిన కారణమునఁ, గౌరవు లవాచ్య మగు పాపము నాచరించుటయుఁ, దత్ఫలముగఁ బదునెనిమిది యక్షౌ హిణుల సైన్యముతోఁగూడ ననేకులు వీరాధివీరులు నశించుటయు జరిగినది. న్యాయధర్మముల స్మరణ కొంత లోకమునఁ గలిగినది. అట్టి స్థితిలో, ధర్మపరుఁడు, నీతివంతుఁడు, శిష్టాచారగుణసంప న్నుఁడు, ననుభవజ్ఞుఁడు, నిరాసక్తుఁడు, నగు కర్మయోగి, లోకకల్యా ణము ప్రయోజనముగ రాజ్యపాలనకుఁ బూనుకొన్నచో, సంఘమున ధర్మము మఱల సుప్రతిష్ఠిత మగుట కవకాశము గలుగును. అట్టి పరిస్థి తిని, గలుగఁ జేయుట శ్రీకృష్ణుని యాశయము. ధర్మజుఁడు రాజ్య భారము వహించుచో నీ యాశయము సిద్ధింపఁ గలదు. కాని, యుద్ధ

ఫలమువలన వికలమనస్కుఁడై, నిర్వేదమునకు లోనైయున్న ధర్మజుఁడు, సంసారవిముఖుఁడుగ నున్నాఁడు.

"ధృతరాష్ట్రుండు దనూజుకీడు సమబుద్ధిం జూడ కన్నీచుఁ డే
గతిఁ జన్నంజననిచ్చెఁ గాని మగుడంగాఁ దివ్వఁడయ్యెఁ నిరా
కృత శీలుండగు నా సుయోధనుఁడు సంక్షీణంబు సేసెం గులం
బతనిం జంపఁగఁ గోపమూఁది మది శోకాక్రాంతమయ్యెం దుదిన్.

"ఆ దుర్జనుండు గర్జం బెఱుంగక దుర్మానంబు వాటించిన సైరించి తొలంగ నైతి. రాజ్యపరిగ్రహ పరత్వంబు మచ్చిత్తంబునం గలిమిం జేసి కిల్బిషం బత్యంతంబు నాచరింపవలసె. పరిగ్రహ దోషంబు పరిగ్రహ త్యాగంబునం గాని పోదు. పరిగ్రహ త్యాగశీలుండు జన్మ మరణ దుఃఖంబులం బొరయండని శ్రుతులు సెప్పెదు. అపరిగ్రహం బొక్కటన శుద్ధుండ నయ్యేద."

అను, ధర్మజు వాక్యము లతని మానసిక క్షోభనంతయుఁ జక్కగ వ్యక్తపఱచు చున్నవి. అపకారము చేసిన పాపినిఁ జంపుటతోఁ గోపము చల్లారినది. కాని, మనస్సు శోకాక్రాంత మైనది. ప్రతిహింసా చరణ ముచేఁ జిత్తస్వాస్థ్యము లభించుననుట కల్ల. తద్విపరీతమగు ఫలమును గర్త యనుభవింపవలసి వచ్చుననుట, ప్రకృతి సత్యము. Vengeance recoils itself on the perpetrator అను నాంగ్లసూక్తి యీవిష యమునే యుద్ఘోషించు చున్నది. అమానుషమగు పాప మొనర్చిన దుర్యోధన దుశ్శాసనులను జంపుటచేఁ గ్రోధము శాంతించినది; తాత్కాలికమగు తృప్తి కల్గినది. కాని, సకల హిత బంధు వర్గ నాశ నముచేఁ గల్గిన శోకవేగ ముత్కటమై, సత్పురుషుఁడగు ధర్మజుని మన స్సును వికలపఱచినది. ఇంతటి పాపమునకును గారణమగు రాజ్యసంప దన్న బూర్తిగ విసర్జించుటయే తనకుఁ గర్తవ్యమని ధర్మజుఁడు నిశ్చ

యించినాఁడు. పశ్చాత్తాపమున కిది ముఖ్యలక్షణము. ధర్మజుని మనో వైకల్యము పోవుటకును, మనస్సు ప్రశాంతత నొందుటకును గురూప దేశ మవసరము. అంతియ కాక, విశిష్ట జ్ఞానోపేతుఁడగు కర్మయోగిగ, ధర్మజుఁడు పరివర్తన మొందవలసి యున్నది. ప్రజాపాలనకు జనక మహారాజు వంటి జీవన్ముక్తులే యర్హులని, భారతీయుల యభిప్రాయము. కనుక, ప్రజాపాలన భారమును వహింపఁబోవు ధర్మజునకు, సమగ్రమగు నైహికాముష్మిక జ్ఞానము మిక్కిలి యవసరమై యున్నది. ఇట్లు శాంత్యనుశాసనిక పర్వగత మగు విషయ మంతయుఁ బ్రధానేతివృత్త ముతో సమన్వయముఁ బొందుచున్నది. జ్ఞానోపదేశమునం జేసి, స్వధర్మోన్ముఖుఁడైన ధర్మజుఁడు, రాజ్యభారమును వహించి, వ్యాస చోదితుఁడై, లోకహితార్థ మశ్వమేధమును వేదోక్తవిధమున నిర్వ హించి, దేశమునందలి రాజులనెల్లర నేకైక ధర్మశాసన బద్ధులం గావించినాఁడు. అంతియేకాక, నిరాసక్తుఁడై వేదోక్తములగు కర్మల నాచరించుట వలనను, స్వధర్మమును శ్రద్ధతో నిర్వహించుట వలనను గృహస్థుఁడు భవబంధ విమోచనముం బడయఁగలఁ డను విషయము, ధర్మజు నశ్వమేధ వృత్తాంతము మూలమున వ్యక్తీకరింపఁ బడినది. ఈ పర్వమున వర్ణితమైన సక్తుప్రస్థుని వృత్తాంతము స్వధర్మ నిర్వహణ విశిష్టతను నిరూపించుచున్నది.

ఇట్టి విశిష్టమైన స్వధర్మ కర్మాచరణమునకు విముఖుఁడైయున్న నాయకుని చిత్తవృత్తివర్ణనతో, నీఘట్ట మారంభ మగుచున్నది.

"జనసంపూజ్య పదారవిందుఁడగు నాచార్యుండు శోకించి నం
దనుఁ బ్పారయ వేడి పెద్దయు ననుం దానమ్మి యర్థింపఁ జా
వనివానిం గరిచావు బుద్ధినిడి యశ్వత్థామసచ్చెన్ నిజం
బని యేఁబొంకితి మేదినీభరణ మర్హ్యంబే గురుద్రోహికిన్."

"కడిఁదిమగండు కుంభజుఁడు గానఁగ నొడ్డిన మంటవోలె నుం
డెడి మొనఁ జూచిచూచి యిది డెప్పరమ న్వగలేక పంచితిం
గొడుకుఁ జొరంగ నత్తెఱఁగుక్రూరత సైఁప సుభద్రయట్లుఁ గ
వ్వడిక్రియ నేర్తు రే యెరులు వల్లభుఁడేలగునట్టిఁ డుర్వికిన్."

అను ధర్మజుని మాటలవలన, యుద్ధానంతర మతని మన సెట్టి పరివర్త నముఁ జెందియున్నదియు వ్యక్తమగుచున్నది. యుద్ధమధ్యమున ననతి క్రమణీయములగు విపత్కాలములలో, నతఁడొనర్చిన యకార్యముల స్మృతి యతనికి మనోవైకల్యమును గలిగించినది. సజ్జనుల చిత్తము లొక ప్పుడు వజ్రసన్నిభములైనను, స్వాభావికముగ నవి కుసుమ కోమల ములై యుండును. ధర్మజుఁడు సజ్జనుఁడగుటచే, తా నాత్మవిమర్శఁ గావించుకొని, ద్రోణాభిమన్యుల యధర్మ హాననమునకుఁ దానే బాధ్యుఁ డని నిశ్చయించినాఁడు. కనుకనే, యధర్మప్రవర్తకుఁడైన తనయట్టివాఁడు రాజ్యమునందు ధర్మము నెట్లు పాలింపఁగలఁడని సంకోచించుచున్నాఁడు. చిత్తమునకుఁ బ్రశాంతత లభించుటకుముం దిట్టి హృదయ సంక్షోభ మావశ్యకము. రాజ్యపాలనార్హత విషయమున వ్యాసుని యాశయ మెంతటి యుదాత్తమైనదియుఁ గూడ, నిందుమూలమున విదితమగు చున్నది. శ్రీకృష్ణ వేదవ్యాసాదుల యుపదేశ కారణమున ధర్మజుని మనస్సు నాక్రమించిన తమస్సు నిరస్తమైనది; చిత్త మీశ్వరాయత్తమైనది.

"మనుజులసేయ నెవ్వరు సమస్తము నీశ్వరునాజ్ఞఁ జెల్లెడు
న్వీనుము కుఠారపాణి ధరణీరుహముల్ నటికంగఁ బాపమొం
దునొకొ కుఠారమున్ జనులు దోసముఁ బొందరు కర్త యీశ్వరుం
డనియెడు నిశ్చయంబు దృఢమై మదినిల్చినఁ జాలు భూవరా."

"కర్మఫలం బీశ్వరుని యదియ. తదర్పణ బుద్ధి సహితంబుగాఁ
బ్రబుద్ధులు వేదచోదిత కర్మంబు లనుష్ఠింతురు."

అను పరాశరాత్మజుని వాక్యముల పరమార్థము ధర్మజునిచే గృహీత మైనది. అహంకార మమకారములు, రాగమోహాములు త్యక్తములు కాగా, మనస్సు కుదుటఁబడినది. కనుకనే ఆత్మ జిజ్ఞాస ధర్మజునియం దుదయించినది.

భవ్య ధ్యాననియూఢతనున్న కృష్ణునిం గాంచి, ధర్మజుఁ డతని నిరూపించి,

"పంచాత్మకంబైన పవనంబు నిగృహీత
మైనది భవ దింద్రియములు మనము
నం దాగఁబడ్డవి యవియును నదియును
బుద్ధియం దొదిగించి శుద్ధమైన
నాలవ తెరవున లోలతా రహితముల్
గాఁగ నిన్నియును సంకలితములుగ
నంచితక్షేత్రజ్ఞునందుఁ గూర్చినవాఁడ
వీ పరమధ్యాన మేమికతన
నొలసెనొకో లోకములకు నొండొక్క వింత
లేక నెమ్మది యున్నదియే కరంబు
విస్మయముఁబొందె నామది వినఁగ నర్హా
మేని వినిపింపవే నాకునిత్తెఱంగు."

అని ప్రార్థించినాఁడు. ఇట్లు యోగనిష్ఠయం దాసక్తియు, పరతత్త్వము నందుఁ జిజ్ఞాసయు, ధర్మజునకుఁ గలుగుటచే నతఁడు గురూపదేశమును బొందుటకుఁ దగిన స్థితియందున్నాఁడు. కనుక శాంత్యనుశాసనిక పర్వ గతమగు నాధ్యాత్మిక తత్త్వ ప్రకృతి రహస్యాదులన్నియు, నితనిఁ గర్మ యోగి నొనర్చుట కుపకరించినవి.

మఱియు, కథానాయకులగు పాండవుల జీవితమందలి చరమదశ ప్రశాంతతనొందుట యత్యవసరము. నాయకముఖ్యుఁడు, ఫలాధికారియు నగు ధర్మజుని సశరీర స్వర్గప్రాప్తికిఁ బూర్వ మతనిచిత్తము శాంతి ప్రధానము గావలసియున్నది. ధర్మజుని విషయమున నొక వేదాంతార్థము కూడ స్ఫురించుచున్నది. పూర్వజన్మ సంచితమగు సంస్కార కారణమున, సత్యనిష్ఠ, ధర్మపరత్వ, దైవభక్త్యాదులఁ గల్గి, వాని సహాయమున నింద్రియాదులను క్రమమున వశపఱచుకొని, రాగ ద్వేషాదులనడంచి, తద్ధర్మమును నిర్వహించినవాఁడు ధర్మజుఁడు. క్షత్రి యోచితమగు యుద్ధనిర్వహణమునందు రాజసము నవలంబించి విజృంభించినను, యుద్ధాంతమున మరల సహజ స్వభావమగు ప్రశాంత తను బొందుట యతని ప్రకృతి కుచితమైనది.

" నిసర్గసౌమ్యమేవ బ్రాహ్మం జ్యోతిః కుతోఽపికారణా
ద్ప్రాప్తవికారమపి పునఃస్వభావమే వావతిష్ఠతే. "

" కల్పాంత వాత సంక్షోభ లంఘితాశేషభూభృతః
స్థైర్య ప్రసాద మర్యాదా స్తోయవహా మహోదధేః. "

కల్పాంతమున మహావాయు సంక్షోభచే నుప్పొంగి, సమస్తపర్వతముల నతిక్రమించిన దయ్యును, మహోదధి, మరల శాంతమునుబొంది, మేర మీరక నిలుచువిధమున, స్వభావముచే సౌమ్యమగు బ్రాహ్మజ్యోతి కారణాంతరమున రాజసాది వికారమును బొందినదయ్యును మరల తన సహజ స్వభావమగు సౌమ్యమునే పొందును.

మాయా సంసర్గముచే సాంసారిక బంధములం జిక్కిన పురుషుఁడు (జీవుఁడు) సంస్కార ప్రాబల్యమున నింద్రియాదుల నరికట్టి, నిష్ణుభక్తి నాలంబముగఁగొని, వివేకాది సాధనసంపత్తిచే నరిషడ్వర్గాదుల జయించి, గురూపదేశముచే జ్ఞానియై, ఆత్మసాక్షాత్కారముంగాంచి, జీవన్ముక్తుఁ

డగునను వేదాంతార్థమును ధర్మజుని విషయమున సమన్వయింప వీలగు చున్నది. మోహావిలసితుఁడై ధర్మజుఁడు దూ్యతమున మొదట ప్రవ ర్తించియు, పిమ్మట నరణ్యవాస తపోనియమాదులచేఁ బూర్వసంస్కార స్మృతింగాంచి, యింద్రియముల నడంచి, శ్రీకృష్ణు నాలంబముగఁగొని, భీమార్జునాదిసహాయ (సాధన) సంపత్తిచే, దుర్యోధనాది శత్రువర్గ మును (అరిషడ్వర్గమును) జయించి, భీష్మగురూపదేశముచే జ్ఞానియై, యాత్మసాక్షాత్కారముంగాంచి, తుది సశరీరస్వర్గప్రాప్తియను జీవన్ముక్తి నతఁడు గాంచుట పైనుదహరించిన వేదాంతార్థముతో సమన్వయించు చున్నది. ఆత్మసాక్షాత్కార ప్రతిపాదకమగు శాంత్యనుశాసనిక పర్వ ముల రచన యీ యంతరార్థపోషణకుఁ దగియున్నది.

ఈవిశిష్టమగు నాధ్యాత్మిక తత్త్వమును బ్రతిపాదించుటలో వ్యాసుఁ డవలంబించిన విధానమును విశిష్టముగనున్నది. దివ్యాంశసంభూతుఁడును, నింద్రియవిజయియు మనోవాక్కర్మలయందు సంయమియు, జ్ఞానియు నై, జీవితమును గడపి, వీరోచితమగు ధర్మయుద్ధమున ఫలాపేక్షలేక వర్తించి, తుదిఁ, బ్రశాంతుఁడై, యుత్తరాయణము నెదురుసూచుచు, నంప శయ్యపై, నిష్ఠయందున్న భీష్మునిఁ దుపదేష్ట. ప్రాపంచికకష్టసుఖాద్యను భవము కలవాఁడు, ధర్మపరుఁడు, నాత్మవిమర్శజాత పశ్చాత్తాప మున్నవాఁడు, వీతరాగుఁడు, జిజ్ఞాసువు నగు ధర్మజుఁడు శ్రోత. బోధ్యమగు విషయము శాంతి ప్రదాయకమగు నాధ్యాత్మికము. ఇట్టి విశిష్ట పరిస్థితి కనుగుణముగ తిక్కన రచనయందును బ్రశాంతతా గాంభీర్యములు నెలకొన్నవి. భావోద్వేగ వర్ణనాదుల విసర్జించి, తిక్కన కూడ సంయ మియై రచనకుఁగడంగినాఁడు.

విరాటపర్వ, యుద్ధపర్వ, స్త్రీపర్వములను రచించుటలోఁ దిక్కన యవలంబించినది కావ్యవిధానము. తత్త్వ ఘట్టములయందలి వర్ణనీయ

విషయ వైవిధ్యమును, పాత్రల శీలస్వభావ వైలక్షణ్యమును, పాత్ర రస భేదములను, ననుసరించి, తిక్కన, తన రచనావిధానము నుచితరీతిని మార్చి యుండుటచే, నితివృత్త మాదినుండి తుదివఱకును నసాధారణ మగు చైతన్యముతో నొప్పుచున్నది. శాంత్యనుశాసనిక పర్వములందలి విషయము, నీతిశాస్త్ర ధర్మశాస్త్ర సంబంధియు, వేదాంత గతాధ్యాత్మిక సంబంధియు నగుటచే, తిక్కన రచనా విధానమును నద్దాని కుచితముగ మారినది. విపుల ప్రపంచానుభవము, విశిష్ట లౌకికాలౌకిక జ్ఞానముఁ గల్గి, జితేంద్రియత్వ యోగనిష్ఠాదుల వలన నాత్మ సాక్షాత్కారముం గాంచి, బ్రహ్మానందముం బొందిన గురుఁడు, ఇహలోక విముఖుఁడు, పరిణత మనస్కుఁడు, భక్తుఁడు, ముముక్షువు, నగు శిష్యున కుపదేశించు విధమున నీ పర్వములు రచితములైనవి. భావావేశ భావోద్వేగముల కిం దేమాత్రమును బ్రసక్తిలేదు. కావ్య సంబంధములగు నర్థవైచిత్రి, శబ్ద చమత్కారాదులకుఁ గాని, ధ్వన్యలంకార వక్రోక్తిత్యాదులకుఁ గాని, యిందుఁ బ్రవేశము లేదు. అర్థమే యిందుఁ బ్రధానమగుటచేఁ, దిక్కన, సమాసములను, గణినములగు శబ్దములను, బూర్తిగఁ బరిహరించి, రచనకు సారళ్యము నాపాదించి నాఁడు. రాజనీతిత్యాదులను, వివిధ ధర్మములను, బోధించుచో నుచితములగు నుదాహరణములు, నుపాఖ్యానములు, నర్థసిద్ధికై వివరింపఁ బడినవి. ఇట్లు ప్రసక్తములైన యుపాఖ్యానములను విపరించుటలోఁ దిక్కన కావ్య ప్రబంధాది విధానముకాక, పౌరాణిక మార్గము ననుసరించినాఁడు. దురవగాహములగు వేదాంత శాస్త్రార్థములు, నాధ్యాత్మిక విషయములు నతి సులభమగు శైలిలో, లోకసాధారణములగు చక్కని దృష్టాంతముల సాహాయ్యమున వివరింపఁ బడియుండుట, యీ పర్వముల రచనయందు గాననగు వైశిష్ట్యము. ఈ ఘట్టములందలి శైలి, సమతలమునఁ బ్రవహించు గభీర ప్రశాంతమగు గంగాస్రవంతినిఁ బోలి యున్నది.

కథా కథన సందర్భమున, యుద్ధప్రశంస వచ్చిన సందర్భమునఁ దిక్కన యవలంబించిన విధానము ముఖ్యముగ గమనింపఁ దగినది. భీష్ముఁడు నకులునకు ఖడ్గప్రభావం బెఱిఁగించుచు, నీశ్వరుని రౌద్రము నీ క్రింది విధమున వర్ణించియున్నాఁడు.

"కమలాసనుం డిచ్చిన యయ్యసిఁ గైకొని, విజృంభించి,

"హరుఁడు బెట్టుగనవ్వి పెల్లార్చుటయును
విని సముద్ధత రయమున దనుజకోటి
మునుగఁ బఱి తెంచి తాకిన మునుకొని వ
ధించి యిలయెల్ల నెత్తుట ముంచె నతఁడు."

దైత్యుల నిట్లు గీటడంచి, ధర్మమునిల్పి, ప్రసన్నరూపుఁడై, యప్పరమ కారుణికుండు, త్రిలోకరక్షణౌదాత్త్యమునన్ వెలుంగు హరిం బిలిచి, యమ్మహనీయ ఖడ్గము నతని కిచ్చినాఁడు.

రుద్రుని దనుజసంహార విజృంభణము నంతను "బెట్టుగనవ్వి పెల్లార్చి, యిలయెల్ల నెత్తుటముంచె నతఁడు." అను నాల్గు పొడిమాటలలోఁ దేల్చివేసి, తిక్కన, వర్ణనీయ విషయమును వ్యంగ్య పఱచినాఁడు. పరశురాముఁడు కార్తవీర్యార్జునాది హైహయులను జంపుటయును, నిట్లే యొక్క పద్యమునఁనే వర్ణితమైనది.

"రాముం డుద్ధత రోషపావక శిఖాప్రస్ఫీతుఁడై తున్మదున్
భూమీశాలిఁ గుఠారధార నని విస్ఫూర్జద్ధతి హైహయ
స్తోమంబాదిగఁ జొచ్చి రాజకులముం దున్మాడి చేసెఁ సము
ద్దామ క్రీడను రౌద్ర మొప్ప నిల రక్తస్యంద సంసిక్తగన్."

ప్రశాంత చిత్తముతో నిర్వాణ సమయమును బ్రతీక్షించుచున్న భీష్మునిచే శాంతిరస ప్రధానమగు విషయమును జెప్పించుటలోఁ గవియు

నెంతటి సంయమనమును వహించి యున్నాఁడో యిందు వ్యక్తమగు చున్నది.

అశ్వమేధ పర్వమందలి యుద్ధభాగమును రచించుటయందును దిక్కన యిట్టి సంయమమునే వహించి యున్నాఁడు.

భగదత్త తనయుఁడగు వజ్రదత్తుఁడు, బాహు గర్వంబునను, బాల్య సిద్ధంబగు లౌల్యంబునను, నశ్వరక్షకుండగు నర్జునునిం దాకి, యతనిపై తోమరంబు లనేకంబు లడరింపఁగా, నర్జునుఁడు,

"అనల శిఖలువోని యమ్ములగమి వాని
రూపుమాపి యన్నరుండు వాడి
లేని దొడ్డతూపు లేనింటిఁ దొడి రాచ
ణొడుకునేసెఁ దూలి పుడమిఁ గూల."

అట్లు, సింధుదేశాధీశు లర్జునుని సాంత్వన వాక్యముల సరకుఁగొనక నతనిపై విజృంభింపఁగా,

"నవ్వుచు నానా శరముల
నవ్వీరులఁ బొలియఁజేయ నంతయువిని తా
నెవ్వగతో దుశ్శల యా
కవ్వడిఁ బాత్రాన్వితముగఁ గానఁగ వచ్చెన్."

"వచ్చి, కన్నీళ్లులు వదనంబుపై వెల్లిగొన రోదనంబుసేసిన,
నతండు దయ నిలనిడియె కోదండము."

జరాసంధుని పౌత్రుఁడును నతనిమాటఁ బాటింపక, విజృంభించి యుజ్జ్వల శరావళులఁ బఱఁగింపఁగా,

–వానిని

"అట్లు నతఁడు శాతభల్లతతులం దునుమాడియు నొల్లఁడయ్యెఁ ద
త్తను వొకబాణమేనియును దాఁకఁగనేయ నరేశ్వరోత్తమా."

అసహాదేవపుత్రు గాత్రంబు దాఁకకుండునట్లుగా శరంబులు నిగిడించి, యతని యాటోప మడఁగించి, యతని ననునయించినాఁడు. అప్పే శకుని కుమారుఁడు వచ్చి, తన్నుఁ దాకినప్పు డర్జునుఁడు,

"రాజులఁ జంపకుమని మా
రా జాతియిచ్చె నుద్ధురత నే నని న
య్యోజ విడిచినప్పునఁ బ
రాజితుఁగా నన్ను నద్ధరాపతి దలఁచున్."

అని ధర్మజుసభిప్రాయమును వెలిబుచ్చినాఁడు. విధాయక మగు యజ్ఞ కర్మను విఘ్నము లేక జరుఫుటయే ధర్మార్జునుల యాశయమగుటచే, యుద్ధమున, రాజసముకంటె సాత్త్వికమే ప్రధానముగఁ బోషితమైనది. విజృంభణ మర్జునుని యుద్ధము నందును లేదు, తిక్కన శైలియందును లేదు.

భారత యుద్ధారంభమునఁనే యర్జునుఁడు గురు బంధు మిత్రాదుల హింసకు విముఖతను జూపినాఁడు. యుద్ధఫలానుభవమువల్లను, భీష్మ కృష్ణుల యుపదేశములవల్లను, బ్రబోధముం గాంచిన యర్జునుఁ డీ యజ్ఞాశ్వరక్షణ కర్తవ్యమున నిట్టి సాత్త్వికవిధాన మవలంబించు టెంతయు నుచితమైయున్నది. తదనుసరణముగ తిక్కన రచనయందును సౌమ్యభావమే నెలకొన్నది.

తిక్కన కవితా సరస్వతీస్రవంతి శాంత్యనుశాసనికములందు, సాత్త్విక రూపమునఁ బ్రత్యక్షముగఁ బ్రవహించియు, నశ్వమేధపర్వగత యుద్ధఘట్టమున నంతర్వాహినిగ నిగూఢయయ్యు వెలసినది.

" ఇంద్రియంబులు దమయిచ్చ నట్టునిట్టుఁ
దిరిగెనేనియు దుఃఖముల్ దెచ్చునవియ

కట్టువడి సుఖ మొనరించుఁ గాన యాత్మఁ
గావవలయు నింద్రియ చోరగణమువలన."

అను తిక్కన పద్యభావ మతఁడు శాంత్యాది పర్వములలో నవలంబించిన శైలివిషయమునఁ గూడ సమన్వయమునుఁ బొందుచున్నది. ఇంద్రియములఁ నడఁగించుటచే నాత్మ విశుద్ధముగఁ బ్రకాశితమగునట్లు, అలంకారాదుల నుజ్జగించుటవలన శాస్త్రార్థము చక్కఁగఁ బ్రకాశితమగును. శాంత్యనుశాసనిక పర్వ రచనయందుఁ దిక్కన యనుసరించిన విధానము నిట్టిదియే.

రసాస్వాదనచేఁ గల్గు నార్ద్రితా తన్మయత్వములును, విశిష్టార్థస్ఫూర్తి, వక్రోక్తి, చమత్కారాదులవలనఁ గలుగు హృదయాహ్లాద చిత్తవికాసాదులును, గావ్యమునఁ బ్రధానములు. కనుక, రసధ్వని కావ్యజీవముగను, నలంకార వక్రోక్త్యాదులు, తత్పోషకములుగను, బరిగణింపఁబడుచున్నవి. వాచ్యార్థము కంటెను లక్ష్యార్థ వ్యంగ్యార్థములకుఁ గావ్యములందుఁ బ్రాధాన్యమెక్కువ. అంతరింద్రియములకుఁ గూడ తృప్తినిఁ గల్గించుచు, నందును ముఖ్యముగ, మనస్సునకు నాహ్లాదమును గూర్చుచు, స్థాయీభావ పోషకములగుచు, రసోదయమునకు సాహాయ్యకములగు నలంకారాదులకుఁ గావ్యమునఁ బ్రయోజనము గలదు. ఇందు, వర్ణనీయ విషయమునకంటెను వర్ణనావిధానమున కెక్కువ ప్రాధాన్యమున్నది. కనుకనే, లక్షణావ్యంజన శక్తులును, నలంకారములును, భావపోషకములగు నితర చమత్కారములును, బహుళముగ నుపయుక్తము లగుచున్నవి. శాస్త్రములు పదార్థ ప్రధానము లగుటచే రచన విషయమునఁ గావ్యములకంటె భిన్నములగును. కనుక నిందు వాచ్యార్థము ప్రాధాన్యము వహించుచున్నది. ధ్వన్యలంకారాదుల ప్రాబల్యమువలన, వాచ్యార్థ మప్రధానమగుటయుఁ, బ్రకృతార్థముకంటె నప్రకృ

శార్థమే చిత్తవికాస హేతువగుటయుఁ, గావ్యములం దాదరణీయములు. అలంకారాదులు వర్ణనీయమగు ప్రకృతవిషయమునుండి, యప్రకృతముల పైకి మనస్సు నాకర్షించి, చిత్తవికాసమును గలిగించును. వస్తుజ్ఞాన ప్రధానములగు శాస్త్రములం దీ విధానము చెల్లదు. విషయము ప్రధానమగుటచే నిందుఁ బ్రకృతార్థము ప్రచ్ఛన్నమగుటకుఁగాని, యప్రధానమగుటకుఁగాని వీలులేదు. అట్లగుచో శాస్త్ర ప్రయోజనమే సిద్ధించదు. కనుక శాస్త్రములం డలంకారాదులకును, నితర శబ్దార్థ చమత్కారములకును బ్రవృత్తి కలుగదు. విషయ జ్ఞానము కలుగుటకు సాహాయ్యములుగ లోక న్యాయములును, బ్రకృతి సిద్ధములగు నుదాహరణములును నిందు గ్రాహ్యము లగుచున్నవి. ఐనను, నవి యర్థపోషకములుమాత్రమే యగును కాని, ప్రాధాన్యమును వహింపవు. కనుక ప్రయోజన వైవిధ్య కారణమున, శాస్త్ర రచనావిధానము కావ్య రచనా విధానము కంటెను భిన్నమగుచున్నది. అధ్యాత్మ శాస్త్ర సంబంధములగు నీపర్వములను రచించుటలోఁ దిక్కన యీ విశిష్ట మార్గము ననుసరించినాఁడు.

" ప్రకృతిదొఱఁగి తన్నుఁ బరికించు జీవుండు
పరముఁ గాంచునపుడు ప్రకృతి సగుణ
తా నిరూఢి యడఁగి తన్మయత్వము నొంది
జీవకేవలత్వ సిద్ధి యొలయు. "

" విను కేవలుఁడగు జీవుఁడు
దనుఁ బరముంగాగఁ జూచి తల్లీనత్వం
బున వెలుఁగునది నిరామయ
మనంతమగు పదమునూవె యతులవివేకా, "

విద్యావిద్యల నిరూపణ సందర్భమందలి యీపద్యములు కేవలము నర్థ గౌరవ ప్రధానములై, శబ్దార్థ చమత్కార విరహితములై, శుద్ధ సాత్త్విక రూపమున నొప్పుచున్నవి.

"ఉదిత సమగ్రబోధుఁడగు యోగికి నిశ్చల దీపరూపనం
పద సుఖసుప్త భంగి ఘనపంక్తులు లేని వియత్తలంబు నొ
ప్పిద మొదవుం దరంగములపెల్లునఁ దాఁ జలితంబుగాని వా
ర్ధిదశ నతం డకంపుఁడగు ధీపరివృత్తులు గల్గెనేనియున్."

నివాత నిష్కంపమగు దీపజ్వాలకుఁగల నిశ్చలత్వము, సుఖనిద్రనున్న వాని ప్రశాంతత, మేఘరహితమైన యంబర వినిర్మలత్వము, తరంగ రహితమగు మహోదధి ప్రసాదస్థితి, – యివి యంతర్ముఖుఁడై, ఆత్మ సాక్షాత్కార జన్యమగు బ్రహ్మానందమున లీనుఁడై యున్న మహాయోగి లక్షణములు.

"అవృష్టి సంరంభ మివాంబువాహమ్
అపామివాధార మనుత్తరంగమ్
అంతశ్చరాణాం మరుతాం నిరోధా
న్నివాత నిష్కంప మివ ప్రదీపమ్."

అను కాళిదాసు రచన యిందుఁ జక్కగ సమన్వయించుచున్నది. తిక్కన యీరచన, నిశ్చల, ప్రశాంత, స్వచ్ఛతా, లక్షణముల నొప్పుచు, వేద వాఙ్మయమువలెఁ దేజోమయరూపమున భాసించుచున్నది.

క్షత్రియోచిత ధర్మమగు యుద్ధమును నిర్వహించియు, రాజ్యపాలన మొల్లక, తపోవన గమనమును గాంక్షించుచున్న ధర్మజుద్దేశించి భీమార్జునులు పల్కిన వాక్యములు హేతుబద్ధములై, ప్రకృతార్థము నెట్లు ప్రకాశింపఁ జేయుచున్నదియు గమనింతము.

"పనివడి త్రవ్వి కూపమునందు నుదకంబు
పానంబు సేయని వాని భంగి
యాకొని యొడఁగూర్చి యన్నంబు తళియకు
వచ్చినఁ గుడువని వాని భంగి
యున్నత తరువెక్కి- జున్ను సేకుఱఁగొని
తేనియ యానని వాని భంగి
తమకించి యొకభంగిఁ దన వశంబుగఁజేసి
మానినిఁ గవయని వాని భంగిఁ

గాదె కురువరేణ్య ఘన శక్తి శౌర్యసం
పన్నులైన పగఱ భండనమున
నోర్చి పూజ్య రాజ్య మొల్లక యడవికిఁ
నేఁగు టీవ యెఱుఁగు దిత్తెఱంగు."

"కేవల నిష్కర్మత మో
క్షావహ మగునేని గిరులు నవనీజములున్
భూవర ముక్తిం బడయం
గావలదె యడవి నునికి కైవల్యదమే."

ఘనశక్తి శౌర్య సంపన్నులైన శత్రువులను మహాప్రయత్నము చేసి నిర్జించి, కార్యసిద్ధియైన యనంతరము రాజ్యానుభవ మొల్లకుండుట యెట్లవివేక మో, యర్థవత్తరములగు లోక దృష్టాంతములచే సమర్థింపఁ బడినది.

రాజధర్మమగు దండనీతి నర్జునుఁడు ధర్మజునకు వివరించుచు, హింసా రహిత మైన జీవిత మెవ్వరికిని సాధ్యము కాదని నిరూపించుటయు, నిట్లే యర్థ ప్రధానమై యున్నది.

"కాయలఁ బండ్లు నీళులను గల్గవె సూక్ష్మపుజంతువుల్ మునుల్
సేయరె హింస వాని సుపజీవితఁ ద్రవ్వరె కందమూలముల్
నీయెడఁ జూడు ప్రాణములు నిల్వఁగనేర వహింస నేరికిన్
వేయునునేల భక్ష్యముగ వేధ విధింపఁడె ప్రాణిఁ ప్రాణికిన్."

కృష్ణద్వైపాయనుఁడు ధర్మజున కపాత్ర పురుషుల నెఱిఁగించు విధానమును, నిట్టి యర్థప్రధానమగు నుదాహరణ మగుచున్నది.

"పునుకఁ గుక్కతిత్తిఁ బోసిన పాలు నీ
ళ్ళధికనిందఁ బొరయునట్లు దుష్ట
మైన పాత్ర విషయమగు నీగి వృథపోవు
నిచ్చుచోటఁ బాత్ర మెఱుఁగవలయు."

"పందునకు బిడ్డనిచ్చిన చంద మొందు
బూదిలో నేయి వేల్చుటఁ బోలు నోటి
కడవనీళ్లులు వెట్టిన కరణియగు న
పాత్రజనులకుఁ బెట్టుట పొరవేంద్ర."

ఈ శ్లో పరబ్రహ్మప్రాప్తి సాధన ప్రకారమును వివరించు పద్యముల రచన యందును సారళ్యము విశిష్టత వహించినది.

"వినయము విద్యయుం గలుగు విప్రుని యందును గోవునందు నొ
ప్పు నెఱయు హస్తియందు నొకపోకకుఁ బోవని కుక్కయందు దా
ని నడిచి తెచ్చి వండి తిను నీచపు మాలనియందుఁ దుల్యద
ర్శనులు దదంతరాత్మని నిరంజనునిం గనునట్టి పండితుల్."

ఇందు త్తమాధమ జీవుల నుదాహరించుచుఁ దిక్కన పాటించిన క్రమమును, నుపయోగించిన విశేషణములును ముఖ్యముగ గమనింపఁ

దగినవి. ఆధ్యాత్మిక విషయములను వివరించుటలోఁ దిక్కన యనుస రించిన విధానమును, నిట్లే విశిష్టమైయున్నది.

"పాలకడవ పెక్కు-పసులలో డించిన
యాతఁ డెట్లు దాని నరసికొనుచు
నుండు నట్లు లోన నునిచిన మనసు నే
మఱక యాత్మ వెదకు తెఱఁగు మేలు."

నిగూఢము, క్లిష్టము నగు వేదాంతార్థము లీ పర్వములయందు సులభ గ్రాహ్యమగు విధమున, సరళమగు శైలిలో వివరింపఁ బడినవి. బహుళ వ్యాప్తినందిన తేలిక తెలుఁగుమాటలను ప్రయోగించి, పారిభాషిక పదజాలముచే నర్థము మరుగుపడని విధమున, నెల్లర యనుభవమునకును వచ్చిన లోకన్యాయముల సహాయమున నన్వయ క్లేశము, లేని చిన్న చిన్న వాక్యములలో, నీతిశాస్త్ర ధర్మశాస్త్ర వేదాంతశాస్త్ర విజ్ఞాన సర్వస్వ సారమునంతను, సామాన్యులకుఁ గూడ సుగమమగు రీతిఁ, దిక్కన వివరించి యున్నాఁడు. ఆర్యసారస్వతమున భారతమునకుఁగల విశిష్ట స్థానమునకు శాంత్యనుశాసనిక పర్వములే ప్రధాన హేతువు లగు చున్నవి. భారత రచనాప్రయోజనము గూడ నిందే సిద్ధిఁ బొందినది. మహర్షియు, దివ్య జ్ఞాన స్వరూపుఁడు నగు, వ్యాసునిచే రచితమైన యీ భాగము నవగాహన చేసికొనుటయేకాక, శాస్త్రజ్ఞానము లేని వారికిఁ గూడ సులభ బోధ్యమగు విధమునఁ, దెనుఁగున రచింపఁగల్గిన, తిక్కన తెనుఁగువారి పాలిటి వ్యాసుఁడనుట యతిశయోక్తి కానేరదు.

పుణ్యపాపములు, ధర్మాధర్మములు, సత్యాసత్యములు, మున్నగు వానికి సంబంధించిన క్లిష్టసమస్యలను బరిమార్చుపట్ల, తిక్కన యవలంబించిన రచనావిధానము గమనింపఁదగినది. ఏదిపుణ్యమో, ఏదిధర్మమో, ఏదిపాపమో, సత్యాసత్యముల స్వరూపమెట్టిదో యిద

మిత్థమని నిర్ణయింప వీలులేని పరిస్థితులెన్నియో జీవితమున ననుదిన మేర్పడుచున్నవి.

"ధర్మ మధర్మముభంగి న
ధర్మము ధర్మంబుమాడ్కి దనయా తోఁచుఁ
నిర్మలమతి నరయవలయు
ధార్మికతన కోరువాఁడు దనకేర్పడఁగఁ."

శాస్త్రపాండిత్యము, విశిష్టజ్ఞానము లేనివా రిట్టి పరిస్థితులయం దెట్లు నడచుకొనవలసినదియు, భారతమున సూత్రప్రాయముగ, సూటిగ నిర్వ చింపఁ బడియున్నది.

బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసముల నవలంబించినవా రను సరించవలసిన ధర్మము లెట్లు కొన్నిసందర్భములలో, స్థూలదృష్టికిఁ బర స్పరవిరోధములుగఁ గన్పట్టినను, సూక్ష్మముగఁ బరికించుచో నుత్తమ ధర్మములగునో యిందుఁ జక్కగ వివరింపఁబడియున్నవి. వర్ణధర్మ, ఆశ్రమ ధర్మములను భక్తిశ్రద్ధలతో నడపుట ముక్తికి సులభ సాధనమని వివ రించుచుఁ, దిక్కన, వర్ణధర్మసమితిఁ గల విశేష సాధారణత్వంబులను సుగమము గావించి యున్నాఁడు. శాంతిపరులై జీవయాత్ర సాగింప నిచ్చగించువారి కీ జ్ఞాన మత్యంతావశ్యకమై యున్నది.

"వినుము ప్రతిగ్రహంబును యాజనంబును
నధ్యాపనమును ధరామరులకుఁ
బ్రజరక్షు నృపునకుఁ బశుపాలనము గృషి
వాణిజ్యము నివి వణిజులకును"

అని యిట్లు వర్ణధర్మములను వేర్వేరఁ బేరొక్కని, సర్వవర్ణముల పౌరి కిని సమానములగు నుత్తమ ధర్మములను, వివరించియున్నాఁడు.

... ... సత్య

శౌచంబులును నహింసయు ననసూయయు

శ్రాద్ధంబు నతిథిపూజనము నాత్మ

దారపరతయు సర్వ సాధారణంబు

లనఘ వీనను నిజవృత్తులను సమస్త

జాతులును నిహపర సౌఖ్యసంపదలకు

నాస్పదములగు నింద్యంబు లన్యవిధులు."

ఇట్లే ఆశ్రమధర్మములును తరణోపాయములని వివరింపఁబడియున్నవి.

— "బ్రహ్మచారి గృ

హస్థ వానప్రస్థ యతులు విహిత

కర్మనిష్ఠత సిద్ధింగాంతు రాశ్రమచతు

ష్కము జతుష్షష్టి కాఘటితమైన

నిశ్రేణి తుదిమొట్టునెలవెక్కుటకు నిట్టి

క్రమవర్తనము సుకరంపుమార్గ

ము."

వివిధధర్మముల నవలంబించు వారిలో, తమ తమ ధర్మములపట్ల దురభిమానమును, నన్య ధర్మములయెడ నిరసన భావమును గలుగకుండుటకై, సర్వ ధర్మ సమానత్వము బ్రతిపాదితమైనది.

"వినుమనేకవిధంబుల విస్తరిల్లు

ధర్మముల యందొకండును దలఁప నిష్ప

లంబులే దాత్మమోక్షావలంబియైన

ధర్మ ముత్తమమంద్రు తత్త్వజ్ఞు లధిప."

అని సర్వోత్తమంబగు ధర్మస్వరూపము వివరింపఁబడినది.

"దురమునఁ గైదువుఁ గొని తను
బొరిగొన నేతెంచునట్టి పురుషుని వేదాం
త రహస్యవేది నయినను
బొరిగొనినను గిల్బిషంబు వొందదు వత్సా."

అని, పాపంబులువోలె నుండియు, దూష్యంబులుగాని విషయములు వివరింపఁబడియున్నవి. సత్యాసత్యంబులతత్త్వమును విశదపఱచిన విధానమును నిట్లే విశిష్టమైయున్నది.

"సత్యంబు పలుకుట సర్వధర్మములకు
మిక్కిలి యసృతంబు మేటిపాత
కము తద్విశేషంబుగలదుచెప్పెద నొరు
నర్థంబుఁ బ్రాణంబు నపహరింపఁ
బూచు పాతకులతో సూన్యతం బాడుట
పాపంబు బొంకులు వలికి యట్టి
వారి హింసించుట వరధర్మ మిదియొక్కఁ
డేల భూతములకు హితము సేయు

బొంకులెల్లను ధర్మముల్ భూతబాధ
కంబులగు నిక్కములు పాతకములు వినుము
భూతముల దుష్ట శిష్టత్వములు వివేక
సూక్ష్మతా వేద్యములు వానిఁ జూడవలయు."

ప్రాణిహితముఁ గోరి పల్కినవెల్లను సత్యములనియు, భూతహితము పరమ ధర్మమనియు నిం దుద్ఘోషితమైయున్నది. సర్వ మతములకును నిదియే మూలసూత్రము.

కర్మాచరణ విషయమున విద్వాంసులగు వారికిఁగూడ కలుగు సందేహములను, దిక్కున, యిందు సులభ గ్రాహ్యమగు విధమునఁ బరిష్కృత మొనర్చి, సుకరమగు ననుష్ఠాన మార్గమును దెలిపియున్నాఁడు.

"వేదంబు గర్మంబుల నాచరించుటయుం బరిత్యజించుటయుం జెప్పు. ద్విధంబులు పరస్పర విరుద్ధంబులై యున్నయవి. ఇందెద్దాన నెట్టిగతి సిద్ధించు నేర్పడ నెఱింగింపవే యనుటయు;—

"విను ప్రవృత్తి కర్మ మనఘ ని
ష్కర్మ మరయ బంధకంబు మోక్ష
ణంబు నగుట బోధనత్వసంపన్నులు
సారరు కర్మ తంత్ర కరణమునకు."

"కొందఱు కర్మకరణ మభి
నందింతురు వారలకు జనన మరణములం
బొందక పోరాదు మహా
నందమునఁ బొందుదురు నిత్య నైష్కర్మ్య పరుల్."

"చిత్తశుద్ధిమాత్రఁ జేసెనేనియు నవి
ద్యాత్మకంబ చూవె యరయఁ గర్మ
మదిదొఱంగు టంచితాత్మ విద్యాత్మక
ధర్మ మదియ మోక్షదంబు సుమ్మి."

అని కర్మాచరణముం గూర్చిన ధర్మసూక్ష్మమును జిజ్ఞాసులగువారి కెఱింగించి,

"ఫలములు గోరక కర్మం
బులు నడపుచు వాని విమలబోధాగ్నిహతిం

బొలియించుచు నిర్ద్వంద్వత
నెలకొను నేకాంతిజనులు నిను గండ్రు. హరీ."

అని, యాచరణ సులభమగు కర్మసిద్ధాంతమును సూత్రప్రాయముగఁ దిక్కన, నిర్వచించినాఁడు.

సంసారము నాశ్రయించియున్న సామాన్య జను లెల్లఱకును నాచరణ యోగ్యములైన తరణోపాయములును నిట్లే సులభ బోధ్యమగురీతి వివరింపఁ బడినది.

"జనులకుఁ గీడురోయక యజస్రము ధర్మరతిం జరించి స
జ్జన గురు పూజనంబులును సత్య హితోక్తులు దీనపోషణం
బును నతిథిప్రియత్వమును భూరి దయార్ద్రితయుం గలట్టి వా
రనిమిషలోక గాములని యాత్మ నెఱుంగుము మేనకాత్మజా."

"పరుసనిపల్కు బొంకులగు పల్కులు నన్య ధనాభిలాషముం
బరవనితావిలోలతయు బాంధవ సజ్జన విప్రియంబు దు
శ్చరితుల తోడి మైత్రియును సంతత ధర్మరతాభ్యసూయయుం
గరినిభయాన ఘోరనరకంబున కేగెడివారి చిహ్నముల్."

వివిధ ధర్మశాస్త్రముల యందుఁ జర్చింపఁబడిన విశిష్టార్థములన్నియు నిట్లు సర్వజన గ్రాహ్యమగు విధమున, సిద్ధాంతరూపమున నాంధ్రభారతమునఁ బ్రతిపాదితములై యున్నవి. ఈ విషయముల వైశిష్ట్యముం బట్టియే యాంధ్రభారతము విజ్ఞానవ్యాప్తి కుత్కృష్ట సాధనమై వెలసినది.

ఆశ్రమవాస, మౌసల, మహాప్రస్థాన, స్వర్గారోహణములు

గురూపదేశమున విశిష్ట జ్ఞాన సంపన్నుఁడై ధర్మజుఁడు ధర్మ సింహాసన మధిష్ఠించి, రాజ్యపాలనముఁ గావించిన విధాన మాశ్రమవాస పర్వ పూర్వభాగమున వర్ణితమైనది. రాజుల నెల్లర ధర్మశాసన బద్ధులం గావించి, ప్రజా రంజకముగ, ముప్పదియైదు సంవత్సరముల కాల మతఁడవిచ్ఛిన్నముగ, సత్య, న్యాయ, ధర్మములను బాలించినాఁడు. గాంధారీ ధృతరాష్ట్రాదుల జీవితవిధానము, వారియెడఁ బాండవుల వర్తనము, నిత్యాది వృత్తములన్నియు, నీ భాగమునఁనే కలవు. ఆశ్రమవాసపర్వోత్తర భాగమున వర్ణితమైన ధృతరాష్ట్రాదుల యాశ్రమ గమన నిర్యాణాదులు, నాయకేతివృత్తపుఁ జరమదశకుఁ బ్రస్తావనగ నొప్పినవి. ధర్మజాదుల కిహలోక కాంక్ష యిదివరకే నశించినది. ఐనను, యుద్ధమువలనఁ గల్గిన శోక నిర్వేదములు నాయకులగు పాండవుల హృదయములం దంతర్వాహినులవలెఁ బ్రవహించుచు, వారి తదనంతర జీవితములందు మాటిమాటికిఁ బ్రత్యక్షము లగుచునే యున్నవి. ఆశ్రమవాస కథాభాగ మేతద్విషయ ప్రాధాన్యమైనది.

వ్యాసునితో ధృతరాష్ట్ర నాశ్రమమునకు వచ్చిన పాండవులు గృహోన్ముఖు లగుటకు విముఖతఁ జూపినారు. గాంధారీ ధృతరాష్ట్రాదులు, రాజధర్మమును నిర్వహింపక తప్పదని ధర్మజు నొత్తిపల్క-నతఁడు,

"ఇట్లు మీరు నన్ను నెంతయుఁ దఱిమిన
విపినభూమి మిమ్ము విడిచి పోవ

నియ్యకొనదు నాదు హృదయంబు మునుపోలె
కలుగదిపుడు రాజ్యకాంక్ష నాకు."

"విను పాంచాలుర మాత్స్యులు
పనితాజన శేషులైరి వారలు లేమిన్
జననీ శూన్యంబై తో
చినయది రాజ్యంబు నాదు చిత్తంబునకున్."

అట్లుంగాక,

"సమరము దీరిన కోలెను
శమనిరతా, నామనంబు సారతపమునన్
రమియింపఁ గోరు యుష్మ
త్సమధిక తపమునకు నేను సందడి సేయన్."

అని కుంతితోఁ బల్కి-యున్నాఁడు. సహదేవుఁడును నట్లే తపోవన వాసమునే వాంఛించినాఁడు. ఇవ్విధమునఁ గథానాయకులగు పాండవుల చిత్తవృత్తి యెట్టిహికములనుండి నివర్తితమై, యాముష్మిక మున కున్ముఖ మగుచున్నదో యీపర్వమున సూచితమైనది. ధృతరాష్ట్రాదుల యాశ్రమ జీవితము, వేదవ్యాసాగమనము, నతఁడు తన తపోమహిమచేఁ బాండవులకు మృతబంధుదర్శనముఁ గలిగించుట, కుంతీ గాంధారీ ధృతరాష్ట్రు లగ్నిదగ్ధులగుట, మున్నగు వృత్తములన్నియు నాయకులకు నైహిక బంధ విచ్ఛేదనమును గలిగించినవి.

స్త్రీపర్వమున గాంధారి మనస్తత్త్వము ప్రదర్శితమైనట్లు, యీపర్వమునఁ గుంతి మనస్తత్త్వము ప్రదర్శితమైనది. ఋత్రియోచితమగు సందేశమును గృష్ణునితోఁ బాండవులకుఁ బంపి, వారిని యుద్ధమునకుఁ బ్రోత్సహించి, వారిచే రాజధర్మమును నిర్వహింపఁజేసిన వీరపత్నియు,

వీరమాతయు, నగు కుంతి, యె ట్లా రాజ్యభోగములనొల్లక గాంధారీ ధృతరాష్ట్రులతో నరణ్యమున కేగి, వారితోడనే మరణించినదియు, నిందు వర్ణితములై నవి. కర్ణుని జన్మము మొదలుకొని, తన జీవిత మంత మగువఱకును నీమె యనుభవించిన. నిర్భరమగు హృదయ వేదన, యశాంతి, యీమె నిర్వేదమున కెట్లు హేతువులై నవియు, నిందు వ్యక్తమైనది. ధర్మజునితో నీమె,

— "దినకరసుతునిఁ
భావమునఁ దలఁపు మే నా
దేవసమునిఁ పుట్టు వడఁచితిం గపటమునఁ."

"అవ్విధమునఁ గర్ణుఁ డారడిబోయిన
నాదు మానసంబు ఖేదు నూఱు
పరియలై తలంప బలుఘాతఁ జేసిన
వారు గాఁగవలయు వంశవర్య."

అని తన యీవేదనను వెలిబుచ్చినది. అట్లే, ఆశ్రమమునకు వచ్చిన వేద వ్యాసునితో నీమె,

"కని యేటిలోనిడితిఁ గలఁ
గనినట్లయియుండెఁ దత్ప్రకారం బిది మీ
కినియది దివ్యబోధం
బున నత్తెఱఁ గంతరంగమునఁ గొని కాలున్."

అని తనయశాంతి నతనితో మొఱఁ వెట్టినది.

ఇట్లీఘట్టమందలి విషయము నాయకుల నిహలోక విముఖులఁ గావించి వారి దృష్టి నంతర్ముఖముగఁ జేయుట కనుకూలించునదియై యొప్పినది.

తదనుయాయివృత్త మగు యాదవనాశము పాండవుల యిహలో కానుబంధమును బూర్తిగఁ ద్రెంచివైచి, వారి నాముష్మికోన్నతులఁ గావించినది. సురాసురులకుఁ గూడఁ దేఱి చూడరాని యాదవకులము విధిప్రాబల్యముచేఁ దద్వంశీయుల యన్యోన్య హాననమున నశించుట రామకృష్ణుల నిర్యాణము, నర్జునాగమనము, ద్వారక సముద్రగర్భమున లీనమగుట, సత్యభామాదుల తపోవనగమనము, నిత్యాదులచే నొప్పు మూసలపర్వేతివృత్తము కరుణరస ప్రధానమగు నొక విశిష్టకావ్యముగ విరచితమైనది. యుద్ధపర్వములో నందందు సూచితమై, స్త్రీపర్వ ఆశ్రమవాస పర్వములలోఁ బోషితమైన కరుణకు మూసల పర్వమునఁ బరిణతి సిద్ధించినది. యుద్ధపర్వమునకు ముందున్న విరాటపర్వము వీర రస ప్రాధాన్యమైన మోదాంత కావ్యముకాఁగా, వానికిఁ దరువాతి దగు మూసలపర్వము కరుణరస భూయిష్ఠమగు విషాదాంత కావ్య మైనది. ఇంతియకాక, సూక్ష్మముగఁ బరికించిన నీపర్వరచనలో నొక ప్రత్యేకత గన్పట్టును. శ్రీకృష్ణుని జీవిత పరమార్థమున కీఘట్టము ప్రత్యక్షవ్యాఖ్యానము. లోకమున నన్యాయము ప్రబలి, పాపము విజృంభించి, తన్మూలమున, సత్య ధర్మములకు హాని కలిగినపుడు భగవంతుఁడవతరించి, ధర్మరక్షణ గావించునని పురాణములు వాకొనుచున్నవి. ఈవిషయమునే –

"ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే."

అనుమాటలలో శ్రీకృష్ణపరమాత్మయే యర్జునునకుఁ దెలిపియున్నాఁడుఁ భగవంతుని దశావతారములును నిట్టి ప్రయోజనముతో నొప్పినవియే. అందును గృష్ణావతారమున నీవిషయము సువ్యక్త మగుచున్నది. భారతయుద్ధ మధర్మ పరిణామ ఫలము. కృష్ణుఁడు సూత్రధారియై, యర్జునాదులచే యుద్ధమును నిర్వహింపఁజేసి, యధర్మ పరిణామ ఫలమును

లోకుల ప్రత్యక్షానుభవమునకుఁదెచ్చి, వారికి ధర్మ ప్రవర్తనయం దా
సక్తిఁగల్గించి, లోకమున సత్య, ధర్మములను స్థాపించియున్నాఁడు. ఇదియే
కృష్ణావతార ముఖ్య ప్రయోజనము. కృష్ణుని జీవితచర్యలు, నాతని
రాజనీతి, దుష్టశిక్షణ, శిష్టరక్షణాది కార్యములలో నతఁడవలంబించిన
విధానములు, నిత్యాదుల కన్నిఁటికిని పై ప్రయోజనమే పశ్చాద్భూమి
యగుచున్నది. పాపమును బ్రతిఘటించుటకుఁ దగిన నైతిక స్థైర్యము
చాలనివారై, ప్రత్యక్షముగ ఘోరము జరుగుచుండ నుపేక్షవహించియుఁ,
బిమ్మటఁ బాపులకు బానటయై నిలిచి పోరియు, నధర్మమునకు దోహద
మొనరించిన భీష్మద్రోణాదుల విషయమునకు, శ్రీకృష్ణుఁడవలంబించిన
విధానమునకు, నీమహా ప్రయోజనమే కారణ మగుచున్నది. కర్ణ
ప్రయుక్తమైన 'శక్తి'చే ఘటోత్కచుఁడు గూలఁగా శ్రీకృష్ణుఁడు,

" ప్రమోదంబునొంది, సింహనాదంబుసేసి, శంఖంబుఁ బూరించి,
పగ్గంబులు నొగల ముడిచి, మండమారుతాందోళిత మందారంబు
చందంబుఁ దోప, నర్తించుచు, నరదంబు నడిమి కరిగి, కిరీటిం గౌగి
లించుకొని, వీపవ్వళించి, వెండియు నార్చి, " -

యిట్లు తనసంతోషాతిశయమును బ్రదర్శించినాఁడు. దుఃఖ సమయమున
నిట్టివిపరీత ప్రవర్తనకుఁ గారణమేమని యర్జునుఁ డడుగఁగాఁ, గృష్ణుఁడు,
ఇంద్రదత్తము, నమోఘము నగు శక్తివలని భయ మింక నర్జునునకు
లేకుండుట యొక హేతువుగాఁదెల్పి,

" అదియునుంగాక, ఘటోత్కచుండును, కిమ్మీర బకహిడింబుల
తోడి వాఁడ. ధర్మద్వేషంబును, రోషంబును గలిమింజేసి యొక్కప్పు
డొప్పమివచ్చుం గావున, నద్దానవుల యట్ల వీని పోలిసిపోకయు నా కభి
మతంబు. వీఁడు రావణునట్టివాఁ డగుట నిపుడు సావకుండెనేనిఁ బదంపడి

నాకున్ సంపవలయు, నిది సంతోషకాలంబుకాని శోక సమయంబు కాదు," అని పలికియున్నాఁడు. తనవారు పెరవా రనుభేదము లేక ధర్మద్వేషులు, ధర్మవిముఖులు, సధర్మమునెడ నుపేక్షాపరులు నగు వారెల్లరు నశించిననే కాని, కృష్ణుని ప్రయోజనము సిద్ధింపదు. ఇట్టి మహాప్రయోజనమును సాధించుకొరకే కృష్ణుఁడర్జునుని మమతను బోగొట్టి యుద్ధము నతనిచే నిర్వహింపఁ జేసినాఁడు. అభిమన్యు ద్రౌపదేయాది కుమారులు, విరాట ద్రుపదా ద్యాప్త బంధువులు, నారాయణసైన్యము, నెల్లరు హతులు కావలసివచ్చెను. ఇరావంతుని మృతిచేఁ, బుత్రశోకానలసంతప్త చిత్తుండగు సవ్యసాచిం జూచి గోవిందుఁడు మందస్మితంబుఁ జేసి, యతనికి సృష్టితత్త్వమును స్మరణకుఁ దెచ్చియున్నాఁడు. యుద్ధానంతరము పాండవులను రాజ్యాధిష్ఠితులఁ గావించి, వారిచే నశ్వమేధ మొనరింపఁజేసి, భారత యుద్ధమునఁ బాల్గొనని రాజులను గూడ నశింపఁజేసియో, లేక, ధర్మమార్గోన్ముఖులఁ గావించియో, కృష్ణుఁడు లోకమున ధర్మమును బ్రతిష్ఠించి యున్నాఁడు.

యాదవులు బలరామ కృష్ణుల ప్రాపునఁ బ్రబలి విశృంఖలులై రి. మదోన్మత్తులై, యవినీతిపరులై, ధర్మనాశముఁ గావించుటకు సంసిద్ధులైయున్న యాదవుల నాశముతోఁ గృష్ణుని జీవిత ప్రయోజనము పూర్తియగును. దానికి గాంధారిశాప మొక నెపము. ఆశాపము ఫలించు కాలము సమీపించు నప్పటికి, యాదవుల ప్రవర్తనయును నీతి బాహ్యముగఁ బరిణమించినది.

"బలుఁడు

హరియును దక్కఁగ యాదవ నివహంబు

బ్రాహ్మణ ప్రతతికి బాధసేయు."

"గురుల కవమాన మొనరించు దిరుగు లజ్జ
విడిచి యభిలాషముల వెంట విభుల పంపు
సేయ కున్మార్గములఁ దమ చిత్తములకు
వచ్చినట్ల వర్తింతురు వనిత లధిప."

సంఘమిట్లు నీతి బాహ్యమై, యధోగతి నందినప్పుడు, వినాశము తప్పదు. తద్వినాశమును సూచించుచుఁ, బ్రకృతివిరుద్ధము లగు విశేషములు గల్గుటయు సహజమే. అట్లే, ద్వారకా నగరమున మహోత్పాతము లనేకములు పుట్టినవి.

"అరుణములు ఘూర్ణితంబులు నైన లోచ
నములు మెఱయ మహోగ్రదండము ధరించి
తిరుగు నొక్కొక్క చోట నదృశ్యఁ డగుచు
నంతకుం డిదె యదె తోఁచె ననఘ నధిప."

"వినుఁ గూడు గూర పాకము
గనుఁగొని ప్రొయివాపి డింపఁగా నప్పుడ నం
జనితములై ప్రువ్వులు గల
గొన మిలమిల మెదలు నందుఁ గురుకులముఖ్యా."

అని మనస్సులు వికలము లగు విధమునఁ దిక్కున యా మహోత్పాతములను వర్ణించియున్నాఁడు. "అప్పుడ సంజనితములై ప్రువ్వులు గలగొన మిలమిల మెదలు నందుఁ గురుకులముఖ్యా," అను వాక్యమునఁ బ్రయుక్తములైన శబ్దము లెట్లు వర్ణనీయ విషయమును బ్రత్యక్షము సేయుచున్నవో సుగమము.

గాంధారీ శాపకాలము సమీపించుటయు, యాదవులు కణ్వాది మహర్షుల నవమానించుటయుఁ జరిగినది. యాదవుల దోషములవలనఁ

గలిగిన మునిశాపము నాధారముగఁ గొని, పాప నిర్మూలనమునకు దోహద మొనరించి, శ్రీకృష్ణుఁడు స్వప్రయోజనమును సాధించినాఁడు. లోకుల పాపము ప్రదర్శిత మగునట్లు చేసి, పాపఫలమును వారిచే ననుభవింపఁ జేసి, తనూర్మూలమున ధర్మమును స్థాపించుట యతని యాశయము. యాదవుల కట్టి శిక్ష నీయఁదగిన యవసరము వచ్చినది.

కణ్వాది మహర్షులు యాదవ క్షయాపాదకముగా నొసంగిన శాపము సంగతి వినియు, నియతియగు నవస్థకు నన్యథాత్వకరణము తలఁపఁ జన దని యూహించి, కాలవేదియగు శ్రీకృష్ణుఁ డుపేక్షించియుండెను. తన చుట్టునున్న బంధులఁ గనుంగొని, విధాతృకరణీయ మిట్టిదనియు, నిది వృష్ణికుమారుల తప్పిదమునఁ గల్గెనని చింతింపకుండనియుఁ, బల్కి, వారి నూరార్చి కృష్ణుఁ డభ్యంతరమున కరిగెను. ద్వారకాపురంబున మహోత్పాతంబు లనేకములు కలుగఁగాఁ, గృష్ణుఁడు సర్వవిదుండగుట, గాంధారీశాపము ఫలించు సమయ మేతెంచెనని గుర్తించి, యాదవ నాశము తీర్థ సమీప భూమియం దగుట శ్రేయమని నిర్ణయించినవాఁడై, యాదవుల నెల్లర నుత్సవ వ్యాజమున సముద్ర ప్రాంతమునకుఁ దరలించు కొనిపోయెను.

"తన రథములేమి నొండొక
ఘన రథమును దారుకుండు గైకొని యెలమిం
గొని రా వెడవెడఁ గైసే
సిన కృష్ణుఁడు నిర్వికార చిత్తత వెడలెన్."

"తొడవు చీర పూత తొంటియట్టులు గాఁగ
నేమి వాహనమ్ము నెక్కఁ కించు
కేని వికృతిలేని హృదయంబు మిత్ర సం
భాషణంబుఁ గలిగి బలుఁడు వెడలె."

ఇట్లు నిర్వికార చిత్తులై వెడలిన రామ కృష్ణుల యందుఁ గాలపురుషుని శాంత గాంభీర్యములు సూచితము లగుచున్నవి. సముద్రతీరమున యాదవులు ప్రవర్తించిన విధము, ఆసన్న వినాశనమున కనుగుణముగ నున్నది.

"భూమిసురావళీ మహిత భోజన తంత్రముఁ దీర్పఁబూని హృ
ద్యామల రాజితంబులగు నట్లొనరించిన కూడుఁ గూర లా
కోమలు లాగఁగాఁ గడఁగి క్రోఁతుల కన్నియుఁ బంచివెట్టి రు
ద్దామ విహారలీల వసుధామర యాదవు లేమి సెప్పుదున్."

"విను తదనంతరంబ మదవిహ్వల భావము సేయఁజాలి యిం
పొనరిన యాసవంబులు సముత్సుకతం గనకంపుఁ గోఁలం
గొని హరి సన్నిధానమునఁ గ్రోలిరి యాదవు లంతరంగ మో
దన కరణంబులైన యుపదంశములన్ గొనుచున్ మహీశ్వరా."

ఇట్లు సాత్యకి ప్రద్యుమ్నాది యాదవులెల్లరు, విధివశమునఁ గాంక్షీ దీఱఁ బానవిధి యొనర్చిరి. మదిరావేశమునకు లోనై సాత్యకి కృత వర్మను నిందించుటతోఁ గలహ మారంభమైనది. సాప్తిక విషయగత మగు కృతవర్మ నీచ పరాక్రమమును సాత్యకి నిందింపఁగాఁ, గృతవర్మ, భూరిశ్రవ వధ విషయమును బేర్కొని సాత్యకినిఁ దూలనాడినాఁడు. శమంతకమణికై శతధన్వుఁడు సత్రాజిత్తును జంపిన విధమును, సాత్యకి స్మరణకుఁ దేగా, సత్యభామ వనితా స్వభావోద్గతాశ్రుపూర మైనది. కృష్ణునకును గృతవర్మాదులపై రోషము జనించినది.

ఆతఁడు కృతవర్మాదుల నతిక్రూరముగఁ జూచి, వారియెడఁ దన యసహ్య భావమును బ్రదర్శించినాఁడు. ఇట్లు సాత్యకి కృతవర్మాదులపై విజృంభించునట్లు చేసి యాదవ నాశమున కొక విధముగఁ గృష్ణుఁడు కూడ దోహద మొనర్చినాఁడు. కృతవర్మ వధానంతరము భోజాంధక వీరు

లెల్లరును సాత్యకి నాక్రమించినపుడు, కృష్ణుఁడు, కాలవేదితన్ దమ్మునిఁ గాచు సముదగ్రత నొల్లఁడయ్యె. మునిశాప మాహాత్మ్యమునను విధి ప్రాబల్యమునను యాదవులు క్రోధావేశ వివశులై, ముసలత్వ విస్మార్తితో నొప్పిన తుంగలచే నొండొరుల మోదుకొని నశింపసాగిరి.

"తండ్రి పుత్రుఁ డన్న దమ్ముఁడు నాక య
య్యలు దెఱంగువారు నేపుఁ గేఁగి
మడియ మోద గాలిఁ బడు వ్రాకుగముల తె
ఱంగు దోఁచె నేమనంగఁ గలదు."

"మునిశాపము వారల మది
నసయము నసమెక్కఁజేయ నందొక్కఁడైన
విను మఱలుట దెఱలుట లే
కని బెట్టుగఁ జేసి రధిప యార్వులు సెలఁగన్."

అనిరుద్ధ ప్రద్యుమ్నాదులెల్లరు హతులు కాగాఁ, బరమ ముసీంద్ర శాపశక్తిచేఁ గోపాగ్ని తనదు చిత్తమున నుద్ధురమై జనింపఁగాఁ గృష్ణుఁడును, హతశేషులగు ప్రతివీరులపైఁ గవిసి, తుంగలఁగొని మోది, నిరవశేషముగఁ జేసి, గాంధారీ వాక్యమును బార మొందించెను. అనంతరము గజాదులను, నింతులను బురిఁజేర్చి తన తపోవన గమన నిశ్చయమును వసుదేవాదులకుఁ దెలిపి, వారిని వీడ్కొని, కృష్ణుఁడు బలరాముఁడున్న యెడకుఁ బోయెను. బలరాముఁడు తన యోగబలమ్మ్మ పేర్మిఁ దనువు విడిచి, మహాభుజంగ రూపమున వియద్వీథి నంబునిధికిఁ బోవుటయు, ననంతుఁ డమూర్త్యంతరమును దన పరమమూర్తియందుఁ గలిపి కొనుటయును, గృష్ణుని దివ్యదృష్టికి గోచరమైనది. అట్లగ్రజుఁడు చనఁగా, లోకపాలనకునై భూలోకంబునందుఁ దాఁ బుట్టంగవలసిన యట్టి మేటి పనులెల్ల దీఱుట మనమునఁ

దలపోసి, తనువిముక్తికి నిమిత్తము నరసినాఁడు. మునుల వాక్యము తెఱంగును, దొల్లి దుర్వాసు నవయవసమితిఁ బాయసముఁ బూయునప్పు డరకాలఁ బూయమి నత్తపస్వి యచట, నవిలంఘ్యమై యపాయంబు గలుగు ననిన మాటయుఁ జర్చించి, మనసు నడంగించి, గాఢ సమాధి నొందిి, మహీస్థలశయనుం డయ్యెను. 'జర' తన్ను మాయచే నావహింప నొకబోయ కృష్ణునిఁ జూచి, కృష్ణసారంగ మను భ్రాంతికి లోనై బాణ ప్రయోగముఁ గావించినాఁడు. ఇది తన తనువిముక్తికి నిమిత్తము కాఁగా, హరి మానుష దేహమును విసర్జించి, నిజపదంబు నొందుట కరిగెను. దేవ ముని గణములతో దేవేంద్రుఁ డాశ్రీహరి నెదురొక్కాని భక్తితోఁ బ్రణమిల్లి,

"ధర్మరక్షణకునై దయావిధేయమగు ఖేలనంబున నవని నవతరించి, కంసాది పాపులనెల్ల సమయఁజేసి, భరత కులము కసటు వాపితి" వని స్తుతించినాఁడు. ఇట్లు యాదవ నాశముచేఁ గృష్ణావతార ప్రయోజనము పూర్తియైనది. శ్రీకృష్ణుఁడు వహించిన యుపేక్షవలన యాదవనాశ మవశ్యభావ్యమగుట కొంతవరకు వసుదేవునకును గోచరమైనది. ఎట్టి కార్యము నైనఁ జేయ వలఁతి, మృతుఁడగు పరీక్షితునిఁ బ్రతికించినవాఁడు, నగు కృష్ణుఁడు యాదవ నాశమునెడ నుపేక్ష వహించెనని వసుదేవుఁడు,

"వలసిన నెట్టి కార్యమును వావిరి నెట్టుగనైనఁ జేయఁగా
వలఁతి మృతుం బరిక్షితుని వత్సలతన్ బ్రతికించె శౌరి మొ
క్కలమున యాదవుల్ పెనఁగఁగాఁ గని మాన్పఁ డుపేక్ష సేసె నీ
పొలియు టవశ్యభావ్య మని బుద్ధిఁదలంచుట గాననయ్యెడున్."

కృష్ణుని నిర్యాణమును గూర్చి దుఃఖించు నర్జును నోదార్చుచు, వేదవ్యాస మహర్షి "హరి యెఱుంగు మున్న యాసంక్షయం" బని, పలికెను. "మూడుభువనముల నన్యథాత్వంబుఁ బొందఁ జేయఁ జాలు

వాఁడు కణ్వాదుల శాప ముడుపలేఁడయ్యెనే" యని పలికి వేదవ్యాసుఁ డర్జునునకుఁ గృష్ణుని జన్మరహస్యమును బోధించినాఁడు.

"ధరణి భరంబు వాప నవతారము నొందిన విష్ణుఁ డత్తెఱం
గరుదుగనిర్వహించి యజరామర నిష్కల నిర్వికార భా
స్వర నిజ సత్పదంబు నుపశాంతి పరుండయి పొందె దానికిఁ
గురుకులవర్య శోకమునఁ గుందుదురే మిముఁబోటి బోధనుల్."

"అవనీ భారము వాపి తాహారికిఁ దోడ్డై భీమసాహాయ్య గౌ
రవ దుర్దాంత పరాక్రమంబునఁ గృతార్థత్వంబునం జేసి య
స్త్రవితానంబును నిన్ను బాసి చనియెఁ దైవప్రకారజ్ఞ నీ
దు వరిష్ఠాచరణంబునన్ సురలు సంతోషించి రప్సోరులన్."

"బలమును బుద్ధియుఁ జేవయు
నలఘు మతియు నుల్లసిల్లు నగు కాలమునన్
బొలియుం గాల విపర్యయ
కలనంబున బుధుల కుబ్బుఁ గలఁకయుఁ గలవే."

నర నారాయణులను బురాణమునులు లోక కల్యాణార్థమై పార్థ, పార్థ సారథులుగ జన్మించి, తత్ప్రయోజనమగు ధర్మసంస్థాపనఁ గావించిరని భారతమువల్లఁ దెలియుచున్నది.

"నరుఁడు నారాయణుండు ననంగ బఱఁగు
నిత్యపురుషులు నీవును నేను జూమ్మీ
భువన హిత మాచరింపఁగాఁ బూని వేడ్క
వచ్చి యిమ్మహిఁ బుట్టినవార మనఘ."

ఈవిషయమునే శ్రీకృష్ణుఁడును నర్జునునకు హరిహరాభేదమును దెల్పి తఱి బోధించినాఁడు.

"నానారూపంబుల ని
న్నేను బ్రవర్తింతు జగము లన్నింటను నీ
శానుఁడు నభవుఁడు నమృతుఁడు
నైన శివుని నీవు గొలువు మర్జున యెపుడున్."

"ఏను రక్షింప జయము నీ కెసకమెసగ
సమరమున శూలపాణివై శత్రుకోటి
నీదు మునుమున వధియించు నిరుపమాన
తేజు రుద్రుగా నెఱుఁగుము ధీరచిత్త."

అర్జును నొక నిమిత్తమాత్రునిగఁ జేసి, తానే భారత యుద్ధము నంతను నిర్వహింతునని, కృష్ణుఁడు నుడివియున్నాఁడు. ఈవిషయము నింతకు ముందే వ్యాసుఁడు,

"నీ వనిసేయ నీవలని నెయ్యమునం గృప నన్యసైన్యముల్
దా వధియించు శూలధరతాస్ఫురణం బెసఁగంగ ముంద ఆ
ద్దేవుఁడు దానిఁ గాంచు భవదీయ సమంచిత దృష్టి యున్ నినున్
గావఁడ యామురాంతకుఁడు గాలవిపర్యయ మావహిల్లుటన్."

అని యర్జునునకుఁ దెల్పి, యతని నావరించిన మాయను దొలఁగించి నాఁడు. అర్జునుఁడు శ్రీకృష్ణుని దివ్యత్వమును గ్రహించిన భక్తుఁడు. అతఁడు నిర్వహించిన ప్రతి కార్యమునకును శ్రీకృష్ణుని ప్రోత్సాహమే కారణము. శ్రీకృష్ణపరమాత్మ సంకల్పమును నిర్వహించు భౌతిక శక్తి యర్జునుఁడు. కృష్ణార్జునుల సంబంధము మనోదేహముల సంబంధ మును బోలినది. యాదవనాశమును గూర్చి వినినంతనే భావిప్రళయ మర్జునునకు గోచరమైనది. మూసలపర్వ గతేతివృత్తమునఁ జిత్రితుఁడైన యర్జునుని యందుఁ బూర్వపు సాహసోత్సాహములు లేవు. కృష్ణుని

నిర్వాణముతో నర్జునుని శక్త్యుత్సాహములన్నియు నతనికిఁ దెలియ కయే, యొక్కమ్మడి నంతరించినవి. ఉత్తర దిగ్విజయ, పాశుప తాస్త్ర ప్రయత్న, గోగ్రహణ విజయాది ఘట్టములందలి యర్జునుఁడు వేఱు, యిప్పటి యర్జునుఁడు వేఱు. ఇతివృత్తమునందలి దశా భేదముల ననుసరించి పాత్ర పోషణమున కవి యెంతటి యౌచిత్యమును బాటించి యున్నాఁడో యిందుఁ జక్కగ వ్యక్తమగుచున్నది.

సైంధవ వధనాఁడు, లోకాతీతము, నద్భుతము, దివ్యము నగు శక్తి సామర్థ్యములను బ్రదర్శించిన యర్జునుఁడు మూసలపర్వ కథాభాగమునఁ గేవలము నరుఁడైనాఁడు. శాంతి స్థైర్యములు, నుచితజ్ఞతా బంధు ధర్మములు, ప్రజారక్షణభారము, పరిణతమగు జ్ఞానము, – నివి యిప్పటి యర్జునుని జీవితమునఁ బ్రాధాన్యము వహించినవి. ప్రాపంచిక విషయ ముల యెడ నొక విధమగు వైముఖ్యము, విధివిలాస మవిలంఘనీయ మను జ్ఞానము, తత్ఫలమగు నిరాసక్తి, వీనితో నొప్పుచున్న యర్జు నుఁడు, విషాదగర్భితము, కరుణరస భూయిష్ఠము నగు మూసలపర్వ కథయం దుపనాయకుఁడై, కృష్ణుని యంతిమాదేశమును శిరసా వహించి, తనధర్మమును నిర్వర్తించినాఁడు. ఇట్లు, మూసలపర్వమందలి యితివృత్తము కృష్ణావతార ప్రయోజనమును, సువ్యక్త మొనరించుచు, భగవంతుని యీ యవతారమునకుఁ బ్రత్యక్షవ్యాఖ్యయై యొప్పినది.

మఱియు, మానవుని జీవిత పరిణామమున కంతకును మూలకందమై, యతని శీల స్వభావ ప్రవర్తనాదులకు హేతువై, యనుల్లంఘ్యమై యొసఁగు సంచిత కర్మ పరిపాక ప్రాబల్య మెట్టిదో యీఘట్టమున నిరూపితమైనది. మణిహారమందలి సూత్రమువలె భారతేతి వృత్తమున నాదినుండియుఁ బ్రచ్ఛన్నముగ, ననుస్యూతమై వచ్చిన విధిప్రాబల్య మిందుఁ బ్రకాశితమైనది.

"వినుము పురాతన జన్మం
బునఁ జేసినయట్టి కర్మముల ఫలములు ప్రా
ఙ్ఞునినైనఁ బొందు వానికి
నది శోకము నావహించు నత్యంతంబుక."

"విను విధికృత్యము లూరక
కనుఁగొనుచును సిధ్యసిద్ధి కల్పిత సుఖదుఃఖ నిరూఢిఁ బొందకుండఁగ
మనముం దొలఁగించు వెఱపు మహనీయమగున్."

అని యీ విధమున విధివిలాసము పలుచోట్ల వివరింపఁబడినది. నముచి యింద్రునితో, దైవము యొక్కయు, కాలముయొక్కయు ప్రభావ మెట్టిదో యిట్లు చెప్పినాఁడు.

"సకల భూతములకును శాసకుఁడు గలఁడు
గాడె యొక్కరుఁ డాతని కల్పనమున
ప్రాప్తమైనది నీళ్ళులు పల్లమునకు
వచ్చుక్రియ దాన వచ్చుఁ గీర్వాణముఖ్య.

"కాలమడఁగించు జను గ
ల్లోలిని గిరిఁ బ్రెదించుకరణి లోభక్రోధా
శీలత్వ కామ భయములఁ
దేలు జనుఁడు మూఢచిత్తతీవ్రత్వమునన్."

ఈవిషయమునే మూసలపర్వాంత్యభాగమున వేదవ్యాసుఁడు వివరించి యర్జునునకు జ్ఞానోపదేశముఁ గావించియున్నాఁడు.

"కాలమూలంబు సర్వంబు గాన దీని
కొండు తలఁపులు దక్కి మీ రుత్తమంపు

గతికిఁ జనుఁడు నిశ్చింత వికారతనులు
విడిచి యార్య జనంబులు వినుతి సేయ."

ఈ బోధనవలన శోకమోహాంబులు వాసినవై, యర్జునుని డెందము నిర్భరానంద మొందినది. అట్లర్జునుఁడు ప్రబోధమునంది హస్తినాపురికిఁ జని, కృష్ణ బలరామాది యాదవుల వృత్తాంతము సర్వమును, దనదు తెఱంగును, సత్యవతీ తనూభవు హితభాషణంబులు, నేర్పడంగఁ జెప్పిన విని, యుధిష్ఠిరుండు, ప్రస్థానంబునకు మది యొలయ నతనితోఁ,

"కర్మసంత్యాగకలనంబు కార్య మిప్పు
డను వినిశ్చయ మొందె నీమనము నరయ
నిదియ మేలుగఁ గనుచుంటి విదితమయ్యె
నాకు."

అనిపల్కి మహాప్రస్థానమునకు నిశ్చయించినాఁడు. ఇట్లు మౌసలపర్వ మునఁ గవి యాదవవంశేతివృత్తము నాలంబముగఁగొని, యనుల్లంఘ్యము, నప్రతిహతము నగు విధివిలాసముయొక్క మాహాత్మ్యమును, గాలప్రభావమును, బ్రత్యక్షమగు విధమున వివరించుచుఁ, గృష్ణుని జీవిత తత్త్వమునకు వాఖ్య యొనర్చియున్నాఁడు.

ఇట్టి యుత్కృష్ట ప్రయోజన ముండుటచేఁ దిక్కన యీఘట్టము నొక సమగ్ర స్వతంత్ర కావ్యముగ రచించినాఁడు. కావ్యమునకు విశిష్టత నాపాదించు గుణములలో సమగ్రేతివృత్త పోషణ మొకటి. కావ్యవస్తువు నుచితరీతి నుపక్రమింపఁ జేయుట కావ్యరచనయందు మొదటిఘట్టము. ఇట్లుపక్రమింపఁబడిన వస్తువును రసస్ఫోరకములగు సన్నివేశములచే విస్తరింపఁజేయుట రెండవది. అట్లు విస్తృతమైన యితివృత్తమును, దైవికమగు నొక సంఘటనచే రసోన్ముఖముగఁజేయుట మూడవఘట్టము. రసోత్పత్తియు, రసానుభూతియుఁ గలిగినపిమ్మట,

నుద్వేగమును తగ్గించి విషయము నుపసంహరించుట నాలవది. ఇట్లుపసంహృతమైన యుద్వేగమును శాంతియందుఁ బరిణమింపఁజేసి, కావ్య ఫలసిద్ధితో నితివృత్తమును ముగించుట నిర్వహణ మగును. ఉదాత్త వస్తు భావ సమన్వితములు, మానవ కల్యాణార్థ ప్రతిపాదక ములు, నిత్యానందదాయకములు నగు నుత్తమ కావ్యములం దీ లక్షణ ములు కాననగుచున్నవి. మూసలపర్వ మిట్టి యుత్కృష్ట కావ్యలక్ష ణములతో నొప్పు నుదాత్తరచన.

ఇతివృత్తము యాదవ వంశగత మగుట వస్తు వుదాత్తమును, బ్రఖ్యా తమును నైనది. మహానుభావుఁడగు శ్రీకృష్ణుఁడు కథానాయకుఁ డగుట వలనఁ గావ్యమున కుత్తమ నాయకత్వము సిద్ధించినది. భారతవీరుఁడు, దివ్యాంశ సంభూతుఁడునగు నర్జునుఁ డిందుపనాయకుఁడై, కృష్ణుని సంకల్పము నిర్వహించుటకు సహాయకారి యగుచున్నాఁడు. కరుణము ముఖ్య రసముగను, వీరము తదంగముగను బోషితములైనవి. యాదవ నాశ, బలరామకృష్ణ నిర్యాణములచే నుత్పన్నమైన కరుణరస మర్జునుని యుత్కంఠయందును, యాదవాంగనల యాక్రందనములందును, నుద్వే గముఁ గాంచినది.

కృష్ణుఁడు లేమిచేఁ గాంతి విహీనమై, దీనమై కన్పట్టు ద్వారకను బ్రవే శించినప్పటి యర్జునుని యవస్థ కరుణ రసోత్పాదకముగ వర్ణితమైనది.

"అరిగి మగండుసచ్చిన కులాంగనయున్ శశి గ్రుంకినట్టి శ
ర్వరియును బోల్పఁ బట్టగుచు వారిజనాభుఁడు లేని నీనతం
బొరసి కృపై కభాజనతఁ బొందిన యప్పురిఁ జూచి మానసం
బెరియఁగఁ జొచ్చె నేటి కెదురీదినచాడ్పున నేమి సెప్పుదున్."

ప్రియబంధుఁడగు నర్జునుని జూచుటతో నంతవఱ కడఁగియుండిన దుఃఖ మంతయు నొక్కుమ్మడి పైకుబికి, యాదవాంగనలను ముంచివైచినది.

"చనుటయుఁ గ్రొత్త పేరడలు సైపఁగలేక మురాంతక ప్రియూం
గనలు పదాఱువేలును మొగంబులఁ గ్రప్పఁగ బాష్పవారి రో
దనరవముల్ సెలంగఁగఁ బదంబులు దొట్రువడంగ దైన్యముల్
తనువులు దాల్చినట్టు దెరలన్ జనుదెంచిరి పార్థపాలికిన్."

సన్నిహిత బంధుదర్శనముతో శోకవేగ మగ్గలమగుట ప్రకృతి సహజమే కదా! వారి శోకప్రవాహమం దర్జునుఁడును నిమగ్నుఁడైనాఁడు.

"వారలఁ గాంచి శోక మనివారణఁ జిత్తముపెల్లగింప న
క్కారవసత్తముం డెలుఁగు గద్గదికం దగులంగ నేడ్చుచున్
దేరొకభంగి డిగ్గి యిలఁబ్రెళ్ళిన యద్దురవస్థఁ జూచినన్
వైరులకైన డెందములు ద్రవ్యలుగా వగఁదాకు భూవరా."

ఱట్లు పాతకుల హృదయములు ద్రవీభవించు విధమున కరుణ పోషింపఁబడినది.

కృతవర్మపై విజృంభించిన సాత్యకివర్ణన యందును, యాదవుల పరస్పర హాననమునందును, యుద్ధవీర మంగముగఁ బోషితమైనది.

"అనుచున్ సంయమిశాపజాత ముసలాత్యంతాద్భుతస్ఫీత శ
క్తి నిరూఢమ్ముగ నూనినట్టి నిజసిస్త్రింశంబు శీఘ్రంబునం
గొని తద్దీధితిరాజిచే నతనిచూడ్కుల్ విహ్వలత్వంబు నొం
ద సుదగ్రోద్ధతిఁ ద్రుంచెఁ దద్గళము రక్తాంబు ప్రసారంబుగన్."

అట్లు కృతవర్మం దెగటార్చిన సాత్యకి, యంత నిలువక యుద్ధతుఁడై, బాహావిలాసంబు మెఱయ భోజకులంబుపైఁ గవియ, భోజాంధకవీరు లెల్లరు నతని నాక్రమించినారు. ప్రద్యుమ్నాదులు సాత్యకికి సహాయులుగా,

"కనుఁగొని వృష్ణివీరులు నికామ సముజ్జ్వల రోషవహ్ని నె
మ్మనమున నుత్థితంబుగ సమత్సరశౌర్యము విక్రమోద్ధతిఁ
బెనుపఁగ వారలిద్దరకుఁ బ్రీతి మెలర్పఁగ సింహనాదముల్
ఘనపథమెల్ల నిండఁగ బలంబుఁ జలంబును నుల్లసిల్లఁగన్."

విజృంభించినారు.

ద్వారకాప్రజల రక్షణార్థమై, యర్జునుఁడు బలరామకృష్ణుల నిర్యాణమును రాజాంతఃపురకాంతలతోఁ జెప్పక, నిగూఢముగ నుంచి, సూర్యోదయమునకుఁ బూర్వమే ప్రజలను బురినుండి నిర్గమింపఁజేసి, వారిని రక్షించుటలో, నతని స్వార్థత్యాగము ప్రదర్శితమైనది. దైవగతి నంబుధి పట్టణము నాక్రమించుట మరునాఁడ యగుట మెఱింగి యర్జునుఁడు,

"యీ రేయి నెచ్చెర బ్రయాణ
మునకుఁ గృత్యములగు పనులెల్ల సమకట్టి
వేగంగఁ గ్రక్కున వెడలవలయు

"గాని వెడలకున్న భానూదయంబున
వనధి పురము ముంచికొనిన గణన
సేయరాని యట్టి సేగియుఁ బ్రయ్యుఁ బొ
పంబు వగయు నెల్లభంగిఁ గలుగు."

అని పలుకుటలో నతనికి లోక హితమునెడఁ గల జాగరూకత వ్యక్తమయినది. రుక్మిణ్యాదులయుఁ, దనయొక్కయు సుఖదుఃఖాదులిం దర్జునునిచేఁ దక్తములగుటఁ ద్యాగవీరమును నొక యంగముగఁ బోషితమైన దనవచ్చును. 'అవశ్య మనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభ' మ్మను సిద్ధాంత మీపర్వమున నిదర్శన పూర్వకముగఁ బ్రతిపాదితమగుటచేఁ గావ్యమున కుదాత్తత సిద్ధించినది. మూసలపర్వకథ

భారత కథాంతర్భూతమగు నొక భాగమే యైనను, నారంభమునుండి నిర్వహణము వఱకును, గార్యకారణ శ్రేణిచే సంబద్ధమై స్వతంత్ర కావ్య ముపలెఁ బోషితమైనది. శాంతిపర్వాదుల యందువలె వివిధ ధర్మ వివరణములకు, నుపాఖ్యానములకు నిందుఁ బ్రసక్తి లేదు. కథా గమనమున కంతరాయములగు విషయాంతర వర్ణనలు లేకుండుటచే, నితివృత్తమేకధారగ, ఫలోన్ముఖమై ప్రవహించుచున్నది. విరాటపర్వమునఁ గూడ లేని వస్తైక్య మీ మూసల పర్వమున సిద్ధించినది.

పర్వారంభమునఁ వర్ణితములైన ధర్మజు రాజ్యమునందలి యుత్పాతములచేఁ గథాంతర్భావము సూచితమైనది.

"భారత సంగ్రామ పారీణుఁడై జయ
రమ యుల్లసిల్ల సామ్రాజ్యమునకుఁ
బాండవ ముఖ్యునిఁ బట్టంబు గట్టిన
యది యాదిఁగాగ ముప్పదియునైదు
సంవత్సరంబులు సన నసంతర వత్స
రంబునఁ బ్రజకుఁ భయంబొనర్చు
నుత్పాతములు పుట్టె నుర్వీశ వినుమహా
వాయువు శర్కరావర్షి యగుచు,

"వీచు నర్కు నుదయవేళల బింబంబు
బలసి దోఁచు ఘన కబంధసమితి
నీరదములు లేక నిర్ఘాతపాతముల్
గలుగు నుల్కలెల్ల కడల డుల్లు."

"పరివేషము లిన రజనీ
కరులకు నతి రూక్షరుచులు గలిగి కలుగు నం

బరమెల్లఁ గప్పి వేసవి
బరగుం బెనుమూడ మంచు పౌరనముఖ్యా."

ధర్మజు రాజ్యమునఁ గల్గిన యీ భయోత్పాదకములగు ప్రకృతి వైపరీత్యములు మూసల పక్వేతివృత్త సూచకము లగుటయే కాక, ప్రధానమగు భారతేతి వృత్తమునకు నాయకులైన పాండవుల మహా ప్రస్థానాదులను గూడ సూచించునవియై యున్నవి. ఇతివృత్తము కణ్వాదుల శాపముతో నుపక్రమింపఁ బడినది. తదనంతరము ద్వారకయందు గల్గిన మహోత్పాతములు, సాంఘిక కల్లోలములు, కథాబీజము నంకురోన్మీళముఁ గావించుచున్నవి. సముద్రోత్సవ సందర్భమందలి యాదవుల యున్మార్గ ప్రవర్తనచే నితివృత్తము పోషితమై, యాదవ వినాశముచే రసోన్మీళము గావింపఁ బడినది. బలరామ కృష్ణుల నిర్యాణముచే రసోత్పత్తి సిద్ధించినది. యాదవాంగనల యాక్రందనములం దుద్వేగమును బొందిన కరుణరస మర్జునుఁ డొనర్చిన ప్రజారక్షణాద్యనుయాయి వృత్తములచే నుపసంహృత మైనది. యాదవకుమారుల పట్టాభిషేకములు, సత్యభామాదుల తపోవన గమనము, నిత్యాది ఘట్టము లితివృత్తోప సంహారమునకు సహాయకములై కథను శాంతి రసోన్మీళముఁ గావించినవి. వేదవ్యాసుఁ డర్జునున కొనర్చిన తత్త్వోప దేశమునందు శాంతి వెలసి కరుణను దనయందు లయింపఁ జేసి కొనుచున్నది. కరుణరస ప్రధానముగఁ బోషితమైన యాదవ వంశేతివృత్త మీ క్రమమున శాంతియందుఁ బరిణతిఁ జెందినది. ఇట్లీ పర్వరచన సలక్షణమగు, నుదాత్త దృశ్య ప్రబంధ రచనతోఁ దులదూగుచున్నది.

నాయకవధ సర్వథా త్యాజ్య మను లౌకిక కావ్యలక్షణమునకుఁ గృష్ణుని నిర్యాణము విరుద్ధముగఁ గన్పట్టును. కాని, భగవదవతార ప్రయోజనమగు ధర్మసంస్థాపనము సిద్ధించుటయు, నంత, నవతార పురుషుఁడగు కృష్ణుఁడీ లింగశరీరమును వీడి,

"అమృతం బజరం బవ్యయ
మమలం బవితర్క్య మచల మాగమగమ్యం"

బగు నిజపదమును జెందుటయు, లోక కల్యాణమునకు హేతువులగు టచేఁ బూర్వోక్త విరోధము పరిహృత మగుచున్నది.

భారత రచనచే వేదవ్యాసుఁడు నిర్వహింపఁబూనిన ప్రయోజన మీ మూసలపర్వ కథాభాగముతోఁ బూర్తిగ సిద్ధించినది. వివిధ వర్ణాశ్రమ ధర్మములను, సత్య న్యాయ ధర్మాదుల తత్త్వములను, సుఖదుఃఖాది జీవిత విషయముల స్వభావ స్వరూపములను, భారతీయ మతానుసారముగ, సర్వజన గ్రాహ్యమగు విధమున, జనులకు బోధించి, సంఘమును సంస్కరించుట యీ ప్రయోజనమందొక భాగము. ఇంతియ కాక, వేద వేదాంతర్గతములై, లోకమునం దత్యధిక సంఖ్యాకు లగువారి కందుబాటులోలేని, భగవత్తత్త్వ సృష్టిరహస్యాదులు, కర్మయోగ జ్ఞానయోగాది ముక్తిమార్గములు, మున్నగు నాధ్యాత్మిక విషయములను, శాస్త్ర పరిచయములేని జిజ్ఞాసువులకు సాధ్యములగునట్లు చేసి, తన్మూలమున, నిహలోక జీవితమునకు శాంతినిఁ బ్రసాదించుటయు నొక ప్రయోజనము. ఇట్టి యుత్కృష్ట ప్రయోజన సిద్ధికి పాండవేతి వృత్త మాలంబనమైనది. మూసలపర్వముతో నీ యుత్కృష్ట ప్రయోజనమును, పాండవేతి వృత్తమును, జాలవఱకుఁ గడముట్టినవి. శాంత్యనుశాసనికములందు బోధింపఁబడిన జీవితతత్త్వము యాదవేతివృత్తమునఁ బ్రత్యక్షముగ నిరూపితమైనది. పాండవు లిహలోకమును ద్యజించి, మహాప్రస్థానగతు లగుటకు, యాదవేతివృత్తము ప్రబలకారణమై, ప్రధానేతివృత్తమును ఫలోన్ముఖముఁ గావించినది. మూలకథతోఁ బూర్వాపర సంబంధముఁగల్గి, యుదాత్తములగు ప్రయోజనముల నొప్పియున్న యీ మూసలపర్వ కథ తిక్కనచే నుత్కృష్టము, సర్వాంగ సుందరము, రసవత్తరము నగు విధమునఁ బోషితమైనది.

మూసలపర్వగతమగు యాదవనాశ, కృష్ణ బలరామ నిర్యాణముల కారణమునఁ బాండవుల కిహలోక బంధము ఫూర్తిగఁ దొలఁగినది. పరీక్షితునకు రాజ్యాభిషేకముఁజేసి పాండవులు ద్రౌపదీసహితులై తపోవన గతులగుటయు; భీమాదులు నిర్యాణము నందుటయు, నిర్యాదులు మహాప్రస్థానపర్వమునను, ధర్మజుని యలౌకిక శీల ప్రవర్తనములు, నతని సశరీర స్వర్గప్రాప్తి మున్నగునవి స్వర్గారోహణ పర్వమునను వర్ణితము లగుటతో నితివృత్తము సమాప్తమైనది. ఇట్టి కథాక్రమమునుసరించి స్త్రీపర్వమున శోకోద్వేగమును, శాంత్యనుశాసనికములలో నిర్వేదమును, మూసలపర్వమున గరుణయుఁ, బ్రధానములైనను, ధ్యేయమగు శాంత మూమూఁడు ఘట్టములందును నంతర్వాహినిగఁ బ్రవహించి, కడపటి ఘట్టమున నితివృత్తమును దనలో లయింపఁ జేసికొనుచున్నది.

202

కర్మయోగి - వాజ్ఞయ యజ్ఞము

విరాటపర్వమాదిగ బహువిధముల విస్తృతిఁజెంది, ప్రకృతి తత్త్వ మును సుగమముఁజేసి, శాంత్యధిష్ఠితమగు స్వర్గారోహణముతో సమాప్తిఁజెందిన యీ భారతభాగమును రచించుటలోఁ, దిక్కున, యెట్లు తత్తత్సన్నివేశముల కనుగుణముగఁ దన కవితాశిల్పము నుచిత విధమునఁ బ్రదర్శించినదియు సహేతుకముగ నిరూపితమైనది. మూసల పర్వ గతమగు యాదవనాశ, కృష్ణ బలరాముల నిర్యాణముల కారణ మునఁ బాండవుల కిహలోక బంధము పూర్తిగఁ దొలఁగినది. పరీక్షితుని రాజ్యాభిషిక్తునిం గావించి, పాండవులు ద్రౌపదీసహితులై ప్రస్థానగతు లగుటయు, భీమాదులు నిర్యాణముం బొందుటయు, మున్నగునవి మహా ప్రస్థానము నను, ధర్మజుని యలౌకిక శీల ప్రవర్తనములు, నతని సశరీర స్వర్గప్రాప్తి త్యాదులు స్వర్గారోహణ పర్వమునందును వర్ణితములైనవి. ఇట్టి కథాక్రమము ననుసరించి, విరాటపర్వము వీర శృంగారములకును, యుద్ధపర్వములు వీర రౌద్రాదులకును ప్రాధాన్యము వహించినవి. స్త్రీపర్వమున శోకోద్వేగమును, శాంత్యనుశాసనికములలో నిర్వేద మును, మూసలపర్వమునఁ గరుణయుఁ, బ్రధానములుగఁ బోషితములు. శాంత మీ కడపటి మూఁడు ఘట్టములందును, నంతర్వాహినిగఁ బ్రవ హించుచుఁ, గడపట నితివృత్తమును దనలో లీనముఁ జేసికొనుచున్నది.

ఆదినుండి యంతమువఱకును, నితివృత్తమును, పాండవుల జీవితము లును, పరస్పరాశ్రయములై, యొక క్రమపరిణామము ననుసరించి యుండుట గమనింప నగును. బాల్యమునఁ దండ్రినిఁ గోల్పోయి నిస్సహా యులై పితృవ్యుని పోషణమునన్న బాలుర జీవితము లోకమునకుఁ

గ్రొత్తకాదు. ఈర్ష్యాపరులు, దురాశాపీడితులు నగు దాయాదులు పన్నుకుట్రలు, వారు పెట్టు బాధలు, నధర్మమున కాదియంచుఁ గలుగు విజయము, — మున్నగునవి, లోకమునఁ బ్రత్యక్షముగ మనము దిన దినము చూచు విషయములు. పాండవుల బాల్యమును నిట్టిదియే యగుటచే నీ యితివృత్తము మన జీవితమున కత్యంతము సన్నిహి తమ్మై యున్నది. వివాహ సంబంధ కారణమునఁ దగిన సహాయసంప త్తి లభింపఁగా, బాండవు లున్నతస్థితికి వచ్చుట కనుకూల పరిస్థితి యేర్ప డినది. దానికి స్వశక్తి సామర్థ్యములును, ధర్మనిష్ఠయుఁ దోడ్పడినవి. తత్ఫలితముగ వారి కున్నతస్థితి సిద్ధించినది. కాని, ధర్మవిజయ మింకను స్థిరపడలేదు. లోకమున నధర్మమునకు విస్తారప్రాబల్య ముండుటచే, దుర్యోధనాదుల పన్నాగములు ఫలించుటయుఁ, బాండవులు రాజ్యభ్రష్టు లగుటయు జరిగినది. ధర్మజుని దోషలేశముకూడ నిందులకు హేతు వైనది. ఈపరిణామ క్రమము మానవ జీవితమున కెంతయు ననుగుణ ముగ నున్నది. కించి దాత్మ దోష కారణమునఁ బదవీపరిభ్రష్టులై, పలుబాధలఁ బడినవా రనేకులు లోకమునఁ గలరు. కష్టానుభవ కార ణమున సాత్త్వికుల హృదయములు పరితప్తము లగుటయుఁ, గ్రమముగ వారికి జ్ఞానోదయమగుటయుఁ గూడ నట్లే సహజము. అరణ్యవాసాజ్ఞాత వాసానుభవము ధర్మజుని చిత్తశుద్ధికిఁ గారణమైనది. లోక కల్యాణము నపేక్షించి, యతఁడవలంబించిన శాంతివిధానము ప్రయోజన సిద్ధిం గాంచక పోవుటచే స్వధర్మమగు క్షాత్రము నతఁడవలంబింపక తప్పినది కాదు. కాని, అధర్మపక్షముతోఁబాటు ధర్మపక్షము కూడ యుద్ధమున నశింపవలసివచ్చినది. ఇది ప్రకృతి తత్త్వము. సంఘర్షణయం దుభయ పక్షములకును నాశము తప్పదు. ధర్మజున కీసత్యము ప్రత్యక్షముగ విదితమై, యతనికి వైరాగ్యోదయము గల్గుటకు హేతువైనది.

యౌవనమున నుత్సాహ ప్రధానముగ నుండిన మానవుని జీవితము, రానురాను, ప్రపంచిక కష్టసుఖాద్యనుభవ కారణమునఁ గ్రమపరిణా

మముం గాంచి, కడపట శాంతి ప్రధానమగుట లోక సహజము. తత్ప రిణామము ననుసరించి, జీవిత మధ్యకాలము వఱకును, ముఖ్యముగ నైహి కములపైఁ గేంద్రీకరించి యుండిన మానవుని దృష్టి, జీవితపు నుత్తరభా గమునఁ గ్రమముగ నైహికవిముఖమై, యాముష్మికముపైఁ బ్రసరించు టయును నైజమే. పాండవుల జీవితచరిత్ర, యీ క్రమపరిణామము ననుసరించి యుండుటయు, భారతేతివృత్తమందలి వివిధ ఘట్టము లీ పరిణామ మునకుఁ గారణములై యుండుటయు, సులభముగ గమనింపనగును. మానవ జీవితపరిణామ విధాన క్రమ మాదినుండి తుదివఱకును, ధర్మజుని జీవితచరిత్ర యాధారమున నిందుఁ బ్రత్యక్షమగురీతిఁ జిత్రితమైయున్న దని చెప్పవచ్చును. ఇతివృత్తమును, నాయకజీవితమును గూడ, జీవిత పరిణామ క్రమముతో నిట్లనుసంధించుచుండుటచే, భారతము సర్వతో ముఖమగు జీవితచరిత్రకు సమగ్ర వ్యాఖ్యయని చెప్పుటకుఁ దగియున్నది.

ఇట్టి పరిణామముతో నొప్పు భారతభాగమున కనుగుణముగఁ, దిక్కన రచనయు నుచిత పరిణామము నందినది. యుద్ధపర్యంతమువఱ కును లౌకికమైయున్న యితని రచన, తదనంతర భాగములలోఁ గ్రమ ముగ నలౌకిక విధానము నవలంబించినది. నాయకజీవిత మెట్లు లౌకిక ములనుండి మఱలి, యలౌకికములపైఁ బ్రాకి, క్రమముగ నంతర్ముఖమై, కడపటఁ బ్రశాంతతను గాంచినదో, యట్లే, తిక్కన రచనయుఁ, గ్రమ ముగ లౌకిక కావ్య లక్షణములగు ధ్వన్యలంకార, చమత్కారాదులను విసర్జించి, యంతరంగమగు నర్థపోషణముకే పరమ ధ్యేయముగ నిడికొని తుదిఁ బ్రశాంత తేజోమూర్తిగఁ బరిణమించినది.

వేదవేదాంగములు, పురాణములు, ధర్మశాస్త్రములు, పరబ్రహ్మ స్వరూప ప్రతిపాదకములునగు నుపనిషదుత్తరమీమాంస గతార్థములు, వివిధదర్శనములు, నిత్యాదుల నన్నిఁటిని మథించి, భారతీయ ప్రాచీన

సంస్కృతి నంతటిని గ్రహించినవాఁ డగుటచేఁ దిక్కనకు మహాభారత రచన సాధ్యమైనది. సాంఖ్యాది యోగసూత్రార్థములు, జీవాత్మ పరమాత్మ తత్త్వ వివరణములు, మున్నగు నాధ్యాత్మిక రహస్యములన్నియు, సుస్పష్టమగు విధమున వివరింపఁబడి యుండుటంబట్టి, తిక్కనకు, అధ్యయన గురూపదేశ మూలకమగు జ్ఞానము మాత్రమే కాక, అనుభవ జ్ఞానముకూడ కలదని విదితమగుచున్నది. ప్రతివిద్యకును, అధీతి, బోధ, ఆచరణ, ప్రచారము లను నాల్గు దశలున్నవని పెద్దలందురు. భారతరచనతోఁ దిక్కన, తా నేర్చిన విద్యకు, నాల్గవదశను గూడ సాధించినాఁ డని చెప్పవచ్చును.

విద్యాప్రచారముచే లోకకల్యాణ మను నుత్కృష్ట ప్రయోజనమును సాధింపఁ బూనినవాఁడు తిక్కన. పరబ్రహ్మ రూపప్రతిపాదకమగు భారతాంధ్రీకరణమునకుఁ బూనుచు, తిక్కన యజ్ఞరూపమగు నీశ్వరార్చనమును నిష్ఠమై నిర్వహించి, చిత్తమును భగవదాయత్తముం గావించినాఁడు. వాఙ్మయరూప విశిష్ట యజ్ఞమున కారంభించు తిక్కన లౌకైక యజ్ఞకర్మదీక్ష యత్యావశ్యకమైనది. అహింసాత్మకమగు, వాఙ్మయాధ్వరార్చనకుం గడంగు తిక్కన విషయమున నీ వైదికకర్మకాండ యొక యత్కృష్టసాధన మైనది. తత్సాధనచేఁ జిత్తమునకుఁ బ్రశాంతత సిద్ధింపఁ దిక్కన, మహా కవిత్వదీక్షతోఁబాటు, వాఙ్మయ యజ్ఞరూపమగు యోగదీక్షను బూని, భారతరచనకుఁ గడంగినాఁడు. ఈకావ్యముచే నితఁడు సాధింపఁబూనినది, ఆముష్మికఫలము, – జన్మరాహిత్యము.

"తపమునకు విద్యకును జనుస్థానమైన
జననరహితుని యజ్ఞాత్మ శౌరి వాఙ్మ

యాధ్వరార్చితుఁ జేసితి నా జనార్ద
నుండు మద్భజనమునఁ బ్రీతుండు గాత."

అను, శరతల్ప గతుఁడగు భీష్ముని కృష్ణస్తవ రూప వాక్కులు తిక్కన విషయమునఁగూడ, చక్కగ సమన్వయమును బొందుచున్నవి. విద్యా తపస్సుల జన్మమునకు స్థానమైనవాఁడును, జనన రహితుఁడును, యజ్ఞ మూర్తియు, నగు పరబ్రహ్మను వాఙ్మయరూప యజ్ఞముచేఁ దిక్కనయుఁ బూజించినాఁడు. తన యీ భజనచే భగవంతుఁడు ప్రీతుఁ డగుటయే యతని యాశయము.

"శరణాగతుండ భక్తుఁడఁ
బరమపదవిఁ గోరెదను శుభంబుగ నన్నుఁ
బరికించి యేది మే ల
య్యీరవు దొరకొనంగఁ దలఁపవే కమలాక్షా."

అనుప్రార్థన తిక్కన విశిష్ట జ్ఞానమునకు నిదర్శనము. భగవత్ప్రీత్యర్థము, భక్తిశ్రద్ధలతో సత్కర్మనాచరించి, ఫలాపేక్షలేక, జీవితము నీశ్వరార్ప ణముం గావించిన తిక్కన ఆదర్శకర్మయోగి. "ఏది మే లయ్యీరవు దొర కొనంగఁ దలపవే కమలాక్షా" యని తన భావిశ్రేయమును గూర్చిన చింతను గూడ తిక్కన భగవదాయత్తముఁ గావించినాఁడు. వ్యాసరచిత గీతాతత్త్వమును వాచ్యము చేయక, తిక్కన యిట్లాచరణ రూపమునఁ బ్రకాశిత మొనర్చుటచే నతఁ డాంధ్రలోకమున కాదర్శపురుషుఁ డైనాఁడు.

యోగ, తపో, యజ్ఞాదు లీతని యభిమాన విషయములు. నిర్మ లాంతఃకరణ సాధ్యమగు బ్రహ్మజ్ఞాన మితని ధ్యేయము.

"యోగులకు యోగబలమున
రాగము మోహంబునుం జిరస్నేహముఁ గా

మాగమముఁ గ్రోధము గుణా
మోగము వరుసఁ బెడఁబాప నున్నతి యొలయున్."

"ఘనఋషమున్ సముద్ధతమృగంబును జాలముఁ బ్రచ్చి వాగురా
వినిహతిఁజేసి యిష్టపదవిం జనుచాడ్పున యోగతంత్ర రో
ధనమగు లోభజాత దురితవ్రజముం బెడఁబాచి సత్పథం
బునఁ జరియించుయోగి సుఖమూర్తిత సుస్థితగా వహించుచున్."

అని, యోగ మెట్టి విశిష్ట మోక్ష సాధన మగునదియు వ్యక్తము గావింపఁ బడినది. అంతియకాక,

"యోగనిరూఢుఁడు సంగ
త్యాగానందైకరతుఁ డతనికి జనన సం
యోగము మృతి ద్వైన్యంబును
భోగాభోగ సుఖదుఃఖములు లే వధిపా."

అని యోగలబ్ధమగు నానందమెట్టిదో తిక్కన వివరించినాఁడు.

"అనఘ యంచిత స్వాధ్యాయమునను యజ్ఞ
మున సమాచారమున నిష్ఠ వొనుగుపడక
యుండు నెవ్వారలకు వార లోపి నడపు
నదియ కనుము ధర్మము సూక్ష్మపదవిగాఁగ."

"విను దానంబుఁ దపమును వృద్ధసేవ
నము సహింసయు నియత కృత్యములు సర్వ
జనుల కిమ్మహాగుణములు మనమునందు
దృఢముగా నిల్పి నడపుము ధీరవర్య."

అని పలుచోట్ల తపోయజ్ఞాదుల విశిష్టత వివరింపఁ బడినది. తిక్కన యొకచో "యజ్ఞాత్మక రూప నిశ్చలావ్యయదీపా" యని పరమేశ్వరుని సంబోధించి యుండుట గమనింపఁ దగినది.

ఇతని యాశ్వాసాంతపద్యము లీతని మనస్తత్త్వమును, విశిష్ట జ్ఞాన సంపత్తిని, మహోన్నతాశయములను వ్యక్తపఱచు చున్నవి.

1. "నియమనికటవర్తీ, నిష్కళానందమూర్తీ."

2. "యమనియమవికాసీ వ్యాసచేతోనివాసీ."

3. "యమనియమాద్యష్టాంగ
క్రమాభ్యసన నిర్మథిత వికారసుచేతఃకమలామోదమయాత్మా."

4. "యమనియమ వికాసి ధ్యానగేహ ప్రదీపా
దమశమకలితానంద ప్రకాశ స్వరూపా."

అను సంబోధనలు, తిక్కన యింద్రియ విజయి యని సూచించుచున్నవి. యమనియమాదులను క్రమముగ నభ్యసించుటచే, వికారము లడంగి, చిత్త మెట్లు శుద్ధిగాంచునదియు, నట్టి విశుద్ధమగు నంతఃకరణ మెట్లాత్మ స్వరూప జ్ఞానమునకు నవసరమగునదియుఁ, దిక్కన పలుచోట్ల వివరించి యున్నాఁడు.

1. "ప్రమదవిషాదాది ద్వం
ద్వమలాపిహితాంతరంగవాసా."

2. "అపగత కామరోష హృదయాంతర ఖేలనకల్య."

3. "ధర్మాధర్మ విదూర నీతిపర విద్వచ్చిత్తయోగీ."

ప్రమోద విషాదములు, సుఖదుఃఖములు, ధర్మాధర్మములు, కామ రోషములు, రాగద్వేషములు, — మున్నగు ద్వంద్వముల నధిగమించిననే తప్ప, చిత్తమునకుఁ బ్రశాంతత లభింపదనియుఁ, జిత్త శాంతి సిద్ధించిననే కాని పరబ్రహ్మస్వరూపము బోధపడదనియు నీ వాక్యము

లచేఁ దిక్కన సూచించుచున్నాఁడు. ఇవి యతని విశుద్ధాంతరంగ ప్రదర్శకము లగును.

1. "సకలనిగమవేద్యా."
2. "వివృతనిగమశాఖావిశ్రుతాగ్రైకవేద్యా."
3. "సుమహదుపనిషత్ప్రస్తుత్యభిశ్రావ్యసేవ్యా."
4. "ఉపనిషదవగమ్యా యోగభావ్యైకరమ్యా."

అను వాక్యములు, తిక్కనకు వేదములయందును, నుపనిషద్గత వేదాంతము నందును గల పూజ్యభావమును వ్యక్తపఱుచుచున్నవి. వేద వేదాంత విశిష్ట జ్ఞానముచే భగవత్స్వరూపము బోధపడునని యిందుచే సూచితమైనది. భారత రచనారంభమునకుఁ బూర్వము, పూర్వ మీమాంసా ప్రతిపాదితమగు వైదిక కర్మకాండచే నాకర్షింపఁ బడిన తిక్కన మనస్తత్త్వము శాంతిపర్వ రచనా కాలమునాఁటికిఁ బొందిన పరిణామము ముఖ్యముగ గమనింపఁ దగినది.

1. "ప్రకృతి పురుషయోగీ వికృతి రహితమూర్తి."
2. "సుస్థిరానందవర్త్మా."
3. "కేవలభావానందమయా."
4. "భాస్వ దానందమార్గా."

అను సంబోధనలలోఁ, దిక్కన, పరబ్రహ్మతత్త్వము నాత్మసాక్షాత్కార జన్యమగు బ్రహ్మానందముతో నభేదముగ వర్ణించినాఁడు. మఱియు, దేహాభిమాన కారణమున వృద్ధిఁజెందిన మోహాంధకారమును వివేకముచే నశింపఁజేసిననే కాని, యాత్మ ప్రబోధము కలుగదని తిక్కన గ్రహించుట మాత్రమేకాక, నాత్మ సాక్షాత్కారమును గూడఁ గాంచినాఁడని యీ క్రింది పద్యమువలన నూహింపనగును.

"దేహాభిమాన సంభృత
మోహతమోనిరసనాభిముఖ భూరివివే
కాహీన మహాతత్త్వాస
మాహిత చిన్మాత్రరూప మధురిమసుభగా."

సదసద్వివేచార జ్ఞానముచే మోహము నిరస్తముకాగా, లభించిన చిత్త వికాసమే. పరమాత్మస్వరూప మనుటచేఁ, దిక్కనకు జ్ఞానకాండయందుఁ గల దృఢవిశ్వాసము సూచితమైనది.

యోగులు పరమాత్మైక్యసంధానమునంజేసి, భవబంధ మోక్షణముం గాంచినట్లు, తిక్కనయుఁ, గవిత్వ దీక్షావిధిం బూని, శబ్దబ్రహ్మైక్య సంధానమునంజేసి, జ్ఞాన జ్యోతిస్వరూపమగు పరమాత్మ సాక్షాత్కారముం గాంచి, భవబంధ విమోచనముం బొందియున్నాఁడు.

"కరణఫల పరిత్యాగ వ్రతోదాత్త చేతఃపరిణతసుఖపీఠ భ్రాజమానా నతాంహోనిరసనచరణాబ్జోన్నిద్రతారాజమానానిరవధిపరిణాహా నిర్భరానందదేహా"

"అనపేక్షితఫలతా శోభనమహనీయ క్రియా విపాకాత్మకరూప."

అను సంబోధనలు, తిక్కన, విశిష్ట కర్మయోగి యనుటకు సాక్ష్యములు. భారత రచనతోఁబాటు తిక్కన హృదయమును బరిణతి నందుచు వచ్చినది. ఆధ్యాత్మిక విషయ ప్రధానములగు పర్వముల రచననాటికిఁ దిక్కనయు నింద్రియముల బాహ్యప్రవర్తన నరికట్టి, యంతర్ముఖుఁడై,

పవనాదుల నిరోధించి యాత్మ సాక్షాత్కారముం బొందినట్లు కన్పట్టు చున్నది.

శాంత్యనుశాసనికాది పర్వ గతమగు నితని రచనయే యిందులకుఁ బ్రబలసాక్ష్యము. భిన్నవర్ణ మణులయందుఁ బ్రసరించిన సూర్యకాంతి తత్తన్మణిస్వభావము ననుసరించి, భిన్నకాంతులతో భాసించునట్లు తిక్కనరచనయు, విషయ వైవిధ్యము ననుసరించి, వివిధభంగుల విరాజిల్లు చున్నది. విరాటపర్వమాదిగ యుద్ధాంతము వఱకును నితని రచనా విధానము లౌకిక వాఙ్మయమున కుత్తమాదర్శమై, యుదాత్త కావ్య లక్షణములతోఁ బ్రకాశించినది. శాంతిపర్వాదులయం దితనిరచన, కవిత్వ పరాకాష్ఠ నందికొని, యలౌకిక వేదవాఙ్మయ స్వరూపముందాల్చి, తేజోమయమై, జ్ఞానజ్యోతియై విలసిల్లినది.

"త్రియుగ కమల వీథీదీప్తసంచారలీలా
నియమిత పవ నాత్మాగ్ని ప్రభాస్నిగ్ధసంగా
స్మయవికచ మహాబ్జశ్రీ మాధ్వీక ధారో
దయమయ మధురాత్మా దర్శితానంద వర్త్మా."

సంపూర్ణము

సవరణలు

పేజి.	పంక్తి.	తప్పు.	సవరణ.
1	18	చతుష్షష్ఠి	చతుష్షష్టి
21	17	బ్రధాస	బ్రధాన
34	4	పోషకములగు	పోషకమగు
43	4	పరుచుటకై	పలుచుటకై
82	23	నర్జుని	నర్జునుని
84	3	నుపమాలంకార	నుపమాలంకారముల
91	20	సతుత్తుర	సత్తుర
104	7	బ్రతిశబ్దమును అర్థగౌరమున	శబ్దములు అర్థగౌరవమున
113	24	భ్రాతృవాతల్య	భ్రాతృవాత్సల్య
166	13	నతనిపై	యతనిపై
183	9	విషయమునకు	విషయమున
187	23	విజృభించు	విజృంభించు
196	9	నద్దురవస్థ	యద్దురవస్థ
206	17	యత్కృష్ట	యుత్కృష్ట
210	22	నాత్మ	యాత్మ

గ్రంథకర్త ఇతరరచనలు

1. ధర్మరక్షణము ... నాటకములు
2. సారస్వతవిమర్శ ... వ్యాససంపుటి
3. కర్మబద్ధులు ... కథాసంపుటి

215

216